# సింగిల్ డైరీ

## వెల్చేరు చంద్రశేఖర్ నవల



శ్రీ
కౌముది
మీ మనోగతాల్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 59

# సింగిల్ డైరీ
## వెల్చేరు చంద్రశేఖర్



**డైరీ చదివేముందు**

సహస్రఫణి విరాజితమై నాకు నీడలా వెన్ను కాస్తున్న కాలనాగులాంటి సోమరితనం, అలసత్వం నుండి, నన్ను కాపాడడానికా అన్నట్టు, నన్ను ఆవరించి, నాలో ప్రభవించే ఆలోచనాతరంగాలూ, పెనుచీకటి మూకలతో, మోడులా ఉన్న జీవితాన్ని ఆత్మానంద జ్యోతిర్ ప్రాంగణంగా మార్చిన అనేక తలపులు, నాలో అంతర్మథనాన్ని ప్రేరేపిస్తున్నాయి, విశ్వనాథ చెప్పినట్లు, 'కరిగిపోతిని నిలువెల్లను, మరిగిపోయిన నా గుండియ' అన్నట్లుగా వాహినీ రూపమై చిరులొల్కుసోనలై సిరులొల్కువానలై, మనోవీథిని మృదుతాండవము చేస్తూ దభంగతురంగమృదంగ కలాపకలాపిజాలమై, అంతర్వాహినిగా ప్రవహించాయి. ఈ ప్రవాహంలో చైతన్యం... భరించలేని వేగం.... అందులో అనేక, శకలాలు, చుట్టూ పరిభ్రమిస్తూ లెక్కలేదు, ఉండదు ఉండే అవకాశం లేదు. ఈ పరిభ్రమణంలో రుజుమార్గంలో ఎన్ని? వక్రమార్గంలో ఎన్ని? పరిభ్రమణంలో శకలాలు వక్రిస్తాయా? మనిషికి మనసు వక్రించినట్టు!

ఈ వక్రగతి తాత్కాలికం.. మళ్ళీ ఋజుమార్గం పట్టేస్తాయి, అయితే ఇక్కడ వక్రంగాని రుజుగాని ఉన్నాయా? నీ ఆలోచన నీకు రుజు అవతలివాళ్ళకి వక్రం అవుతుందా? వీటి అంచనా ఏమిటి? వాటిని కొలవడం ఎలా? ఎందుకు కొలవాలి? ఆ కొలత ప్రయత్నమే ఈ డైరీ...

**నేపథ్యం**

"అంకము చేరి శైల తన యాస్తనదుగ్ధములానువేళ బాల్యాంకవిచేష్ట, దోడగి, అవ్వని చన్కంబళింపబోయి, అచట కుచంబుగానక, అహివల్లభు (శివుడు) హారము (పాము) కాంచి, వ్రేముళాం కురశంక నంటెడు గజాస్యుని గోల్తున్' అని ప్రభందకారుడు పెద్దసాని గజిబిజిగా అల్లాడు కాని అర్ధమాత్రుమూర్తికి కరువైన వినాయకుడిలా కాక, పుట్టగానే తల్లికే కరువై, గొల్లభామ పాలడబ్బాలకే బలియై ఆరోగ్యమే కలగా మిగిలిన అనేకమంది చిన్నపిల్లల్లో నేనూ ఒకడ్ని. పుట్టగానే వీడిని వదిలించుకుందామనే ఆలోచన తల్లికి ఏం చేసినా నీ ఇష్టం అనే చికాకు తండ్రికి కలిగాయంటే ఆ నిరభిమానానికి, నిస్సహాయతకీ పునాది, ఆ ఇంటి ఆర్ధిక పరిస్థితి అని అర్ధం చేసుకోక తప్పదు.

పాలకోసం ఏడవడం కడుపు నిండితే నవ్వడం, తప్పు తెలియని నేను ఎదురుగా గిలకలు, నాలుక చప్పరించేట్టు చేసే తీపికి లొంగి, ఇంకో మనిషికి మాలిమై, ఆమెతో ఎక్కడికి వెళుతున్నానో తెలియక, ఆమెతో ఆమె ఊరు చేరి, మాటలొచ్చేసరికి ఆమెనే 'అమ్మా' అని పిలిచాను. చాలా యేళ్ళ తర్వాత కలిసిన అన్నయ్య 'నిన్ను పెంపుకిచ్చేడం వెనుక చాలా కథుందిరా' అన్నాడు. వాడు చెప్పిన కథకి హీరో కన్నతండ్రి! బేక్ గ్రౌండ్ మ్యూజిక్ స్వతంత్ర పోరాటం! సెట్ కాంగ్రెసు మూమెంటు! పెళ్ళి జరిగిన నాటికి, తండ్రికి బాధ్యతలేదు. తల్లికి మొగుడుంటే అర్ధం తెలీదు.

ఈనాటికీ ఆ ఇంట్లో చెప్పుకుంటారట, తండ్రిని చూపించి, 'వీలు ముక్కు తలుచుకుంటే గాని, నేను వీలు పక్కన కూర్చోను' అంటూ తల్లి చేసిన అల్లరికి పెళ్ళికొచ్చిన వారు నవ్వలేక చచ్చారని.

పెళ్ళి జరిగిన నాలుగేళ్ళకి కానీ వ్యక్తురాలు కాలేదు తల్లి, వ్యక్తురాలైన రెండేళ్ళకి గాని కాపరానికి రాలేదు. పెళ్ళి జరిగిన నాటికి గ్రామంలోకి వచ్చిన ప్రతీ గ్రామఫోను జట్కా వెనకాల, సినిమా గూడుబళ్ళ వెనకాల, సిల్కు చొక్కాలేసుకుని పరిగెత్తే తండ్రి, గాంధీ టోపీకి మురిసిపోతాడని, ఆ టోపీవాళ్ళని ప్రజలు నెత్తిమీద పెట్టుకోడం చూసి భ్రమసిపోతాడని ఎవరనుకున్నారు? తర్కవితర్కం జ్ఞానం లేని తండ్రి ఇంట్లో దొరికిన డబ్బు చేజిక్కించుకుని 'సైమన్ గోబాక్' అంటూ తుపాకీ గొట్టాలకి రొమ్ములొడ్డి, ఆంధ్రకేసరి బిరుదు సంపాదించిన టంగుటూరి ప్రకాశం పంతులుగారిని చూడ్డానికి చెన్నపట్నం వెళ్ళిపోయాడు.

తీసుకెళ్ళిన డబ్బులు నెలరోజులు కూడా రాలేదు. కాంగ్రెసు మూమెంటులో పాల్గొన్న ఉత్సాహం తీరనూ లేదు. కాంగ్రెసు జెండా మోసినందుకు, ఆ ఇంటా ఈ ఇంటా స్వతంత్రసమరయోధినులు పెట్టిన భోజనం తిని గడిపినా, వాళ్ళు చూపిన ఆదరణ కొన్నాళ్ళకి ఖర్చయిపోయి, తిరిగి ఇంటికి చేరాడు తండ్రి.

తండ్రి ఇల్లు వదిలిననాడే బెంగతో అనారోగ్యంతో మంచం ఎక్కిన తాత, భార్య కాపరానికి, వస్తే పెద్దకొడుకు ఇంట్లోపడి ఉంటాడనే ఆశతో తల్లిని అత్తవారింటికి రప్పించాడు. తల్లిని దిగబెట్టడానికి వచ్చిన మేనమామకి, ఎదురుగా మంచం ఎక్కిన ఇంటిపెద్దా, పెద్దరికం చేయడానికి తగిన మనిషికోసం ఎదురుచూస్తున్న ఆస్తీ, చూసాక ఆ ఇంటినుండి కదలబుద్దెయ్యలేదు.

చెన్నపట్నం నుండి తండ్రి ఇంటికి చేరకుండానే తాతకాలం చేసాడు. ఇంటిపెత్తనం మేనమామ చేతుల్లోకి మారింది. తండ్రి ఇంటికి వచ్చేసరికి ఇంటిలో కొత్తగా కాపరానికి వచ్చిన భార్య ఆకర్షణీయంగా కనిపించింది. పెత్తనం బావగారి చేతుల్లో ఉండి అందుబాటులోకి వచ్చింది.

తండ్రే జ్యేష్టుడు అవడం, మిగతావాళ్ళు తండ్రికన్నా చిన్నవాళ్ళు అవడంవలన, మేనమామ ఆ ఇంటిలో ఎవరి భ్రమలని వాళ్ళ కలలుగా మార్చి రంగులుదిద్ది 'మీ జీవితాలకేమ్రా, మీరు మహారాజులు. అరవై ఎకరాల పొలం లంకంత కొంప మీరీ పల్లెటూర్లో, ఏం చేస్తారు, పట్నం పోయి చదువుకోండి. సీమకెళ్ళి పేరు తెచ్చుకోండి' అంటూ తండ్రి సోదరుల్ని పట్నం పంపేసాడు.

ఇంక తండ్రిని 'నీ అంతటి స్వతంత్ర్య సమరయోధుడు, ఈ దేశానికి ఎంతేనా అవసరం' అంటూ ఉత్సాహపరిచాడు, దానికి తగ్గట్టుగా కాపరానికి వచ్చిన భార్య వంశోద్ధారకుడ్నికనే ఆనందంతో పుట్టింటికి వెళితే, ఇంట్లో ఏ పనీ లేకుండా కూర్చున్న తండ్రి, 'గాంధీగారి పిలుపొచ్చింది' అంటూ తనవంతులో రెండెకరాలు పొలం అమ్మి లాహోరు వెళ్ళడం జరిగింది. గాంధీగారి ఉద్యమంలో చేరిన తండ్రికి అక్కడ ఉత్సాహం తగ్గేసరికి, ఇంటిదగ్గర కాపరం గుర్తుకి వచ్చేది. ఇంటికి వచ్చిన తండ్రికి ఆరేడు నెలల వ్యవధిలో భార్య రెండో వంశోద్ధారకుడ్ని కనేందుకు పుట్టింటికి, రెండెకరాలు తెగనమ్మి సుభాస్ పిలుస్తున్నాడని, కలకత్తా ప్రయాణం తప్పలేదు.

ఈ రకంగా తండ్రికి స్వాతంత్ర్యేచ్ఛ అమ్మ పుట్టింటి గొప్పలూ, మేనమామ సమయస్ఫూర్తి, కలిసి, వెరసి కళకళలాడే ఇంటిని లచ్చమ్మ చేతుల్నిండి పెద్దమ్మకి పెత్తనం అప్పచెప్పడానికి, ఎంతోకాలం పట్టలేదు. ఈరకంగా తల్లీ, తండ్రీ స్వాతంత్ర్యం వచ్చాక, ఇంటిదగ్గర కూర్చుని లెక్కలేసుకుంటే అయిదుగురు నికరసంతానం, ఆరోవాడికి మిగిలింది ఉండడానికి, చిన్నకొంప, కూరలు పండుతున్న దొడ్డీ, 'ఇదేమిటి బావా?' అంటే 'దేశంలో ఉన్న దేశ నాయకుల్ని చూడడానికి నీకున్న ఎకరాలు సరిపోవండీ, ఈ జన్మకింతే అని సరిపెట్టుకోండి'. అన్నాడు మేనమామ

దొడ్డిలో పండే కూరలకి ఇంటిలో ఆకలి తీరదు, లేదా ఆ పరిస్థితిలో పిల్లజమిందారుగా పుట్టిన తండ్రి, చదువులేని నేపథ్యంలో కొడవలీ పార పుచ్చుకుని, రోజుకూలికి పొలంలోకి వెళ్ళక తప్పలేదు.

ఈ నేపథ్యంలోనే కడుపులో ఉండేవాడిమీద విరక్తి, వాడ్ని ఎలా పోషించాలనే భయం పట్టి పీడించాయి తండ్రికీ తల్లికీ వీడు కడుపున పడ్డప్పట్నించే దరిద్రం, కష్టాలూ ఇంట ప్రవేశం చేశాయన్న సెంటిమెంటు కూడా లేకపోలేదేమో!

ఈ రకంగా ఆరో సంతానంగా పుట్టీ అడ్డాల్లోనే అమ్మని మార్చుకున్న ఘనత నాకే దక్కింది! రుజు మార్గం నుంచి మళ్ళిన జీవితం! అయితే అది వక్రమార్గమా? యేదేనా ముందున్న జీవితం తేల్చిచెప్పాలి. ప్రస్తుతం యేది రుజుమార్గమో, ఏది వక్రమార్గమో? ఆలోచించి తేల్చి చెప్పడం కష్టం. దారిద్ర్యానికి ఈ చిన్ని నోరుకూడా ఎక్కువే. తల్లిపేగుకి కాకపోవచ్చు. తల్లి ఆలోచనకి, చిన్నపిల్లాడి ఏడుపు భారమే! హృదయానికి కాకపోవచ్చు. ఇంటి ఆర్థిక పరిస్థితికి పిల్లాడ్ని వదిలించుకోడం, రుజుమార్గమే! కాని అభిమానానికి వక్ర భాష్యమేమో? ఒకే పని ఒక ఆలోచనకి వక్రం, ఓ ఆలోచనకి రుజు అవుతాయా?

***శైశవగీతి***

పిల్లల్లో వీడికీ కాంప్లెక్సుంది.--- దీనికి కాంప్లెక్సుంది, అంటూ ప్రతివాడి జీవితాన్నీ కన్ఫ్యూజ్ చేసెయ్యొచ్చు, కానీ అమ్మ, నాన్నల్లో ఏ కాంప్లెక్సులున్నాయో, ఎవరూ కనుక్కోలేదు. కనుక్కోలేరు కూడా. కనుక్కోనివన్నీ మనం కన్ఫ్యూజ్ చెయ్యొచ్చు! పిల్లల తెలివి తేటలన్నీ పెద్దవాళ్ళ గడుసుదనం ముందు దిగదుడుపే, ఎందుకవుతాయి? పిల్లలకి ఓటమి తప్పదు సెంటిమెంటులో తప్ప... విచిత్ర మేమిటంటే పిల్లలది రుజు స్వభావం... అప్పుడప్పుడు తిక్క పెట్టేస్తారు! భరించలేం!... అయితే ఈ తిక్క అంత సీరియస్ కాదు, ఆ తిక్క ఆ కోపం వెనక చిన్న చిర్నవ్వు ఉంటుంది.

అమ్మా నాన్నవి, ద్వంద్వస్వభావాలని ఎందుకన్నానంటే మనతో ఒకలా ప్రవర్తిస్తారు, మనవెనకాల ఒకలా ప్రవర్తిస్తారు. అందుకే వాళ్ళమీద అనుమానం వస్తుంది. ఇందులో ఎవరికీ తీసిపోరు. నేనూ వాళ్ళకి తీసిపోను. అయితే అమ్మ ద్వంద స్వభావం నే పట్టేసాను.

నేను అల్లరి చేస్తున్నప్పుడు విసుక్కునేది. అదే అల్లరిని ఎంతో గొప్పగా పక్కింటివాళ్ళతోనూ భావలతోనూ, అత్తతోనూ చెప్పి నవ్వుకునేది. అందుకే కోపం వచ్చేది. అయినా అల్లరి చేస్తున్నానని నేననుకోలేదు. ఎందుకంటే నేను చేసింది నాకు అల్లరి, ఊరివాళ్ళకి ముచ్చటా! అయే అవకాశం లేదుగా!

చాక్లెట్లూ అవీ రుచి చూపించి, నన్ను తీసుకొచ్చిన అమ్మ, అన్నం తినే వయసు వచ్చిందగ్గర్నించీ 'చారు' అన్నం ముద్దలు తినిపిస్తుందని నాకేం తెలుసు!? ప్రపంచంలో 'చారు' అన్నది, ఉన్నందుకు పీకలదాకా కోపం వచ్చేది. అందుకే చారు అన్నం గొంతు దిగేది కాదు. బాల్యంలో చారు అన్నం గండం ఉందని నాకు ఏ జ్యోతిష్కుడూ చెప్పలేదు. అందుకే అది తినవలసిన సమయం వచ్చేసరికి, దాన్ని తప్పించుకోడానికి, నాకున్న తెలివి తేటలన్నీ ఉపయోగించవలసి వచ్చేది. అఫ్ కోర్స్ ఫిట్టెస్ట్ విల్ సర్వైవ్! అలాంటి టెక్నిక్‌లో ఒకటి అన్నం అంతా కంచం కిందకి తోసేసి, తినేసానని చెప్పడం! చాలా చీప్‌గా ఉంది కదూ! అందుకే అమ్మ తొందరగా పసికట్టేసింది. లేనిపోని కుళ్ళెత్తులు వేసింది. నాకు నాన్నగారి పక్కనే కంచం పెట్టి, నాన్నగారితో అన్నం పెట్టేది. చారు అన్నం దగ్గరకి వచ్చేసరికి, చారన్నాన్ని కలిపి ఆరు ముద్దలుగా చేసి కంచంలో పెట్టి 'నేను మళ్ళీ చూసేసరికి, చారన్నం తినేయాలి. నిన్నటిలా కంచం కిందకి నెట్టెయ్యకు తెలిసిందా?' అంటూ గదమాయించేది.

నాకు తెలుసు 'ఆరుముద్దలూ తినేయాలి తెలిసిందా?' అన్న డైలాగు నాకూ, నిన్న చారన్నం తినకుండా కంచం కిందకి నెట్టేసాడు, అన్న కంప్లైంట్ ప్రత్యేకంగా నాన్నగారికి అన్న విషయం ఇద్దరికీ అర్థం అయేది.

నాన్నగారు నన్ను కోపంగా చూసి, 'చారు'అన్నం తిను ఆరోగ్యానికి మంచిది' అని భోజనం చేయడంలో మునిగిపోయేవారు. నేను చారు అన్నం తినడం కొంచెం ఆలస్యం చేస్తే, నాన్నగారు భోజనం చేసి, తయారై ఆఫీసుకి వెళ్ళిపోతారు. అప్పుడు అమ్మని బతిమాలి చారన్నాన్ని తప్పించుకోవాలి. అట్టిపరిస్థితుల్లో రెండుముద్దలు తినక తప్పలేదు. ***కాంప్రమైజ్ టెండెన్సీని పిల్లలకి పెద్దలే నేర్పుతారు.***

***దానివల్ల పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుందని చాలా విషయాల్లో ఋజు స్వభావాన్ని కోల్పోతారని వాళ్ళకి అర్థం కాదు.***

నేను రెండు ముద్దలు తినేసరికి నాన్నగారి భోజనం చేయడం అయిపోయేది. ఆయన తొందరలో నన్ను గమనించకుండానే వెళ్ళిపోయేవారు.

ఇంక నేను బతిమాలి బామాలి అమ్మని ఏడిపించి మిగిలిన చారన్నం పారేయడానికి పర్మిషను సంపాదించే సరికి మరోముద్ద గొంతు దిగేది. అమ్మ కూడా పర్మిషను అంత తొందరగా ఇచ్చేది కాదు. కంచం కింద వెదికి, ఆ అన్నం నేను తినేసానని నమ్మకం కుదిరాక, నాతో పెట్టుకుంటే తన పని తెమలదని, మిగతా అన్నం వదిలేయడానికి ఒప్పుకునేది. కాని నా ఉద్దేశ్యం వేరు. బాల్యాంతం చారన్నం తినడం నాకు ఇష్టం లేదు. అందుకే కొత్త కొత్త సులభ పద్ధతులు వెదుకుతుండేవాడిని. దాన్ని వాళ్ళు అల్లరి అనేవాళ్ళు, అది వేరే విషయం. ఇక్కడ కూడా ఏదో సులభ పద్ధతి వెదకాలి! లేకపోతే నాకు చారు అన్నం అలవాటయే ప్రమాదం ఉంది!

'నెసెసిటి ఈజ్ మదర్ ఆఫ్ ఇన్వెన్షన్' అని ఎవడన్నాడోగాని, మా బాగా అన్నాడు. అలాంటి ఇన్వెన్షన్ ఫలితంగా, నాకు చారన్నం తినడం తప్పింది.

చారన్నాన్ని కలిపి ఆరో పదో ముద్దలుగా చేసి కంచంలో పెట్టేది అమ్మ. నాన్నగారికి తొందరగా వడ్డన చేస్తూ నేను తింటున్నానా లేదా అని ముద్దలు లెక్కపెట్టేది.

నేను తినకపోతే ముద్దలన్నీ పెట్టినవి పెట్టినట్టుగా ఉంటే, నన్ను గదమాయించేది. నా టెక్నిక్ ఉపయోగించి, ఆవిడ గదమాయింపుల నుండి తప్పించుకున్నా!

పెద్దవాళ్ళకి చారన్నం మంచిది, పిల్లలకి చారన్నం చెడ్డది ఎందుకవ్వాలి అంటే చారన్నంది తప్పా? పెద్దలిది తప్పా? విచిత్రమైన ధర్మ సంకటం! అందులోనే విమోచనా మంత్రం.

కానీ ఓ రోజు మా బావ, మాతో భోంచేస్తున్నాడు. వాడు నా ఇన్వెన్షన్ని పసిగట్టేశాడు. నాన్నగారు భోజనం చేసి వెళ్ళిపోయాక నవ్వుతూ 'ఏమిటత్తా వీడీమధ్య చారన్నం శుభ్రంగా తింటున్నాడంటే, నిజమే అనుకున్నా, వాడెక్కడ తింటున్నాడూ, వాడు నిన్ను ఫూల్ని చేస్తున్నాడు 'అన్నాడు.

నేనేం మాట్లాడలేదు బావ సంగతి నాకు తెలుసు. వాడు మిరియాలకషాయం తాగడానికి ఏడుస్తాడు, నాకు చారన్నం తినడం ఇష్టం లేదు, అంతే తేడా అదెవరూ గుర్తించరు, అదే నా బాధ.

'అదెలా?' అంది అమ్మ ఆశ్చర్యంగా.

'దీనికి అంత ఆశ్చర్యపడిపోడం దేనికి, ఇప్పుడంటే చెప్పనుగాను, పెద్దయాక నేను చెప్పనా?' అనుకున్నాను మనసులో...

కాని నా ఆలోచనలని పట్టించుకోకుండా బావ నవ్వుతూ 'అత్తా నువ్వు ఆరుముద్దలు వాడికంచంలో పెట్టావు, వాడిని తినమన్నావు నువ్వు. నీ పనిలో ఉండగా, వాడు ఒక ముద్దని కొంచెం కొంచెంగా మిగతా అయిదు ముద్దలతోనూ కలిపేసాడు. నువ్వు లోపలనుండి వచ్చి చూసి కంచంలో అయిదే ఉన్నాయి. కాబట్టి వాడు ఒకటి తినేసాడు, అనుకున్నావు. నీ పని తొందరలో నువ్వు గమనించినప్పుడల్లా ఒక్కొక్క ముద్ద మాయమయేది. అవివాడు తినేసాడని నువ్వు అనుకున్నావు, ఆ ముద్దల్ని వాడు మిగతా ముద్దల్లో కలిపేస్తున్నాడు. ఆఖరికి మూడు ముద్దలు మిగిలాయనగా అందులో చెయ్యికడిగేసుకుంటున్నాడు' అంటూ నేను కనుక్కున్న టెక్నిక్ అంతా అమ్మకి చెప్పేసాడు. దాంతో అమ్మకి మోసపోయాను కదా అని తనమీద తనకి కోపం వచ్చి, చారన్నం గుణగణాలన్నీ వర్ణించి, అంతటి చారన్నాన్ని నీళ్ళపాలు చేస్తావా? అంటూ ఒక్కటిచ్చుకుంది.

ఆమె ఇచ్చుకున్నది నాకు తగలదని నాకూ తెలుసు, అమ్మకీ తెలుసు. అమ్మ ఇచ్చుకున్నట్టు నటిస్తే, నేను తగిలినట్టు నటిస్తాను. ఉత్తుత్త కోపాలతోనూ భయాలతోనూ వీడిచేత చారన్నం తినిపించలేమనే నిర్ణయానికి అమ్మ ఎంతో కొంత చారన్నం తినక తప్పదనే ఆలోచన నాకూ వచ్చేసాయి. మళ్ళీ కాంప్రమైజ్, డామిట్!

అప్పుడు అమ్మ 'నువ్వు చారన్నం శుభ్రంగా తినేస్తే, నీకు రోజూ పదిపైసలు ఇస్తాను' అంటూ వాగ్దానం చేసింది. ఇదేదో లాభసాటిగా ఉందని నేను ఒప్పుకున్నాను.

ఎందుకంటే ఆ రోజుల్లో పదిపైసలకి చాలా విలువ ఉండేది. మురీ ఉండలు, సెనగపప్పుండలు, తాండ్ర, అన్నీ వచ్చేవి. ఏదికావలిస్తే అది కొనుక్కునే వాడిని. ఆ విధంగా ఇంట్లో మదర్స్ ఫండ్ (IMF) నుండి రోజూ పదిపైసలు సంపాదిస్తూ తొమ్మిదేళ్ళకే సంపాదనా పరుడ్ని అయిపోయాను..!

✡✡✡

## 2

ఎదుగుతున్న వయసుకి, కథలు రుచించినంత ఇంకేవీ రుచించవు. ఆ రోజుల్లో టెలివిజన్స్ లేవు మామ్మే పెద్ద 'టెల్'విజను. మామ్మ చెప్పే కథల్లో, మహత్యాలూ గొప్పగొప్పవాళ్ళూ ఉండే వారు కాదు. దొంగలు, రాజకుమారులు, మాయలు మంత్రాలూ ఉండేవి. అవికొంత వరకూ సరదాగా ఉండేవి. కాని మనసుని భ్రమ పెట్టేవి కావు. విని ఆనందించి తర్వాత మర్చిపోయేవాడిని.

కాని ప్రతి ఆదివారం నాన్నగారు చదివే భాగవతం గొప్ప థ్రిల్లింగ్‌గా ఉండేది. మొదట్లో భయం వల్ల నాన్నగారి దగ్గర కూర్చుని భాగవతం విన్నా, రాను రాను, పోతన తెలుగు తేనె నా నాలుక చివర అంటి, నాకా పద్యాలు కంఠతా వచ్చేసేవి. ప్రతి ఆదివారం ఇంట్లో నాన్నగారు స్పాన్సరు చేసే పోతన ఛానల్, నా మీద విపరీతమైన ప్రభావాన్ని చూపింది. నాన్నగారు భావయుక్తంగా పద్యం చదివి, అర్థం చెప్పేవారు. ఆ పద్యాలని స్కూల్లో పోటీలకి చదవడం వల్ల ప్రైజులు కూడా వచ్చాయి.

ఆ పద్యాల్లో 'హాలికులైననేమి కందమూల గౌద్దాళికులైననేమి నిజదారసుతోదర పోషణార్థమై' అన్న పద్యమొకటి. దానిని శ్రీశ్రీ 'హాలికులైన నేం ఆల్కాహాలికులైననేమి' అని చమత్కరించాడు. శ్రీ శ్రీ తత్కాల చమత్కారం ఆస్వాదించాలంటే, పోతన పద్యం తెలిసుండాలికదా!

ఆ రకంగానే భాగవతంలో పోతనగారు 'సిరికిం చెప్పడు, శంఖుచక్రగదాయుగముం చేదోయి సంధింపడు... యే పరివారంబును జీరడు, అభ్రకపతిమన్నింపుడు... ' అంటూ విష్ణుమూర్తి గాభరాని వర్ణించాడు. కాని ఏమిటా గాబరా? అన్నవాళ్ళకి 'హరి వెంటన్ లచ్చి, లచ్చి వెంట.... 'అంటూ మరో పద్య రాసి చేతులు దులిపేసుకున్నాడు.

ఆ పద్యాలు నాకు చాలా సరదా వేసేవి. ఎక్కడికేనా వెళ్ళడానికి అంత తొందర పనికిరాదు అనిపించేది. అందుకే అమ్మ 'ఒరేయ్ ఉప్పు తెచ్చిపెట్టరా' అంటే 'డబ్బులు ఆ టేబులు మీద పెట్టు, అని నా వెనకాల వస్తాయో రావో చూస్తానూ' అనే వాడిని 'బావుంది డబ్బులు టేబులు మీద పెడితే నీ వెనకాల ఎలా వస్తాయి?' అనేది అమ్మ డౌటుతో.

'మరి అవన్నీ విష్ణుమూర్తి వెనక వెళ్ళలేదా, లక్ష్మి ఎవరి వెనకాలైనా బయలుదేరుతుంది' అన్నాను. అమ్మకూడా భాగవతం వింటుంది.

అమ్మ నవ్వుతూ 'నీ పురాణ జ్ఞానం బాగానే ఉంది. వెళ్ళు తొందరగారా' అంది.

అదే వారంలో ఒకరోజు పగలు మా బావ నన్ను వీధిలో గోళీలాడుతుండగా పట్టుకున్నాడు. ఇంటికి తీసుకొచ్చాడు.

'ఒరేయ్ స్కూలుకెళ్ళలేదా? పుస్తకాలు ఏవి? ఆటకి వెళుతున్నట్టు అమ్మకి చెప్పలేదా?' అంటూ అడ్డమైన ప్రశ్నలూ వేసి, ఓ జెల్లకాయ కొట్టాడు.

నేను కొంచెం మొండిగా 'అమ్మకెందుకు చెప్పడం, విష్ణుమూర్తి ఎవరికీ చెప్పకుండా వెళ్ళలేదా, నేనూ అంతే అమ్మకుం చెప్పడు, పుస్తకాసంచీ చేదోయి సంధింపడు----- గోళీకాయలాటనోత్సాహియై' అంటూ పద్యం మార్చి చదివాను.

వెనక నుండి అమ్మ, ముందు నున్న బావ నవ్వారు. అది కాదు ముఖ్యం, అందరికీ వెనగ్గా నాన్నగారు పెదవులమీద చిరునవ్వు ఉన్నా, కళ్ళల్లో కోపాన్ని చూపిస్తూ 'ఏమిరా అమ్మకుం చెప్పడా--- పుస్తకాల సంచీ చేదోయి సంధింపడా?..... నీ భాగవత శ్రవణం ఇందుకు పనికి వస్తోందన్నమాట' అన్నారు వెనక నాన్నగార్ని చూసేసరికి నాలో విష్ణుమూర్తి మాయమై, గజేంద్రుడు ప్రవేశించి వణకసాగాడు.

ఆ సమయంలో నాన్నగారిని ఇంట్లో చూసి ఆశ్చర్యంతో బావ 'అదేంటి మామయ్యా ఆఫీసు లేదా?' అంటూ అడిగాడు.

బావ అడిగిన ప్రశ్నకి నాన్నగారు 'లేదు ఇవాళ ఆఫీసులు, మునిసిపల్ స్కూళ్ళూ శలవులిచ్చారు ఎక్స్ మునిసిపల్ చైర్మన్‌గారు పోయారు.' అన్నారు.

'అందుకా వీడు పొద్దున్నే ఆటకిపోయాడు స్కూలునుండి ఎప్పుడొచ్చాడో తెలీదు. ఎప్పుడూ పుస్తకాలింట్లో పెట్టాడో తెలీదు. ఆటలో చూసి స్కూలెగ్గొట్టాడేమో? అని పట్టుకు తీసుకొచ్చా' అన్నాడు బావ.

ఆ విధంగా నా పద్యాన్ని మర్చిపోయారు నాన్నగారు.

✡✡✡

నాన్నగారు చదివిన పద్యాల్లో నన్నాకట్టుకున్న పద్యం 'ఇంతింతై, మరియు దానింతై నభోవీధిపైనంతై... బ్రహ్మాండాంతర సంవర్ధియై' అంటూ వామనుడు బ్రహ్మాండం అంత ఎలా పెరిగాడో వర్ణించాడు పోతన, వామనుడు ఎలా పెరిగాడో అలాగే నాకూ పెరిగిపోవాలనుండేది. అలా పెరిగి స్కూల్లో అందరినీ ఓ పట్టు పట్టాలనుండేది.

అదెలాగూ జరగదు కాని నేను ఎవరితోనైనా దెబ్బలాడితే, 'ఇంతింతై అంతై ఇంతై' అంటూ నేలమీంచి, గట్టుమీదకి, గట్టుమీంచి బెంచీమీద నుండి, డస్క్ మీదకి అక్కడినుండి టీచరు టేబులు మీదకి గెంతి నేలమీద నిలబడి నన్నే చూస్తున్న ఫ్రెండుని ఒక జెల్లకాయిచ్చుకుని, వాడు కూడా అంతై ఇంతైవటుడింతై అన్నది ప్రాక్టీసులో పెట్టేలోగా టేబులుమీంచి దూకి పారిపోయేవాడిని.

ఈ పద్యం నా మిత్రులందరికీ పట్టేసింది. ఒకరోజు మేష్టారు ఎవరూ రాలేదు. కాళీగా ఉన్న సమయం వృధా కాకుండా మిత్రబృందంతో 'అంతై ఇంతై వటుడింతై' అంటూ కోరస్ పాడుతూ, బెంచీమీదనుండి ఇంకో బెంచీ మీదకి గెంతుతున్నాం. మా పక్క క్లాసులో తెలుగు మాస్టారు ఉన్నారు. ఆయనకి పద్యంతో పాటు దబదబ చప్పుళ్ళు వినిపించాయి.

ఆయన మా క్లాసులోకి వచ్చారు. మేం ఎగిరి గంతులేయడం ఆయనకి ఆశ్చర్యం కలిగించలేదు. పద్యం ఆసక్తి కలిగించింది. ఆ పద్యం ఎవరు చదువుతున్నారో వాళ్ళే, ఈ అల్లరికి మూలకారణం అని ఆయన ఉద్దేశం. ఆయన టాక్ట్ ఫుల్‌గా 'వొరై ఆ పద్యం పూర్తిగా ఎవరు చదువుతున్నారో వాళ్ళని వదిలేస్తాను. మిగతావాళ్ళ చేత గోడకుర్చీ వేయిస్తాను' అన్నారు. మిగతా వాళ్ళు వెర్రిమొహాలేసారు. నేను మాత్రం 'జమ్ జమ్' అంటూ పద్యం చదివేసాను

ఆయన పద్యం అంతా విని 'ఈ అల్లరికి మూలకారణం నువ్వా నాయనా?' అంటూ నా చేత గోడ కుర్చీ వేయించారు. నేను బిక్కమొహం వేసి గోడకుర్చీ వేసాను. ఆయన నన్ను చూపిస్తూ 'ఓ గంట తర్వాత వీడు ఏ పద్యం చదువుడో తెలుస్రా?' అనడిగారు క్లాసుని.'తెలీదుసార్' అంటూ తెలుసుకోవాలనే ఉత్సాహం చూపించారు క్లాసులో విద్యార్థులు. అప్పుడు తెలుగుమాస్టారు రాగయుక్తంగా 'లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయె---- ప్రాణంబులాఠావుల్ తప్పెన్, మూర్ఛవచ్చె---- సంరక్షించు భద్రాత్మకా' అంటూ పద్యంచదివారు.

పిల్లలందరూ గొల్లున నవ్వారు. తెలుగు మాష్టారు క్లాసులోంచి వెళ్ళిపోతూ నా వేపు చూసి 'ఇంకెప్పుడూ బెంచీలెక్కి దూకకువెళ్ళి సీట్లో కూర్చో' అన్నారు. 'అమ్మయ్య' అనుకుని సీట్లోకెళ్ళి కూర్చున్నాను.

✡ ✡ ✡

నాకు భాగవతంలో ఎసెన్స్ ఆ వయసులో అంతగా పట్టుబడలేదు. కానీ ఆ పద్యాల్లో ఒకటి 'వారిజాక్షులందు వైవాహికములందు ప్రాణ విత్తమానభంగమందు, జికితగోకులాగ్రజన్మ రక్షామందు, బొంకవచ్చు నఘము పొందదధిప. ' అన్న శుక్రనీతిని అర్ధం చేసుకున్నాను.

పిల్లకాయలకి చాలా ఇబ్బందులుంటాయి. అలాంటి ఇబ్బందుల్లో ఒకటి పొద్దునే చన్నీళ్ళ స్నానం చేయడం. పొద్దునే ఎనిమిది గంటలకి స్కూలు కెళ్ళాలంటే ఏడుగంటలకల్లా స్నానం చెయాలి. చన్నీళ్ళు ఒంటిమీద పడగానే ఒళ్ళంతా జివ్వున లాగేది. నేను మధ్యాహ్నం చేస్తాననే వాడిని, అలా కాదు పొద్దునే చెయ్యాలి చేస్తే మంచిది అంటూ ఆరోగ్య సూత్రాలన్నీ, వర్ణించేది అమ్మ. ఏమైనా అడ్డుచెపితే నాన్నగారితో చెపుతాను అనేది.

ఏం చేయాలో తోచక బాత్రూములో దూరి కసికొద్దీ కూర్చునేవాడిని. అది అమ్మ బైటనుండీ గమనిస్తూ 'ఏదీ నీళ్ళ చప్పుడు అవడం లేదు నాన్నగారిని పిలవనా' అనేది. అప్పుడే నాకు అయిడియా తట్టింది. నీళ్ళ చప్పుడైతే చాలు, నేను నీళ్ళు పోసుకున్నట్టే, అమ్మకి నమ్మకం కలుగుతుంది. అందుకే రోజూ నీళ్ళొంపేసి, నీళ్ళుపోసుకుంటూ సర్టిఫికేటు ఎందుకు కొట్టేయకూడదూ!

బాత్రూములో కెళ్ళి ఓ బాల్చీడు నీళ్ళు చెంబు చెంబునా, పైనుండి చప్పుడయేటట్టు ఒంపేసి, ఆఖరి చెంబుడు నీళ్ళతో కాళ్ళు మాత్రం కడుక్కుని, బయటకి వచ్చేవాడిని.

నేను నీళ్ళు పోసుకున్నానని అమ్మ సంతోషించేది. నీళ్ళు పోసుకోలేదని నేను సంతోషించేవాడిని. కాని నా విషయం మా బావ పసిగట్టేసాడు. ఒకరోజు నేను నీళ్ళొపేసి బైటకి వచ్చేసాక 'ఏరా సబ్బురుద్దుకున్నావురా?' అని అడిగాడు.

'వో' అన్నాను నేను.

'వెధవా..సబ్బు బయటుంటే బాత్రూములో సబ్బెలా రుద్దుకున్నావ్?' అన్నాడు గదమాయిస్తూ.

బావకి నా నాటకం తెలిసిపోయిందని అర్ధమయి, 'అమ్మో స్కూలుకి టైమయిపోతోంది' అంటూ స్కూలుకి పారిపోయాను.

బావ చెప్పిన విషయం అమ్మకి అర్ధమైపోయింది. నేను నీళ్ళుపోసుకునే స్థానాన్ని మార్చేసింది. 'ఒరేయ్ నీళ్ళు తోడి నూతి చప్టాదగ్గర పెట్టాను అక్కడే పోసుకో నీ గౌరవానికి వచ్చిన భంగం ఏదిలేదు గానీ, చెడ్డీతో పోసుకో ఆరేస్తాను' అంది.

ఇంక తప్పదురా భగవంతుడా అని ముక్కుతూ, మూలుగుతూ నూతి చప్టా దగ్గర స్నానం చేసా! అలాగని నాకు జలగండముంది, నీళ్ళోసుకోడం ఇష్టం లేదు అనుకుంటే పొరపాటు. పొద్దున్నే చల్లటి నీళ్ళోసుకోడం ఇష్టంలేదు. కాని మధ్యాహ్నం బాత్రూములో దూరి, బాత్రూము తూములో అడ్డంగా గుడ్డపెట్టి, బాత్రూము గట్టువరకూనీళ్ళు నింపి చిన్న చెరువులా చేసి ఆ చెరువులో కేరింతలు కొడుతూ, నీళ్ళోసుకోవడం అంటే ఇష్టం.

నా ఇష్టాలు అమ్మకి అనిష్టాలు. అందుకే రెండు మూడు అక్షింతలు వేసినా, అవి సీరియస్ కాదని ఆమె పెదాలమీద చిరునవ్వు చెప్పేది.

కాని కార్యక్రమం సవ్యంగా జరిగిపోతే కథేలేదు! ఆ రోజు బాత్రూములో గుడ్డపెట్టి కొళాయి విప్పి నీళ్ళు బాత్రూము గట్టు వరకూ పట్టి, ఆ చిన్న చెరువులో కేరింతలు కొడుతూ జలక్రీడలు ఆడుతున్నాను. ఆ సమయంలో అత్త బిందె పట్టుకొచ్చింది. నీళ్ళు పట్టుకోవాలి అంది. అత్త నాన్నగారికి స్వయానాచెల్లెలు, నేను ఆమెని మేనత్త అనే అనుకునేవాడిని. కాని ఆమె నన్ను దత్తత మేనల్లుడు అని అనుకునేది, తన స్వంత అన్నగారి సదుపాయాలన్నీ తనూ తన పిల్లలూ అనుభవించిన తర్వాతే నేను అనుభవించాలని ఆవిడ గట్టి

నమ్మకంతో ఉండేది అందుకే నన్ను చిన్న చూపు చూసేది. లేదా అలా చిన్న చూపు చూసే, అవకాశం కోసం ఎదురుచూసేది. అది ఆవిడ రుజు ప్రవర్తన అని అప్పుడు నాకు తట్టలేదు! ఆ రోజు అవకాశం వచ్చింది. విచిత్రం ఏమీటంటే ఆవిడ ఆలోచనకి నా పసితనం అడ్డురాలేదు.

అత్త వచ్చినా నేను బాత్రూములోంచి బైటకి రాలేదు. అందుకు ఆవిడ పౌరషించింది. బైటకి రమ్మని గదమాయించింది. అదికూడా నేను పట్టించుకోలేదు. ఆవిడ పౌరుషం కోపంగా మారి బాత్రూములోకి వచ్చి 'చెపుతుంటే నీకు కాదురా' అంటూ నన్ను జబ్బ పట్టుకు బైటకు లాగి, తూముకి అడ్డంగా పెట్టిన గుడ్డ తీసేసింది. నేను కష్టపడి బాత్రూమునిండా నింపిన నీళ్ళన్నీ తూముగుండాపోతుంటే, సహించలేక ఉక్రోషంతో బైటనున్న బిందెని కాలితో తన్నా.... మంచినీళ్ళు పట్టుకునే బిందెని కాలుతో తంతావురా' అంటూ ఛెళ్ళుమనేలా లెంపమీద కొట్టింది. దాంతో నాలో కోపం అయితే పెరిగింది, కానీ ఏం చేయాలో అర్ధంకాలేదు.

ఏడుస్తూ 'ఇంట్లోంచి వెళ్ళిపోతా' అని అంటూ గబగబా ఫేంటు షర్ట్ వేసుకున్నాను.

అప్పటికి అమ్మ వచ్చి నన్ను పట్టుకుని 'అత్త నీళ్ళు పట్టుకోడం అయాక ఆడుకో' అంటూ సలహా ఇచ్చింది, కాని అది నచ్చలేదు. నేను ఇంట్లోంచి పోతానన్న మంకు పట్టు వదలలేదు.

అమ్మ పట్టుని వదిలించుకోడానికి గింజుకుంటున్నాను. నా మొండితనం, నా పట్టుదల చూసి అత్త మెత్తబడింది. కాని బైటకి బింకంగా 'ఒక్కటేస్తే సరి, వాడే నోరెత్తకుండా ఉంటాడు' అంది. కాని అమ్మ ఒక్కటెయ్యలేదు, అమ్మలో మంచి లోపం అదొక్కటే, బతిమాలుతోంది, డబ్బులిస్తానంది. ఇంకా ఎన్నోవిధాల బామాలుతోంది, కాని నేను వినడం లేదు మంకుగా 'మరి ఇంటికి రాను' అని చెప్పి అమ్మ పట్టుని విడిపించుకోవాలని చూస్తున్నాను. అది చూసి అత్తయ్యలో ఆందోళన పెరిగింది 'అన్నయ్యా' అంటూ నాన్నగారిని కేకేసింది.

అమ్మ భయపెడుతుంది కాని అంత తొందరగా నాన్నగారిని పిలవదు. 'ఆయనకి ప్రధమ కోపం వస్తే నన్ను గట్టిగా కొట్టేస్తారేమో' అని భయం.

నాన్నగారికి పిలుపు వెళ్ళిపోడంతో, నాన్నగారు రంగప్రవేశం చేస్తారని అందరికీ తెలుసు అందులో మామ్మ మనసు ముందుగా కరిగిపోయింది. 'వాడేదో అల్లరి చేసాడే అనుకో నీకు బుద్దుండుద్దే నువ్వూ వాడితో సమానంగా మొండిపట్టుపట్టావు. ఇప్పుడు వాడు కిందకి దిగివస్తే, వీడ్నో రేవు పెడతాడు. వాడికసలే ప్రధమ కోపం' అంటూ గిలగిల్లాడిపోతూ కూతుర్ని మందలిస్తోంది మామ్మ.

ఎటూ చెప్పలేక నాన్నగారు వస్తే నన్ను కొట్టేస్తారు కదా, అని జాలిగా చూస్తోంది అమ్మ. ఆ క్షణంలో నాన్నగారి చెప్పుల చప్పుడు, మేడమెట్ల మీద వినబడింది. దాంతో వాతావరణం సద్దుమణిగింది. నేను బిక్కుబిక్కుమంటూ అమ్మ వెనక్కి చేరాను! అత్తనీళ్ళు పట్టుకునే నెపంతో బాత్రూములోకి దూరింది. మామ్మ మాత్రం కిందకు దిగిన నాన్నగారిని చూస్తూ 'వాడ్నేమనకురా బాబూ ఏదో చిన్నతనం' అని నాన్నగారికి సిఫార్స్ చేస్తూ బుర్ర వణికించుకుంటూ గోడ పట్టుకుని తనగదిలోకి వెళ్ళి మంచం మీద కూలబడింది. అది మామ్మ రుజు ప్రవర్తన!

నాన్నగారు వచ్చాక జరిగినదంతా, అమ్మ నాన్నగారితో చెప్పింది. నాన్నగారు కోపగించారా? తెలీలేదు. ప్రసన్నంగా ఉన్నారా? అదీ తెలీలేదు. నన్ను చూసి 'నాతోరా' అని మేడమీదకి వెళ్ళిపోయారు, నేను ఆయన వెనుకే పిల్లిలా మేడమీదకి వెళ్ళాను. నాన్నగారు వెళ్ళి ఆయన పడక కుర్చీలో కూర్చున్నారు. నేను వెళ్ళి ఆయన ఎదురుగా నిలబడ్డాను.

నాన్నగారు నన్ను ఎక్కడ కొట్టేస్తారో అన్న భయంతో అమ్మ నా వెనుకే మేడమీదకి వచ్చింది. అప్పుడు నాకు అర్ధం అయింది ఏమీటంటే అమ్మల్లో స్వంత అమ్మ పెంచిన అమ్మ వేరుగా ఉండరని!

నాన్నగారు నన్ను తీక్షణంగా చూస్తూ 'ఏమిటీ ఇంట్లోంచి వెళ్ళిపోతావా?' అని అడిగారు.

నేనేమీ మాట్లాడలేదు బిక్కచచ్చిపోయి ఆయన ఎదురుగా నిలబడ్డాను. నాన్నగారు గొంతుక సౌమ్యంగా ఉంది.

'ఇంట్లోంచి వెళ్ళిపోయి ఏం చేస్తావు? ఎక్కడుంటావు? ఏం తింటావు? ఏం కట్టుకుంటావు? చదువు మానేస్తావా? అన్నీ ఉంటేనే అదిలేదు ఇది లేదు అని అమ్మని వేధించుకు తింటున్నావు, రోజూ నాకు తెచ్చే సిగరెట్లలో ఐదుపైసలు మిగుల్చుకుంటున్నా చూసీచూడనట్టు ఊరుకుంటున్నానంటే, నీలో పసితనానికి ముచ్చటపడి, కాని నువ్వు మమ్మల్ని మోసం చేస్తున్నావని అనుకోలేదు. ఇంట్లోంచి వెళ్ళిపోతే అక్కడ నీకు అమ్మా నాన్నలు ఉండరు. ఎవర్ని అల్లరిపెడుతావు, ఎవర్ని మోసం చేస్తావు? తప్పు ఇంకెప్పుడూ ఇంట్లోంచి వెళ్ళిపోతాననకు' అన్నారు.

ఆయన మాటలు నాకు చాలావరకూ అర్థం కాలేదు, పిల్లలకి కన్సెషన్స్ ఉంటాయన్న సంగతి నాన్నగారు చెప్పే వరకూ అర్థం కాలేదు ఇన్నాళ్ళూ

నేను సిగరెట్లలో పదిపైసల వరకూ మిగుల్చుకుంటున్నానని తెలిసీ నన్నేమనలేదు అంటే నేను చేస్తున్న పని నాన్నగారికి తెలుసు కానీ పట్టించుకోలేదు. నాన్నగారు చాలా తక్కువ సిగరెట్లు కాలుస్తారు. అరపెట్టి తెప్పించి అందులో రోజుకి ఒకటో రెండో తాగేవారు. ఒకరోజు ఆయన పూర్తిపెట్టి కొనుక్కున్నారు. ఆ పెట్టెలోంచి నేను ఒక సిగరెట్ తీసి దాచాను. నాన్నగారు సిగిరెట్లు తెమ్మన్నప్పుడు నాలుగే కొని ఈ సిగిరెట్టు అందులో కలిపి, అరపెట్టె చేసి నాన్నగారికి ఇచ్చాను. ఆ సిగిరెట్టు డబ్బులు మిగిలేవి. ఇలా చాలాసార్లు చేసాను. నాన్నగారు పసికట్టలేదు, అనుకున్నానంతే. నేను బయటికి వెళ్ళిపోతే అమ్మనాన్నలు ఉండరు! అన్నారే అది నాకు అర్థం కాలేదు అమ్మనాన్నల అవసరం నాకేమిటి? అసలు పిల్లలకి అమ్మా నాన్నల అడవుండాలా? అంతాఅయోమయంగా ఉంది.

నా మౌనం నా దీనవదనం చూసిన నాన్నగారు 'వెళ్ళు వెళ్ళి దేముడిపటం ముందు, 'ఇంకెప్పుడూ ఇలా ప్రవర్తించను. ఇంట్లోంచి వెళ్ళిపోతానను' అని లెంపలేసుకుని దండం పెట్టు' అన్నారు.

నేను అప్రయత్నంగా దేవుడి పటం దగ్గరకి వెళ్ళి దండం పెట్టాను 'ఇలా రా' అన్నారు.

నేను వెళ్ళాను, నేను వెళ్ళేసరికి నాన్నగారు పడక కుర్చీలోంచి లేచి, మంచం మీద పడుకున్నారు. నన్ను కూడా మంచం మీద పడుకో అన్నారు. నేను మంచం ఎక్కి ఆయన పక్కగా ఒదిగి పడుకున్నాను. నా మీద చెయ్యి వేసి, ఆయన అలసటగా దిండు కానుకుని పడుకున్నారు. అమ్మ శాంతించిన మనసుతో వెనుతిరగడం చూసాను. అంతే కన్నుమూతపడింది.

✡ ✡ ✡

నేను లేచేసరికి నాన్నగారు పడక కుర్చీలో కూర్చుని ఎవరితోనో మాట్లాడుతున్నారు. నాకు బద్దకంగా ఉండడం వల్ల, అలాగే పడుకుని ఉన్నాను. 'ఏమిటే నీకు చిన్నపిల్లాడితో పోటీ ఏమిటి?' అంటున్నారు నాన్నగారు.

'వాడిని వెనకేసుకు రాకు అన్నయ్యా' అంటోంది అత్త.

'వెనకేసుకు రావడం ఏమిటి? వాడికేం తెలుసు, ఇంట్లోంచి వెళ్ళిపోతానని, కోపంతో వీధిలోకి వెళ్ళిపోయి తప్పిపోతే మళ్ళీ వాడిని పట్టుకోగలమా?ఈ పట్నంలో ఎక్కడని వెదుకుతాం కొంచెం అర్థం చేసుకు ప్రవర్తిస్తుండండి'అన్నారు,

చిరాకు పడుతూ పన్నెండేళ్ళు పెంచిన మమకారంతో... 'ఆ వీడుపోతే ఇంకొకడు లోకంలో పిల్లలకే కరువా?' అంది అత్త మూతివిరుస్తూ.

'నీకేమేనా బుద్ధుందా చిన్న వాడిమీద అంత అసూయతో ఉంటావనుకోలేదు తొందర్లో ఇంకో ఇల్లు చూసుకోండి... వెళ్ళు'. అన్నారు నాన్నగారు కోపంతో.

'అయిన వాళ్ళకి ఆకుల్లోనూ, కానివాళ్ళకి కంచాల్లోనూ' అంటూ ఏవేవో అనుకుంటూ గదిలోంచి కిందకి వెళ్ళిపోయింది అత్త. ఆ సంభాషణలో అర్థం నా బుర్రకి ఎక్కలేదు. కాని నాన్నగారు పూర్తిగా నన్ను సమర్థిస్తూ మాట్లాడుతున్నారు. అది అర్థం అయింది.

రెండోరోజు అత్త బావలు ఒకవేపు, నాన్నగారు, అమ్మ, మామ్మ ఒకవేపుగా పెద్ద దెబ్బలాట అయింది. ఆ కోపంలో అత్త నన్ను చూపిస్తూ 'వీడో దొంగవెధవ అవుతాడు, అప్పుడు నీకు తెలుస్తుంది. మా విలువ' అంటూ ఏవేవో అంది. ఆ మర్నాడే అత్తా బావలూ ఇల్లు కాళీచేసి వెళ్ళిపోయారు.

ఆ రోజుల్లో నాన్నగారు నన్నెందుకు వెనకేసుకొచ్చారో, అత్త మనసులో ఏముందో నాకు అర్థం కాలేదు. కాని 'జోతుజ్ మె హై, తెరీతస్వీర్ మె నహీ', అన్న హిందీకవిలా, నాన్నగారిలో ఉన్న క్షమాపణ గుణం, అభిమానం, అమ్మ చెప్పినట్టుగా నేను భయపడినట్టుగా కాక భిన్నంగా ఉన్నాయి.

ఇంత జరిగాక నాన్నగారంటే భయం పోయి, అభిమానం గౌరవం ఏర్పడ్డాయి. ఇంకెప్పుడూ అల్లరి చెయ్యకూడదనిపించింది. మొదటిది అంటే నాన్నగారంటే అభిమానం, గౌరవం నా జీవితాంతం నాతోనే ఉన్నాయి. కాని రెండోది అల్లరి చేయకూడదన్న నిర్ణయం. మూడురోజులు మాత్రమే ఉంది.

✡✡✡

# 3

**అత్త, బావలూ** ఇల్లు కాళీ చేసి వెళ్ళిపోవడంతో... నాకు స్వేచ్ఛ లభించింది. నాన్నగారితో డైరెక్ట్ రిపోర్టుల బెడద తగ్గింది. ఇప్పుడు కావలసినంతసేపు ఆడుకోవచ్చు, పెద్దవాళ్ళ భాషలో చెప్పాలంటే అడ్డమైన అల్లరీ చెయ్యవచ్చు! అందులో భాగంగా శ్రీరామనవమి రోజుల్లో పులివేషాల వెంటబడి పోవడం ఒకటి!

పులి వేషాలు చాలా త్రిల్లింగ్, నలుపు పసుపు వెనక తోకలతో, పులి బుర్రలతో బాజాలు వేస్తున్న దరువుకి, లయబద్ధంగా అడుగులు వేస్తూ, పులివేషగాళ్ళు చూపే హావభావలకి ఒళ్ళు జలదరించేది. ఆ బాజాల వెనకపడి తిరుగుతోంటే సమయం తెలిసేదికాదు. నన్ను వెతుక్కుంటూ వచ్చి, లాక్కెళ్ళి ప్రైవేటు మాష్టారి దగ్గర కూర్చోపెట్టేది అమ్మ.

'చదువుకోసం ప్రైవేటు మేష్టార్ని పెడితే, ఆ పులివేషాలంట పడిపోతావేంట్రా వాటిల్లో ఏముందని' అని విసుక్కునేది. రోజూ నన్ను వెతుక్కోలేక!

'వాళ్ళకి ఉన్నవి ప్రైవేటు మాష్టారిలో లేవు 'అన్నాను.

'ఏమిటి ప్రైవేటు మాష్టారులో లేవు' అంది ఆశ్చర్యంగా అమ్మ.

'పులిచారలు' అన్నా.

'అవి మేష్టారికెందుకుంటాయి'? అంది అమ్మ నవ్వుతూ. కాని ఆ విషయం మేష్టారితో చెప్పేసింది.

అలా అమ్మ చెప్పిన మరునాడు మేష్టారు 'ఏమ్రిటా నాకు పులిచారలు లేవా? నేనొచ్చే సరికి నువ్వు ఇంట్లో ఉండకపోతే నీకు చారలు తేలేటట్టు వీపు మీద కొడతాను. నిన్ననే బెత్తం కొన్నాను. ఇవాళ తీసుకురావడం మర్చిపోయాను.' అన్నారు.

పులివేషాలు గొప్పవా? వెంకటరత్నంగారి లెక్కలు గొప్పవా?

ఎందుకంటే ఇప్పుడు పిల్లలు చూద్దామన్నా ఆనాటి పులివేషాలూ లేవు ఆ మజా లేదు.

బెత్తం పేరు వినగానే నాకు భయం వేసింది కాని ఆ మేష్టారు నాకు ప్రైవేటు చెప్పినన్నాళ్ళూ బెత్తం తేలేదు, నన్ను కొట్టలేదు. ఆ అవసరం కూడా ఆయనకి వచ్చేది కాదు. ఆయన లెక్కలు చెప్పేవారు. ఆ లెక్కల ప్రపంచంలోకి ఆయన వెళ్ళిపోతే, ఆయనకీ నాకూ

కూడా, పరిసరాలు సమయం తెలిసి వచ్చేవి కావు. అలాంటి వెంకటరత్నం మాష్టారికి పులిచారల మాట అటుంచి, మామూలు భేషజాలు కూడా లేవు నలుపు, తెలుపులో మాసిన గెడ్డం, దళసరి కళ్ళద్దాలూ, చిన్న జుట్టూ ఖద్దరు కల్లీలాల్చీ చిన్నగా మాసిన ఖద్దరు పంచె, చేతిలో పొడుం డబ్బా, మాష్టార్ని చూస్తుంటే, నాన్నగారు చదివిన పద్యంలా 'కొల్లాయుంచితి కోక చుట్టితిన్, మహాకూర్పాసనమున్' అన్న శ్రీనాధుడు జ్ఞాపకం వస్తాడు, ఆయనకీ ఈయనకీ తేడా ఏమిటంటే? దయలేదా కన్నడ రాజ్యలక్ష్మి నేను శ్రీనాధుడన్, అని ఆయనన్నాడు ఈయన ప్రతీ లక్ష్మివారం బురుజు పేటలో గుడికి వెళ్ళి 'దయలేదా కనకమహాలక్ష్మి నేను వెంకటరత్నం పంతులున్ లెక్కలున్, చెప్పుదున్' అని అనునేమో!

ఆయన నా బుర్రలో లెక్కలకి వేసిన పునాది ఎంత దిట్టమైనదంటే నేను లెక్కలని నమ్మి వాటితో నా జీవితానికి, మెరుగులు పెడదామనుకున్న నాడు, వెంకటరత్నంగారు వేసిననాటిన వేరు ఎంత దిట్టమైనదో అర్ధం అయింది.

ప్రస్తుతానికి లెక్కలు పేకాటలో వోకులు లెక్కపెట్టడానికి పనికి వచ్చాయి. నాకు పనెండేళ్ళకే పేకాట నేర్పింది మా బావ. దానికి నీరు పోసినవాడు శ్రీను. శ్రీను ఇంజనీరింగ్ చదువుతున్నాడు. శ్రీను తమ్ముడు క్రిష్ణ నాకు ఫ్రెండ్ కాన్వెంట్‌లో టెన్త్ చదువుతున్నాడు. వాళ్ళు మేము ఫేమిలీ ఫ్రెండ్స్, పేకాటకి శ్రీను ఫ్రెండ్స్ రాకపోతే, నన్ను కృష్ణని కూర్చోపెట్టి పేకాట ఆడించేవాడు. అలా ఆడించినప్పుడు, పేకాటలో నా చలాకీతనం, వోకులు లెక్కపెట్టడంలో వేగం, కింద ముక్కల్ని బట్టి, ముక్కల్ని డిస్‌కార్డ్ చేసే నేర్పు శ్రీనుని ఆకట్టుకున్నాయి. శ్రీనుకి బదులు నేను ఆడిగెలిచిన నాడూ, నన్ను లేపేసేటప్పుడు శ్రీను నాకు రూపాయి, ఇచ్చేవాడు. దాంతో నేను కృష్ణ ఇంగ్లీషు సినిమాలు చూసేవాళ్ళం.

హెర్క్యులిస్, హెర్క్యులిస్ అన్‌చైన్డ్, గలివర్ ట్రావెల్స్, గోలియత్ అండ్ బార్బేరియన్స్ శాంసన్ అండ్ డెలైలా,' ఇంగ్లీషు సినిమాలు ప్రత్యేకంగా లీలామహల్‌లో విడుదలయ్యేవి. సినిమా మూడున్నరకి మొదలయ్యేది. ముందుగా కృష్ణ వెళ్ళి ముప్ఫై అయిదుపైసల టికట్లు రెండు తీసి ఉంచేవాడు. నేను మూడు గంటలవరకూ నాన్నగారిచ్చిన పాఠాలు రాసి, ఆయన నిద్ర లేవగానే ఆయనకి చూపించి, ఆడుకోడానికి పర్మిషను సంపాదించి, ఆటపేరుతో బయటపడి పరిగెట్టుకుంటూ లీలామహల్ చేరి సినిమాహాల్లో దూరి సినిమాలో స్టీవరీస్ కండలు, హీరోయిన్ హీరాయిక్ డీడ్స్ చూస్తుంటే, థ్రిల్లింగ్‌గా ఉండేది.

ప్రతి ఆదివారం ఇంగ్లీషు సినిమా చూడాలంటే కృష్ణకి ఆ సమస్య ఉండేది కాదు. వాడికి ఇంట్లో స్వేచ్ఛ ఉండేది. డబ్బులు అందుబాటులో ఉండేవి.

అదే నా విషయంలో పూర్తిగా విరుద్ధం నాన్నగారు సినిమాలకి వెళ్ళేవారు కాదు. ఎవర్నీ పంపేవారు కాదు. అలాంటప్పుడు డబ్బులు చేజిక్కడం, అన్నది గగనకుసుమమే!

అలాంటి పరిస్థితిలో డబ్బులు కోసం అనేక ట్రిక్కులు చెయాల్సివచ్చేది. అలాంటి ట్రిక్కుల్లో ఒకటి నాన్నగారు తెప్పించే పేపర్ల దొంతర కిందనుండి పాత పేపర్లు కొన్ని తీసి అమ్మేసి ఆ డబ్బులతో ఇంగ్లీషు సినిమాలు చూసెయ్యడం.

ఈ రకంగా సినిమాలు చూస్తూ, కాస్త చదువుకుంటూ, కాస్త ఆడుకుంటూ తొమ్మిదో తరగతికి వచ్చాను. ఆ రోజుల్లోనే సివియర్ ఆస్తమా అటాక్ వచ్చింది, నాన్నగారికి.

✡✡✡

నాన్నగారికి వచ్చిన ఆస్తమా అటాక్ తగ్గలేదు, పరిస్థితి బావులేదని అర్ధం అవుతోంది. రెండేళ్ళ క్రితం దెబ్బలాడి వెళ్ళిపోయిన అత్త, బావలూ మళ్ళీ వచ్చారు. అమ్మ ఎప్పుడూ నాన్నగారి పక్కనే ఉంటోంది. నాన్నగారికి ఆయాసం ఎక్కువవుతోందేగాని, తగ్గుతున్న సూచనలు కనబడటంలేదు.

ఆ రోజు రాత్రి క్రిందని మామ్మగదిలో నేను చదువుకుంటుండగా, అమ్మ కిందకి వచ్చి 'నాన్నగారు పిలుస్తున్నారు.' అంటూ నన్ను మేడమీదకి తీసుకెళ్ళింది. మేడమీద నాన్నగారి గదిలో నాన్నగారు దిళ్ళకి ఆనుకుని కూర్చున్నారు. ఆయన ఊపిరి భారంగా తీసుకుంటున్నారు. ఆయన గుండెలు ఆయాసంతో ఎగిరెగిరి పడుతున్నాయి. నాన్నగారికి తలపక్కగా మామ్మ కూర్చుని, ఆయన గుండెల్ని చేత్తో రాస్తోంది. నేను మేడమీదకి వెళ్ళడంతోనే నాన్నగారు నన్ను చూసి 'దగ్గరకు రా' అన్నట్టు సైగ చేసారు. నేను వెళ్ళా, మంచం మీద కూర్చో అన్నారు. నేనుమంచం మీద కూర్చున్నాను. భాగవతంలో భీష్మస్తుతి చదవరా అన్నారు. నాన్నగారు నా చేత భాగవంతంలోవి చాలా పద్యాలు కంఠస్థం చేయించారు.

నే గొంతెత్తి భావయుక్తంగా 'కుప్పించి ఎగిసిన కుండలమ్ముల కాంతి గగన భాగంబెల్ల గప్పిగొనగ.. ఉరికిన నోర్వక ఉదరమ్ములోనున్న జగతి వ్రేగునకదల' అంటూ భీష్మస్తుతి చదివాను. దాని తర్వాత నాన్నగారు కోరినట్లుగా 'అంబనవాంబుజోజ్వలకరాంబుజ.....' అంటూ సరస్వతీ ప్రార్థన చేసా, ఆయన నేను పద్యం చదువుతున్నంతసేపూ కళ్ళుమూసుకుని దిండుకానుకునే ఉన్నారు. నేను పాడడం దేవుడిపటం చూస్తూ 'నేనేం పాపం చేసానని ఇంత బాధపెడుతున్నావు, తీసుకుపోదల్చుకుంటే తీసుకుపో, ఈ బాధ భరించలేకుండా ఉన్నాను.' అన్నారు.

మామ్మ గాద్గదంగా 'బాబూ అలా అనకోడదురా' అంది ఆ తర్వాత ఆమె గొంతునుండి మాటరాలేదు. 'ఏం చెయ్యనే అమ్మా నాలుగురోజుల్నుంచి ఇలా కూర్చోలేక పడుకుంటే ఊపిరాడక చాల బాధగా ఉందే మందులకి తగ్గేదయితే, ఎప్పుడో తగ్గిపోయేది. వాడి దయలేదే అమ్మా' అన్నారు దేవుడిపటం చూస్తూ. కాళ్ళ దగ్గర నిలబడ్డ అమ్మ కూడా నిశ్శబ్దంగా ఏడుపోస్తోంది. రెండు నిముషాలు నిశ్శబ్దం తర్వాత, అమ్మవేపు చూసి గోడనున్న దేవుడిపటం తెమ్మన్నారు. అమ్మ వెళ్ళి దేవుడిపటం తీసుకొచ్చింది. తన ఎదురుగా పెట్టమన్నారు. అమ్మ దేవుడిపటాన్ని, ఆయన ఎదురుగా పెట్టింది.

'ఆ పటం మీద చెయ్యివేసి ప్రమాణం చెయ్యి అన్నారు. అమ్మ గొంతుక పూడుకుపోయింది. ఏడుపు వచ్చేసింది. 'ఇప్పుడవన్నీ ఎందుకండీ' అంది.

నాన్నగారు ఆయాసపడుతూనే 'చెప్పినట్టుచెయ్యి,' అని విసుక్కున్నారు.

అమ్మ దేవుడిపటం మీద చెయ్యివేసింది.

'మా అమ్మకి అంటే అత్తగారికి లోపం చెయ్యను' అని ప్రమాణం చెయ్యి అన్నారు. తన గైర్ హాజరిలో తల్లిని సరిగా చూడదేమో, తల్లికి సరిగా జరుగుబాటవదేమో అన్న తపన!

అమ్మ నాన్నగారు చెప్పినట్టు ప్రమాణం చేసింది. నాకు అన్యాయం చేయడమేమిటో అర్థం కాలేదు. తర్వాత అర్థం అయింది. అమ్మకి నన్ను దత్తత తీసుకోడం ఇష్టం లేదు. నాన్నగారికి తన తరపువాళ్ళనిగానీ, అమ్మ తరపువాళ్ళని గానీ దత్తత తీసుకోడం ఇష్టంలేదు. అందుకే అమ్మచేత అలా ప్రమాణం చేయించారు. ప్రమాణాలు అయాక నన్ను దగ్గరగా తీసుకుని ముద్దుపెట్టుకున్నారు 'వెళ్ళిపడుకో' అన్నారు.

నేను మంచం దిగి, కిందకి వచ్చి, మామ్మ మంచం పక్కనే ఉన్న మంచం మీద పడుకున్నాను. మంచి నిద్రపట్టేసింది.

అర్థరాత్రి ఘొల్లున ఏడుపులకి తెలివి వచ్చింది, మేడమీద అమ్మ పెద్ద స్వరంతో ఏడుస్తోంది. మామ్మ ఏడుపు మరీ దారుణంగా ఉంది. 'బాబూ బాబూ' అని పిలుస్తూ ఒకటే ఏడుపు నాకు మెల్లిగా అర్థమవసాగింది. నాన్నగారు చనిపోయారని.

బావ కిందకి వచ్చి, నన్ను లేపి మేడమీదకి తీసుకెళ్ళాడు., నేను గదిలో అడుగుపెట్టగానే మళ్ళీ ఏడుపులు పెద్దగా పెరిగాయి.

మామ్మ నన్ను దగ్గరగా తీసుకుని 'బాబూ చిన్నా వచ్చాడు పలకరించరా' అంటూ ఏడవడం మొదలు పెట్టింది.

ఆ గదిలో మంచానికి పక్కగా చాపమీద నాన్నగారిని, పడుకోబెట్టారు నాన్నగారిలో ముందు రాత్రి చూపిన ఆయాసం లేదు గుండెలు ఎగిరిపడటంలేదు. కళ్ళుమూసుకుని ఉన్నాయి. నోరు కొంచెంగా తెరుచుకుని ఉంది. నాన్నగారి చాపచుట్టూ అమ్మ, అత్త పెద్దబావ, మామ్మ కూర్చుని ఉన్నారు. వాళ్ళకి దూరంగా తలుపు దగ్గర చిన్నబావ నిలబడ్డాడు.

అమ్మ నన్ను దగ్గరగా తీసుకు ఏదేదో అంటూ ఏడుస్తోంది. ఆ క్షణంలో నాన్నగారు పోయారని ఏడ్చానా? లేక అందరూ ఏడుస్తున్నారని ఏడ్చానా? నేనూ ఏడ్చాను!

***ఈ రీతి కొద్ది కాలం.... క్షణాల ఇంద్రజాలం***

మైట్రూ కంఫెషన్ ఏమిటంటే, బాల్యంలో ఏ హిడన్ ఇన్‌స్టింక్ట్ కాంప్లెక్స్‌లు డ్రైవ్ చేసాయో తెలీదు కానీ ఈ కాలంలో జీవితం నేచురల్ స్టే ఆఫ్ లివింగ్‌లో ఉంటుంది. ఇక్కడ కమ్యూషన్స్ రూపందాల్చుతాయి. మాస్క్ తగిలించుకుంటాం, కానీ బాల్యానికి యవ్వనానికి మధ్య కన్‌ఫ్యూజన్ ఏడ్చినా, ఇన్‌స్టింక్ట్ స్కిల్స్ అనేవి బైటకి వస్తాయి. అలాంటి స్కిల్స్‌లో ఒకటి పేకాట.

✡ ✡ ✡

నాన్నగారు పోవడంతో అమ్మ నాడించే శక్తి పెరిగింది. చదువు మీద ఆసక్తి తగ్గి, పేకాట మీద అనురక్తి పెరిగింది. పేకాట మీద ఆసక్తి పెరగడానికి కారణం స్నేహబృందం కూడా కావచ్చు. యాభై రెండు ముక్కలూ ఎన్నిసార్లుచూసినా మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేవి.

స్నేహితుల కలిసి చదువుకుంటానన్న నెపంతో పుస్తకాలు పట్టుకుపోయి, రాత్రంతా పేకాట ఆడిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

ఒకరోజు చదువుకుంటానని స్నేహితుని ఇంటికిపోయి, తెల్లవార్లూ పేకాట ఆడాను. కాని తెల్లవారాక ఆ రోజు పరీక్ష అని జ్ఞాపకం వచ్చింది. అందరం తేరుకుని పేకాట ఆపేసి టెక్స్ట్ బుక్స్ పట్టుకునిఆ రోజు పరీక్షలో వచ్చేవి గెస్ చేస్తూచిన్న చిన్న స్లిప్పులు తయారు చేసారు. పరీక్షలు రాయడం, పాసవడం ఇంత తేలికా! అనిపించి.. నేను కూడా ఉత్సాహంగా పరీక్షలో వచ్చేవి గెస్ చేస్తూ స్లిప్పులు తయారు చేసా, స్లిప్పులైతే తయారు చేసాను, కాని వాటిని ఉపయోగించే అనుభవంలేకపోడంతో పిల్లికళ్ళుమూసుకు పాలు తాగినట్టుగా అయింది, నా బెదురుచూపులు, సందేహాత్మకమైన ప్రవర్తన, టీచరుని ఆకర్షించింది. అతను స్లిప్‌ని పట్టేసుకున్నాడు.

నేనెంతో జాగ్రత్తగా, ఎవరికీ తెలియకుండా రాస్తున స్లిప్పుని టీచరు ఎలా పట్టేసుకున్నాడా? అని ఆశ్చర్యపోయా, దొరికిపోయానన్న అవమానంతో బికమొహం వేసుకు నిలబడ్డ నన్ను చూసి టీచరు 'వోహో తమరి తెలివి తేటలు ఇందుకు ఉపయోగిస్తున్నారన్నమాట' అంటూ, నా ఆన్సర్ బుక్ మీద ఎర్రింకుతో ఏదో రాసేసారు. టీచరు తిడుతున్నంతసేపూ, వెక్కిరిస్తున్నంతసేపూ, అవమానం ఫీలవుతూ నిలబడ్డానేగాని, ఆయన్ని బతిమాలలేదు. అణుకువని నటించలేకపోయాను..

తోటి విద్యార్థుల మధ్య తిట్లు తింటుంటే వళ్ళంతా చెమట్లుతో నిశ్శహాయంగా అందరి మధ్యా నిలబడ్డాను. నాకు చేతకాని పనిచేసి, దొరికిపోయా. ఆ రోజు నేను తప్ప ఇంకెవరూ దొరకలేదు. మిగతావాళ్ళు సక్సెస్‌ఫుల్‌గా స్లిప్పులు చూసి పరీక్షలు రాసారు. నా దౌర్భాగ్యం కొద్దీ నేనే దొరికిపోయాను. క్లాసులో అందరూ నన్నే చూసి, నవ్వుతున్నట్టు ఫీలయాను. ఆ అవమానం మర్చిపోవడానికి నాకు చాలా రోజులు పట్టింది.

కానీ ఆ రోజు  నేను తీసుకున్న నిర్ణయం చాలా మంచిది. పరీక్ష ఏమైపోనీ పరీక్షల్లో స్లిప్పులు కొట్టడంగానీ మరేవిధంగా దొంగపనికి పూనుకోడం గానీ చేయకూడదు. అని మనసులో తీవ్రంగా నిర్ణయించుకున్నాను. కాని నేను తీసుకున నిర్ణయం తప్పు. ఆ నిర్ణయం పరీక్షల్లో చీటింగ్‌కి సంబంధించింది మాత్రమే!

కానీ ఆరోజే నా స్వభావ విరుద్ధమైన ఏ పనీ చేయకూడదని నిర్ణయం తీసుకుని ఉండి ఉంటే ఎంతో గొప్పగా ఉండేది. జీవితంలో చాలా అవమానాలని తప్పించుకుని ఉండేవాడిని.

✡✡✡

ఒడిదుడుకులతో సాగుతున్న చదువు పదోతరగతిలోకి వచ్చింది. పదోతరగతిలో నేనో విచిత్రమైన పరిస్థితిలో ఇరుకున్నాను. పరీక్ష ఫీజు కట్టాలని చెప్పి అమ్మ దగ్గర ఎనభైరూపాయలు తీసుకున్నాను. ఆ సాయంత్రం కృష్ణ కలిసాడు, ఆ రోజే వాడికి వాళ్ళ నాన్నగారు పాకెట్ ఎక్స్‌పెన్సెస్‌కి మనియార్డరు పపారు.

'ఏరా డబులున్నాయి స్టార్‌నైట్ క్లబ్‌కి వెళదామా? అని అడిగాడు.

'అక్కడ మనల్ని పేకాట ఆడనివ్వరేమో' అన్నా... 'శ్రీను మెంబరు కదా, శ్రీను ఎలాగూ లేడు, నేను వెళుతున్నాను వస్తా. ఆడనివ్వక పోతేకేరమ్స్ ఆడుకుని వచ్చేద్దాము' అన్నాడు.

నాకు కొత్త అనుభవం మీద ఆసక్తి కలిగింది. ఆ రోజు పరీక్షకి కట్టవలసిన ఫీజు వాయిదా వేసాను. పేకాట ఆడితే సాధారణంగా నాది ప్రోఫిట్ హేండ్, ఇప్పుడూ ఎక్కువ ష్టేక్ ఆడితే ఎక్కువ గెలిచే అవకాశం ఉంది. ఒకవేళ పోవడం మొదలుపెడితే ఇరవై రూపాయలు పోగానే లేచి వచ్చేయవచ్చు. పరీక్ష ఫీజు అరవైరూపాయలేగా అన్న ఆలోచనతో రాత్రి ఎనిమిది గంటకి భోజనం చేసి, చదువుకోడానికి వెళుతున్నానని, చెప్పి పుస్తకాలు తీసుకుని, కృష్ణ రూముకి వెళ్ళి, రూములో పుస్తకాలు పడేసి ఇద్దరం స్టార్ నైట్ క్లబ్‌కి వెళ్ళాం.

రాత్రి తొమిది అయిందేమో క్లబ్ చాలా బిజీగా ఉంది. లోపల ఓ గదిలో పేకాట జరుగుతోంది. అందులో ముగ్గురు నాకు తెలుసు. శ్రీను స్నేహితులు పేకాట టేబులు దగ్గర ఆరుగురు పేకాట ఆడుతున్నారు. అంటే మా ఇద్దరికీ ఆడే అవకాశం లేదు. క్లబ్ మెయిన్ హౌసీ ఆడుతున్నారు, చాలామంది.

మేమిద్దరం వాళ్ళల్లో కూర్చుని రెండు హౌసీలు ఆడాం. రాత్రిపదయింది. హౌసీ బోరుకొట్టింది, పేకాట చూడడంలో ఉన్న మజా హౌసీ ఆడడంలో లేదనిపించింది. హౌసీ ఆడడం ఆపేసి మెల్లగా పేకాట రూములో చేరి పేకాట చూడడం మొదలుపెట్టా.. పేకాట చూస్తూ ఓ గంట గడిపాను. రాత్రి పదకొండు గంటలకి, పేకాట ఆడుతున్న ఇద్దరు లేచి వెళ్ళిపోయారు. మిగిలిన వాళ్ళకి పేకాట మీద కుతి తీరలేదు.

'ఏరా ఆడతావా?' అని నన్ను అడిగారు.

'ఊఁ' అంటూ లేచి వెళ్ళి కృష్ణని పిలుచుకువచ్చా. ఇద్దరం డబ్బులు ఇచ్చి కాయన్స్ తీసుకున్నాం. పేకాటలో మునిగిపోయాం.

కాయన్స్ తో మొదటిసారి ఆడడం వల్ల డబ్బులు డైరెక్ట్‌గా ఇవ్వవలసి లేకపోవడం వల్ల, ఈ రౌండులో హేండు రైజ్ అవుతుంది అనే ఆశవల్ల, నాకు తెలియకుండానే కాయన్స్ అన్నీ పోగొట్టుకున్నాను. కృష్ణపరిస్థితి కూడా అలాగే ఉంది. తెల్ల వారుఝామున నాలుగు గంటలకి మొత్తం కాయన్స్ పోగొట్టుకుని ఇంటికి చేరి పక్కమీద పడుకున్నాక పరీక్ష ఫీజు కట్టడానికి ఇంకా అయిదురోజులే ఉందని, జ్ఞాపకం వచ్చింది.

డబ్బు ఎలా వస్తుంది? ఫీజు కట్టగలనా? లేదా? టెన్త్ క్లాసు పబ్లిక్ పరీక్ష! నేను ఫీజు కట్టకపోతే హెడ్ మాష్టారు ఇంటికి కబురు చేస్తారు. ఇంట్లో బావకి తెలిస్తే, బావ వెళ్ళి నిజం తెలుసుకుంటాడు. నాన్నగారు పోయాక మళ్ళీ అత్తా బావలూ ఇంటిలో కింద వాటాలోకి అద్దెకి వచ్చారు. బావకి నిజం తెలిస్తే నా విషయంలో నిర్ధయగా ఉంటాడు.

పరీక్ష ఫీజు కట్టకపోతే చదువు ఆగిపోతుందా? ఏదేనా అమ్మేస్తే ఎవరికీ తెలియకుండా, ఏది అమ్మగలం? ఇంట్లో తెలిస్తే మరింత గొడవ అవుతుంది. ఏం చెయ్యాలి? అన్న ఆలోచనతో నిద్రపట్టలేదు. ఒళ్ళంతా జ్వరం వచ్చినట్టుగా ఉంది. కళ్ళు పొడారిపోయాయి.

డబ్బు ఎవర్ని అడగాలి అన్న ఆలోచన తెగడం లేదు. కృష్ణని అడిగితే వాడు ఇవ్వడూ! వాడి దగ్గర ఉన్నా ఇవ్వడు మరి ఎవర్ని అడగాలి? ఆ సమయంలోనే రాజగోపాల్ జ్ఞాపకం వచ్చాడు. వాడు నాకన్నా నాలుగేళ్ళు పెద్ద, వాళ్ళనాన్నగారికీ, మా నాన్నగారికీ స్నేహం అందుకే మా ఇద్దరికీ స్నేహం కలిసింది. నాకున్న పుస్తకాల పిచ్చి వాడికీ ఉంది. ఇద్దరం నవలలు అద్దెకి తెచ్చుకుని చదివేవాళ్ళం. పగలు

వాడు కాలేజీలో నవల్ని చదివి, సాయంకాలం నాకు ఇచ్చేవాడు, నేను రాత్రి నవల్ని పూర్తిచేసి, మర్నాడు మరో నవల తెచ్చేవాడిని ఇద్దరం కలిసి అద్దె భరించేవాళ్ళం, వాడి దగ్గరకి వెళ్ళి విషయం చెపితే, ఏమైనా ప్రయోజనం ఉండవచ్చు అన్న ఆలోచన రావడంతో, మనసు కుదుట పడింది. కన్నుమూతపడింది.

✡✡✡

## 4

**నేను లేచేసరికి** పగలు పదిగంటలయింది. ఈ మధ్యలో అమ్మ స్కూలు కెళ్ళవేమ్రా అంటూ లేపింది. స్కూలు లేదు అని చెప్పి మళ్ళీ పడుకున్నా.. పదిగంటలకి లేచి, తయారై ఆతృతగా రాజ్‌గోపాల్ ఇంటికి వెళ్ళాను రాజగోపాల్ కాలేజీకి వెళ్ళాడు, మూడుగంటలకి వస్తాడని చెప్పారు వాళ్ళ అమ్మగారు.

కృష్ణకూడా కాలేజీ ఎగ్గొట్టి పడుకుని ఉంటాడనే అనుమానంతో వాడి రూముకి వెళ్ళాను. కృష్ణ రూములోపలి నుండి గడియవేసివుంది. తలుపు కొట్టా... తలుపు వెంటనే తీయలేదు. వీడు ఇంకా పడుకునే వున్నాడు. అనుకుని ఇంకా గట్టిగా కొట్టాను, అలా రెండు సార్లు కొట్టింతర్వాత తలుపు తెరుచుకుంది. తలుపు తీసింది శ్రీను.

శ్రీనుని చూడగానే నా గుండె గుభేలుమంది. తలుపు తీసి నన్ను చూస్తూనే ‘ఏరా స్కూలుక్ వెళ్ళలేదా? కృష్ణ కాలేజీకి వెళ్ళాడు‘ అని విసుగ్గా చెప్పి నా మొహం మీద తలుపు వేసేసాడు. శ్రీను నాతో విసుగ్గా మాట్లాడడం ఇదే మొదటిసారి. శ్రీను తలుపు వేసేసినా తలుపుదగ్గరే నిలుచున్నాను. లోపలి నుండి ‘ఎవరూ‘ అంటూ ఎవరో శ్రీనుని అడుగుతున్నారు. ఆడగొంతుకలా ఉంది. లోపల ఉన్నది ఎవరైవుంటారా? అన్న ఆలోచనతో ఇంటికి వచ్చేసాను. అప్పటికి మధ్యాహ్నం పన్నెండయింది. భోజనం చేసి, లైబ్రరీ పుస్తకాలు తీసుకుని సెంట్రల్ లైబ్రరీకి వెళ్ళి పేపర్లు మేగ్జైన్లు అన్నీ తిరగేసాను. ఏవీ చదవబుద్దివెయ్యలేదు. నిన్న ఆడిన పేకాట, పేకముక్కలు జ్ఞాపకం వస్తున్నాయి. జ్ఞాపకాలని మరుపున పెట్టడానికా అన్నట్టు పేపర్లు తిరగేసాను. పేపర్లో అంతా కాంగ్రెసు గొడవ సిండికేటు గురించి, ఇందిరాగాంధీ గురించి సంజీవరెడ్డి ప్రెసిడెన్సీ గురించీ ఉంది. విశాలాంధ్ర నిండా నక్సలైట్ల కబుర్లున్నాయి. పేపర్లు కూడా చదవబుద్ధి వెయ్యలేదు. వోల్డ్ బుక్స్ ఉన్న సెక్షన్‌లోకి వెళ్ళి, డిటెక్టివ్ మేగ్జైన్ తీసి రెండు మూడు కథలు చదివాను. అదికూడా అంతలా బుర్రకెక్కలేదు. పాత చందమామ బైండ్‌లు తీసి చందమామ కథలు చదువుతూ, మధ్యాహ్నం మూడుగంటలవరకూ గడిపాను. మూడుగంటలకి నాదగ్గరున్న నవల్సు ఇచ్చేసి, మరి రెండు కొత్త నవల్సు తీసుకుని అక్కడనుండి తిన్నగా రాజగోపాల్ ఇంటికి వెళ్ళాను.

రాజగోపాల్ అప్పుడే కాలేజీ నుండి వచ్చాడు. రాజగోపాల్ ఇంటిలో వాళ్ళ అమ్మగారు పెట్టిన జంతికలు తిని, కాఫీతాగి ఇద్దరం సముద్రపు ఒడ్డుకి వెళ్ళాం... సముద్రపు ఒడ్డున నడుస్తూ రాజగోపాల్‌తో నిన్న రాత్రి జరిగినదంతా చెప్పా!

"ఏం చేసావు? అంత డబ్బు నాకు మాత్రం ఎక్కడ వస్తుంది.?" అంటూ సందేహం వెలిబుచ్చాడు. నేనేం మాట్లాడలేదు. నాకు తెలుసు వాడు ముందు విసుక్కునా, కోపగించుకున్నా, వాడు సహాయం చేస్తాడు. వాడిలో ఓ మంచి గుణం ఉంది. ఎవరో చెప్పినట్టు కృష్ణశాస్త్రి శోకం లోకానికి శోకం, లోకంలో శోకం, శ్రీశ్రీ శోకం, అని వీడికి శ్రీశ్రీ అంటే ఇష్టం నా కష్టాన్ని వాడు తీర్చాలనే తపన వాడిలో ఎక్కువగా ఉంటుంది.

అందుకే నేనెంత మౌనం వహిస్తే, వాడి తపన అంత పెరుగుతుంది. నా మౌనం వాడు అర్థం చేసుకున్నాడు. నా సమస్యకి పరిష్కారమార్గం ఏమిటా? అన్న ఆలోచన వాడి మనసుని తొలిచేస్తోంది. చాలాసేపు మౌనంగా నడిచిన తర్వాత "నా దగ్గర అంటే నేను అమ్మ దగ్గర దాచిన డబ్బులు ముప్పైరూపాయలున్నాయిరా, అంతకన్నా ఎక్కువ సంపాదించడం కష్టం" అన్నాడు తాపీగా.

ముప్పై రూపాయలు రాజగోపాల్ ఇస్తే మిగతా ముప్పైరూపాయలు ఎలా సంపాదించాలా? అన్న ఆలోచనలో పడ్డాను నేను. అమ్మ దగ్గర పరీక్షఫీజు ఎనభైరూపాయలని చెప్పాను కాని పరీక్ష ఫీజు అరవైరూపాయలు! మిగతా ముప్పైరూపాయలూ కృష్ణని అడిగితే, వాడు ఇవ్వడు. శ్రీనుని అడిగితే విషయం అంతా తెలుసుకుని దెబ్బలాడతాడు. ఏం చెయ్యాలా? అన్న ఆలోచనలో నేను బీచిలో జనాన్ని చూస్తూ రాజగోపాల్ పామ్ బీచివరకూ నడిచివచ్చేసాం. పామ్ బీచిలో జనం తక్కువగా ఉన్నారు.

ఇద్దరం ఇసుకలోకి దిగి జనాలకి దూరంగా కూర్చున్నాం. ఎదురుగా తూర్పున నీలాకాశం చీకటిలోకి మారిపోతోంది. ఏదో తెలియని నిరంతర సముద్రపు ఘోష, వాతావరణంలో నిండుకుంది. చెమటెక్కిన శరీరానికి నీటిమీద చల్లనిగాలి ఆహ్లాదాన్నిస్తోంది.

"ఒరేయ్ పేకాటెందుకు ఆడతావురా?" అన్న రాజగోపాల్ ప్రశ్నకి...

"పేకాట థ్రిల్లింగ్‌గా ఉంటుంది అందులో డబ్బు పెట్టి పేకాట ఆడితే సమయం తెలియదు" అన్నా..

"పుస్తకం చదివినా సమయం తెలియదే"

"పుస్తకం చదువుతున్నా సమయం తెలియదు. నిజమేగాని పుస్తకం చదువుతున్నప్పుడు మనం మన బ్రెయిన్‌ని ఉపయోగించక్కరలేదు, రచయిత రాసింది. చదివేస్తాం. మంచి రచయిత రాస్తే పుస్తకం పూర్తయాక ఆలోచిస్తాం కాని పేకాట అలా కాదు. ప్రతి ఆటలో టెంపోవుంటుంది. ఒకవేళ ఆటపారేసినా, పక్కవాడి ఆట చూడడంలో కూడా థ్రిల్ ఉంటుంది" అన్నా...

"కాని పరీక్ష ఫీజు డబ్బుపోగొట్టుకుని, మళ్ళీ పరీక్ష ఫీజు కట్టేవరకూ ఇంకా థ్రిల్లింగ్‌గా ఉంటుంది." అంటూ పకపకా నవ్వాడు రాజగోపాల్.

ముప్పైరూపాయలిస్తానన్నాడుగా అందుకే నేను వాడేసిన జోకుకి ఉడుక్కోలేదు.

ఆ రోజు కృష్ణతదియ కావడం వలన బాగా చీకటిపడ్డాక చంద్రోదయం అయింది ఎదురుగా క్షితిజం నుండి ఆకాశంలోకి చొచ్చుకొస్తున్న పసుపుపచ్చని చంద్రుడూ, మనసుకి ఆహ్లాదం కలిగిస్తున్నాడు. చంద్రకిరణాలు నీటి అలలమీద వోలలాడుతూ, క్షితిజం నుండి వొడ్డుకి సేతువు నిర్మించాయి. ఆరోజు రాజగోపాల్ సముద్రపు ఒడ్డుకి ఎందుకు తీసుకొచ్చాడో అర్థం అయింది. వాడికి ఈ దృశ్యం చూడడం అంటే చాలా ఇష్టం. వాడికీ దృశ్యం 'చూడడానికి పిచ్చిగా ఉంటుంది' అంటాడు. వాడికి విపరీతంగా నచ్చిన విషయం ఏదేనా పిచ్చిగా ఉంటుంది. అజిత్ వడేకర్ పిచ్చిగా బాటింగ్‌చేస్తాడు. శ్రీశ్రీ పిచ్చిగా రాస్తాడు, విశ్వనాథ పిచ్చిగా ఆలోచిస్తాడు. ఆ రకంగా ఆ రోజు చంద్రుడ్ని చూస్తూ "రఘునాథ పాణిగ్రహి పిచ్చిగా వాయించాడు కదరా" అన్నాడు.

"ఎలా?" అని అడిగాను.

"చల్లని రాజా వో చందమామ..." అంటూ ఇలవేల్పులో పాట ఎత్తుకున్నాడు. నేను ఇసుకలో పడుకుని, నా సమస్యలన్నీ మరిచి, పాట వినడం మొదలుపెట్టాను.

రాజగోపాల్ పాటలు బాగా పాడుతాడు. కవిత్వం కూడా బాగా చదువుతాడు. వాడు పాడుతున్నా, కవిత్వం చదివి అర్థం చెపుతున్నా ఎంజాయ్ చెయ్యొచ్చు, చందమామ మీద పాట పూర్తయ్యాక

"ఒరేయ్ అందులోనే కృష్ణుడి మీద పాట ఒకటి ఉంది. ఎంత బావుంటుందో" అన్నాడు.

"ఏ పాట?" అని అడిగాను.

ఏ పాటో చెప్పలేదు పాడడం మొదలుపెట్టాడు. "అన్నా అన్నా విన్నావా చిన్నీ కృష్ణుడు వచ్చాడూ, చిన్నీ కృష్ణుడు వచ్చాడూ, మా వెన్నెల చెలికాడొచ్చాడు అన్నా అన్నా విన్నావా" అని పాడి "ఒరేయ్ ఇందులో గోపికని ఊహించిన కవి ధన్యుడ్రా" అంటూ

"గోకులమందున గోపాలునితో గోపికనై విహరిస్తానూ, ముద్దుల మూర్తిని కంటానూ, మోహన మురళీ వింటానూ" అంటూ కళ్ళుమూసుకుని వాడు పాడుతోంటే, వెనక్కివాలి పడుకున్న నా కళ్ళల్లో బృందావనం మెరుపులా మెరిసింది. రాజగోపాల్ పాడుతూ ఉంటే పాటలు పాడడం తేలిక అనిపిస్తుంది.

ఆ పాట పూర్తవగానే "ఇంకేదేనా పాడరా" అన్నాను.

వాడు రెండు నిముషాలు మౌనంగా ఉండి ప్రేమ కానుక చిత్రంలో "వాడుక మరచెదవేల నను వేడుక చేసెదవేల" అనే పాట ఎత్తుకున్నాడు. పాటంతా పాడాక "ప్రేమని కూడా వాడుక పెట్టేవాళ్ళెవరైనా ఉంటే బావుండునురా" అన్నాడు. నేనేం సమాధానం చెప్పలేదు నేనింకా వాడు పాడిన పాటలో చరణం 'సంధ్య రంగుల చల్లని గాలుల, మధురరాగం, మంజులగానం తేనెవిందుల తీయని కలలులో తేనె విందుల కలల్లో' విహరిస్తున్నాను.

నా సమాధానం కోసం ఎదురు చూడకుండా వాడు ప్రేమలేఖల్లో పాట "పాడు జీవితమూ యవ్వనం మూడునాళ్ళ ముచ్చటలోయి" అంటూ విషాదం వలకపోసాడు. వాడి గొంతుకలో పలుకుతున్న మార్ధవనికి ఆశ్చర్యపోయాను. నేను ఆశ్చర్యం నుండి తేరుకోకుండానే వాడు రెండో చరణంలోకి వచ్చేసాడు. "కంటికి రెప్పా మనపుట్టిల్లు కాని దానికి నీ రుణమే చెల్లు ఎడబాటు ఎదలో ముల్లు.." అంటూ పాటలో పూర్తిగా మునిగి పోయాడు.

సముద్రపొడ్డు అంతా నిర్మానుష్యంగా ఉంది. బీచిరోడ్డు మీద అప్పుడో కారు, అప్పుడో స్కూటరు వెళ్ళుతున్నాయి. రాజగోపాల్ పాటల్ని ఆకాశంలో చంద్రుడు, ఒడ్డున నేనూ విని ఆనందిస్తున్నాము. రాజగోపాల్ పాట "విషాదం వద్దుగాని సరదా పాటలు పాడరా" అన్నాను.

సరదా పాటలు ఏమున్నాయి" పాండురంగమహత్యం సినిమా చూసావా?" అని అడిగాడు.

"లేదు" అన్నాను.

"చూడు! రాఘవచార్య రాసిన పాటలు సూపర్బ్! హీరో ఫిలాసఫీ ఏమిటో తెలుసా "మోజులే రేపు చిరునవ్వు చిందులూ, జాజి చెక్కిళ్ళ సోయగాల విందులూ, వరద పొంగేనులే వయసు సింగారమూ 'అంటూ రోడ్డుమీద ఆడపిల్లల్ని వర్ణిస్తాడు తనని తప్పుకుపోయే ఆడపిల్లల్ని పట్టుకుని

"మొహమూరించు పరువాలగోలకూ, ముతకతెరచాటు అలవాటు లేలనే, నేడు పెనుకాడినా

రేపు వొనగూడునా, అనుభవించే, సుఖించే తరించరా" అంటాడు

"పరువాలగోల" అని బలే పదం వాడేడు కదా అని వాడి ప్రశ్న.

పరువాల గోల అంటే అర్థంకాలేదుకాని, మొన్ననే చదివిన కొమ్మూరిసాంబశివరావు ఒక "వెన్నెలరాత్రి" నవల గుర్తుకొచ్చింది మొదటి ముప్పై పేజీలు కనీసం పదిసార్లు చదివా.... ఏదో తెలిసీతెలియని ఎంతూజియాజమ్ మనసులో మొదలయింది. అది త్వరలో తనువులో కూడా మొదలవుతుందని తెలుసుకోలేకపోయాను.

"అదే సినిమాలో వేశ్యకి ఎంత గొప్ప పాట రాసాడో తెలుసా?"

"వేశ్య ఫిలాసఫీనా?" అన్నాను నవ్వుతూ.

"ఆ వేశ్య ఫిలాసఫీనే ఏమంటుందో తెలుసా" అని రాగయుక్తంగా.....

"ఆనందమిదే నోయి సఖా, ఆగదు కాలం మనేది కొద్దికాలం క్షణాల ఇంద్రజాలం" అంటూ పాడి, పాటని ఆపి "ఏ కొద్దికాలమో నీకు అర్థంకాదులే" అంటూ నవ్వాడు.

రాజగోపాల్ నా కన్నా నాలుగేళ్ళు పెద్ద ఇంటర్‌లో డబుల్ టైఫాయిడ్ వల్ల పరీక్షరాయలేదు. అందుకే ఇంకా ఇంజినీరింగ్ ఫస్టియర్‌లో ఉన్నాడు. నేను చాలా సార్లు రాజగోపాల్‌ని పరిశీలించాను. నాకన్నా మెచూర్డ్ గానూ, చాలా అనుభవం ఉన్నవాడిలాగూ, ప్రవర్తిస్తాడు. అందుకే వాడిని వెన్నెల వెలుగులో చూస్తూ, 'ఏ కొద్దికాలం' అని అడిగాను "క్షణంలో కళ్ళముందు ఇంద్రజాలంలా కనిపిస్తుందే, ఆ కొద్దికాలమే" అంటూ నవ్వాడు.

"నీకులాగే పేకాడుతున్న కొద్దికాలమూ నాకూ ఇంద్రజాలంలా కనిపిస్తుంది" అన్నాను.

వాడు విరగబడి నవ్వి, అది కాదు విను అని రాగయుక్తంగా "ఉన్నది నేడు మరి రేపనుమానం, పనిలేని పనిపరాలనే తలుపు విధానం.. ఈ జీవిత బహుమానం సుఖసారపు పానం, ఆనందమిదే" అంటూ పాట పూర్తిగా పాడాడు.

రాజగోపాల్‌లో ఉన్న గొప్పతనం ఏమిటో తెలీదు గాని, వాడు ఏం పాడినా, మాట్లాడినా సెలెక్టెడ్ పుస్తకాలు చదివినా, చాలా ప్రత్యేకం అనిపిస్తాడు. ఆ పాటల మధ్య చాలా చీకటి పడిందని గుర్తించినవాడు వాడే! 'అమ్మో తొమ్మిదైంది పదపోదాం' అంటూ లేచాడు. ఫాంటు కంటుకున్న ఇసుక దులుపుకున్నాం ఇద్దరం ఇసుకలోంచి గట్టెక్కి బీచిరోడ్డమ్మట నడుచుకుంటూ కె.జి.హెచ్ దగ్గరకి వచ్చాం బస్సుకోసం ఎదురుచూసాం. బస్సుల్లేవని తెలిసింది.

ఇద్దరం నడుస్తూ ఎ.వి.ఎన్. కాలేజీమీంచి కొత్తరోడ్డుకి వచ్చి, అక్కడనుండి రీడింగ్ రూము దగ్గరకి వచ్చాం. వాడు ఇంటిలోకి వెళ్ళిపోతూ "రేపు సాయంకాలం రా.. డబ్బు ఇస్తాను." అన్నాడు.

ఇంతసేపూ పాటల్లో, సంగీతంలో, ప్రకృతిలో మైమర్చిన నాకు మళ్ళీ పరీక్షఫీజు కట్టాలి? అన్నది జ్ఞాపకం వచ్చింది. పరీక్షఫీజు కట్టడానికి ఇంకా మూడురోజులు టైముంది. పరీక్ష ఫీజు కట్టకపోతే ఈ ఏడూ పరీక్షరాయడం అవదు. మళ్ళీ సెప్టెంబరు దాకా ఎదురుచూడాలి? ఒక ఏడాది వేస్టు. ఆ విషయం ఇంట్లో తెలిసిపోతుంది. నాకు చదువుమీద ఇంట్రస్టు లేదని అర్థం అవుతుంది. చదువు ఆగిపోతుంది.

నా ఆలోచనలో నేనుండగానే కురుపాం మార్కెటు వచ్చేసింది. చాలా లేటయిపోయిందేమో ఇంట్లో అందరూ పడుకున్నారు. ఇంట్లోకి వెళ్ళి, అమ్మ చేత చీవాట్లు తిని భోజనానికి కూర్చున్నా.....

అమ్మ ఏదో పనిమీద బాత్రూములోకి వెళ్ళింది. అక్కడ అప్పుడే కాళ్ళు కడూక్కోడం వల్ల, నాకాళ్ళకున్న ఇసుకరాలింది. అది అమ్మ కళ్ళపడింది.

"ఏరా సముద్రపు ఒడ్డుకి వెళ్ళావా?" అమ్మ ప్రశ్న.

"ఊ"

"అలావొక్కడివీ సముద్రపొడ్డుకు వెళ్ళవద్దని ఎన్నిసార్లు చెప్పాలి. బావతోనో, పెద్దవాళ్ళు ఎవరితోనో వెళ్ళాలిగాని అలా ఒక్కడివీ వెళ్ళకు" అంది.

నేనేమో శృంగారాన్ని అర్థం చేసుకునే లెవెల్లో ఉన్నాను. అమ్మ నన్ను ఒంటరిగా సముద్రఒడ్డుకి వెళ్ళవద్దని అంటోంది. నాన్నగారు ఉన్నప్పుడు స్వేచ్ఛ ఉండేది కాదు.

నేను స్వేచ్ఛ ప్రదర్శించేవాడిని కాదు. స్వేచ్ఛమీద ఇష్టం లేకకాదు, అదో రకమైన భయం, స్వేచ్ఛిద్దామనే ఇచ్ఛకూడా బలంగా లేదేమో! ఇప్పుడు అలా కాదు మెల్లిమెల్లిగా నా ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నాను. అమ్మ కసిరినప్పుడు అబద్దం ఆసరా చేసుకుంటున్నాను.

భోజనం ముగించి పక్కమీదకి చేరుకున్నా. ఆలోచనల్లో మళ్ళీ పరీక్షఫీజు వచ్చి కూర్చుంది మిగతా డబ్బు ఎవరిని అడగాలి? సముద్రపొడ్డున రాజగోపాల్ పాటల ప్రభావమేమో తలుపుల్లోకి కృష్ణప్రియ వచ్చింది. కృష్ణప్రియ నడిగితే ఇస్తుందా? కృష్ణప్రియ దగ్గర డబ్బు ఉంటుంది.! కాని అడిగితే ఇస్తుందా? ఇవ్వదా? అని.

కృష్ణప్రియ నాక్లాసుమేటు! బాగా డబ్బున్న కుటుంబంలోంచి వచ్చింది. అన్నిక్లాసులూ ఎటెండ్ అవుతుంది అన్నినోట్సులూ రాసేది.

ఎన్నిచేసినా నా పుస్తకాలూ నోట్సులూ తీసుకోవడం మానేదికాదు. అది నాకూ ఇష్టమే! నేను చేసిన హోమ్ వర్కు లెక్కలన్నీ, కృష్ణప్రియకి ఇచ్చేవాడిని. దానికి బదులుగా కృష్ణప్రియ పెన్సిల్ బాక్సనుండి చాక్లెట్లు డబ్బులూ కొట్టేసేవాడిని. అలా కొట్టేయడం నాకు త్రిల్లింగ్ గా ఉండేది. కృష్ణప్రియకు తెలిసినా ఏమనేదికాదు. "తీసావా?" అని అడిగేది.

"వూ" అంటూ తలూపేవాడిని. హాయిగా చిరునవ్వు నవ్వి ఊరుకునేది. అదో లవ్వు. కృష్ణప్రియ చాలా ఆకర్షణీయంగా డ్రెస్ చేసుకునేది. ఆమె ఎంచుకున్న కలర్స్ కళ్ళకి చాలా ఆహ్లాదాన్ని కలిగించేవి. అప్పటికి వోణీలు వేసేదికాదు, ఆమెలో తొంగిచూస్తున్న యవ్వనం కటి పైభాగంలో దోబూచులాడుతూ, నాకే కాదు క్లాసులో అందరికీ ప్రియంగానే ఉండేది. కాని ఆమెని చూడగానే నాకళ్ళలో వెలిగే వెలుగు, కృష్ణప్రియకి నచ్చివుండాలి. అందుకే నాతో ఉన్నంత చనువుగా మరెవరితోనూ ఉండేదికాదు. దానివల్ల స్నేహితుల దగ్గర ఆమె మీద నాకే హక్కువున్నట్లు ప్రవర్తించేవాడిని...

యాన్యువల్ స్పోర్ట్స్‌లో కృష్ణప్రియ రింగ్ టెన్నిస్ ఆడుతోంటే కోర్టుచుట్టూ చేరి, కృష్ణప్రియని తెగ ఎంకరేజ్ చేసేవాడిని. అది మా క్లాసులో అమ్మాయిలకి బాధకలిగించేది. వాళ్ళు ఈ విషయాలన్నీ సైన్స్ టీచరుకి చెప్పేవారు. సైన్స్ టీచరుకి నేనంటే పడదు. దానికి పెద్ద కారణంలేదు, కాని ఒకరోజు సైన్స్ టీచరు పాఠం చెపుతూ మాకు సైన్సులో ఒక పాయింట్‌ని వివరిస్తోంది. నేను వెనక నుండి 'ఎంత భయంకరమైన పాయింట్ పట్టుకుందిరా బాబూ, ఇంక ముందుకి వెళ్ళదు' అన్నాను. నా ముందర కూర్చున్న వాళ్ళు కిసుక్కున నవ్వారు. సైన్సు టీచరు డిస్టర్బ్ అయి, ముందు బెంచీవాళ్ళని నిలబెట్టి అడిగింది. అందులో సైన్సు టీచరు దగ్గర ప్రైవేటు చదువుతున్న చెంచాగాడు ఒకడున్నాడు, వాడు నే చేసిన కామెంటు టీచరుకి చెప్పేసాడు. దాంతో టీచరుకి కోపం వచ్చి నన్ను క్లాసు బైటకి పంపేసింది. ఆ రోజు నుండి ఆవిడకి నేనంటే పడేదికాదు.

అమ్మాయిలు నా మీద చేసిన కంప్లైంట్‌కి, ఆవిడ నన్నేం చెయ్యలేకపోయింది.

కృష్ణప్రియని పిలిచి "రేపటినుండి వోణివేసుకురా" అంది కోపంగా. కృష్ణప్రియలో ఆకర్షణ ఏమిటో బాగానే పసిగట్టింది.

మర్నాడు కృష్ణప్రియ లంగావోణీ జాకెట్‌తో స్కూలుకి వచ్చింది. పరికిణీ జాకెట్‌లో ఉన్న అందం లంగావోణీల్లో లేదు. అనిపించి, కృష్ణప్రియ దగ్గరకి వెళ్ళి "ఈ డ్రెస్ లో చాలా పెద్దదానిలా ఉన్నావు. నీకు పరికిణీ జాకెట్టే బావుంటుంది" అన్నా.

నాకప్పుడర్థం కాలేదు కానీ, నేను గురిచూసి కృష్ణప్రియ పడుచు తనం మీద దెబ్బతీసా... ఎందుకంటే.. ఏ పడుచూ తన వయసులో పెద్దగా కనిపిస్తున్నానంటే ఒప్పుకోదు... అలా కనబడకుండా ఉండడానికి ఏమేనా చేస్తుంది... నేనన్న మాటకి కృష్ణప్రియ హర్టయి ఉండవచ్చు, కూడా.. కానీ నా బాధ నాది.. ఆమె బాధని నేనెప్పుడూ అర్థం చేసుకోలేదు.. కారణం నా స్వభావం కావచ్చు... కృష్ణప్రియ నాకు తెలుస్తూనే ఉంది.నా అధికారాన్ని సుతారంగా అంగీకరించేది.. నాలో చిలిపితనాన్ని ఎంజాయ్ చేసేది. అలాచేస్తూనే మందలించేది.. కోపగించేది.. విసుక్కునేది.. వింత వింతపోకడ్లు పోయేది.. ఎందుకో అవేవీ నిజంకావు... ఆమె గుండె చప్పుడే నిజం అనిపించేది.

నేనన్నమాట కృష్ణప్రియ పక్కనున్న క్లాసుమేటువింది. వెళ్ళి సైన్స్ టీచరుతో చెప్పింది. దాంతో సైన్స్ టీచరు నామీద విరుచుకుపడింది. హెడ్ మాష్టారితో రిపోర్టు చేసింది.

ఆయన నన్ను పిలిచి వార్నింగ్ ఇచ్చారు. కృష్ణప్రియని కూడా పిలిచి తిట్టినట్టున్నారు.

ఆ రోజంతా క్లాసులో ముభావంగా కూర్చుంది. నాతో చనువు తగ్గించేసింది. చనువు అంటే నేను క్లాసునుండీ బయటకి వెళితే తను క్లాసులో ఉండేది. అంతకు ముందు తను క్లాసులోంచి బయటికి వెళితే, నేనూ వెనకాలే వెళ్ళేవాడిని. కొళాయి దగ్గర కృష్ణప్రియ మీద నీళ్ళు చల్లితే గాని నా మనసు శాంతించేదికాదు. స్కూలు బయట కృష్ణప్రియ కొనుక్కునే వేరుసెనగ పలుకులు కొన్ని లాక్కుంటే గాని, మనసు ఆనందించేదికాదు. నేనలా చేయడం కృష్ణప్రియకి నా మీద ఉత్తుత్తి కోపం వచ్చేది. మాట్లాడ్డం మానేసేది. నేను చొరవచేసి, ఆటల పిరియడ్‌లో కృష్ణప్రియతో "నాకు రింగ్ టెన్నిసు ఆడాలనుంది" అనేవాడిని.

"ఆడుకో" అనేది కోపంగా.

"రింగ్ టెన్నిస్ వొక్కడ్ని ఎలా ఆడుకోడం?" నా సందేహం.

"నేను నీతో ఆడను" అనేది కృష్ణప్రియ బుంగమూతిపెట్టి.

"పోనీ నేను నీతో ఆడనా?" అనేవాడిని నవ్వుతూ... కృష్ణప్రియ కోపం పోయేది.

ఇద్దరం రింగ్ టెన్నిస్ ఆడేవాళ్ళం అది దూరం నుండి చూసిన మాక్లాసుమేటు మేష్టారితో రిపోర్టు చేసేది. డ్రిల్ మేష్టారు వచ్చి "ఆడపిల్లలు ఆడవలసిన రింగ్ టెన్నిసు నువ్వు ఆడతావేమిరా?" అని నన్ను కోర్టు నుండి బైటకి లాగేసేవారు. చేసేదేం లేక నేను కోర్టుబైటకి వచ్చేసేవాడిని. మా క్లాసుమేటు, కృష్ణప్రియ రింగ్ టెన్నిసు ఆడడం మొదలు పెట్టేవారు. కాని డ్రిల్ మేష్టారు అక్కడనుండి వెళ్ళిపోగానే కృష్ణప్రియ, ఇంకో క్లాసుమేటుని పిలిచి రింగ్ ఇచ్చేసి, ఆటనుండి విరమించుకునేది. అది నాకెంతో నచ్చేది.

అలాగే సైన్సు టీచరు మందలించిన తర్వాత రెండురోజులూ కృష్ణప్రియ వోణీవేసుకు వచ్చింది. మూడోరోజు మళ్ళీ పరికిణీ జాకెట్‌తో వచ్చింది. ఆ రోజున సైన్స్ టీచరు నన్ను చూసిన చూపు నేను జన్మలో మర్చిపోలేను.

సైన్సు టీచరు కృష్ణప్రియని నిలబెట్టితిట్టింది. కృష్ణప్రియ 'వోణీ మాసిపోయింది' అంది.

"అదొక్కటే వోణీ ఉందా?" అంటూ సైన్సు టీచరు బుస.

"ఊ" కృష్ణప్రియ సమాధానం

కృష్ణప్రియ నా మాటకిచ్చిన విలువకి నేను ఉబ్బితబ్బిబ్బై పోయాను. కృష్ణప్రియకి తనలో ఎదుగుతున్న యవ్వనం మీద విపరీతమైన మోజువుంది, అది పరికిణీ జాకెట్టులో కనబడినంత ఆకర్షణీయంగా లంగా ఓణీలో కనిపించలేదు. ***అద్దం మనిషిని ప్రభావితం చేసినంతగా, మరొకటి మనిషిని ప్రభావితం చెయ్యదు.***

కానీ సైన్సు టీచరు ఏ మంత్రం వేసిందో తెలీదుగాని, కృష్ణప్రియ నాకు దూరంగా ఉంటోంది. అది నాకు అర్థం అవుతోంది. సైన్స్ టీచరు కృష్ణప్రియ నాన్నగారికి రిపోర్టు చేయడంతో కృష్ణప్రియ కారులో వస్తోంది కారులో వెళుతోంది. క్లాసులో సీటు మారిపోయింది. ఇంతకు ముందులా నాతో చనువుగా ఉండడంలేదు.

ఈలోగా పరీక్షలు వచ్చేసాయి. ఈ రోజు రాజగోపాల్ పాటలు పాడకపోతే కృష్ణప్రియ జ్ఞాపకం వచ్చేదికాదు. ఇప్పుడు కృష్ణప్రియని అడిగినా డబ్బు ఇవ్వకపోవచ్చు! మరి ముప్పై ఎలా సంపాదించాలి? అన్న ఆలోచనతో కళ్ళుమూసుకున్నా, నిద్రమేఘంలా కమ్మేసింది.

✡✡✡

5

**పొద్దున్నే లేచి** స్కూలుకి తయారవుతున్నా.. అదే సమయంలో కృష్ణొచ్చాడు. 'హొరేయ్ శ్రీను పిలుస్తున్నాడు తొందరగా రా' అని చెప్పి కాలేజీకి వెళ్ళిపోయాడు. నా గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి. శ్రీను ఎందుకు పిలిచాడు. నిన్ననే వచ్చినవాడు, క్లబ్బుకి వెళ్ళుంటాడు. క్లబ్బులో మేం పేకాట ఆడినట్టు తెలిసుంటుంది. ఆ విషయం కనుక్కోవడానికే పిలిచాడా? తిడతాడా? పరీక్షఫీజు పోగొట్టుకున్నట్టూ తెలిసిపోతుందేమో, ఎన్నో ఆలోచనలు! ఎన్నో భయాలు! ఇవన్నీ పక్కకి పెట్టి, గబగబా తయారై, శ్రీను దగ్గరకి వెళ్ళాను. వాళ్ళు ఉంటున్న గది మా పక్క వీధిలోనే, వాళ్ళ నాన్నగారు రిటైరైపోయాక ఇల్లు అద్దెకి ఇచ్చేసారు. ఇంటిలో ఓ పక్కగా రెండు గదులుంచుకున్నారు.

అందులో కృష్ణ, శ్రీను ఉండేవారు. శ్రీను ఇంజినీరింగ్ పూర్తయాక కాకినాడలో ఉద్యోగం వచ్చి వెళ్ళిపోయాడు. ప్రస్తుతం ఆ రెండు గదుల్లో కృష్ణ ఉంటున్నాడు. కృష్ణ ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. నాకన్నా రెండేళ్ళు పెద్ద! శ్రీను వాళ్ళ నాన్నగారు మా నాన్నగారి ఆఫీసులోనే పని చేసేవారు. శ్రీనుకి, కృష్ణకి మా ఇంటిలో మంచి చనువుంది. అందుకే శ్రీను నా మీద పెద్దరికం చూపించి అధారిటీ చేస్తాడు. నేను సహించక తప్పదు.

నేను వెళ్ళేసరికి శ్రీను చాపమీద పడుకుని నవల చదువుతున్నాడు. నన్ను చూసి నవలని పక్కకి పెట్టి,

"ఏరా మొన్న క్లబ్బులో పేకాటాడేవా?" అన్నాడు సీరియస్‌గా...

నే సమాధానం చెప్పలేదు.

"నువ్వక్కడకెందుకు వెళ్ళావు, అయినా అంత పెద్ద ఆట ఆడడానికి నీకు డబ్బులెక్కడివి? "

"బట్టలు కొనుక్కోమని ఇచ్చిన డబ్బు" నా శుక్రనీతి ఉపయోగించాను, మానభంగం జరగకుండా...

"అబద్దాలాడకు ఏ పండగలూ లేవుకదా... ఇప్పుడు బట్టలు కొనుక్కోమని డబ్బు ఎవరిస్తారు?" శ్రీను అనుమానం.

శుక్రనీతిని వాడడం కూడా అంత తేలిక కాదు. అని అర్థం అయింది మౌనంగా ఉన్నా.... "ఎంతపోయింది?" అని అడిగాడు.

పేకాటలోపోయిందాని గురించి తక్కువ చేసి చెప్పడం, వచ్చిందాని గురించి ఎక్కువ చేసి చెప్పడం పరిపాటు.. అందుకే శ్రీనితో "నలభైరూపాయలు" అన్నాను.

"నలభైరూపాయలేనా, కృష్ణది నలభైపోయిందటకదా" అన్నాడు నన్ను అనుమానంగా చూస్తూ,

"కృష్ణది నాకు తెలీదు. నాది మాత్రం నలభై" అన్నాను దృఢమా....

"హొరేయ్ నీ చలాకీ నా దగ్గర చూపించకు, ఇద్దరూ తోడుదొంగలు, ఇంకెప్పుడూ క్లబ్బుకి వెళ్ళకు లెంపలేసుకో" అన్నాడు.

నేను బుద్ధిగా రెండులెంపలూ వేసుకున్నాను నన్ను చూసి నవ్వాడు, జేబులోంచి మూడుపదులు తీసి ఇచ్చాడు. నేను నమ్మలేకపోయాను. ఇంట్లో పేకాట ఆడినపుడు మా డబ్బులు పోతే, మమ్మల్ని హోటలుకి తీసుకెళ్ళి టిఫిను పెట్టించేవాడు. ఒకవేళ తనే గెలిస్తే మా డబ్బులు మాకు ఇచ్చేసేవాడు కాని ఈ రోజు ఇంత మొత్తం ఇవ్వడం, నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. డబ్బు సమస్య తీరిపోయిందని ఆనందం వేసింది.

✡✡✡

ఆ రోజు సాయంకాలం రాజగోపాల్ దగ్గరకి వెళ్ళి, వాడిచ్చిన డబ్బు కూడా తెచ్చా.. నా సమస్య తీరిపోయాక, కృష్ణ గురించి ఆలోచనలు మనసునిండా ముసిరాయి. కృష్ణ రూముకి వెళ్ళాను.

కృష్ణ జిమ్ నుండి అప్పుడే వచ్చి ఏదో టిఫిను తింటున్నాడు. నన్ను చూడగానే 'ఏరా శ్రీను నీకెంతిచ్చాడు?' అని అడిగాడు.

'ముప్పైరూపాయలు' అన్నా...

'నాకు ఇరవైరూపాయలే ఇచ్చాడు. రాత్రి శ్రీను క్లబ్బులో యాభైరూపాయలు గెల్చాడు. అదే ఇద్దరికీ సర్దాడు. నీది దగ్గర దగ్గర ఎనభై రూపాయలు పోయిందని తెలుసుకున్నాడు.'

'ఎలా?' అని ఆశ్చర్యపోయాను.

'కాయన్స్‌తో ఆడుతున్నప్పుడు తెలిసిపోతుందిలే.' అన్నాడు కృష్ణ.

నేను కృష్ణతో మాట్లాడుతూ, టేబులు మీదున్న వస్తువులు వెదుకుతున్నాను. టేబులు మీద మూలగా వున్న పుస్తకం నన్ను ఆకర్షించింది. పుస్తకాన్ని తీసుకు చూసాను. అది కోడూరి కౌసల్యాదేవి నవల చక్రభ్రమణం.

'వొరేయ్ ఈ నవల ఎవరిదిరా? నేను తీసుకెళ్ళి చదివి ఇచ్చేస్తాను.' అన్నాను.

'అది మనదికాదు.లలితది, లలిత రూముకి వచ్చినట్టుంది. మర్చిపోయింది' అన్నాడు.

'లలిత ఎవరూ?'అనడిగాను కృష్ణని.

లలిత ఎవరో నాకు తెలుసు, కాని కృష్ణ దగ్గర్నించి ఇంకెక్కువ సమాచారం రాబడదామనుకున్నా.. 'అచ్యుతం అక్క' అన్నాడు కృష్ణ. శ్రీను అచ్చుతం ఇద్దరూ క్లాసుమేట్స్ ఇంటరు దగ్గర్నుండీ ఇంజనీరింగ్ వరకూ కలిసి చదివారు. లలిత అచ్యుతంకి అక్క అవుతుంది. అచ్యుతం కన్నా రెండేళ్ళు పెద్దది. ఇంటరుతో చదువు ఆపేసింది. చిన్న ఉద్యోగంలో జాయిన్ అయింది.

శ్రీను అచ్యుతం ఇంట్లో చాలా చనువుగా ఉంటాడు. అచ్యుతంకి లలితకి క్షణం పడేదికాదు. ఇద్దరూ ఎప్పుడూ ఏదో విషయంలో దెబ్బలాడుకునేవారు.

అందుకే లలిత షాపింగ్‌కి ఇతర అవసరాలకి శ్రీను మీద ఆధారపడేది. శ్రీను ఆమెకి తోడుగా బజారుకి వెళ్ళడం, బుక్ లెండింగ్ లైబ్రరీకి వెళ్ళి నవల్లు తేవడం చేసేవాడు. అప్పుడప్పుడు ఎవరితో చెప్పకుండా ఆదివారాలు శ్రీనుని తీసుకుని మార్నింగ్ షో సినిమాకి వెళ్ళిపోయేది. లలిత శ్రీను కూడా ఆమె సీక్రసీని జాగ్రత్తగా కాపాడేవాడు. ఇంటర్మీడియట్‌లో ఉన్నప్పుడు లలితకి అచ్యుతం లోటుని భర్తీ చేస్తున్నవాడిలా సన్నిహితంగా మెలుగుతూ, లలితతో ఎక్జిబిషన్లకి, సినిమాలకీ, హోటళ్ళకీ, తీసుకెళ్ళడమేకాక, ఆమెకి జాకెట్లు కుట్టించడం, బ్రాలు కొనితేవడం, బుక్ లెండింగ్ లైబ్రరీకి వెళ్ళి బుక్స్ అద్దెకి తేవడం లాంటి సర్వీసులు అందిస్తూ, లలిత దగ్గర ఇంప్రెషన్ కొట్టేసాడు శ్రీను.

ఇంజనీరింగ్‌కి వచ్చినా లలితకి చేసే సర్వీసులో లోపం చెయ్యలేదు. కాకపోతే ఆ మార్పు ఎక్కడ వచ్చిందంటే, శ్రీను కోసం లలిత వచ్చేది, ఏదో పని పురమాయించి ఆఫీసుకెళ్ళిపోయేది. ఆ పనిని చేసిపెట్టేవాడు శ్రీను.

ఆ సమయంలోనే శ్రీనుని, కృష్ణని చదువులకోసం, విశాఖపట్నంలో వదలి స్వగ్రామం వెళ్ళిపోయారు వాళ్ళ నాన్నగారు. దానివల్ల శ్రీనుకి మరింత ఏకాంతం, స్వేచ్ఛ లభించాయి. ఆ రోజుల్లో శ్రీను లలితకి నవలలు తెచ్చినా తన కోసం 'మదన' పుస్తకాలు తెచ్చుకునిరూములో ఎవరూ లేనప్పుడు చదివేవాడు. ఇలా కొన్నాళ్ళు జరిగింది. ఓ రోజు సమయానికి శ్రీను దొరక్క తనే బుక్ లెండింగ్ లైబ్రరీకి లలిత. అక్కడ తన పేరు మీద వున్న పుస్తకాల్లో మదన పుస్తకం ఉండడం చూసి ఆశ్చర్యపడింది. శ్రీనుని ఆ పుస్తకాలు తనకీ తెమ్మని అడిగింది. శ్రీను ఆ పుస్తకాలు తెచ్చి అట్టలేసి లలితకి ఇచ్చేవాడు. లలిత ఆదివారాల్లో పగలు బీచొడ్డుకెళ్ళి అక్కడ కూర్చుని పుస్తకం చదివేది.

శ్రీను చాలా చిత్రమైనవాడు. చాల తక్కువ మాట్లాడతాడు. మనిషి బైటకి చాలా గంభీరంగా కనబడతాడు. తను పేకాటలో గెలిచిన డబ్బుల్ని మాలో పంచిపెట్టేసేవాడు. నేనంటే ప్రత్యేకంగా అభిమానం చూపించేవాడు. నన్ను కూర్చోబెట్టి లెక్కలు చెప్పేవాడు. నా చేత ఎక్కువగా వాగించేవాడు. ఆనందించేవాడు. ఆ రోజుల్లోనే శ్రీను లలిత గురించి ఏవేవో కబుర్లు చెప్పేవాడు కృష్ణ. కాని అవన్నీ నాకు

స్పష్టంగా అర్థమయేవికావు. అలాగని అర్థం కాకపోనూ లేదు విచిత్రమైన ఉత్సాహం ఉండేది. ఏదో అర్థం చేసుకుందామనే తపన మనసుని పట్టిపీడించేది!

శ్రీను లలిత పాత సినిమాలకి జనం లేని సినిమాలకి బాల్కనీ టిక్కట్లు తీసుకుని వెళతారని, అక్కడ ఒక మూలగా కూర్చుంటారని, తనొకసారి సరస్వతి థియేటరులో చూసానని చెప్పాడు. నేను అమాయకంగా 'అలా ఎందుకు వెళ్ళడం?' అని అడిగాను. కృష్ణ పెద్ద ఫిలాసఫర్‌లా నవ్వాడు. 'ఇద్దరూ ముద్దుపెట్టుకుంటారు, తెలుసా? ' అన్నాడు. తర్వాత నా క్వశ్చన్ మార్కు మొహం చూసి 'ముద్దంటే పెదిమలతో ముద్దు ఇంగ్లీషు సినిమాల్లోలాగ' అన్నాడు. నవ్వుతూ. అప్పటికి చాలా ఇంగ్లీషు సినిమాలు చూసాను. ఇంగ్లీషు సినిమాలో హీరో, హీరోయిన్లు తమకంగా పెదమల్ని ముద్దుపెట్టుకోడం చూసాను కాని శ్రీను లలిత గురించి వింటున్న సమాచారం కలిగించినంత ఇంట్రస్టు మరేదీ కలిగించలేదు.

శ్రీను లలితల సన్నిహితం చాలా ముందుకి వెళ్ళింది. ఇద్దరూ రూములో కూర్చుని గంటల తరబడి కబుర్లు చెప్పుకునేవారు. లలిత పుస్తకాలకని వచ్చి శ్రీనుతో హాస్యాలాడుతుంటే, ఎంత పట్టించుకోకూడదు అనుకున్నా, చాలా తీవ్రంగా పరిశీలించేవాడిని.

ఓరోజు కృష్ణ వాళ్ళ ఇంటికి వెళ్ళాను. తలుపు దగ్గరగా వేసుందికదా అని గది తలుపు తోసాను. గదిలోపల లలిత శ్రీనుకి ఎదురుగా నిలబడివుంది. శ్రీను తాడుతో లలిత చాతీని కొలుస్తున్నాడు. తాడుని లలిత వీపుమీంచి చంకల క్రిందుగా తీసుకొచ్చి, రొమ్ములమీద టైట్‌గా పట్టుకున్నాడు. లలిత శ్రీనుని చూస్తూ 'నీ ఉద్దేశం వేరు' అంటూ నవ్వింది.

శ్రీను నవ్వలేదు మరి జాకెట్ దానిమీద చీర అన్నీ ఉంటే కొలత మారిపోతుంది అన్నాడు. 'అవన్నీ లేకపోతే కొలిచే మూడు మారిపోతుంది' అంది లలిత నవ్వుతూ. శ్రీను చాతిని కొలిచి, తాడు నడుం దగ్గరకి జార్చి అక్కడ టైట్ గా పట్టుకుని కొలిచాడు. తరువాత తాడుని మరీ కిందకి జార్చి పిరుదుల మీంచి కొలిచాడు.

'ఒక్క నడుం కొంచెంలో తప్పిపోయింది కాని 'గినాలొల్లోబ్రిగెడా' కొలతలన్నీ నీకు సరిపోతాయి' అంటూ తలుపువేపు చూసాడు. అక్కడ నేనున్నాను. శ్రీను చూసిన సమయానికే లలిత కూడా చూసింది. తడబడింది. నేల మీదకి వేలాడుతున్న పైట తీసి వేసుకుంది.

నన్ను చూసి శ్రీను విసుగ్గా 'ఏరా ఎందుకూ?' అని అడిగాడు. నేను చూసిన దృశ్యం నుండి ఇంకా తేరుకోలేదు నసుగుతూ 'కృష్ణ' అన్నాను.

'లేడు క్రికెట్ ఆడుకోవడానికి గ్రౌండ్‌కి వెళ్ళాడు' అన్నాడు. నేను సరే అన్నట్టు బుర్రవూపి అక్కడ నుంచి వచ్చేసాను. కృష్ణ కూడా చాలా సార్లు ఇలాంటి దృశ్యాల్ని వర్ణించాడు.

ఒక్కోసారి చాపమీద విరిగిన చేతిగాజులు, శ్రీను షర్టుకి అంటిన కుంకుమ మరకలూ చూపించాడు. వీటన్నింటికీ అర్థం అంతగా తెలియలేదు కాని ఈ విషయాలన్నీ మంచి ఇంట్రస్టింగ్‌గా ఉండేవి.

✡ ✡ ✡

ఆ సమయంలో కృష్ణ నాకొక పుస్తకం ఇచ్చాడు. 'శ్రీను హేండ్ బేగ్‌లో ఉంది నాన్నగారికి బాగాలేదని తెలిసి వెళ్ళిపోయాడు. రేపో ఎల్లుండో వచ్చేస్తాడు. చదివి ఇచ్చెయ్, మళ్ళీ బేగ్ లో పెట్టేస్తాను' అన్నాడు.

కృష్ణ ఇచ్చిన పుస్తకాన్ని ఇంటికి తీసుకొచ్చి, అన్ని పుస్తకాల్లాగే చదివాను. అలాంటి పుస్తకాన్ని అంతకు ముందు ఎప్పుడూ చదవలేదు. ఆ పుస్తకం నిండా ఉన్న సాహిత్యాన్ని 'బూతు' అంటారు.

అది చదివాక లేచి నిలబడడానికి సిగ్గేసింది, నన్నెవరో ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారా, అనిపించింది. ఆ పుస్తకం మీద బుక్ లెండింగ్ లైబ్రరీ ముద్రవుంది. ఆ పుస్తకాల షాపునుండే నేను డిటెక్టివ్ బుక్స్ అద్దెకి తెస్తాను. నాకేదేనా కొత్త పుస్తకం దొరికితే రాజగోపాల్‌కి ఇవ్వడం అలవాటు. ఈ పుస్తకాన్ని రేపు రాజ్ గోపాల్‌కి ఇచ్చి, వాడిచేత చదివించేంత టైములేదు.

ఈ పుస్తకాన్ని నేను చదివానన్న ప్రివిలేజ్ పోగొట్టుకోదలచుకోలేదు. అందుకే అదే రాత్రి వాడింటికి వెళ్ళాను. వాడప్పుడే భోజనం చేసి పుస్తకాల ముందు కూర్చున్నాడు. అంత రాత్రయాక నేను రావడం వాడికి ఆశ్చర్యాన్ని కలిగించింది. వాడిని తీసుకుని మేడమీదకి వెళ్ళా... వాడితో పుస్తకం గురించి చెప్పి రహస్యంగా చదవమని చెప్పాను. వాడు ఉత్సాహంగా పుస్తకం ఏదీ అని అడిగాడు. షర్టు కిందవున్న బనీను కింద దాచిన పుస్తకాన్ని తీసివాడికి ఇచ్చాను. వాడు ఆ పుస్తకం తీసుకుని బనీను కింద దాచి కిందకి తీసుకెళ్ళాడు.

పుస్తకం మామూలుదే, పేజీలు మామూలువే, అక్షరాలు మామూలువే కాని దానిని రహస్యంగా దాచాలి అన్న భావం కలిగింది ఎందుకు రుజు భావం కాదా? భావంలో వక్రముందా? అన్నీ ప్రశ్నలే? ఏవీ పుస్తకం గుప్తంగా ఉంచాలని శాసించలేదు, ప్రపంచం శాసించిందా? ఎందుకు? అన్నీ అయోమయం.. మర్నాడు రాజ్ గోపాల్ కాలేజీకి వెళుతూ ఆ పుస్తకాన్ని నాకు ఇచ్చేసాడు, నేను కృష్ణకి ఇచ్చేసాను.

రెండు రోజుల తర్వాత అదే పుస్తకాన్ని కృష్ణ రూములో లలిత హేండ్ బేగ్‌లో పెట్టుకుంటుండగా చూసా... శ్రీనుకి, లలితకి సంబంధం ఉంది, అని కృష్ణ చెప్పింది నిజమే! అని అర్థం అయింది.

నేను టెన్త్ క్లాసు పబ్లిక్ ఎక్జామ్‌కి ప్రిపేరవుతున్న రోజుల్లోనే, ఒకరోజు కృష్ణ మా ఇంటికి వచ్చి నన్ను రమ్మనమని వాడి రూముకి తీసుకెళ్ళాడు. అక్కడ బీరువా తెరిచి, బీరువాలో నుండి రమ్ బాటిలు తీసి నాకు చూపించాడు.

శ్రీను డిఫెన్స్ కేంటిను నుండి 'రం' బాటిలు తీసుకొచ్చి బీరువాలో పెట్టాడు కృష్ణ పుస్తకాల కోసం బీరువా తెరిచి 'రమ్' బాటిలు చూసాడు. వాడికి ఆ రహస్యం తెలుసుకోవడంతో మనసు ఆగలేదు. చిన్న గ్లాసు తీసుకుని అందులో పోసుకు తాగాడు. కాని వాడు తాగి దాన్ని అక్కడ పెట్టేస్తే బావుండును. వాడు తాగేడనే విషయం అందరికీ తెలియాలి. తను గొప్పవాడినన్న సంగతి అందరికీ తెలియాలి అనే 'ఇగో' పని చేసి, సాయంకాలం నన్ను పిలిచి నాకు రమ్ బాటిలు చూపించాడు. వాడక్కడితో ఆగలేదు. రెండు గ్లాసులు తెచ్చి, రెండు గ్లాసుల్లోనూ, కొంచెం పోసి...

'తాగు' అన్నాడు. నాకు తాగడానికి భయం వేసింది. ఈ విషయం కృష్ణతో అంటే 'తాగడానికి భయమా?' అని నన్ను నిరసనగా చూసి, నాది కూడా తాగేస్తాడు. వచ్చిన అవకాశాన్ని పోనివ్వకూడదు. దీని రుచి ఏమిటో చూడాలి? అనుకుని గ్లాసు ఎత్తి 'రమ్'ని ఒక్కసారిగా నోట్లో పోసుకున్నాను. నోరంతా భగభగా మండింది. గొంతుకలో కొరకంచు పెట్టినట్లయింది. పొలమారింది. పొలమారడంతో 'రమ్' యొక్క ఘాటు చిన్నగా ముక్కులోకి వచ్చింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఇన్ని జరిగినా రమ్ బైటకి రాకుండా గుటక వేసాను.

'తాగడం రాకపోతే తాగకు ఎందుకా తొందర దీన్ని మెల్లమెల్లగా తాగాలి' అన్నాడు కృష్ణ విసుగ్గా.

✡✡✡

వీడు ముందు విషయంలో విసుక్కుంటే రాజగోపాల్ పుస్తకం విషయంలో విసుక్కున్నాడు.

'వొరేయ్‌పుస్తకం ఎలా చదివావురా?'

'ఏం బావులేదా?'

'బావుందో లేదో తెలియదు గాని జుగుప్సాకరంగా ఉంది. ' అన్నాడు.

'జుగుప్సాకరంగా అంటే అసహ్యం వేసింది.'

'మరైతే పూర్తిగా చదవలేదా?'

'పూర్తిగా చదవకుండా ఉండలేకపోయాను.'

నేను మనసులో నవ్వుకున్నాను. పుస్తకంలో బూతు అసహ్యం కలిగించింది, కాని పూర్తిగా చదవకుండా ఉండలేకపోయాడు. వీడి హిపోక్రసీకి నవ్వు వచ్చింది. ఆ పుస్తకం ప్రభావం నా మీద పడింది. అలాంటి పుస్తకాలు తెచ్చి చదవడం మొదలు పెట్టాడు. కానీ రాజగోపాల్ మరి ఆ పుస్తకాల జోలుకి వెళ్ళలేదు. వాడింకా ఆత్రేయ పాటల్లోనూ, కొసరాజు గీతాల్లోనూ, రెండర్థాలని వెతుక్కుంటున్నాడు. సంతృప్తిపడుతున్నాడు.

రోజులు అలా గడుస్తుండగానే, నేను టెన్త్‌క్లాసు యాభై మార్కుల ఏవరేజ్‌తో సామాన్యంగా పాసయాను.

✡✡✡

నేను టెన్త్ పాసయి ఇంటరులో చేరిన సమయంలోనే మా ఇంట్లో మాతోపాటు ఉండడానికి మావయ్య తన సంసారంతో సహా వచ్చేసాడు.

మావయ్య అమ్మకి స్వయానా తమ్ముడు, శ్రీకాకుళం జిల్లాలో చింతాడ గ్రామంలో కరణీకం చేసేవాడు. పేకాట, తాగుడు అన్నీ వున్న సర్వగుణసంపన్నుడు.

నాన్నగారుండగా మావయ్యని ఇంటి గడప తొక్కనిచ్చేవారు కాదు. అంతేకాదు నాన్నగారుండగా నాన్నగారి తరుపు వాళ్ళందరూ అంటే అత్తలు, బావలూ, కక్కయ్యలు (చిన్నాన్న) అందరూ నిత్య అతిధులుగా ఉండేవారు. అది అమ్మకి నచ్చేదికాదేమో, కాని నాన్నగారికి భయపడి ఊరుకునేది.

అప్పుడప్పుడు మావయ్య మా ఇంటికొస్తే మొదట్లో వాతావరణం బాగానే ఉన్నా, రాను రాను నాన్నగారికి కోపం వచ్చేది. దానికి సగం కారణం మావయ్యే! మావయ్య అమ్మకి అమ్మ హక్కుల గురించి పురి ఎక్కించేవాడు. అమ్మ అమాయకంగా నాన్నగారిని నిలదీసి ప్రశ్నించేది. అది నాన్నగారి కోపానికి కారణం అయింది.

అమ్మకి వాళ్ళ నాన్నగారిచ్చిన ఎకరం భూమీ అమ్మి, తన ప్రావిడెంట్ ఫండ్ డబ్బు కలిపి, చాలా ముందుచూపుతో నాన్నగారు ఓ పెద్ద ఇల్లు కొన్నారు. కాని మావయ్య అమ్మకి నీ పొలం అమ్మారు కానీ నీకు బంగారం ఏం కొనలేదు. అంత పెద్ద ఇల్లు ఎందుకు? ఉండడానికి చిన్న ఇల్లు చాలదా? అంటూ నూరిపోసాడు. అది అమ్మ బుర్రకి ఎక్కి. నాన్నగారిని ప్రశ్నించి, కోపం తెప్పించేది. అందుకే నాన్నగారు మావయ్యని దూరంగా ఉంచారు.

మావయ్య కొడుకుని పెంచుకుందామని అమ్మకి ఉండేది. అత్తయ్య కొడుకుని పెంపుకిద్దామని అత్తయ్యకుండేది. నాన్నగారికి తమ బంధువుల్లోంచి ఎవరినీ పెంచుకోడం ఇష్టం ఉండేది కాదు. దానివల్ల నన్ను చూస్తే ఇటు నాన్న తరుపువాళ్ళకీ చిన్న చూపే, అటు అమ్మ తరుపు వాళ్ళకీ చిన్నచూపే!

మావయ్య కరణీకంలో చేసిన అవకతవకలు బైటపడి ఉన్న కరిణీకం కాస్తా పోయింది. కరిణీకం పోయి రెండేళ్ళయింది. ఎలాగో ఆ పల్లెటూర్లో జీవితాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈలోగా నాన్నగారు పోవడం, నేను టెన్త్ పాసవడం, మావయ్య కరిణీకం బుర్ర చురుకుగా పనిచేసి, 'అక్కయ్యా నీకు తోడుగా ఉంటాను.' అంటూ మొత్తం సామానుతో విశాఖపట్నం వచ్చేసాడు.

మావయ్య మొదటి పెళ్ళాన్ని కిరసనాయిలు పోసి కాల్చేసాడు. అని ప్రజలు చెప్పుకుంటారు. మావయ్య చెప్పేదేమిటంటే, స్టవ్ బద్దలయి కిరసనాయిలు వంటిమీదపడి చీర అంటుకుని కాలి చచ్చిపోయింది అంటాడు. మావయ్య మొదటి పెళ్ళానికి సంవత్సరీకాలు పెట్టకుండానే రెండో పెళ్ళి చేసుకున్నాడు. మావయ్య మొదటి పెళ్ళానికి సంతానంగా, ఇద్దరు పిల్లలున్నారు. ఇద్దరికీ చదువులేదు.

వెంకటికి పదేళ్ళు. ఆ పల్లెటూర్లో రైతు పిలలతో కూడి అలగాగా తిరిగి యాసగా మాట్లాడ్డం, వెకిలి తనం అలవాటు చేసుకున్నాడు.

ఆ సమయంలోనే మావయ్య రెండో పెళ్ళి చేసుకున్నాడు. అత్తకి ఇరవై అయిదేళ్ళుంటాయి. చాలా పేదకుటుంబం నుండి వచ్చింది. పల్లెటూరి బళ్ళో పదోతరగతి వరకూ చదివింది. పేదరికంతో పెళ్ళిచేయలేని స్థితిలో, రెండోపెళ్ళి వాడికిచ్చి చేసేసారు. అత్తకి మావయ్యకి వయసులో పద్దెనిమిదేళ్ళైనా తేడా ఉంటుంది.

మావయ్య విశాఖపట్నం వచ్చాక రిజిస్ట్రార్ ఆఫీసు దగ్గర చిన్న బల్లవేసుకు కూర్చుని దస్తావేజులు అవీ రాయడం మొదలు పెట్టాడు. దానివల్ల అతని ఆదాయం అంతత మాత్రంగానే ఉండేది. ఆ ఆదాయాన్ని, మావయ్యకున్న లక్జరీలు తాగుడు, పేకాట జోరు తగ్గింది. వచ్చిన ఆదాయం ఇంటి అవసరాలు తీరడమే కష్టంగా ఉంది. పల్లెటూర్లో కూర, పైపై అధరువులు చాలా మట్టుకు ఇంటి అవసరాలు ఊళ్ళో వాళ్ళ సానుభూతి వల్ల తీరేవి. ఇక్కడ ప్రతీదీ కొనుక్కోవలసి వచ్చేది. లేదా అమ్మ మీద ఆధారపడవలసి వచ్చింది. మా ఇంట్లో ఉంటూ వేరే కుంపటి అని చెప్పుకున్నా, అమ్మకి వచ్చే అద్దెనుండి వాళ్ళ కుటుంబానికి ఎత్తి పెట్టవలసివచ్చేది.

మావయ్య రాకముందు సవ్యంగా ఉంటూ, అద్దె ఇచ్చే బావ మావయ్య తోడై, ఇది వాడక్క సొమ్మైతే, ఇది నా మేనమామ సొమ్ము అన్నట్టు అద్దె ఇవ్వడం మానేసాడు.

దాంతో ఇంటిలో ఆదాయం తగ్గింది. నాకు డబ్బులు దొరకడం కష్టం అయింది. ఇంట్లో మనుషులు ఎక్కువ అవడం వల్ల, నా చదువుకీ ఏకాంతానికి, అంతరాయం ఏర్పడింది.

అదే సమయంలో కృష్ణ బాక్సింగ్ ప్రాక్టీసుకి వెళ్ళేవాడు. వాడితో నేనూ బాక్సింగ్ ప్రాక్టీసుకి వెళ్ళాను. కాని బాక్సింగ్ ప్రాక్టీసుతో అలసిన శరీరానికి కావలసిన ఆహారం ఇంటిలో లభించేది కాదు మర్నాటికి చాలా నీరసంగా ఉండేది. క్లాసులో కూర్చుంటే ఇంట్రస్టింగ్‌గా ఉండేది కాదు. కాలేజీలో లెక్చరర్లకి విద్యార్ధులకీ ఏ విధమైన బలమైన బంధం ఉండదు. దానివల్ల నాకు స్వేచ్ఛ లభించింది. ఏ ఇద్దరు టీచర్లో బోధన వృత్తిని స్వీకరించి, విద్యార్ధుల్లో తాము చెప్పే విషయంపై చాలా ఉత్సాహాన్ని కలిగించేవారు. మిగతా టీచర్లు నెలజీతం కోసం ఎదురు చూసే ఉద్యోగస్తులవడం వల్ల వాళ్ళకి క్లాసంటే ప్రతికూలమైన పని చేస్తున్న చిరాకు!

ఈ క్లాసు కొచ్చే టీచర్లకన్నా, కాలేజీకి ఎదురుగా ఉన్న బడ్డీకొట్టు దగ్గర చేరే విద్యార్ధుల గుంపు, వారి సావాసం చాలా హాయిని కలిగించేవి. ***హాయిని కలిగించే చోటు చూసుకుని దాన్నాశయించడం మనసుకి ఇష్టమైన పని.***

✡✡✡

# 6

**కాలేజీకి** ఎదురుగా బడ్డీకొట్టు దగ్గర సిమెంటు చప్టా ఆ సిమెంటు చప్టాని ఆశ్రయించి కాలం వెళ్ళబుచ్చే స్నేహితుల్లో ముఖ్యమైన వాళ్ళు మూర్తి, చక్రి, సుబ్బారావు కాక మరిద్దరు, ఆ సిమెంటు చప్టాని ఆశ్రయించిన మిత్రులకి అన్ డిస్‌ప్యూటెడ్ కింగ్ మూర్తి. మూర్తికి ఇరవైఏళ్ళుంటాయి. బియస్సీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. సోడాబుడ్డీ కళ్ళద్దాలూ, బండముక్కూ, చూపరులకు వింతగొలిపే వాడు. మూర్తి మాటలతో మిత్రబృందానికి సరదా కలిగించేవాడు. మూర్తి కాక ఆ సిమెంటు చప్టా ఆశ్రితుల్లో ముఖ్యుడు చక్రి. చక్రికి ప్రేమికురాలు ఉండేది. కాలేజీలో చక్రి, జానకీ బహిరంగంగానే తిరిగేవారు. ఇద్దరూ కలిస్తే ఒక పట్టాన విడేవారు కాదు. అదే చక్రి గొప్పతనం!

ఆ గ్రూపులోనే ఉన్న సుబ్బారావుకి సిల్వర్ సుబ్బడు అని పేరు. ఆ పేరెవరు పెట్టారో తెలీదుగాని, సిల్వర్ గిన్నెలు చప్పుడు చేసినట్టు ఎప్పుడూ లొడలొడా వాగుతాడు. ఎన్.టి.ఆర్ అభిమానసంఘానికి ప్రెసిడెంట్ ప్రతి సినిమాకి మొదటిరోజే, ఎన్ని కావాలంటే అన్ని టిక్కట్లు తేగలడు. అదే వాడి గొప్పతనం. మిగతా ఇద్దరూ ఉన్నారు గాని, వాళ్ళ గురించి చెప్పుకునేది ఏదీలేదు వాళ్ళంతా డిగ్రీలు చదువుతున్నారు. నేను ఇంటరులోనే వాళ్ళతో దోస్తీ చేసాను.

అయిదుగుర్లో మూర్తి, మాటల్లో వోవిధమైన ఆకర్షణ ఉంటుంది. ఆ రోజు మేమంతా సిమెంటు చప్టా దగ్గర కూర్చుని ఉండగా వర్షం వచ్చింది. మేమంతా బడ్డీకొట్టు పక్కగా ఇంటి అరుగు ఎక్కి నిలబడ్డాం, మూర్తి వర్షాన్ని చూసి సీరియస్‌గా 'ఇటీజ్ వర్షింగ్ రా' అన్నాడు. అందరూ నవ్వారు. కొంతసేపు పోయాక సిల్వర్ సుబ్బడు మూర్తిని అనుకరిస్తూ 'ఇటీజ్ వర్షింగ్ హోయ్' అన్నాడు వెంటనే మూర్తి 'వైడుయు వర్రీ లెట్ ఇట్ వర్ష్' అన్నాడు.

మూర్తి సమయస్ఫూర్తి ముందు స్నేహబృందం వెలవెలబోతారు. అందులో భాగంగానే, వో రోజు చక్రీ తన ప్రియురాలు జానకి గురించి ఏదో చెపుతున్నాడు, మూర్తికి వినడానికి బోరు కొట్టింది. ఒరేయ్ చక్రీ జానకి గురించి అన్ని మాటలెందుకు రెండు ముక్కల్లో చెప్పచ్చు 'కళ్ళంత పళ్ళు, పళ్ళంత కళ్ళూ' అన్నాడు.

అర్థం కాలేదు. చక్రి వెళ్ళిపోయాక మూర్తిని 'కళ్ళంత పళ్ళూ పళ్ళంత కళ్ళూ, అంటే ఏమిటి?' అని అడిగా .. 'శాస్త్రకారుడు స్త్రీకి దానిమ్మగింజల్లాంటి పళ్ళు చెంపకు చేరడేసి కళ్ళూ, ఉండాలని చెప్పాడు. కాని జానక్కి దానిమ్మగింజల్లాంటి కళ్ళు, నోట్లో చేరడేసిపళ్ళున్నాయి. అదీ తిరకాసు' అన్నాడు.

అందరం హాయిగా నవ్వుకున్నాము. ఎందుకంటే జానక్కి పళ్ళు ఎత్తు మూర్తిలో ఒక ఆర్టిస్ట్ ఉన్నాడు. ఆ కళాకారుడి ఉన్నతం ఎంతో నాకు తెలీడంలేదు.

ఆ రోజు విల్స్ సిగరెట్ పేకెట్ తీసుకున్నాడు. దానిమీద రాసున్న (W.D.H.O.WILLS) అంటే అర్థం తెలుసా అని అడిగాడు.

'తెలీదు' అన్నాం.

'వైఫ్ డిజైర్స్ హస్బెండ్ అకేషనల్లీ విల్స్' అంత గ్రేస్ ఫుల్‌గా ఉంటుంది. ఈ సిగరెట్ కాలిస్తే అన్నాడు.

'కాని చాలామంది చార్‌మినార్ కాలుస్తారు వాళ్ళ విషయం ఏమిటి? ' సిల్వర్ సుబ్బడి సందేహం. 'నీకున్న ఒక్కమినార్ సంగతి చూసుకోవోయ్. మిగతా వాళ్ళ సంగతి నీకెందుకూ....' అంటూ సిల్వర్ సుబ్బడ్ని కామ్మకట్టేసాడు.

ఒకరోజు చక్రి సిమెంటు చప్టా దగ్గరకి వచ్చేసరికి, 'ఏరా మొహాలు కడుక్కునే వచ్చావా'? అనడిగాడు.

దాన్ని చక్రి తప్పుగా అర్థం చేసుకుని 'మొహమా పొద్దున్నే కడుక్కున్నానుగా' అన్నాడు.

'అదికాదోయ్ చక్రీ జానకితో అలా ప్లేగ్రౌండులోకి వెళ్ళి జిమ్‌కి పక్కగా ఎవరికి కనపడకుండా చెట్టుకింద కూర్చున్నావా? ముద్దుకో, ముచ్చటకో, కక్కుర్తి పడకుండా ఉంటావా? నీమొహానికి కుంకమో, కాటుకో అంటుకుందనుకో, దాన్ని శుభ్రం చేసుకుంటే దాన్ని మొహాలు కడుక్కోడం అంటాం... పొద్దున్నే నిద్రలేచి మొహంతో పాటు కడుక్కునే మొహాలు వేరు. నువ్వింతవరకూ ఆ లెవలుకి రాలేదు. ' అన్నాడు. మేమంతా నవ్వాం మాతో చక్రికూడా నవ్వాడు.

✡✡✡

రోజులు గడవడం కోసం.. సినిమాలు చూడడం, పుస్తకాలు చదవడం సిమెంట్ చప్టా దగ్గర కబుర్లు చెప్పడం.. ఇవి కాక సీక్రెటివ్ పనుల్లో రమణి సెక్స్ పుస్తకం చదవడం ఒకటి, సెక్స్ కథలు.. వాటిని చదవడానికి మనసు పడే తపన.. చదువుతుంటే శరీరపు తహ తహ .. ఊహల్లో ఆనాటి కృష్ణప్రియ... ఈనాటి మధురవ్యూహాలు.... అరచేతిలో అందమైన కలలు.. కలల్లో కైపు... లావా పొంగి ప్రవహించే అనుభూతి! మైకం వీడి లోకంలో అడుగుపెట్టి నిర్వేదం నిస్సహాయత పరిపాటయిపోయి, ఏమిటీ తపన అన్న ఆలోచనే రాలేదు... వచ్చేంతగా మనసెదగలేదు....

అందులే తెలుకొండిలా ఉలికిపడుతున్న మనసుని... మౌలికమైన ఇన్‌స్టింక్ట్‌ని... ఎపుడవకాశం దొరుకుతుందా? ఏలోతుల్లో ఆనందపుటంచు తగులుతుందా అన్న ఆలోచన ఎత్తుల్లో వెదికేకళ్ళు... ఇవన్నీ కలిసి మనసంతా చదరంగపు గళ్ళల్లా గజిబిజిగా ఉన్నా చాలా బిజీగా ఉంది.

పుస్తకాలు చదవడం అంటే అద్దెకి సెక్స్ పుస్తకాలు తెచ్చుకు చదవడం హాబీ అయిపోయింది. కాలేజీ పుస్తకాలు పరీక్షలముందు చదివితే చాలు అనిపించేది. అది రాజగోపాల్ స్నేహం వల్ల వచ్చిన వోవర్ కాన్ఫిడెన్స్!

ఒక రోజు కాలేజీ నుండి వచ్చి, నా పుస్తకాల రేక్‌లో పెట్టిన రమణి పుస్తకం గురించి వెదికాను. అది కనబడలేదు. బావ మీద అనుమానం వచ్చింది. బావ తీస్తే ఇంక తిరిగి ఇవ్వడు నన్ను వెటకారం చేస్తాడు. రెండు రోజులు బావ వెటకారాల కోసం ఎదురు చూసాను. కాని బావ అలాంటి వెటకారాలేవీ చెయ్యలేదు. మరి బావ తియ్యకపోతే ఎవరు తీస్తారు? ఇంట్లో ఇలాంటి పుస్తకం చదివే వాళ్ళెవరు? ఇప్పుడా పుస్తకం ఇవ్వకపోతే దాని ధర ఇచ్చుకోవాలి! లేదా రోజూ పదిపైసల చొప్పున దాని అద్దె పెరిగిపోతుంది. రెండూ దండగే ఏం చేయాలో తెలీక, బావకి మావయ్యకి తెలీకుండా వాళ్ళ గదుల్లో వెదుకుతున్నాను. నా వెదుకుడు అత్త పసిగట్టింది. పుస్తకం తీసుకొచ్చి నాకిచ్చింది. నేను ఖంగుతిన్నాను.

'ఇలాంటి పుస్తకాలు ఎక్కడ దొరుకుతాయి?' అని అడిగింది.

'అద్దెకిస్తారు'

'ఎంత అద్దె'

'రోజుకి పదిపైసలు.'

'తీసుకొచ్చినప్పుడు నాకూ ఇవ్వు, అద్దె నేను ఇస్తానులే' అంది అత్త.

'అలాగే' అన్నాను.

ఆ రోజు నుండి నేను తెచ్చిన పుస్తకాలు పగలు అత్త చదివేది. రాత్రి చిన్న గుడ్డి దీపం పెట్టుకుని నేను చదివేవాడిని. అత్త దగ్గర డబ్బులు వసూలు చేసేవాడిని.

✡✡✡

సిమెంటు చప్టా మిత్రబృందాన్ని చూస్తే, అందరిలో ఏదో ప్రత్యేకత కనిపిస్తుంది.

నాలో ఏ ప్రత్యేకతా లేదనిపించేది. ఆ ప్రత్యేకత ఆ గుర్తింపు పొందడానికి ప్రయత్నంగా, మూర్తికి సెక్స్ పుస్తకాలు అత్తకి సప్లై చేస్తున్న విషయం చెప్పాను.

'మంచి అత్తని పట్టావురా' అన్నాడు ఆ రోజునుండి అత్తని నన్నూ కలిపి సెక్సీగా కామెంట్లు చేసేవాడు. అది నాకు చాలా ఇష్టంగా ఉండేది. ప్రభావం చూపేది.

నేను కూడా ఏవేవో ఊహించుకుని ఆనందించేవాడిని. వీటన్నింటివల్లా నాకు చదువు ధ్యాస కుదర్లేదు. ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు వచ్చాయి. రిజల్ట్సు వచ్చాయి. ఫస్టియర్ పోయింది. పరీక్ష పోయినా సెకెండ్ ఇయర్ చదవచ్చు. పరీక్షపోయినా ప్రభావం నా మీద అంతగా పడలేదు. ఇంట్లో పరీక్ష పాసయానని చెప్పాను. అంతా సంతోషించారు.

కానీ ఆ సంతోషం ఎక్కువ రోజులు నిలవలేదు. బావ కాలేజీకి వెళ్ళి మార్కుల లిస్టు పట్టుకొచ్చాడు. దాంతో మావయ్య అమ్మతో 'ఇంక వీడు చదవడు, ఇలాగే అబద్ధాలు చెపుతాడు. టెన్త్ పాసయాడు. ఏ టీచరు ట్రైనింగ్ కో పంపితే సరిపోతుంది.' అన్నాడు.

ఆలోచన్లు అక్కడితో ఆగాయా లేదు.. ఉద్యోగం రాగానే మావయ్య కూతురు జమునని ఇచ్చి పెళ్ళి చేస్తే సరిపోతుంది అనుకున్నారు.

జమునని పెళ్ళాంగా తలచుకోగానే, వళ్ళంతా కంపరం ఎత్తింది. చదువాగిపోతే పెళ్ళి చేసేస్తారేమో? అన్న భయం వేసింది. జమున కళ్ళముందు మెదలగానే, చింపిరి జుత్తు దారాపాతంగా కారుతున్నముక్కు, ముదురు రంగు పరికిణీ, జాకెట్టు, అసహ్యానికి అచ్చమైన నమూనా అనిపించేది.

కానీ సెకండ్ ఇయర్‌లో జాయిన్ అవడం వల్ల, కాలేజీ హడావిడి వల్ల, పరీక్ష పోయిన ఎఫెక్ట్ ఎక్కువగా కనబడలేదు.

ఆ ఏడాదే కృష్ణకి బి.యి. సీటు వచ్చింది. వాడు విశాఖపట్నం వదిలేసి వెళ్ళిపోయాడు. ఇంటర్ ఫస్టియర్ పోయిందన్న విషయం రాజగోపాల్‌తో చెప్పాను. వాడు బాధపడ్డాడు.

'ఇలా పరీక్ష పోతే నీకు బాధవెయ్యదురా?' అని అడిగాడు.

అవును బాధే కానీ ఏం చెయ్యనూ ఇంట్లో ఉన్న జనాభా వల్ల రాత్రిపూట చదువుకి కుదరదు అమ్మని 'మేథ్స్' ప్రైవేటు పెట్టించమంటే, 'చదువుకునే వాడికి ఈ హంగులన్నీ ఎందుకు, అదిలేనివాడికే అవన్నీ అవసరం నువ్వు చదవలేనప్పుడు, ఆ టీచర్ ట్రైనింగ్‌లో చేరు' అంటుంది.

మావయ్య నవ్వుతూ టీచరు ట్రైనింగ్ అవగానే 'జమునతో పెళ్ళి నీకేమిటిరా జీవితం వడ్డించిన విస్తరి' అంటాడు. ఇంక వీళ్ళు ఇలాగుంటే క్లాసులో పాఠాలు ఎలా చెపుతారో నీకు తెలుసు. ఆ సాంబశివరావు లెక్కలు చెపుతాడా! గారడీ చేస్తాడా? అన్నట్టుంటాడు. బోర్డుమీద లెక్కరాసి' వచ్చేసిందీ! వచ్చేసిందీ! అంటూ కింద ఆన్సరు వేస్తాడు. లెక్క మధ్యలో మూడొంతుల స్టెప్స్ మింగేస్తాడు.

'మేష్టారు లెక్క పూర్తిగా చెయ్యండీ' అంటే మా ఇంటికి ట్యూషనుకి వచ్చేయ్ అంటాడు. ట్యూషను వెళ్ళగల వాళ్ళు బాగుపడతారు! వెళ్ళలేని వాళ్ళు చెడిపోతారు! ఇంక రెండో లెక్కల లెక్చరర్ కాశీనాధ్ క్లాసుకంటూ వస్తే చాలాబాగా చెపుతాడు. కాని క్లాసుకే రాడు రాత్రి తాగిన మత్తు పొద్దున్నకి విరిగితే ఆరోజు క్లాసు ఉన్నట్టు లేకపోతే లేదు. కాని క్లాసుకంటూ వస్తే ఆ రోజు లెక్కల పండుగే! ఇంక ఫిజిక్స్‌కి వచ్చే ఈశ్వరరావు ఇన్ షర్ట్ చేసి టై కట్టుకుని 'మోస్ట్ అన్ ఫిట్ ఇన్ హిజ్ క్లోత్స్' అన్నట్టుంటాడు.

ఒక్క న్యూటన్స్‌లా చదవడానికి పాతికసార్లు టై టైట్ చేసుకోవలసి వచ్చేది. అప్పుడు గాని అది గొంతులోంచి బైటకి వచ్చేది కాదు.

వచ్చే మాష్టర్లందర్లోనూ, ఇంగ్లీషుకి వచ్చే భాస్కరరావుగారు, తెలుగుకి వచ్చే నరసింహమూర్తి ప్రత్యేకం.. భాస్కరరావుగారి క్లాసు పెద్ద ఇంగ్లీషు డ్రామా జరుగుతున్నట్టుగా ఉండేది. పాఠం మరిచి ఆయనలో నటుడ్ని చూసి ఆనందించేవాళ్ళం. నరసింహమూర్తి క్లాసు శృంగార భరితంగా, ఎంతో ఇంట్రస్టింగ్ గా ఉండేది.

'వీళ్ళందరివల్లా నా అవసరం ఏమిటో నేను మర్చిపోయాను. నా అవసరం పాఠం చదివి, తెలుసుకుని మార్కులు తెచ్చుకోడమే అన్న విషయం నాకు తట్టలేదు' అన్నా.. అలా అనడమే కాదు నాకేదో అన్యాయం జరిగిపోతోందన్నట్టుగా, రాజగోపాల్ నా చదువు గురించి అడిగే ప్రశ్నల్ని తట్టుకోలేక వాడితో పరిచయం తగ్గించి, మూర్తితో పరిచయం పెంచుకున్నాను.

మూర్తి నన్నూ, అత్తనీ కలిపి చేసే సెక్స్ కామెంట్సు నాకు సుఖాన్నిచ్చేవి. 'పుస్తకాలేనా సెప్టి చేసేది. కాస్త నీ యవ్వనాన్ని కూడా పంచు ఆనందిస్తుంది.' అనేవాడు.

నేనేం సమాధానం చెప్పేవాడిని కాదు. నవ్వేసి ఊరుకునేవాడిని కాని నా చూపు మారిందన్న సంగతి నాకూ అత్తకీ కూడా అర్థం అయింది. అందుకే నేను ఎదురవగానే అవసరం ఉన్నా లేకపోయినా పైట సరిచేసుకునేది. పని చేసుకుంటూ నన్ను వోరగా చూసేది. ఇవన్నీ మూర్తికి చెపితే, మూర్తి నవ్వేవాడు. 'నువ్వు ధైర్యం చేస్తావని మీ అత్త ఎదురుచూస్తోందోయ్' అనేవాడు.

'అంటే?' అన్నాను.

'ఇన్ని పుస్తకాలు చదివావు ఇంకా జ్ఞానం రాలేదా? నువ్వు కూడా మీ అత్త అంటే ఇష్టం ఉన్నట్టు ప్రవర్తించు' అన్నాడు నవ్వుతూ.

మూర్తికి చెప్పలేదు కాని, నే మసులుతున్న విధం అదే అప్పుడప్పుడు చేతులు తగిలించడం. చూపుల్లో చూపు పెట్టి చూడడం, ఏ విషయం చెప్పాలన్నా భుజం మీద తట్టో, వెనకనుంది తట్టో చెప్పడం చేస్తున్నాను. స్పర్శానుభూతి పొందుతున్నా, ఇంతకన్నా ఏం చెయ్యడానికీ ధైర్యం చాలడం లేదు.

కాని నా ధైర్యాన్ని పెంపొందించడానికా అన్నట్టు.. అత్త ఒకరోజు 'చిన్నా బ్రా తీసుకొస్తావా' అంది. నేను ఆశ్చర్యపోయి 'వూ' అని చెప్పి డబ్బు తీసుకున్నా, రెడీమేడ్ బట్టల షాపుకెళ్ళి 'బ్రా ఇమ్మన్నా' వాడు 'ఏ సైజు' అని అడిగాడు. నాకేం చెప్పాలో అర్థం కాలేదు.

షాపువాడు నా కన్ఫ్యూజన్ అర్థం చేసుకు 'వయసెంత' అని అడిగాడు.

'ముప్పై ఏళ్ళు' అన్నా...

ముప్పై ఒకటి, ముప్పై రెండు, ముప్పై మూడు అంటూ ఏదో బ్రా తీసి ఇచ్చాడు. వాడు చెప్పిన సైజులు నాకు అర్థం కాలేదు. కానీ ఆ బ్రా తీసుకొచ్చి అత్తకి ఇచ్చా...

ఆ సాయంత్రం అత్త 'నువ్వు తెచ్చిన సైజు బ్రా సరిపోలేదు చిన్నా' అంది.

'మరి నువ్వు సైజెంతో చెప్పలేదు కదా?' అన్నా గడుసుగా...

'రోజూ దొంగ చూపులు చూస్తావు ఆ మాత్రం తెలీదా?' అంది నవ్వుతూ.

నా దొంగతనం దొరికినంతగా ఫీలయాను. ఇదే విషయాన్ని మూర్తితో చెప్పా ... మూర్తి నవ్వుతూ, తాడు పట్టుకుని కొలవవల్సింది. అన్నాడు. ఆ క్షణంలో నా బుర్రలో మెరుపు మెరిసింది. ఆ మెరుపులో నన్ను నేను కంట్రోలు చేసుకోలేకపోయాను. నాలో ఏదో నమ్మకం, విశ్వాసం భ్రమలు రేపింది. నేను నా కలల్లో విహరిస్తుండగానే ఓ రోజు రాత్రి ఎనిమిది గంటలకి భోజనం చేసి సెకండ్ షో సినిమాకి వెళ్ళిపోయాడు మావయ్య, అది జులై నెల అవడం వల్ల సమ్మర్ వేడింకా విశాఖపట్నాన్ని వదిలిపోలేదు. ఇంట్లో అందరూ పడుకోవడానికి డాబా ఎక్కేసారు.

అత్తకిందని పని చేసుకుంటోంది. నేను అత్త వెనకాలే ఏవో పొల్లు కబుర్లు చెబుతూ తచ్చాడుతున్నా... ఏదో చెయ్యాలి... అసహనం.. ఉద్వేగం... అత్తకి నా కోర్కె తెలియచెప్పాలి! ఎలా?

వెనకే తిరుగుతున్న నేను, అత్త కిందకి వంగినప్పుడు.. జాకెట్లో చెయ్యిపెట్టి వొడిసి పట్టుకున్నా. నేననుకున్నట్టు ఏం జరగలా, అత్త చిర్నవ్వు నవ్వలా.. నన్ను దగ్గరగా.. తీసుకు ముద్దులు కుడవలా!.. నా చెయ్యి బయటకి నెట్టేసింది.. 'జమునా' అంటూ కేక పెట్టింది.. జమున కిందకి దిగి వచ్చింది.. జమున రాగానే అత్త తన పనిలో మునిగిపోయింది.

నేనక్కడినుంచి కదల్లేకపోయా... చేసినపనికి గిల్టీ ఫీలింగ్‌తో మెదడు మొద్దుబారిపోయింది.. సెక్స్ డ్రీమ్స్ అన్నీ కల్లలుగా మారిపోడం తట్టుకోలేకపోయాను.

ఏం చెయ్యాలి?.. కిం కర్తవ్యం?... అత్త రుజు మార్గంలో కెళ్ళి.. నన్ను వక్రం లోకి నెట్టేసింది. భ్రమ.. ఎందుకింత భ్రమ పడ్డాను?... ఓటమి ఒప్పుకోబుద్ది వేయలేదు. అందుకే అక్కడ కాసేపు తచ్చాడి, మేడమీదకి వెళ్ళిపోయా... ఆ రాత్రి నిద్రపట్టలా.. మర్నాడు ఈ విషయం మూర్తికి చెప్పలేదు.

✡✡✡

ఆ సంఘటన తర్వాత నేను అత్త దగ్గరకు పోలేదు. అత్తకూడా నా దగ్గరకు పుస్తకాలకోసం రాలేదు. ఈ పుస్తకాల్లో, కథల్లో వంచన ఎంతగా మనసుని భ్రమ పెట్టాయో అర్థం అయింది. నా స్వభావ విరుద్ధంగా ప్రవర్తించి, అవమానం పాలయాననిపించింది.

అత్త ఈ విషయాన్ని మావయ్యతో చెప్పింది అనుకుంటా, మావయ్య నన్ను అదోలా చూసాడు ఏ గొడవా చెయ్యలేదు. ఈ అవమానంతో నేను మూర్తికి దూరంగా ఉండడం మొదలు పెట్టా, సెప్టెంబరులో ఇంటర్ ఫస్టియర్ పాసయాను. కాని శ్రమ ఎక్కువ అవడం వల్ల, సరైన ఆహారం లేకపోవడం వల్ల టైఫాయిడ్ జ్వరం వచ్చింది, కొన్నాళ్ళకి తగ్గి మళ్ళీ వచ్చింది. డబుల్ టైఫాయిడ్ వల్ల ప్రాక్టికల్స్‌కి వెళ్ళక సరిగ్గా చదవక ఇంటర్ సెకండ్ ఇయర్ పోయింది. చదువు కంటిన్యూ చేయలేక ఆ ఏడాది ఇంట్లో ఉండిపోవలసి వచ్చింది.

✡✡✡

రోజూ ఇంట్లో అత్త ముఖాముఖీగా ఎదురవడం, అత్త చూపులో కనిపించే నిరసన భావం, నన్ను అనేక ఆలోచనల్లో పడేసింది. అత్తలో అకస్మాత్ పాతివ్రత్యం భరించలేక పగలల్లా ఎక్కడేనా గడపవలసివచ్చేది.

అలాకాలం వెళ్ళబుచ్చడానికి ఎన్నుకున్న చోటు సెంట్రల్ లైబ్రరీ అవడం నా అదృష్టం. అత్త చేసిన అవమానం వల్ల, లైబ్రరీ పుస్తకాల మధ్య మంచి రచయితల భావపరంపరలవల్ల అంతవరకూ నాలో విరిసిన తనూ జిజ్ఞాస, కోర్కె తగ్గిపోయి, మనో జిజ్ఞాస పెరిగి మంచి పుస్తకాల కోసం వెదకడం మొదలు పెట్టాను... మంచి పుస్తకాలు ఏవి? ఎలావుంటాయి? అన్నది తెలీదు. ఏ పుస్తకం మనసులో చాలాకాలం గూడుకట్టుకు నిలుచుండి మనసుని నిలేసి మధిస్తుందో, అవన్నీ మంచి పుస్తకాలే అన్న అభిప్రాయం ఏర్పడింది.

అలాంటి పుస్తకాలలో గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర' మొదటిది. ఆ నవలలో ఏదో సహజత్వానికి అందని లాజిక్ ఉంది. అదేమిటో అర్థం కాలేదు! దానిలాగే బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' నవలలో మనిషి స్వభావాల్లో కల సీక్రెసి ఒక పట్టాన హరాయింపుకి రాలేదు.

శ్రీ శ్రీ 'మహాప్రస్థానం', తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' చలం నవలలు, నా మనసులో చీకటి కోణాన్ని ప్రకాశవంతం చేశాయి. ఆ సమయంలోనే మూర్తి స్నేహం తగ్గిపోవడం, మళ్ళీ రాజగోపాల్‌తో స్నేహం చిగురించింది.

అప్పటికి రాజగోపాల్ బి.ఇ మూడో సంవత్సరం చదువుతున్నాడు. వీడో విచిత్రమయిన మనిషి! ఏడాదిలో పదినెలలూ సినిమాలు చూస్తూ, నవలలు చదువుతూ ఆనందంగా గడుపుతాడు పరీక్షల ముందు రెండు నెలలూ బిర్రబిగుసుకు పోతాడు, ఎవరెళ్ళినా మాట్లాడడు. పుస్తకాల ముందునుండి కదలడు. పరీక్షలయాక 'ఎలారాసావురా? అంటే 'అరవై నాలుగు పర్సెంటు రావచ్చు' అనేవాడు. వాడనుకున్నంతా వచ్చేది. అది నాకు ఆశ్చర్యంగా ఉండేది. కాని వాడే నాలో ఉన్న ఆత్మ వంచన నుండి విముక్తి కలిగించాడు.

రాజగోపాల్ తో స్నేహం అంటే సాయంకాలం బీచి, బీచిలో పాటలు, రాత్రి ఎనిమిది గంటలవరకూ రీడింగ్ రూము జంక్షన్‌లో, ఆ రోజు చదివిన నవల గురించి చర్చ, నిత్యకార్యక్రమాన్ని పాటిస్తూ, నేను లైబ్రరీలో సగం పుస్తకాలకి పైగా చదివేసాను.

✡✡✡

## 7

**ఆ రోజు సాయంకాలం రాజగోపాల్‌తో బీచికి వెళ్ళా....**బీచిలో దూరంగా కూర్చున్నాక రాజగోపాల్ నవ్వుతూ 'ఒరేయ్ నీలాంటి వాడికోసం ఓపాటవుందిరా' అన్నాడు.

'ఏమిటా పాట?' అనడిగా...

'అయ్యయ్యో చేతిలో డబ్బులుపోయెనే, జేబులు కాళీ ఆయనే. ' అంటూ పాడ్డం మొదలుపెట్టాడు.

'నేను పేకాట అడ్డం మానేసాను.' అన్నాను సీరియస్‌గా.

'డోంట్ డిస్కరేజ్..' అని 'గెలుపువోటములు దైవాధీనం చెయ్యితిరగవచ్చు, మళ్ళీ ఆడి గెల్వవచ్చు, ఇల్లు కుదవపెట్టవచ్చు...'

'నేను పేకాట అడ్డం మానేసాను.' అన్నాను సీరియస్‌గా.

'డోంట్ డిస్కరేజ్...'

'నేను పేకాటమానేసానని చెప్పానా?' అన్నాను నేను స్వరం పెంచి.

'తప్పు అలా మానేయకు అని అంటూ' ఛాన్సు తగిలితే ఈ దెబ్బతో నీ కరువు తీరవచ్చు. పోతే! అనుభవమ్ము వచ్చు, చివరికి జోలిపట్టవచ్చు.... అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే, జేబులు కాళీ ఆయనే 'అంటూ పాడాడు.

వాడు పాట పాడుకుంటే పాడుకున్నాడులే అని నేను మౌనంగా ఊరుకున్నాను. పాట అయిపోయాక వాడు నవ్వుతూ 'నీ గురించి పాడలేదురా, తెలుగులో సరదా పాటలు చాలావున్నాయి. అంటూ.. 'భలే ఛాన్సులే లలలాం లలలాం లక్కీ ఛాన్సులే' అంటూ ఇల్లరికంలో పాటపాడాడు.

మాధవపెద్దిలా గొంతుమార్చి వాడు పాడిన చరణం 'జుత్తుపట్టుకుని పైకి ఈడ్చినా, చూరుపట్టుకుని వేలాడి ధూషణ భూషణ తిరస్కారములు, ఆశీస్సులుగా తలచేవాడికి, ఇల్లరికంలో ఉన్న మజా, అనుభవంలోకి రాకమానదు' అనిపించింది.

నేనీ పాట నెమరువేసుకుంటుంగా మిస్సమ్మ సినిమాలో రేలంగి పాడిన పాట ఎత్తుకున్నాడు. 'ధర్మం చెయ్ బాబు ధర్మం చెయ్ బాబు' అంటూ పాడాడు.

ఆ పాట చరణంలో ఉన్న వ్యంగ్యం నన్ను ఆలోచనలో ముంచింది. 'కోటి విద్యలూ కూటికోసమే పూట గడవని ముష్టి జీవితం... పాటుపడిన ఏపని రాదాయే, సాటి మనిషిని చావనబాబూ' అన్న చరణమే కాకుండా.... అడుక్కోడంలో అందమైన ఆత్మవంచన్ని చూపిస్తూ కవి 'నీ చెయ్ పైనా నా చెయ్ కింద, ఇచ్చి పుచ్చుకును రుణమే బాబూ' అంటాడు. తెలుగు పాటల్లో ఉన్న రుచంతా, అతి సామాన్యమైన ఆ పదాల్లోనూ సంగీతంలోనూ ఉంది.

నేను పాత పాటల గురించి ఆలోచిస్తుండగా, రాజ్ గోపాల్‌కి పొలమారింది. పాట ఆపేసి 'పోదాం పద' అంటూ లేచాడు. ఇసకలోనే నడుస్తూ కె.జి.హెచ్ జంక్షన్‌కి చేరుకున్నాం. కె.జి.హెచ్ దగ్గర బస్సు ఎక్కి, రీడింగ్ రూము దగ్గర దిగాం. ఇద్దరం ఏదో పుస్తకం గురించి మాట్లాడుతూ చాలా సేపు రీడింగ్ రూము జంక్షన్‌లో నిలబడ్డాం. ఏదో విషయం మాట్లాడుతున్న రాజగోపాల్ అకస్మాత్తుగా

'ఏరా ఈ ఏడాది పూర్తిగా ఖాళీయేనా?' అనడిగాడు.

'ఊ' అన్నా ముభావంగా....

'ఇంటర్ పూర్తిచేయవా?'

'ఇంటర్ పూర్తి చేస్తా'. అన్నాను దృఢంగా.

'అసలు నువ్వు పరీక్షలు ఎందుకు ఫెయిల్ అవుతున్నావు?'

'ఇంట్లో చదువుకోడానికి సరయిన వాతావరణం ఉండదు. నేను చదువుదామనుకునే సరికి, మావయ్య లైటార్పేసి, 'పడుకో పగలంతా తిరుగుతావు. వెధవ నవలలూ అవీ చదువుతావు. రాత్రయేసరికి నిద్రపోనివ్వకుండా లైట్లేసుకు కూర్చుంటావు.' అంటూ విసుక్కుంటాడు. అమ్మ ఎటూ చెప్పదు, పగలు చదవడానికి ఇల్లంతా గోలగా ఉంటుంది. ఇంట్లో అద్దెకున్నవాళ్ళని ఏం అనలేం కదా.... '

'నువు హాస్టలికి వెళ్ళి చదువుకో' సలహా.

'ఇప్పుడే ఇల్లు గడవడం కష్టంగా ఉంది. ఇంక హాస్టల్లో ఉండడానికి డబ్బెవరిస్తారు?'

నే చెప్పిన సమాధానం రాజగోపాల్‌కి నచ్చలేదు. చుట్టూ చూసాడు గుప్తా బ్రదర్స్ అరుగుమీద కూచున్నాడు. నేనూ వెనకాలే వెళ్ళి, వాడిపక్కనే కూర్చున్నాను.

'చిన్నా నే చెప్పింది నీ బుర్రకి ఎక్కలేదు క్లియర్‌గా చెపుతా.. విను. ఇలా పరిస్థితుల్ని తిట్టుకుంటూ. అది కుదరదు ఇది కుదరదు, అంటూ కూర్చుంటే జీవితం ఏదోలా నెట్టుకురావచ్చు. కాని నువ్వనుకున్నట్టు నెట్టుకు రాలేవు. అది నీకు తృప్తి ఇవ్వదు. నీ జీవితం నీ చేతుల్లో ఉంది. లేదా ఉండాలి. దాన్ని నువ్వే మలచుకోవాలి. ఆ విషయంలో నువ్వు ఎవర్ని ఎదిరించవలసివచ్చినా వెనుదీయకు. నిన్ను మీ వాళ్ళు ఎందుకూ పనికి రానివాడికింద జమ చేసి ఉంటారు.

నువ్వు చెప్పిన లాజికి విని 'ఔను నిజమే' అని పల్లకీలో తీసుకెళ్ళి హాస్టల్లో చేరుస్తారని అనుకోకు, నువ్వు చదువుకోడానికి ఏ ఆటంకాలు ఉన్నాయని అనుకుంటున్నావో, వాటిని తొలిగించుకో! పరిస్థితులతో సమాధానపడకు. మన వంట మనమే వండుకోవాలి? నువ్వేది మంచి అనుకుంటున్నావో, అది ఆచరించు. అలా ఆచరించడానికి సంకోచించకు! అలా చేయడం స్వార్థం, అంటావేమో, మన చుట్టుపక్కల ఉన్న స్వార్థపరుల దౌర్జన్యానికి గురై అణగదొక్కబడేకన్నా, వాళ్ళతో ఘర్షించి, మనదీ అంటూ మనం నిర్మించుకున్న జీవితం మనకి కావాలి! నేనేదో చెప్పేనని కాకుండా నీకుగా నువ్వు ఆలోచించుకో!

ప్రస్తుతం నీలో ఉన్న లోపాలు ఏమిటి? దానివల్ల నువ్వు ఏం నష్టబోతున్నావు. ఆ నష్టాన్ని పూరించాలంటే నువ్వేం చెయ్యాలో, నువ్వే నిర్ణయించుకో! నీ సమస్యని ఎలా పరిష్కరించుకోవాలో నేను చెపితే, అది హైపొథిటికల్ సొల్యూషన్ అవుతుంది. నీ సమస్యని నువ్వే పరిష్కరించుకో. దానికోసం, నువ్వు మీ అమ్మగార్ని ఎదిరించాల్సివచ్చినా, మేల్కోలేదనుకో నువ్వు జీవితంలో నష్టపోతావు ఆలోచించు' అన్నాడు ఏకధాటిగా

అప్పటికి రాత్రి పది అయింది. నా మనసు కూడా ప్రస్తుతం ఇంట్లో పరిస్థితులని ఎలా మార్చాలా? దానికోసం ఏం చెయాలా? అన్న ఆలోచనల్లో ఉంది. రాజగోపాల్ చెప్పిన ప్రతీ మాటా నా హృదయాన్ని బలంగా తాకి నన్ను కార్యోన్ముఖుడ్ని చేస్తుందని ఆ రోజు అనుకోలేదు.

'చిన్నా నీకో పుస్తకం ఇస్తాను చదువు భాష కఠినంగా ఉందని పక్కకి పెట్టకు. పూర్తిగా చదువు' అంటూ వాళ్ళింటికి తీసుకెళ్ళాడు. తలుపు తట్టగానే వాళ్ళ అమ్మగారు వచ్చి తలుపు తీసారు.

'ఇంత అర్థరాత్రి వరకూ ఎక్కడ తిరుగుతున్నావు' అని దబాయించారు. వాడు దానికి సమాధానం చెప్పకుండా 'అమ్మా తలుపెయ్యకు చిన్నాకి పుస్తకం ఇవ్వాలి' అంటూ లోపలికి వెళ్ళాడు. అంతవరకూ చీకటిలో నన్ను గమనించని ఆవిడ, నన్ను చూసి 'నువ్వూ వీడితో రోడ్లమీద తిరుగుతున్నావా? బాగానే ఉంది స్నేహం' అంటూ లోపలికి వెళ్ళిపోయింది. రాజగోపాల్ గాబరాగా బైటకి వచ్చి నాకో పుస్తకం ఇచ్చి, మళ్ళీ లోపల దూరి తలుపేసుకున్నాడూ.

రాజగోపాల్ ఇంటి నుండి రోడ్డుమీదకి వచ్చి తిన్నగా ఇంటికి వెళ్ళాను. నేను తలుపు తట్టిన అరగంటకి అత్త తలుపు తీసింది. జుత్తంతా రేగివుంది. పైట ఎదమీద కప్పివున్నా జాకెట్టు బటన్స్ ఊడున్నాయి. నేను లోపలికి వెళ్ళి అమ్మని లేపా.... అమ్మ విసుక్కుంటూ లేచి అన్నం పెట్టింది. భోజనం చేసి, పక్క మీదకు చేరాను.

రాజగోపాల్ చెప్పినట్టు 'సైన్సులో సైన్సు సూత్రాలు కనుగొన్నవారు ఎలావుంటారో అంటే న్యూటన్, ఆర్కిమెడిస్, షోక్స్ వీరు ప్రతిదాన్ని ప్రత్యేక దృష్టితో చూసి సూత్రీకరించి మనకి సూత్రాల్ని అందిస్తారు. మనం వాటిని ఉపయోగిస్తాం, కొందరు ఆ సూత్రాలని బాగా ఆకళింపు చేస్తుకుంటారు, వాళ్ళని మనం తెలివైనవారంటాం! సూత్రాల్ని కనుగొన్న వాళ్ళని జీనియస్‌లంటాం. అలాగే తెలుగు సాహిత్యంలో విశ్వనాథ, శ్రీ శ్రీ చలం, గోపీచంద్, బుచ్చిబాబు కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి, సూత్రాలని సృష్టించిన జీనియస్‌లు. వీళ్ళని, వీరి భావాల్ని ఏవో రంగుల స్కేళ్ళతో కొలవాలని ప్రయత్నించడం మన ప్రారబ్ధం రంగుస్కేళ్ళ, రంగులు మారతాయిగాని, వీళ్ళ భావ పరంపర అందించిన నూతనత్వం మాత్రం మారదు!

రాజగోపాల్ చెప్పిన విషయాలోచనలతో... అలసిన శరీరానికి నిద్రపట్టింది.

✡✡✡

నేను నిర్ణయానికి వచ్చి..., ప్రస్తుత ఇంటి పరిస్థితిని ఆకళింపు చేసుకునేటప్పటికి డిసెంబరు నెల వచ్చేసింది. నేను హాస్టల్లో జాయిన్ అయి, ఇంటరు సెకెండ్ ఇయర్ పూర్తి చెయ్యడానికి, నిర్ణయించుకున్నా!

నేను హాస్టల్లో జూలైలో జాయిన్ అవాలి! దానికి అయే ఖర్చులు అమ్మని భరించమని చెప్పాలి. అలాగే చెప్పాను. ఏ తల్లైనా రెండుసార్లు పరీక్షపోగొట్టుకున్న కొడుకుని 'ఈ ఏడాది చదివి ఫస్టుక్లాసు తెచ్చుకుని, ఇంజినీరింగ్ సీటు తెచ్చుకుంటాను' అంటే నమ్ముతుందా? నమ్మలేదు సరికదా. 'ఎందుకు దానికయే డబ్బు దండగ, మావయ్య ఏదో ఉద్యోగం చూస్తాడు అందులో చేరు. నీ సరదాలకి సరిపోయేంత అద్దెలు రావడంలేదు' అంది.

'ఈ ఏడాది హాస్టల్లో జాయిన్ అయి చదువుతాను. ఒకవేళ పరీక్షపోతే ఉదోగంలో జాయిన్ అవుతాను. బి.కాంలు బి.యస్సీలు చదవులే' అని నమ్మకంగా చెప్పా...

'హాస్టలు కెంతవుతుందేమీటి?' అంది ఆఖరికి నమ్మకం కుదిరీ కుదరక.

'హాస్టలుకి నెలకి నూట పాతిక బిల్లవుతుంది. వో పాతిక నా ఖర్చులకి ఉండాలి' అన్నా...

అప్పటి ఇంటి పరిస్థితులబట్టి, అలా నూటయాభై ఎత్తి ఇవ్వడం కష్టం అది నాకూ తెలుసు! ఇంటి అద్దెల ఆదాయం నూట డెబ్బై అయిదు, మేడమీద వాటా పెద్దది దానికి నూరు రూపాయలు అద్దె వస్తుంది. మేడమీదే మరో చిన్న వాటా ఉంది. దానికి యాభైరూపాయలు వస్తుంది. క్రిందని మూడు వాటాలున్నాయి. ఒక వాటా చాలా చిన్నది. ఒక గది వంటిల్లు మాత్రమే దానికి పాతిక రూపాయల అద్దెవస్తుంది. ఒక వాటాలో బావ ఉంటున్నాడు. మామ్మ పోయాక మామ్మగది మరో చిన్న రెండు గదులు బావ వచ్చి అద్దెకి

ఉంటానంటే 'సరే' అంది అమ్మ. బావ మొదట్లో అద్దెగా ముప్పై రూపాయలు ఇచ్చేవాడు. ప్రస్తుతం అది కూడా ఇవ్వడం లేదు. ఇంక మేముంటున్న వాటా, వాటా అయితే పెద్దదే మావయ్య వచ్చాక ఇరుకు అయిపోయింది. దాదాపు వాటాని రెండు భాగాలు చేసాడు. మావయ్యకి ఇష్టం వచ్చినట్టు వాడుకుంటున్నాడు.

అమ్మకి ఆదాయం నుట డెబ్బై అయిదు అయినా ఇటు మావయ్య అటు బావ వాళ్ళకి ఏది తక్కువైనా అమ్మ దగ్గర నుండి, తీసుకువెళ్ళిపోతారు. మొదట్లో బావ అంత ఎక్కువ చొరవ చూపించకపోయినా, మావయ్య ఇంట్లో మకాం పెట్టిన దగ్గర్నించీ, బావ చొరవ చూపించే విధానం ఎక్కువైపోయింది. ఇంటి అద్దె ఇవ్వడం మానేసాడు. నెలాఖరకి ఇంట్లోంచి, బియ్యం దినుసులు ఏమి తమ ఇంట్లో తక్కువైతే అవి అడగకుండా పట్టుకుపోయేవాడు. అమ్మ గదమాయిస్తే మా మేనమామ ఆర్జించిన దానికి, ఆ మాత్రం హక్కుదారుడ్ని కానా అనేవాడు నవ్వుతూ, వీళ్ళ పోటీవల్ల మధ్యలో మాట తక్కువైపోయేది. దాంతో అమ్మ తన మెడలో గొలుసు తాకట్టు పెట్టి అప్పు తెచ్చేది. మరుసటి నెల అద్దెలు రాగానే అప్పు తీర్చేది.దానివల్ల నా అవసరాలు ఏవీ తీరేవికావు.

ఇప్పుడు అమ్మకి మూడువందల ఆదాయం చూపించాలి.! అందులో నుటయాభై నేను పట్టుకెళ్ళాలి అమ్మకి నూటయాభై వదిలేయాలి. మేడమీద అద్దెకున్న వాళ్ళని అద్దెపెంచమంటే వాళ్ళు అద్దె పెంచుతారు కాని అద్దె ఏ పదో ఇరవైయ్యో పెంచుతారు. అంతకన్నా ఎక్కువ పెంచే అవకాశం నాకూ లేదు. పెంచవలసిన అవసరం వాళ్ళకి లేదు.

ఇకపోతే బావ ఉన్న వాటా, ఆ వాటాకి అద్దె బావ ఇస్తానన్న అద్దెకన్నా ఎక్కువ వస్తుంది. ఆ ఎక్కువ అద్దె బావ ఇవ్వడు. ఎందుకంటే ప్రస్తుతం ఈ అద్దే ఇవ్వడంలేదు. బావని అద్దె పెంచమనడం దండుగ. ఇల్లు ఖాళీ చేయించి ఇంకొకళ్ళకి అద్దెకి ఇవ్వాలి. ఖాళీ చెయ్యడానికి బావ ఒప్పుకోకవచ్చు. నేను బావని ఖాళీ చెయ్యమంటే బావ గొడవ చేస్తాడు. దానికి దస్తావేజుల మావయ్య మద్దతువుంటుంది.

ఎందుకంటే బావ తర్వాత ఈ ఇంటినుంచి ఉద్వాసనా క్రమంలో తనవంతే వస్తుందని మావయ్య అంచనా వేస్తాడు! కాబట్టి మావయ్యని, బావని ఒకేసారి టాకిల్ చెయ్యకూడదు. బావ విషయం పూర్తిగా తేలేవరకూ మావయ్యతో మాట్లాడకూడదు. దాంతో మావయ్యకి ఏం చెయ్యాలో అర్థంకాక, తటస్థంగా ఉంటాడు. వీళ్ళతో జాగ్రత్తగా వ్యవహరించాలి, అనుకున్నాను.

చాలా తర్జబర్జనలు పడిన తర్వాత, కార్యక్రమానికి రూపం ఇవ్వాలని అమ్మతో 'బావని ఇల్లు ఖాళీ చెయ్యమని చెప్పు' అన్నాను. అమ్మ 'నాదేముంది నువ్వే చెప్పు' అంది. ఇక్కడ నా కర్థం అయిందేమిటంటే ఇష్టంలేనిపని ఎవరిచేతా చేయించలేం....

మర్నాడు అమ్మ పిలుస్తోందని బావని పిలిపించాను. బావ వచ్చాడు అమ్మ ఏ విషయం మాట్లాడలేదు. నేను కూడా ఉపోద్ఘాతాలూ, వివరణలూ, ఏమీలేకుండా బావతో 'నువ్వు ఇల్లు ఖాళీ చెయ్యి, నీకు నేను రెండు నెలలు టైము ఇస్తున్నాను' అన్నాను.

బావ డంగైపోయాడు అమ్మవేపు చూసాడు. అమ్మేం మాట్లాడలేదు. కోపంగా నావైపు చూసి 'నువ్వెవడివిరా నన్ను ఇల్లు ఖాళీ చెయ్యమనడానికి, నీ దిక్కున్నచోట చెప్పుకో, నేను కాళీ చెయ్యను.' అన్నాను అక్కడనుండి వెళ్ళిపోయాడు.

తన ఎదురుగా చెడ్డీలేసుకు తిరిగిన నేను తనని ఇల్లు ఖాళీ చెయ్యమని ఆర్డర్లు వేయడం బావకి నచ్చలేదు.

✡✡✡

బావని ఇల్లు ఖాళీ చెయమని చెప్పింతర్వాత నేను బావతో మాట్లాడలేదు. ఇంటి వాతావరణంలో పెద్ద మార్పూ రాలేదు. బావ ఇంకో ఇల్లు వెదుక్కుంటున్న లక్షణాలు కనిపించలేదు. నేను ఇల్లు ఖాళీ చెయ్యమని బావకిచ్చిన గడువుకి ఇంకా పదిరోజులుండనగా, బావ మనసులో ఏముందో తెలుసుకుందామని, బావ ఇంట్లో వున్న సమయం చూసి, ఆ వాటాలోకి వెళ్ళి 'నువ్వు ఇల్లు ఖాళీ చెయ్యడానికి ఇంకా పదిరోజులేటైముంది' అన్నాను.

'నేను ఖాళీ చెయ్యను. ఏం చేస్తావురా నీదిక్కున్నచోట చెప్పుకో' అన్నాడు బావ.

'నువ్వు పదిరోజుల తర్వాత ఇల్లు ఖాళీ చెయ్యకపోతే, నీ సామానంతా రోడ్డుమీదకి విసిరేస్తాను. జాగ్రత్త'అన్నాను.

'నువ్వు సామాను మీద చెయ్యివేస్తే నీ చెయ్యి పచ్చడి చేసేస్తాను' అన్నాడు బావ కోపంగా.

అప్పుడే అత్తయ్య కలుగచేసుకుంది. 'ఒరేయ్ నువ్వుండు వీడేం చెయ్యగలడుగాని అన్నయ్యతో చెపుదాం... వాడే వీడి తిక్క కుదురుస్తాడు.' అంది అత్తయ్య.

అత్తయ్య రిఫర్ చేసిన అన్నయ్య మా నాన్నగారికి తమ్ముడవుతాడు. నాకు చిన్నాన్న. ఎదుటివాళ్ళ కష్టసుఖాలు కాని, బంధుత్వాలు కాని అక్కర్లేని స్వార్ధజీవి. అలాంటివాడు నాకు మాట సాయం చేస్తాడంటే నాకు నమ్మకం లేదు. తద్దినాలకీ ఇంట్లో జరిగే కార్యక్రమాలకి, వంటలోనూ, మిగతాపనుల్లోనూ, సహాయకారిగా ఉన్న అత్తయ్య వేపే కొమ్ముకాస్తాడు. ఆ విషయం అత్తయ్యకి తెలుసు.

✡ ✡ ✡

ఆ విధంగా అన్నయ్య పెద్దరికపు భ్రమతో అత్తయ్య, ఆ భ్రమలని తొలగించాలనే ధ్రుడనిశ్చయంతో నేనూ చిన్నాన్న ఇంటి దగ్గర సమావేశమయ్యాం.

అమ్మ నోరు తెరచి 'వస్తున్న ఇంటి అద్దెలు సరిపోడం లేదు. చిన్నా చదువు ముఖ్యం, వాడి చదువు అస్తవ్యస్తం అవడానికి ఆర్ధిక పరిస్థితులు కూడా కారణం. బావ ఇంటి అద్దె సరిగా ఇవ్వడంలేదు' అని చెప్పి ఉంటే సమస్య మూడొంతులు తీరిపోను. చిన్నాన్నకి అమ్మ అంటే గౌరవం, బావ పంతం వీగిపోను.... బావకి ఉద్వాసన కార్యక్రమం సజావుగా సాగిపోను, కాని నేను వెళ్ళేసరికి, చిన్నాన్న, బావ, అత్తయ్య, అమ్మకి పరిస్థితిని ఏ విధంగా వివరించారో తెలీదుగాని అమ్మ 'నాదేం ఉంది వాడు ఖాళీ చెయ్యమంటున్నాడు' అంది.

అమ్మ గోడమీది పిల్లివాటం. అత్తయ్యకి చిన్నాన్నకి ఇంకోలా అర్ధం అయింది. అందుకే నే వెళ్ళగానే చిన్నాన్న 'ఏరా వాడిని ఖాళీ చెయ్యమంటున్నావట ఎందుకు? అని అడిగాడు. ఆ గొంతులో 'ఓరి కుర్రకుంకా నువ్వు చెప్పినంత మాత్రాన వాడు కాళీ చేస్తాడా?' అన్న వెటకారం ఉంది. నేనా వెటకారాన్ని పట్టించుకోలేదు సౌమ్యంగా ' ఖాళీ చెయ్యమన్నాను రెండు నెలల టైము ఇచ్చాను' అన్నాను. మిగతా వాళ్ళని కూడా ఖాళీ చెయ్యమన్నావా? చిన్నాన్న ప్రశ్న.

'ఇక్కడికి మిగతా వాళ్ళ విషయం మాట్లాడటానికి రాలేదు' అన్నాను.

'అది సరేలే వాళ్ళని ఎందుకు ఖాళీ చెయ్యమనలేదు' అన్నాడు చిన్నాన్న.

'వాళ్ళు ప్రతీనెల అద్దె ఇస్తున్నారు.' అన్నాను, నేను తప్పు చేసానని నాకు తర్వాత అర్ధం అయింది.

'అంటే బావ అద్దె ఇవ్వడంలేదు అందుకు, ఖాళీ చెయ్యమంటున్నావు.'

నాకేం అనాలో తోచక 'ఊ' అన్నాను.

'సరే ఒరేయ్ వచ్చే నెలనుండి అద్దె సరిగా ఇచ్చెయ్. అద్దె ఇవకపోతే వదినకి కూడా కష్టం కదా' అన్నాడు చిన్నాన్న బావతో,

బావ నవ్వుతూ 'అలాగే వచ్చేనెలనుండి, ఫష్టునాడే అద్దె ఇచ్చేస్తాను' అన్నాడు. ఆ నవ్వులో కపటం స్పష్టంగా కనబడుతోంది.

'అయితే ఇంక సమస్యేలేదు' అన్నాడు చిన్నాన్న నవ్వుతూ

చిన్నాన్న తేలుకొండిలాంటి వాడు ఎలా పొడుస్తాడో తెలీదు. ఈ బంధువులంతా అంతేనేమో? నాకా చిరునవ్వులు చూసి కంపరం ఎత్తింది. నేను చిన్నాన్నని చూస్తూ 'చిన్నాన్నా బావ అద్దె ఇవ్వకపోతే?' అన్నాను.

'ఎందుకివ్వడురా ఇవ్వకపోతే ఇప్పించే పూచీనాది, లేదా నేనిస్తాను' అన్నాడు చిన్నాన్న తేలికగా.

'ఆ పూచీ ఏదో ఇప్పుడే పడు ఏడాది అద్దె నువ్వు ఇచ్చెయ్, బావ దగ్గర నెలనెలా అద్దె నువ్వు వసూలు చేసుకో' అన్నాను.

'ఏం వేళాకోళం ఆడుతున్నావేంటిరా' అన్నాడు చిన్నాన్న కోపంగా

‘అంటే బావ నెలనెలా అద్దె ఇస్తాడన్న నమ్మకం నీకూ లేదన్నమాట!?‘ అన్నాను.

ఆ మాటతో చిన్నాన్న బావతో ‘వీడితో మనకేమిటి నెలనెలా అద్దె వదినకి ఇచ్చెయ్యరా ‘అన్నాడు అక్కడితో ఆ ఇంటి సమావేశం ముగిసింది.

✡✡✡

# 8

**చిన్నాన్న ఇంటి సమావేశంతో** బావ చేత కాళీ చేయించడమే నా ఉద్దేశం అని వాళ్ళకి ఎలా అర్థం అయిందో! కాళీ చెయ్యకూడదన్న వాళ్ళ పంతం కూడా నా కర్థం అయింది.

రెండు నెలలు పూర్తయిన మొదటి తారీకు వచ్చింది. రోజు బావ ఆఫీసునుండి రాగానే శాలరీ నుండి అద్దె చెల్లించేస్తాడు కానీ నాకా అద్దెపుచ్చుకోడం, అలాగే ప్రతి నెలా అద్దె చెల్లిస్తాడనే అమాయకంలో పడడం నాకిష్టం లేదు.

బావ అద్దె విషయం మర్చిపోయి ఘర్షణలో పడాలి అప్పుడే నేననుకున్న లక్ష్యం నెరవేరుతుంది. దానికి నేను బావలో ఉన్న "ఇగో"ని రెచ్చగొట్టాలి ! ఎలాగ? అన్న ఆలోచనలో పడ్డాను.

బావ ఇంటిలో జరిగే కార్యక్రమం నాకు బాగా తెలుసు. బావ ఇంట్లో పదిగంటలకల్లా వంట అయిపోతుంది. బావ భోజనం చేసి ఆఫీసుకి వెళ్ళి పోతాడు. అక్కా పిల్లలూ పదకొండు గంటలకల్లా భోజనం చేసి పడుకుంటారు. ఏ ఒంటిగంటకో లేస్తారు. అక్క మిగతా పనుల్లో మునిగిపోతుంది.

కాని ఆ రోజు బావ భోజనం చేసి ఆఫీసు కెళ్ళిపోగానే, నేను బావ అద్దెకుంటున్న వాటా దగ్గరకి వెళ్ళి.. "అక్కా నేను బావని ఇల్లు కాళీ చెయ్యమన్నాను. ఈ రోజువరకూ చెయ్యలేదు. ఈ రోజుతో గడువుతీరిపోయింది. ఇప్పుడు ఇద్దరు మనుషుల్ని మాట్లాడాను. వాళ్ళొచ్చి సామాన్లు బయట పెట్టేస్తారు." అన్నాను.

"ఆయన లేకుండా నువ్విలా అల్లరి చెయ్యడం బావులేదు చిన్నా" అంది అక్క కొంచెం బెంబేలు పడింది. కొన్ని విషయాల్లో వక్రమార్గం తప్పదు... చిలికిన మజ్జిగలోంచి వెన్న తీయాలంటే వేళ్ళని వంకర చెయ్యక తప్పదు...

"నాకేం తెలీదు నేనిచ్చిన గడువయిపోయింది," అన్నాను.

అక్క ఏం మాట్లాడలేదు. నేనే అక్కని ఇంకా భయం పెట్టాలని "ఏం సర్దాలో అన్నీ సర్దేసి రెడీగా ఉంచు, వాళ్ళొచ్చాక సర్దుకుంటూ కూర్చుంటే కుదరదు" అన్నాను.

అప్పుడు అత్త కలుగచేసుకుని "వీడితో ఏమిటి.. అన్నయ్య దగ్గరకి వెళదాం పద" అని వాళ్ళ వాటాకి తాళం పెట్టి అందరూ చిన్నాన్న ఇంటికి వెళ్ళారు. నేనాశించినట్టే జరగడంతో, నేను రెడీగా ఉంచిన బండ తాళాన్ని, అక్క వేసిన తాళం మీద వేసాను. బావ ఇంటిలోకి వెళ్ళాలంటే, నేవేసిన తాళం బద్దలు కొట్టాలి లేదా గడియ బద్దలు కొట్టాలి దానికి చాలా సమయం తీసుకుంటుంది. దాంతో బావలో పంతం పెరుగుతుంది. అది ఘర్షణకి దారి తీస్తుంది. అదే నాకు కావాలి.

✡✡✡

సాయంకాలం బావ వచ్చి, నన్నూ అమ్మనీ నానా తిట్లు తిట్టాడు. ఆ ఆవేశంలో అద్దె ఇవ్వడం మర్చిపోయాడు. అప్పటికి నేనూ ఘర్షణకి సిద్ధంగా ఉండడం వల్ల కొండల్రావూ, రాజూ, ఇద్దరూ వచ్చి నాకు తోడుగా ఉన్నారు. బావ వెళ్ళి చిన్నాన్నని తీసుకొచ్చాడు చిన్నాన్న "వాడేం చేయగలడు తాళం బద్దలు గొట్టరా" అన్నాడు.

"నువ్వు నా తాళం బద్దలు కొట్టావో, నీ ఇంట్లో ఉన్న వస్తువులన్నీ బద్దలు కొట్టేస్తాను." అన్నా బావతో.... నాదొట్టి వాచాలతే అని నాకు తెలుసు కాని, దాని ప్రభావం బావమీద పడాలన్న ఉద్దేశం నెరవేరింది.

"ఎలా బద్దలు కొడతావురా బద్దలకొట్టి చూపించు." అంటూ నా మీదకు వచ్చాడు బావ.

ఆ సమయంలోనే నాకు, బావకి మధ్యగా వచ్చి, బావ జబ్బ బలంగా పట్టుకున్నాడు కొండల్రావు.

మా అందరిలో కొండల్రావు ప్రత్యేకంగా ఉంటాడు. మేమందరం నాజూగ్గా ఉన్నాం. కాని కొండల్రావు నల్లగా పొడువుగా బలిష్టంగా మా అందరిలోకీ ప్రత్యేకంగా ఉన్నాడు. నేను కృష్ణతో బాక్సింగ్ ప్రాక్టీసుకి వెళ్ళినప్పుడు అక్కడ పరిచయం అయ్యాడు. ఒక ఏడాది ప్రాక్టీసుచేసి నేను బాక్సింగ్ మానేసాను. కాని కొండల్రావు, కృష్ణ కంటిన్యూ చేసారు. ఇద్దరూ మా ఇంటి పక్క వీధిలోనే ఉండడం వల్ల ఇద్దరితో స్నేహం కొనసాగింది. మా అందరిలోకీ కొండల్రావు పెద్దవాడు ఉద్యోగం చేస్తున్నాడు. అందుకే ఘర్షణకి దిగిన బావకి తన పట్టు ఎంత చూపించాలో అంతే చూపించాడు.

కొండల్రావు బావ జబ్బ పట్టుకోగానే, బావ విడిపించుకోడానికి ప్రయత్నించాడు. గింజుకున్నాడు కానీ కుదరలేదు, బావ గింజుకోడం విరమించుకున్నాక, కొండల్రావు బావ జబ్బ పట్టుకునే "అనవసరపు ఘర్షణ ఎందుకండీ?" అన్నాడు. కొండల్రావు బావ జబ్బ పట్టుకున్న విధానంతో కొండల్రావు వ్యవహారం చిన్నాన్నకి అర్థం అయిపోయింది. ఘర్షణ జరిగితే దెబ్బలు తినేది బావే, అన్న విషయం తెలిసిపోయింది.

"ఒరేయ్ పదరా పోలీసు రిపోర్టిద్దాం వన్ టౌన్ పోలీసు ఇన్స్పెక్టరు నాకు తెలుసు" అన్నాడు

బావ చిన్నాన్న ఇద్దరూ వెళ్ళిపోయారు.

నేనూ రాజూ, కొండల్రావు మిగిలాం! అంతవరకూ మౌనంగా ఉన్న కొండల్రావు "మీ చిన్నాన్న నిన్ను భయపెట్టడానికి పోలీసు రిపోర్టు అన్నాడు కాని, మనకి మంచి ఐడియా ఇచ్చాడ్రా చిన్నా" అన్నాడు.

"ఏమిటి?" అనడిగా.. ఆతృతగా .

"వన్ టౌన్ పోలీసు ఇన్స్పెక్టర్ మా కులమే, నాకు బాగా తెలుసు, మేం ఉంటున్న వీధిలోనే ఉంటున్నాడు. రాత్రి ఆయనింటికి వెళదాం" అన్నాడు.

నేను చేసేదేం లేక "సరే" అన్నాను...

నేను బయిటకి వెళుతున్నానని తెలిసి, అమ్మ "ఒరేయ్ పిల్లలు అదీ ఎక్కడికి పోతారు. ఆ తాళం తీసెయ్" అంది.

నేను రెండు నిముషాలు ఆలోచించి, జరిగిన ఘర్షణ వల్ల నేనంత పట్టుదలతో ఉన్నానన్న విషయం చిన్నాన్నకీ బావకీ అర్థం అయింది కాబట్టి ఇంకా తెగేదాకా లాగడం మంచిదికాదని, తాళం తీసేసాను.

రాజు, కొండల్రావుతో కలిసి రోడ్డుమీదకి వెళ్ళిపోయాను.

✡ ✡ ✡

రాత్రి ఎనిమిది గంటలకి ఇన్స్పెక్టర్ ఇంటికి వెళ్ళాం. కొండల్రావు ఆయన దగ్గర తెగవినయం ఒలకపోసాడు. నేనూ దీనంగా మొహం పెట్టా.. ఆ మాత్రం నటన అవసరం అనిపించింది. నమస్కారాలూ, పరిచయాలూ అయాక కొండల్రావు తెలివిగా, "మా ఇంట్లో ఒక టెనెంట్ ఉన్నాడని, ఇంటి అద్దె ఇవ్వక, ఇల్లూ ఖాళీ చెయ్యక, మా అమ్మని అల్లరి పెడుతున్నాడని, ఆ ఇంటిలో ఉన్నది నేనూ

అమ్మేనని, ఇంకెవరూ ఆసరాగా లేరని, ఇంట్లో అద్దెకున్న మిగతా అద్దెలవాళ్ళు పెద్ద సహాయంగా ఉండడం లేదని అతన్ని ఇల్లు ఎలాగైనా ఖాళీ చేయించాలని, అతనికి రెండు నెలల గడువు ఇచ్చామని ఆ గడువు నిన్నటితోనే అయిపోయిందని" చెప్పాడు.

కొండల్రావు చెప్పిందంతా వింటే ఎవరో దొమ్మరి నిస్సహాయురాలైన ఒక ఆడదాన్ని, అమాయకుడైన ఆమె కొడుకుని అల్లరి పెడుతున్నారని అర్థం వస్తుంది.

ఇన్స్పెక్టర్ మేం చెప్పినదంతా విన్నాడు. ఏవో రెండు మూడు ప్రశ్నలు వేసాడు. వాటికి హీనస్వరంతో సమాధానం చెప్పా, ఇన్స్పెక్టర్‌గారికి ఏమనిపించిందో "ఓయ్ రేపు మీ ఇంటికి వచ్చి అతనితో మాట్లాడతాను. నే చెప్పినట్టు విన్నాడాసరి, లేదా నేను మనుషుల్ని పంపుతాను. వాళ్ళు అతని చేత ఖాళీ చేయించేస్తారు. నువ్వేం గాబరాపడకు" అన్నారు.

✡✡✡

ఇన్స్పెక్టర్ నన్ను సమాధాన పరచడానికి అనునయవాక్యాలు చెప్పాడని అనుకున్నాను. కాని మర్నాడు పొద్దున్నే ఇంటికి స్వయంగా వస్తారని అనుకోలేదు.

ఇన్స్పెక్టర్ని చూసి ఇంట్లోవాళ్ళు, గాబరాపడ్డారు. చిన్నాన్న రిపోర్టు చేస్తే నన్ను మందలించడానికి వచ్చాడనుకున్నారు.

అమ్మ గాబరాగా "ఒరేయ్ చిన్నా లేనిపోని గొడవలకి పోకు, ఆయన ఎలా చెపితే అలా విను" అంది.

నాకు ఎవరు వచ్చారో తెలియక "అలాగేలే" అని బయటికి వచ్చా ఎదురుగా రాత్రి నేను కలుసుకున్న ఇన్స్పెక్టర్, నేను ఆయన్ని చూడగానే నమస్కారం పెట్టాను. ఆయన స్నేహపూర్వకంగా నా భుజం తట్టి "ఆయనతో నేను కాళీ చెయ్యమని చెప్పి చూస్తాను. నా మాట కూడా ఆయన వినకపోతే చూద్దాం.. ఆయన ఉండే వాటా చూపించు" అన్నారు.

నే ఇన్స్పెక్టర్ని లోపలికి తీసుకొచ్చి బావ ఉంటున్న వాటా చూపించా.. ఆయన బావ ఉంటున్న గదిలోకి వెళ్ళి పదినిముషాలు మాట్లాడి బయటికి వచ్చి "నే చెప్పాలే" అని నా భుజం తట్టి వెళ్ళిపోయారు.

ఇన్స్పెక్టరు వెళ్ళిపోయాక, నేను పుస్తకాలు తీసుకుని లైబ్రరీకి వెళ్ళా! పేపర్లూ అవీ చదువుతున్నానన్నమాటేగాని ధ్యాసంతా ఇంటిమీదే ఉంది. బావ చిన్నాన్న దగ్గరికి వెళతాడు. చిన్నాన్న బావని తీసుకుని ఇన్స్పెక్టరు దగ్గరకి వెళతాడు. చిన్నాన్న బావ నా గురించి చెడుగా చెపుతారు. ఇన్స్పెక్టరు మనసు మారవచ్చు, అలా జరిగితే ఏం చెయ్యాలి?

ముందు ముందు దౌర్జన్యం చేయడానికి కుదరదు. కొండల్రావు కూడా సహాయానికి రాకపోవచ్చు. ఇన్స్పెక్టరు ఎదురు తిరిగి నన్నే మందలించవచ్చు, ఇన్స్పెక్టర్ని ఈ గొడవలోకి లాగి నేను తప్పటడుగు వేసానేమో? అనిపించింది. ఇన్స్పెక్టర్ని గొడవలోకి లాగకుండా ఉండి ఉంటే నేనే ఏదో గొడవపెట్టి బావ ఇంట్లో ఉండడం దుర్భరం అన్న పరిస్థితి కల్పించి ఉండేవాడిని, ఇప్పుడు పరిస్థితి చెయ్యిజారిపోయింది. ఏ విధంగా ఆలోచించినా ఇన్స్పెక్టర్ని గొడవలోకి లాగడం తప్పేమో! అన్న ఆలోచనతో మనసంతా చికాగుగా తయారైంది. ఏ పుస్తకం మీదా మనసు నిలవలేదు పన్నెండువరకూ లైబ్రరీలో గడిపి, కాలేజీకి వెళ్ళి అక్కడ పని చూసుకుని ఒంటిగంటకల్లా, ఇంటికి చేరుకున్నాను. ఇంట్లోకి వెళ్ళి అమ్మతో "అమ్మా అన్నం పెట్టవే" అని కాళ్ళు కడుక్కునే నెపంతో బావ వాటావేపు వెళ్ళాను. బావ వాటా తాళం వేసి ఉంది. కాళ్ళూ, చేతులూ కడుక్కుని లోపలికి వచ్చి, అందరూ కలిసి, చిన్నాన్న ఇంటికి వెళ్ళివుంటారు, అనుకున్నా, నేను లోపలికి వచ్చి భోజనానికి కూర్చుంటూ "బావావాళ్ళూ చిన్నాన్న దగ్గరకి వెళ్ళారా?" అనడిగా... "లేదురా కాళీ చేసి వెళ్ళిపోయారు, ఆ తాళం మనదే" అంది అమ్మ నా చెవులని నమ్మలేకపోయా.. భోజనం ముగించి, పోలీసు స్టేషనుకి వెళ్ళా, అక్కడ ఇన్స్పెక్టర్ని కలిసి, ఆయనతో "బావ కాళీ చేసేసాడని" చెప్పాను. ఆయన నవ్వుతూ నా భుజం తట్టారు. అక్కడితో బావ ప్రహసనం ముగిసింది.

✡✡✡

బావ ప్రహసనం నాకు ఫేవర్‌గా ముగియగానే, నాలో కాన్ఫిడెన్స్ పెరిగింది. ఇంట్లో మిగిలిన వాటా వాళ్ళని అద్దెపెంచమన్నా, అందుకు అందరూ ఒప్పుకున్నారు. బావ వాటా అద్దెకి ఇచ్చేసాను. మొత్తంగా నేననుకున్నట్టు రెండువందల అరవై రూపాయల అద్దె వసూలవుతోంది.

ఇంతా చేసాక నా దృష్టి మావయ్యమీదకి మళ్ళించా!.. ఓ రోజు మావయ్యని పిలిచి అమ్మ దగ్గర కూర్చో పెట్టి, నాకొచ్చిన సమస్య చెప్పా...

"నేనేం చెయ్యనా" అన్నాడు మావయ్య.

"నాకు కావలసిన మొత్తంలో నలభై రూపాయలు తక్కువ వచ్చాయి. అవి నెలనెలా అద్దె ఇచ్చుకో" అన్నా.

"నేను అద్దె ఇచ్చుకోగల స్థితిలో ఉంటే, ఇంట్లో ఎందుకు పడివుంటానూ" అని బీదరుపులు అరిచాడు.

"అది నాకనవసరం, వస్తున్న అద్దెల్లో నేను నూటయాభై పట్టుకుపోతాను. మిగతా నూటపది అమ్మకి వదిలేస్తున్నాను. అవి అమ్మకి చాలవు. మిగతా నలభై నువ్వు పూర్తిచెయ్యాలి." అని చెప్పా.... అమ్మకీ మావయ్యకీ ఇద్దరికీ పచ్చివెలక్కాయ గొంతులో పడింది. నేనివ్వనని మావయ్య అంటాడా? బావకి జరిగిన మర్యాద చూసాడు. కాబట్టి తెగేదాకా లాగడం మావయ్యకి ఇష్టం ఉండదు.

"వాడివ్వడ్డా నువ్వే ఏదో తేల్చివెళ్ళు" అని అమ్మ అంటుందా? అలా అనలేదు అమ్మే మావయ్యని ఈ ఇంటికి రప్పించింది..., ఇద్దరూ మనసులో ఏ తర్జన బర్జనలు పడ్డారో తెలియదు గానీ....

"సరేలే ఎలాగొలా సర్దుతాను" అని మావయ్య నసిగాడు.

"నీకు సరిపోయే డబ్బు నువ్వు తీసుకుపో మేం ఎలాగొలా సర్దుకుంటాం" అంది అమ్మ

"సరె మీ ఇష్టం' అన్నా... నేను మనసులో నవ్వుకుంటూ

✡✡✡

జూలై నెల్లో హాస్టల్లో జాయిన్ అయి, ఇంటర్ సెకెండ్ ఇయర్ చదివా.. మంచి మార్కులు వచ్చాయి. ఇంజనీరింగ్‌లో సీటు వచ్చింది.

అదే సమయానికి రాజగోపాల్ ఇంజనీరింగ్ పూర్తయింది. వాడు బెంగుళూరులో టాటా ఇన్స్టిట్యూట్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్ చేయడానికి వెళ్ళిపోయాడు. వాడు వెళ్ళిపోయాక అందమైన సాయంత్రాలూ, హాయిగొలిపే సముద్రపు హోరు, మైమరిపించే తెలుగు సినీమా పాటలు ఇంపైన చంద్రోదయాలూ, ఏమీ లేవు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతూ బిజీ అయిపోయాను.

ఆ రోజుల్లోనే రాజగోపాల్ రాసిన మొదటి ఉత్తరం వచ్చింది.

మొదటి ఉత్తరంలో బెంగుళూరుని గురించి వర్ణించాడు. వర్ణన అంతా అయాక చివర్న చిన్న కవిత ఉంది.

నా ఊహలన్నీ రోమాంటిక్ పోయ్ట్రీలు...
నా శ్వాసలన్నీ జైగాంటిక్ జామెట్రీలు...
నా హృదయం ఫెసిఫిక్ సీ...
నా మనసు నిర్మల చైతన్య రాసి....
నా స్పేదన బైకల్ లేక్...

నా స్పందన రాకెట్ పీక్...

అసలు నేనా ఝురీ గమనంలో జీవాణువుని...

బట్ బైలాజిలల్లీ డిగ్రేడబుల్‌ని...

స్నేహలత పరిచయం అయింది. ఆమె దూరపు బంధువు. ఆమె గురించి తర్వాత ఉత్తరంలో

నీ

రాజ్

రాజగోపాల్ తన స్వంత కవిత్వం మొదలు పెట్టాడు. తనంత బాగా రాయగలగడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించలేదు. ఇలా ఎప్పుడో జరుగుతుందని అనిపించేది. ఎడారిలాంటి హాస్టలు జీవితంలో రాజగోపాల్ ఉత్తరాలు చాలా ఆహ్లాదాన్ని కలిగించేవి. నా క్లాసులో కొలీగ్స్ పరిచయం అయారు. వాళ్ళల్లో మల్లికార్జు, నరసింహులు, మార్కండేయులు, రూపమ్ ఇంకా ఎందరో.. మొదటి ఆరునెలలూ కలిసికట్టుగా ఉన్న క్లాసు.. ఆరునెలలయేసరికి, ఎవరికి వారు అన్నట్టుగా సర్దుకుంది. నాతో స్నేహానికి మల్లికార్జున్, మార్కండేయులు, రూపమ్ మిగిలారు.

క్లాసు గోదావరి, బెజవాడ జిల్లాల గ్రూపులుగా విడిపోయింది. అదే హాస్టలులో కూడా రిపీటు అయింది.

ఈ క్లాసులతో.. ఈ తరహా స్నేహితులతో... సతమవుతూ ఉంటే రాజగోపాల్ ఉత్తరాలు నిండువేసవిలో చలివేంద్రంలా ఉండేవి.

డియర్ హనీ,

నీ ఉత్తరం అందింది. హాస్టలు లైఫు అంతే హాస్టలుకి చదువుకోడానికి వెళ్ళావుగా చదువుకో!

స్నేహలత ఎవరూ అని అడిగావు కదూ!

స్నేహలత బయాలజీలో పి.హెచ్.డి. చేస్తోంది. రాత్రిపదకొండు, పన్నెండు గంటలకి సైకిలు వేసుకుని రయ్‌మని లేబరేటరీకి వెళుతూంటుంది. ఒక రోజు రాత్రి లేబరేటరీక్ వెళుతుండగా, సైకిల్ చైన్ ఊడిపోయింది. చీకటిలో పెట్టుకోలేక అవస్థపడుతోంది. నేను సాయం చేసా. తనతో లేబరేటరీకి రమ్మంది, వెళ్ళా.. స్నేహలత తన ఎక్స్‌పెరిమెంట్ అబ్జర్వేషన్స్ తీసుకుంటూ.. నాతో బాతాఖానీ వేసింది. మా ఇద్దరి మధ్యా వున్న పరిచయాన్ని స్నేహంగా మార్చింది.

ఇక్కడ ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ లో మంచి స్వేచ్ఛ ఉంది. ఎవరిపని వాళ్ళదే ఎవరూ ఎవర్ని పట్టించుకోరు. అందరూ తమతమ పనిలో మునిగిపోయి ఉంటారు.

ఆ రకంగానే నీ హాస్టలులో కూడా నీకు స్వేచ్ఛ ఉంటుంది. దాన్ని ఎలా ఉపయోగించుకుంటావన్నది నీ మీద ఆధారపడివుంటుంది.

డియర్

ఆ స్వేచ్ఛలో...

ఆస్తులు కట్టెలై...

రుధిరమంత ఆవిరై...

గుండేలే జ్యోతిగా...

పరిసరములు నిండిన ధూమం మనసుకాగా..

నా చితిమండుచున్నది

బ్రతుకు పండనున్నది...

అప్పటికీ నేనన్నానూ....

ఎవరున్నారని అటకేగావు...

ఎవరు లేరని ఇచ్చోట వదిలేవు..

రా! కదలిరా! రానేరావా!

నీ

రాజగోపాల్

కాలేజీని స్నేహితుల్ని వాళ్ళ స్వభావాల్ని అర్థం చేసుకునేసరికి.. కాలేజీ కొత్త వదిలించుకునే సరికి, చాలా సమయం పట్టింది. ఆ రోజుల్లోనే రాగింగ్ పేరుమీద సీనియర్స్ బూట్సుకి పాలిష్ చేసా.. టెర్రస్ మీద సమావేశం అయిన సీనియర్స్ మధ్య, ఓ సీనియర్‌ని పట్టుకుని "సిగ్గేస్తోందా? సిగ్గేస్తోందా? చిన్నవాడు అనుకున్నది చిన్నది చేసేస్తుంటే, సిగ్గేస్తోందా? నీకు సిగ్గేస్తోందా?" అన్న పాటకి అభినయం జోడించి, పాడాల్సి వచ్చింది. బికినీ దొరకదు కాబట్టి బనీన్ని కట్ డ్రాయర్ కి జోడించి డాన్స్ చేసా.. నా డాన్స్ కోసం ఓ సీనియర్, పిట్టగోడమీద కూర్చుని రెండు కేజీల పుస్తకం బి.ఎల్. తెరాజా పట్టుకుని దరువు వేస్తూ.. మొత్తం పాట పాడాడు.

"నీటిలో మునిగినా నీడలో నిలిచినా

నీవు తోడులేనిదే వేడిగా ఉందిలే.." అంటూ పాడి, నీగురించి కాదులే అన్నాడు.

ఆ విధంగా పరిచయం అయాడు చందు. ఎలక్ట్రికల్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అతని స్నేహంతో నాలో రాగింగ్ భయం పోయింది. సంవత్సరం సగం గడిచింది. రాజగోపాల్ దగ్గర్నుంచి మూడో ఉత్తరం వచ్చింది.

ప్యారే దోస్త్

నీ ఉత్తరాలూ అనుభవాలూ చూస్తుంటే పూర్వం ఈగ ఇల్లలుకుతూ పేరు మర్చిపోయిందట! నువ్వు చదువుకుంటున్న బడిలో నేను నాలుగేళ్ళు చదివానురా, కూచీ.. అవన్నీ నాకు రాయకు.. స్నేహలతతో స్నేహం చాలాదూరం పోయింది. రాత్రుళ్ళు ఆమె సైకిలుకి చైను ఎక్కడ తెగిపోతుందేమో అన్న ఆలోచనతో దాదాపు రోజూ ఆమెతో లాబ్ కి వెళ్ళడం హస్కు భోంచెయ్యడం చేస్తున్నాను. కానీ స్నేహలత చేస్తున్న ఎక్స్‌పెరిమెంటు పూర్తయిపోయింది. అందుకని రోజూ స్నేహతో లైబ్రరీకెళుతున్నాను. రాత్రి పన్నెండువరకూ లైబ్రరీలో గడిపి ఎవరిపని వారు చేసుకుంటున్నాం. మాట్లాడుకోడానికి అవకాశం చిక్కడంలేదు. అదినాకు తలనొప్పి తెప్పించింది. నా తలనొప్పికి ముందు ఆమె దగ్గరుందని చెప్పి నన్ను తన రూముకి తీసుకెళ్ళింది. కాఫీ చేసి ఇచ్చింది.

రూములో జీరో బల్బు వెలిగించి, కాఫీ సిప్ చేస్తూ జీవితం గురించి, ముఖ్యంగా స్త్రీ ఎగ్జిస్టెంషలిజమ్ గురించి చెప్పింది. స్నేహలతకీ నాకూ తేడా ఏమిటంటే స్నేహ పూర్తిగా విదేశీ.... నేను పూర్తిగా దేశీ! నా తలకింకా ఏమీ ఎక్కక పోతే ఇర్వింగ్ వేలస్ చాప్‌మెన్ రిపోర్టు గురించి చెప్పింది... చదవమని బుక్ ఇచ్చింది.

విచిత్రం ఏమిటంటే నువ్వూ నేనూ చదవడమే! కానీ స్నేహలత అర్థం చేసుకుంటుంది కూడా! ఇలా మాట్లాడుకుంటుండగా

'ఎల్లలు లేని వరద

కలలు కాని సరదా

తెల్లకాంతుల జలద

బంగారు రాజ

తెల్లారిపోయిందని అర్థం. నేను భారంగా రూముకొచ్చేసాను.

ఈ ప్రభాతంలో ఒక పూవు వికసించింది...

ఆద్యంతక్షరాల మధ్య స్పందన..

ఆ గణిత పదిక హృదయ ప్రాంగణాన...

వికసించిదొక తీయని రాగం...

విచిలిత మానసిక మేదకునికది ఆశా చిహ్నం!

వెరీ గుడ్ బై

నీ

రాజగోపాల్

రాజగోపాల్ కవిత్వంలో దోబూచులాడుతున్న భావాన్ని వెదుకుతున్నాను. కవిత్వం వల్ల అంత స్పష్టంగా లేదు.

✡✡✡

# 9

**రాజగోపాల్‌ని** కరిగిస్తున్న స్నేహలత గురించి తరచి ఆలోచించే, అవకాశం లేకుండా ఎకడమిక్ ఇయర్ చివరికి వచ్చేసాం. సెషనల్ వర్కుతోనూ, పరీక్షల చదువుతోనూ, ఊపిరి సలపలేదు.

ఇయర్ ఎండింగ్‌లో, ఏన్యువల్ స్పోర్ట్స్, డిబేట్ కాంపిటీషన్స్, పాటలపోటీలు జరిగాయి. కాలేజీకి ఫెష్టివ్ లుక్ వచ్చింది, కేంపస్ హాష్టలు... సందడిగా తయారైంది.

డిబేట్ కాంపిటేషన్ లో నాకు సెకండ్ ప్రైజ్ వచ్చింది. ఫైనల్‌గా కాలేజ్ డే ఫంక్షన్ జరిగింది.

ఫైనలియర్స్ ఏదో నాటకం వేసారు. రూపమ్ స్టేజీ మీదకి ఎక్కి 'మిమిక్రీ' చేసాడు. మిమిక్రీలో సినిమానటులు, రాజకీయనాయకులు, తర్వాత ఇద్దరు టీచర్లని మిమిక్రీ చేశాడు.

అందులో మాకు డ్రాయింగ్‌కి వచ్చే టీచింగ్ అసిస్టెంట్ ఒకడు. ఒకరోజు డ్రాయింగ్ క్లాసులో మేమంతా గోలగా మాలో మేము మాట్లాడేసుకుంటున్నాం. మమ్మల్ని ఏ విధంగానేనా నిశ్శబ్దంగా కూర్చోబెడదామని ఆయన 'బోయ్స్ సైలెన్స్ ప్లీజ్, ప్రిన్సిపల్ జస్ట్ పాస్ట్ ఎవే ఇన్ ది వరండా' అన్నాడు. వెంటనే రూపమ్ 'టు మినిట్స్ సైలెన్స్ ఈజ్ ఇనఫ్ సర్' అని అడిగాడు క్లాసంతా ఘొల్లుమని నవ్వాం.. మేమెందుకు నవ్వామో అతనికి అర్థం కాలేదు అదే మిమిక్రీ చేసాడు దాంతో ఆడిటోరియం అదిరిపోయింది.

అంతా అయాక పాటల కార్యక్రమం మొదలయింది. చాలామంది సీనియర్స్ వచ్చి, వాళ్ళకి తోచిన విధంగా రకరకాల గొంతుకలతో పాటలు పాడారు. ఆఖర్న చందూని స్టేజి మీదకి పిలిచారు. చందు తన స్వంతగిటారుతో స్టేజెక్కాడు గిటారు మీద చిన్న బీట్సు వేస్తూ 'హార్డ్ డేస్ నైట్' లోని బీటిల్స్ పాటలు 'ఐ షుడ్ హేవ్ నోస్ బెటర్ గర్ల్ లై యు' ఒకటి 'కెనాట్ బై మై లవ్; పాటలు పాడి ఆడిటోరియంని అదరగొట్టించాడు.

⁂⁂⁂

మర్నాడు హాస్టల్లో చందు రూముకి వెళ్ళి చాలా బాగా పాడారంటూ అతన్ని అభినందించా.. అతని గదిలో అతని రేక్  నిండా ఉన్న ముళ్ళపూడి వెంకట రమణ పుస్తకాల్ని చూసి వాటిపై మమకారంతో చందుతో స్నేహం పెంచుకున్నాను.

ఫస్టియర్ పరీక్షలయి శలవులిచ్చారు. ఆ శలవుల్లో రాజు మాష్టారితో పరిచయం పెరిగింది.

ఆయన గురించి ఓ రచయిత చెప్పినట్టుగా 'వృత్తిచేత మెకానికల్ డిపార్టుమెంటులో రీడరైనా, ప్రవృత్తిచేత సాహితీ రీడరు, వ్యావృత్తిచేత ట్రాన్సిండెంటల్ మెడిటేటర్, చార్మినార్ ఫీడర్' ఆయనతో పరిచయం పెరగడానికి కారణం, ఆయన ఏ విషయాన్నేనా విడదీసి వివరించే వివరణ ఏకధాటిగా వో రోజు ఆయనతో వాదానికి దిగాను. శ్రీకృష్ణుడు చాల కన్‌ఫ్యూజింగ్‌లో ఉన్నాడన్నాను. బసవరాజుగారు సిగరెట్ పిడికిటిలో బిగించి, గాఢంగా పొగపీల్చి 'ఎలా' అన్న రెండు అక్షరాలుగా మార్చి పైకి వదిలేరు.

'ముక్తి పొందడానికి శ్రీకృష్ణుడు సాంఖ్య, భక్తి, యోగ, కర్మ, సన్యాసయోగ మార్గాలన్నీ చెప్పి అర్జునుడ్ని నువ్వు యుద్ధం చెయ్యక తప్పదు... అంటూ ప్రోత్సహించాడు. ఇందులో శ్రీకృష్ణుడి కన్‌ఫ్యూషనేనా ఎక్కువైయుండాలి, లేకపోతే వ్యాసుడికి యుద్ధం ముందు ఫిలాసఫీలాంటిది చెప్పాలనే దురదేనా ఎక్కువైయుండాలి' అన్నాను.

నా ఆర్గ్యుమెంటు విన్న తర్వాత, రెండు నిముషాలు మౌనంగా ఉండి 'కొండంత రాగం తీసి బూతుపాట పాడినట్లుంది' అన్నారు విచిత్రంగా నవ్వుతూ.

నేనూ నవ్వాను సామెతకి.. కానీ ఆలోచించగా ఆ సామెత నా విషయంలో వాడారో లేక శ్రీకృష్ణుడి విషయంలో వాడారో మాష్టారి వ్యంగ్యం కనిపెట్టలేకపోయా...

మాష్టారు సిగరెట్ పీలుస్తూ 'ఏ తత్వశాస్త్రమూ హేతువాదానికి పరిమితం కాదు. అలాగని మానవజీవితంలో ఏమూల తత్వాన్ని విడిచిపెట్టినా, అది తత్వశాస్త్రం కాదు. తత్వశాస్త్రాన్ని అధ్యయనం చేసి ఆచరణలో పెట్టరు చూడండి అలాంటి వాళ్ళు మన దేశంలో అతి చవగ్గా దొరికే మార్క్సిస్టులు' అంటూ మళ్ళీ నవ్వారు.

'ఈ హేతువాదం హేతువు లేకుండా వాదించడానికే అయితే మనం కూడా మార్క్సులాగా భ్రష్టయోగులం కాక తప్పదు' అన్నారు.

'మార్క్స్‌భ్రష్టయోగా?' అన్నాను ఆశ్చర్యంగా

'ఆ! ఎలాగంటే మార్క్స్ రాజకీయ సిద్ధాంతాన్ని నిర్మించే ముందు ఒకతత్వశాస్త్రాన్ని ఏర్పరిచాడు కానీ రెండింటికీ సమన్వయం కుదరక రావలసిన దేశాల్లో మార్క్సిస్టు విప్లవం రాలేదు. విప్లవం వచ్చిన దేశాల్లో స్టాలిన్‌లాంటి పాలకుల్ని చూసాం. తత్వశాస్త్రాలన్నీ ఆచరణకి సూచికలు మాత్రమే' అంటూ చాలాసేపు తత్వశాస్త్రాల గురించి, దర్శనాల గురించి, మాట్లాడారు. ఆయన  భావాలు వక్రం కొందరికి.. కాదు ఇండియన్ కమ్యూనిస్టులే వక్రం అంటారు మాష్టారు.. ఆ రోజుల్లో మార్క్సిజం మీద పుస్తకం రాస్తున్నారు. ఇలా పెరిగిన ఆయన స్నేహాన్ని చాలాకాలం పదిలంగా దాచుకున్నాను. కానీ భగవద్గీత గురించి మాట్లాడలేదు.

*** ***

శలవులయిపోయి రెండో సంవత్సరం మొదలయింది.

చందూ నేనూ రూమ్మేట్స్‌గా హాస్టల్లో జీవనం మొదలుపెట్టాం. చందు మాటలు ప్రత్యేకంగా ఉంటాయి. చందు శలవులనుండి రాగానే 'వొరేయ్ మా ఇంటిపక్కనే ఇద్దరు అక్కచెల్లెళ్ళు ఉన్నారు. అందులో పెద్దామెకి తన యౌవ్వనం మీద చాలా మమకారంలె.. దాన్ని ఎవరూ  చూడకుండా, ముసలిదైపోతుందేమోనని భయం. మా ఇంటికి వెనక పెరడులో, బాత్రూముంది. ఆ బాత్రూములో స్నానం చేసిన వారి కేరికేచర్స్ మా మేడమీదకి వైడాంగిల్స్‌లో కనిపిస్తాయి. ఆమె బాత్రూములో.. నేను మేడమీద.. ఆమె బాతును.. నేను చూతును,' అన్నాడు మురిసిపోతూ..

సరదాగా సాగుతున్న చందు స్నేహం కాలేజీలో చేరిన కుర్రాళ్ళకి ఏదో చెప్పేద్దామనే మాష్టర్ల ఆరాటం, చస్తే నేర్చుకోకూడదనే స్టూడెంట్ల పోరాటం మధ్య ఎనిమిది నెలలు గడిచాయి. ఫస్టియర్ డిబేట్ కాంపిటీషన్‌లో గెలవడంవల్ల, ఫస్టియర్ ఒకేదెబ్బతో ఇంజనీరింగ్ మెకానిక్స్ పాసవడం వల్ల, కాలేజీలో నేను కొంచెంగా ఫేమస్ అయ్యా..

*** ***

ఈసారి రాజగోపాల్ దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరం చాలా క్లుప్తంగా ఉంది.

***డియర్ ఫ్రెండ్***

ఇక్కడ నా చదువు సరిగా సాగడం లేదు స్నేహలత పి.హెచ్.డి. సబ్‌మిట్ చేస్తోంది ఆమెకి హెల్ప్ చేస్తున్నాను. రోజూ రాత్రుళ్ళు నా రూములోనే ఉండిపోతోంది.

చితి వెలుతురు మధ్యగా...

స్మృతులంటెడు చిటపటధ్వనుల మధ్యగా..

ఇటకరుదెంచినదెవరు?

ఆరడి పొందిన మనసును...

ఊరట బెట్టగా...

ప్రేమ తంత్రులు మీటేదెవరు?

ఇంకెవరు స్నేహలతే!

***ఇట్లు***

***నీ రాజగోపాల్***

రాజగోపాల్ ఉత్తరాల్లో స్నేహలత గురించి వివిధ భావాల చిటపట ధ్వనులు వినిపిస్తున్నాయి.

ఈ అర్థాలని మరుగున పెడుతూ.. పరీక్షలు వచ్చేసాయి. ఈసారి పరీక్షలు అంత సజావుగా జరగలేదు. పరీక్షల్లో నరసింహులు చీటింగ్ చేస్తూ దొరికిపోయాడు. నరసింహుల్ని పట్టుకున్న మాష్టారు చాలా స్ట్రిక్టు అని పేరుంది. దొరికిపోయిన వెంటనే నరసింహులు ఏడ్చేసాడు. మాష్టారి కాళ్ళు పట్టుకున్నాడు తలకొట్టుకున్నాడు. ఏం చేస్తే మాష్టారి మనసు కరిగించగలను. అనుకున్నాడో అంతా చేసి విఫలం చెందాడు. ఏకో నేకో హమస్మి..! అన్న మంత్రం పనిచెయలేదు. వక్రికి వక్రప్రవర్తన కలిసిరాలేదు..

మాష్టారు ఆన్సర్ బుక్‌ని, స్లిప్‌ని తీసుకెళ్ళి ప్రిన్సిపల్‌కి అప్పచెప్పారు. అప్పటికే ఈ విషయం కాలేజీలో పాక్కింది. నరశింహులు భీమ అసోసియేషన్‌కి జాయింట్ సెక్రటరీ. ఆ అసోసియేషను వాళ్ళు ప్రిన్సిపాలు రూము చుట్టూ చేరారు. ప్రిన్సిపల్ బైటకి వచ్చి విద్యార్థులతో మాట్లాడి 'నేనేం చెయ్యలేను. స్లిప్ పట్టుకున్న మాష్టారిపై ఆధారపడివుంటుంది. ఏ విషయమేనా' అంటూ తప్పించుకున్నాడు.

అసోసియేషను ప్రెసిడెంట్ మాష్టారితో మాట్లాడాడు. నరశింహులు మళ్ళీ అలాంటి పని చెయ్యనని, కాగితం మీద రాసిచ్చాడు. కాని మాష్టారు దేన్నీ పట్టించుకోకుండా, మూడేళ్ళు సస్పెండు చెయ్యమని రికమెండ్ చేస్తూ నోట్ రాసి ప్రిన్సిపాల్‌గారికి ఇచ్చేసారు.

దాంతో అసోసియేషను విద్యార్థుల్లో సహనం చచ్చిపోయింది. ఆ మొత్తం సంఘటనని వెనకబడిన జాతుల్ని అణగదొక్కుతున్న వ్యతిరేక ఉద్యమంగా మారిపోయింది. మాష్టార్ని 'డౌన్ డౌన్' అన్నారు. ఈ రూల్స్ అన్నీ అసోసియేషను వాళ్ళమీదే రుద్దుతున్నారని, మిగతావాళ్ళు రూల్సేపాటించడం లేదని పెద్ద గొడవలేవదీసారు. మాష్టారి స్కూటర్ని తగలపెట్టారు.

ఇంత జరుగుతున్నా అసోసియేషను వాళ్ళది తప్పు అని ఇటు ఇతర విద్యార్థులుగాని, అటు టీచర్సుగాని అనలేదు.

రెండోరోజు అసోసియేషను వాళ్ళు ఎవరూ పరీక్షరాయకూడదని చేసిన విజ్ఞప్తికి ఇతర విద్యార్థులు సహకరించారు. ఇంకా మూడు పరీక్షలు మిగిలి ఉన్నాయి. ఆ రోజంతా గొడవగా ఉంది. ఆఖరికి మాష్టారు చేసిన రికమెండేషనుని కాదని నరశింహులు పరీక్షలు ఆ ఏడాదివి మాత్రమే.. కేన్సిల్ చేస్తూ ప్రిన్సిపాల్ నిర్ణయం తీసుకుని, విద్యార్థుల్లో హీరో అయిపోయాడు.

మరీ డిసిప్లిన్, స్ట్రిక్టు అనేవాళ్ళకి కావాలని ఇలాంటి మొట్టికాయలు వేస్తారు, కొందరు...సాటి టీచర్లు.. వాళ్ళల్లో ప్రిన్సిపాల్ ఒకడు. ఇదంతా విద్యార్థులకి అర్థంకాని .. టీచర్ల స్ట్రేటజీ అనిపించింది.

ఈ రకం గొడవలు ఒక ఆ విద్యార్థి అసోసియేషనుకే పరిమితంకావు. విద్యార్థుల్లో మార్కిస్టు సానుభూతిపరులు, పరిషత్తువాళ్ళూ చాలామంది ఉన్నారు. ఏ విషయమేనా వాళ్ళకి, అనుకూలించనప్పుడు అందరూ అనుసరించే రాస్తావ్రకమే!

*****

మేం మూడో సంవత్సరంలోకి, దేశం యమర్జెన్సీలోకి, ఒకేసారి అడుగుపెట్టాం. సెకండు ఇయర్ ఎండింగ్‌లో కాలేజ్‌డే ఫంక్షనులో పాటల కార్యక్రమంలో ఆఖర్న చందు స్టేజెక్కి గిటారువాయిసూ 'ఏక్యా హువా? కైసే హువా? కబ్‌హువా?' అంటూ కిషోర్ కుమార్ పాటపాడాడు. హాలంతా పిన్‌డ్రాప్ సైలెన్స్‌తో విన్నారు. తర్వాత బీటిల్స్ నుండి 'ఐషుడ్ హావ్ నోన్ బెటర్ గర్ల లైక్ యు' పాడి క్లిఫ్ రిచర్డ్స్ నెంబరు 'డేన్సింగ్ షూస్' పాడాడు తర్వాత హాలువాళ్ళని ఉత్తేజపరుస్తూ 'కం సెప్టెంబరు' మ్యూజిక్ వాయించాడు. అది ప్రేక్షకుల్లో పాపులర్ నెంబర్ అవడం వలన హాలంతా చప్పట్లతో మార్మోగిపోయింది. సృజన మనసు గాడి తప్పిపోయింది.

సృజన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ చదువుతోంది. మా బాచ్‌దే. చాలా డబ్బున్న వ్యవహారం. రోజూ కాలేజీకి కారులో వస్తుంది. అలంకరణ సంగతి చెప్పక్కరలేదు.

ఓ రోజు సైన్స్ కాలేజీ వాళ్ళ ఫంక్షన్‌కి 'బాల సుబ్రమణ్యం' ప్రోగ్రాం ఉంటే నేనూ చందూ వెళ్ళాం... అదే ప్రోగ్రాం కి సృజన కూడా వచ్చింది అప్పటికే చందూని పరిచయం చేసుకుందేమో ఇద్దరూ అతుక్కుపోయారు. కబుర్లలో మాత్రమే!

ప్రోగ్రాం అయిపోయాక నన్నూ, చందూని కారులో మా హాస్టలు దగ్గర దింపింది.

'ఏమ్రిటా ఇంతలా మాట్లాడేసుకున్నారు.' అనడిగా...

'జీవితం గురించి.. అది యవ్వనంలో పెడుతున్న బాధగురించి' అన్నాడు. చందు కిటికీ తలుపు రెక్క పట్టుకుని రెండో చేత్తో కాలర్ని పైకి ఎగదోస్తూ.

'నీ అక్కినేని ఫోజు చాలుగానీ ***జీవితం చచ్చేవరకూ బాధపెడుతుంది*** ఇప్పుడు కాలుజార్చుకుని బాధపడకు' అన్నాను.

'కాలు ఎక్కడ జారుతుందోయ్ మనం కారులో వస్తే' అన్నాడు.

'ఏరా నీ జీవితంలో డైలాగులన్నీ ముళ్ళపూడి రాసిచ్చేసాడా? తిన్నగా సమాధానం చెప్పు ఎంతవరకూ వచ్చింది వ్యవహారం' అన్నా...

'కాళ్ళూ చేతులూ జార్చేసుకోడానికి సిద్ధమేకానీ.. పెళ్ళంటుందేమోనని భయం ' అన్నాడు.

'నీకొట్టి కాళ్ళే జారతాయి. సృజనకి కాళ్ళు జారి, బరువెక్కుతాయి, మరిపెళ్ళాడవా?' అన్నా నవ్వుతూ.

'సృజనకి కాళ్ళే బరువెక్కుతాయి, సృజన లాంటిదానితో పెళ్ళయితే నా బుర్ర బరువెక్కిపోతుంది. అది నేను భరించలేను.'

'సృజనకేంరా శుభ్రంగా ఉంటుంది. కారుతో వస్తున్న కుర్రది, పెళ్ళిచేసుకో' అన్నా...

'ఈసారి అవకాశం వస్తే నిన్ను నాతో తీసుకువెళతాను. మా ఇద్దరి వ్యవహారం అబ్జర్వ్ చెయ్యి.' అన్నాడు చందు.

'అదిసరే కాని సృజన నా క్లాసుమేటు కదా నీ వెనక పడిందే?' అన్నా..

'వెనకా ముందూ అనకు నా పాటకి పడింది. ఇంక సృజన వెంటపడ్డం నా కిష్టమేగాని.. పెళ్ళంటుందేమో అని భయం.'

'మరి వెంటపడ్డవాళ్ళని పెళ్ళాడకూడదు, పెళ్ళాడిందాని వెంటపడకూడదు,'

'వ్వా! జీవిత సత్యం చెపుతున్నారా ఫిలాసఫర్ గారు' అన్నా.. అంతో ఇంతో వాడి మనసులో మాటలాగగలిగినందుకు.

'కాదు చందు నుడివిన నుడువులు, వీలయినన్ని చెపుతా రాసుకో' అన్నాడు.

చందుతో ఏం మాట్లాడినా, వాడి బుర్రలో ఏముందో తెలుసుకోవడం కష్టం. అన్నీ తేలిగ్గా తీసిపారేస్తాడు. ఏమైనా అంటే 'బ్ర.నే.వా' అనేస్తాడు నవ్వుతూ. రూము బైట చందు బ్ర.నే.వా. అని బోర్డుకూడా పెట్టుకున్నాడు 'ఇంజనీరింగ్ డిగ్రీకన్నా ఆ డిగ్రీ ముఖ్యం! ప్రతీ జీవికీ'అఅంటాడు సీరియస్‌గా..

బ్ర.నే.వా అంటే బ్రతకనేర్చినవాడు అని అర్థం.

⁂⁂⁂

చందు లైట్ లవ్వుతోనూ.. రాజగోపాల్ కమిటెడ్ లవ్వుతోనూ.. నాకు మంచి కాలక్షేపంగా ఉంది. అప్పుడే రాజగోపాల్ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

***డియర్ డియరెస్ట్***

స్నేహలత థీసిస్ సబ్‌మిట్ చేసింది. ఇంటికి వెళ్ళిపోయింది వచ్చే సమ్మర్లో పోస్టు డాక్టరల్ చెయ్యడానికి జర్మనీ వెళుతుంది. జర్మనీ వెళ్ళేముందు బెంగుళూరు వస్తానంది. వస్తుందా? రాదా? అన్నది కాదు ప్రశ్న, వచ్చినా మళ్ళీ కనబడకుండా వెళ్ళిపోతుందనే దిగులు.. మనసుని పట్టిపీడిస్తోంది.

పగిలిన సమాధిలో.....
పరుగులు తీస్తున్న జీవాలెవరు...
సమాధిపై తులసికే..
నిచ్చెనవేసి ఊయలలూగేదెవరు?
నిద్రలేక ఆత్రత చెంది...
రాళ్ళల్లో దాగిన జీవాలెవరు?
అందంగా రాళ్ళల్లో...
మృత్యువు ఒడిలో....
దాగిన పథికులు ఏమెరుగని మేధకులు!

రెండో ఏడు చాలా బాగా గడిచింది. అని రాసావు. ఇంక అన్ని సంవత్సరాలూ బాగానే గడుస్తాయి. స్నేహలతతో స్నేహం గురించి చెప్పాలంటే.. 'మనేది కొద్దికాలం క్షణాల ఇంద్రజాలంలా' అనిపించింది.

నీ జాబుకి ఎదురుచూస్తూ

***నీ..గోపాల్***

రాజగోపాల్ సమాధులు, మృత్యువు అంటూ వర్ణించడం ఆశ్చర్యం కలిగించింది. వీడి కమిట్‌మెంట్ ఇంత డీప్ హార్టెడ్‌గా ఉంటుంది అనుకోలేదు. అక్కడ వాడి సంగతి అలావుంటే ఇక్కడ చందూకి సృజన నుండి రోజుకో ఉత్తరం వస్తోంది. ఆ ఉత్తరాలు చదివి రోజుకో సినిమా పాట పాడుతున్నాడు.

ఓ రోజు చందూ హడావిడిగా నా క్లాసుకి వచ్చి 'సృజన సినిమాకి వెళదాం అంటోంది. నువ్వా వస్తావా?' అన్నాడు.

'గువ్వా గువ్వీ మధ్య నేనెందుకు?' అన్నా..

'ఫర్వాలేదురా.. సృజనని అబ్జర్వ్ చేద్దుగాని' అన్నాడు

'నేను మీతో రావడానికి సృజన ఒప్పుకోవద్దూ' అన్నా.

'నే చెపుతాలే పద' అన్నాడు. వీళ్ళ వ్యవహారం పసిగడదామని 'సరే' అన్నా...

మధ్యాహ్నం తొందరగా మెస్ పూర్తిచేసి, ఇద్దరం జగదాంబ థియేటర్‌కి వెళ్ళాం.. ఎదురుగా ఉన్న ఐస్ క్రీం పార్లర్ దగ్గర నిలబడివుంది సృజన, నన్ను చూసినా ఏమీ అనలేదు. ముగ్గురం చేరాక ఏ సినిమాకి వెళదాం అన్న తర్జన భర్జన జరిగింది.

నేను 'ముత్యాలముగ్గు' సినిమాకి వెళదాం అన్నాను.

సృజన నన్ను ఈసడింపుగా చూస్తూ 'ఏమిటీ? ఇంకా నయం పేడ అలుకుడు సినిమా రాలేదు. దానికి వెళదాం అందురు.' అని తన జోకుకి తనే నవ్వింది.

నేను డంగైపోయాను.. ఎందుకంటే నాకన్నా ఆ సినిమాని ఎవరేనా ఏమైనా అంటే చందుయే ఎక్కువ బాధపడతాడు. ముత్యాలముగ్గు సినిమాని వాడు ఓ పదిసార్లేనా చూసుంటాడు నేను జాలిగా చందు మొహంలోకి చూసాను. వాళ్ళిద్దరి మధ్య ఏది వక్రించిందో నా కర్థమయింది.. వాడు సృజన వేపు చూసి, 'అబ్బ బస్సులో వచ్చాం దాహం వేస్తోంది చల్లగా ఏదేనా తాగుదాం' అన్నాడు.

'ఏం తాగుతాం పద ఆరెంజి జ్యూస్ తాగుదాం' అన్నా.

'వాట్ చందూ ఇక్కడ జ్యూసులు అంత బావుండవు. చాక్లెట్‌డ్రింక్ తాగుదాం పద పార్లర్‌లోకి' అంది సృజన...

అంతవరకూ చాక్లెట్ అంటే అర్ధరూపాయి చాక్లెట్ అనేనాకు తెలుసు. కానీ చాక్లెట్ డ్రింక్ కుడా ఉంటుందని తెలీదు ముగ్గురం పార్లర్‌లోకి వెళ్ళాం... సృజన చాక్లెట్ ఆర్డరిచ్చింది. డ్రింక్ వచ్చింది. ముగ్గురం తాగాం. సృజన చేతి పర్సు తీసి బిల్లు ఇచ్చింది. మొత్తం ముప్పై రూపాయలు నా నెలరోజుల జేబు ఖర్చు.

నా మాటని చందూ మాటని తోసిపుచ్చి, లీలామహల్లో ఆడుతున్న 'గెస్ట్ హు ఈజ్ కమింగ్ ఫర్ డిన్నర్' సినీమాకి తీసుకెళ్ళింది.

ఒక బ్లాక్ అబ్బాయి, ఒక వైట్ అమ్మాయిని పెళ్ళిచేసుకోడం వలన వచ్చే సమస్య గురించి పిక్చర్ పిక్చర్ నిండా డైలాగ్‌లే, చందూ తలపట్టుకు కూర్చున్నాడు. 'సిడ్నీ పాయ్‌టర్ మెయిన్ రోల్‌లో ఉండడం వలన, నేను కొంత ఎంజాయ్ చేసాను. సృజన సినిమా చూస్తూ గంభీరంగా కూర్చుంది.

రెండు మూడు చోట్ల నవ్వింది. ఆ సన్నివేశాల్లో నవ్వు పుట్టించేదేమిటో అర్థంకాక నేను నవ్వలేదు. సినిమా వదిలి బైటకి వచ్చేసరికి, ఇంకా వెలుగ్గా ఉంది. ముగ్గురం నడిచి జగదాంబ జంక్షన్‌కి వచ్చాం. జంక్షనుకి పక్కగా జంగిడి ఉంది. దాంట్లో మురీలు చూసేసరికి, 'ఒరేయ్ మురీలు తిందామా?' అన్నాడు చందు.

'వో' అన్నానేను.

'వాట్!' అంది సృజన ఆశ్చర్యపోయి 'వాటే నేష్టి ఈటింగ్! మంచిదికాదు అంతగా ఆకలేస్తే మళ్ళీ చాక్లెట్ డ్రింక్ తాగుదాం అంది.

'నో...!' అన్నాడు చందు అది కొంచెం అరిచినట్టుగా అనిపించింది. నాకూ సృజనకి కూడా... వెంటనే సృజన 'సరేలే ఐస్ క్రీమ్ తిందాం' అంది పార్లర్‌లోకి వెళ్ళిపోయింది. ఇద్దరం ఆమె వెనక వెళ్ళక తప్పలేదు. ముగ్గురం ఐస్ క్రీమ్ తిని బయటకి వచ్చాం.

సృజన రిక్షామీద ఇంటికి వెళ్ళిపోయింది. మేమిద్దరం బస్సెక్కి యూనివర్సిటీ హోష్టలుకి వచ్చాం, గదిలోకి రాగానే పక్కమీద వాలిపోయాడు. 'ఒరేయ్ ఎంజాయ్ చేసినదానికన్నా శ్రమపడింది ఎక్కువగా ఉంది' అన్నాడు. 'మనం బాధపడతామనికూడా ఆలోచించలేదేంరా సృజన' అన్నా సృజన ప్రవర్తనని తలుచుకుంటూ

'సృజన అంతేరా బాబూ, నేను ఇంగ్లీషు పాటలు పాడితే ఎల్విస్ ప్రెస్లీకి చుట్టాన్ననుకుంటోంది.' అన్నాడు చందు నిట్టూరుస్తూ .

****

## 10

**ఇది జరిగిన రెండురోజులకి రాజగోపాల్ దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది.**

డియర్ సాజన్

నీ ఉత్తరం అందింది కాలేజీలో జరిగేవాటిని చూసి, భయపడకు విద్యమిధ్యగా మారి చాలరోజులైంది. నా థీసిస్ మరో ఆరునెలలు ఎక్స్టెండ్ అయింది. స్నేహలత ఇంటినుండి వచ్చింది. కాని ఆమె దూరంగా వెళ్ళిపోవడం నాలో దిగుల్ని పుట్టిస్తోంది. కాని స్నేహలత నా మాటని చిరునవ్వుతో కొట్టిపారేసింది. అది నాలో బలహీనత అంటుంది. నాలో ఈ బలహీనతకి బలమైన కారణం ఆమే అన్న విషయం ఆమెకి ఎటువంటి గర్వాన్ని కలిగించలేదు. పైగా డోన్ట్ బి సిల్లీ అంది నా శరీరం ఆమెకై తపిస్తోంది. పెదవులు ఆమె ఎదలోతుల్లో వెచ్చని సెగకై ఆటపడుతున్నాయి. శరీరం ఆమె నేర్పిన ప్రకృతి భాషకై తహ తహలాడుతోంది. స్నేహలతకి వీసా వచ్చేసింది.

పెదవులల్లాడు నినువిడుచునాడు.....
గొంతులోని మాట గుండెలో స్పందించు...
చెప్పదగిన మాట మనసులో నెవుండు ...
ఎదురెదురైనా దూరం దగ్గరైనా...
యుగాలకాలం విశ్వాలదూరం.....
కనురెప్పల్లో వాలి, కనుకొలుకుల్లో మెరిసి....
భావానికి ప్రతిబింబంగా స్నేహానికి చిహ్నంగా.....
జారుతోంది చెలీ, తుడుచుకో దాచుకో!

స్నేహలతతో బొంబాయి వెళ్ళాను. ఇద్దరం రెండురోజులు బొంబాయిలో తిరిగాం. నేనో చిన్న తాజ్ మహల్ కొని పేక్ చేయించి స్నేహలతకి ఇచ్చా...

వెన్నెల్లో తెల్లగా మెరుస్తూనే వుంది తాజ్...
అందులో ఉందో లేదో ముంతాజ్...
ప్రణయం అమరం కాదు...
మృత్యువు కబళించకపోదు..

తాత్కాలిక భ్రమతోన్మాదానికి...

రాజ్యాలేలెడు రాజే గురయ్యాడు దానికి!...

స్నేహలత వెళ్ళేరోజు పొద్దున్నే వాళ్ళ అమ్మ నాన్న వచ్చారు. స్నేహలత మధ్యాహ్నం ఫ్లైట్‌లో వెళ్ళిపోయింది. హోటలు రూముకి వచ్చి, నా సామాను పేక్ చేసుకుంటుండగా, టేబులు మీద నిన్న నేను కొని స్నేహలతకిచ్చిన తాజ్ మహల్ పేకింగ్ కనబడింది. ఆక్షణంలో కసి, కోపం అన్నీ ఒక్కసారిగా పెల్లుబికాయి. ఆ పేకింగ్‌ని హోటలు వెనుక కిటికీలోంచి చెత్తకుండీలోకి విసిరేసాను.

ముసలిదై నా జీవితం.......

పడుచు గుండెతో భయపెడుతోంది.

నీలో నాలో బేధం....

తెలియటల్లా నీది జీవితము...

పడుచు గుండెతో భయపెడుతోంది.

నీలో నాలో బేధం....

తెలియటల్లా నీది జీవితం

నాది మాత్రం విషాదావృతం....

అయినా సాగిస్తానీయాత్ర

నీ కాలేజీ గొడవలు రాయకురా ఇంకేదో నా రాయి

నీ గోపాల్

ఈ ఉత్తరం తర్వాత రాజ్ గోపాల్ నుండి ఉత్తరం రాలేదు ఎమ్.యి. పూర్తిచేసి పి.హెచ్.డి. అక్కడే రిజిష్టర్ చేసాడని మాత్రం తెలిసింది.

✡ ✡ ✡

చందు సీరియస్‌గా చదువుతున్నాడు. బైటకి తిరగడం మానేసాడు. దానివల్ల సృజన కిచకిచలాడిపోయింది. ఓరోజు సృజన ఉత్తరం రాసింది. తను కాని చందుని పొందలేక పోతే, ఆత్మహత్య చేసుకుంటానని, చందు ఆ ఉత్తరం నాకు చూపించి 'మద్రాసులోనో సినీకవితో రాయించినట్టుంది, ఈ ఉత్తరం' అన్నాడు కాని లోలోపల భయపడ్డాడు. సృజన్ని పట్టించుకోలేదు. చందుని భయం పెడుతూ రెండు మూడు ఉత్తరాలు రాసింది సృజన. అవి పనిచెయ్యకపోయేసరికి, ఓరోజు బాయ్స్ హాస్టల్‌కి వచ్చింది. హాస్టలు బయట ఇద్దరూ చాలాసేపు మాట్లాడుకున్నారు. లోపలికి వచ్చిన చందూని చూసి 'ఏరా ఏమైంది? అని అడిగా కుతూహలంగా. 'ఏమవుతుందీ, నేను తనని మోసం చేస్తున్నానట, ఇంకా ఏదేదో చెప్పింది.' అన్నాడు చిరాకుగా.

'మరీ నువ్వేమన్నావు,' అన్నాను వాడి చిరాకు గమనించి కూడా.'ఏమంటానూ మనిద్దరం కలిసి చదువుని మోసం చెయ్యొదు అన్నాను.'

'నీకంతగా నా ప్రేమ మీద నమ్మకం లేకపోతే నా సర్వస్వం అర్పించడానికి సిద్ధంగా వున్నా' అంది.

'నువ్వెప్పుడు సిద్ధంగా లేవు, పదమూడేళ్ళకే చిమ్మిలి పండగ చేసుకుని సిద్ధం అయిపోయి వుంటావు.' అన్నాడు చందూ.

'చందూ జోకులెయకు సీరియస్ గా చెప్పు'.. అన్నా.

'సీరియస్ ఏమిటిరా నాలు బోల్డు సమస్యలు, దీనివెనక బడిపోవడం నాకిష్టం లేదు. నా కెరీర్ నాకు ముఖ్యం దాని తర్వాతే ఇవన్నీ' అన్నాడు దృఢంగా.

ఆ ఏడాది పరీక్షలయిపోయాయి. చందు కాలగర్భంలో కెరీర్‌ని వెతుక్కుంటూ మాయమయాడు.

✡✡✡

నా నాలుగో ఎకడమిక్ ఇయర్ మొదలయింది.

అప్పటికి కాలేజీలో నా పేరు మార్మోగిపోతోంది. డిబేటులోనూ, ఆర్గనైజింగ్ లోనూ నా సత్తా చూసిన కొందరు విద్యార్థులు, నన్ను పొటన్షియల్ కేండిడేట్స్‌లో జమ చేసేసారు.

కానీ ఎలక్షన్స్‌కి ఎంత ఖర్చుపెట్టాలో నాకు తెలుసు తెలియందల్లా ఎంత వక్రంగా ఉంటాయో అన్నదే.!

ఫైనలియరు స్టూడెంట్స్ కొందరు, నేను ప్రెసిడెంట్ గా నిలబడితే, జనరల్ సెక్రటరీగా ఎవర్ని నిలబెట్టాలని చర్చించి, నాతో ఈ విషయాన్ని చెప్పి తర్డ్ ఇయర్ చదువుతున్న వెంకటేష్ పేరుని ఖరారు చేసారు. వెంకటేష్ బాగా ఖర్చు పెట్టగల సమర్థుడు. అతని పేరు విషయమై మాలో అంగీకారం కుదరగానే తన పేరుని కాలేజీ గోడలమీద రాసిన బ్లూతో పెద్ద పెద్ద అక్షరాలతో రాయించాడు. అది చూసి కొందరి కన్నుకుట్టింది.

కాలేజీ స్టూడెంట్స్ లో మూడు వర్గాలున్నాయి. ఒకటి స్టూడెంట్స్ ఫెడరేషన్, రెండు విద్యార్థి పరిషత్ నుండి ఎలక్ట్రికల్ మధు, భీమసేన నుండి సింహాద్రి ప్రెసిడెంట్స్‌గా నిలబడడం ఖాయం. నా విషయం కొంచెం వేవరింగ్ కాని విద్యార్థి పరిషత్ నుండి వెంకటేష్ జనరల్ సెక్రటరీగా నిలబడడం ఖాయం అయిపోయింది.

ఫ్రెషర్స్ వస్తే, వెంటనే ఎలక్షన్స్ జరుగుతాయి. దానికి అందరూ గ్రౌండు ప్రిపేరు చేసుకుంటున్నారు. ఆ సమయంలో సురేంద్ర రూపమ్‌ని రూముకెళ్ళి కొట్టాడు.

రూపమ్ ఏ వర్గానికీ చెందకపోయినా ఎక్కువగా ఎలక్ట్రికల్ మధు, భీమసేన నుండి సింహాద్రి ప్రెసిడెంట్స్‌గా నిలబడడం ఖాయం. నా విషయం కొంచెం వేవరింగ్ కాని విద్యార్థి పరిషత్ నుండి వెంకటేష్ జనరల్ సెక్రటరీగా నిలబడడం ఖాయం అయిపోయింది.

ఫ్రెషర్స్ వస్తే, వెంటనే ఎలక్షన్స్ జరుగుతాయి. దానికి అందరూ గ్రౌండు ప్రిపేరు చేసుకుంటున్నారు. ఆ సమయంలో సురేంద్ర రూపమ్‌ని రూముకెళ్ళి కొట్టాడు.

రూపమ్ ఏ వర్గానికీ చెందకపోయినా ఎక్కువగా ఎలక్ట్రికల్ మధుతో తిరుగుతాడు. మిమిక్రీ బాగా చేస్తాడు. ఆ రోజు రాత్రి మెస్‌లో కాబోయే కాలేజీ ప్రెసిడెంటులు అంటూ నన్నూ, ఎలక్ట్రికల్ మధుని, నరశింహులుని అనుకరిస్తూ విద్యార్థుల్ని బాగా ఎంటర్‌టైన్ చేసాడు.

ఆ విషయం తెలిసి నేనేం పట్టించుకోలేదు. ఎలక్ట్రికల్ మధు పట్టించుకోకేదు కాని నరశింహులు ఉడుక్కున్నాడు. దానికి కారణం, నరశింహుల్ని మిమిక్రీ చెయడానికి రూపమ్ ఎంచుకున్న సబ్జెక్ట్! రెండేళ్ళ క్రితం పరీక్షలో స్లిప్పుతో నరశింహులు దొరికిపోయిన విషయానికి సంబంధించింది.

ఈ వార్త తెలిసి, ఉడుక్కుని కోపం తెచ్చుకున్న నరశింహులు వాళ్ళ అసోసియేషన్ వాళ్ళతో మాట్లాడాడు. వాళ్ళ అసోసియేషన్‌కి సురేంద్ర సెక్రటరీ. చాలా మంచివాడు కాని తొందర పడే స్వభావం! సురేంద్రకి నేను ఇంజనీరింగ్ మెకానిక్స్, స్ట్రెన్త్ ఆఫ్ మెటీరియల్స్ చెప్పేవాడిని ఆ విధంగా నాకు సన్నిహితుడు. సురేంద్రలో తొందర స్వభావానికి కారణం సురేంద్ర బాక్సర్ అవడమే! అందరూ, పురి ఎక్కించేసరికి, నలుగుర్ని తీసుకుని రూపం రూముకి వెళ్ళి, రూపమ్‌ని చితకబాదాడు.

ఇది అర్థరాత్రి జరిగింది. రూపమ్ బాగా దెబ్బతిన్నాడు. తెల్లారేసరికి హాస్టల్లో పెద్ద న్యూస్ అయికూర్చుంది. పొద్దున్నే టిఫిన్ ముగించి రూపమ్ రూముకి వెళ్ళా.. రూపమ్ నన్ను చూసి నవ్వుతూ, 'నువ్వూ కొడతావా?' అన్నాడు. ఆ రూములో ఎలక్ట్రికల్ మధు

చిందులు తొక్కుతున్నాడు. 'వాడ్ని చంపేస్తాను, కొట్టేస్తాను, నరికేస్తాను..' అంటూ, ఇద్దరు ముగ్గుర్ని రూములో ఉంచి, మిగతావాళ్ళని పంపేసి మధుతో దీన్ని ఇలా వదిలేయవద్దని కొంత గొడవకింద మార్చమని చెప్పాను. అది ఎలా చెయ్యాలో సలహా ఇచ్చాను.

అంతే నా సలహా పాటిస్తూ, రూపమ్‌ని హాస్పటల్‌కి తీసుకువెళ్ళారు. ప్రిన్సిపాల్‌కి రిపోర్టు చేసారు. దీన్ని పెద్ద న్యూసులా అన్నీ పేపర్లకి పంపించారు.

ప్రిన్సిపాల్ హాస్పిటల్‌కి వెళ్ళి రూపమ్‌ని చూసాడు. మర్నాడు పేపర్లలో పడ్డ న్యూసుని పెద్ద డ్రాయింగ్ షీటు మీద అంటించి, నోటీసు బోర్డులో పెట్టారు. దాంతో ప్రిన్సిపాల్ ఇద్దరు ప్రొఫెసర్లను నియమించి నిజం తెలుసుకోమన్నాడు. సురేంద్ర రూపమ్‌ని కొట్టినట్టు ఒప్పుకున్నాడు. సురేంద్రని వారం రోజుల పాటు కాలేజీనుండి బహిష్కరించారు. హాస్టలు నుండి బహిష్కరించను కాని, హాస్టలు సూపరింటెండెంట్ వాళ్ళ అసోసియేషనువాడే! అందుకే ఏ ఏక్షనూ తీసుకోలేదు. సురేంద్రని సస్పెండు చేసినందుకు సురేంద్రకన్నా నరశింహులు ఎక్కువ బాధపడ్డాడు. వాడు పసిగట్టాడు ఈ చర్యల వెనక నా ఆలోచన ఉందని.

✡ ✡ ✡

ఈ గొడవ జరుగుతుండగానే ఫ్రెషర్స్ వచ్చేసారు. కాలేజీలో హాస్టల్లో కొత్తవాళ్ళని రాగింగ్ చేస్తూ కేంపస్‌ని అదరగొట్టేస్తున్నారు, సీనియర్లు.. రాగింగ్ వక్రం అమటారు కొందరు, సక్రమం అంటారు స్టూడెంట్స్...

హాస్టల్లో రాగింగ్ శృతిమించి సాడిష్ట్ రాగాన పడింది. దాంతో ఫ్రెషర్స్ అందరూ ఓరోజు ధర్నా చేసారు. హాస్టల్లో ఉన్న ఫష్టియర్ స్టూడెంట్స్ అందరూ, వో రూములో చేరి ఆ రూముని లోపలనుండి గడియవేసి, దానికి టేబుల్స్ అడ్డుగా పెట్టారు.

ఆ రోజు రాత్రి మెస్‌కి రాలేదు. నాకు రోజూ లేటుగా మెస్‌కి వెళ్ళడం అలవాటు. ఆ రోజు కూడా సురేంద్ర సస్పెండ్ అయిన రోజుల్లో పోయిన ఫ్లూయిడ్ మెకానిక్స్ పాఠం చెప్పి, అది పూర్తయాక ఇద్దరం బయలుదేరి, మెస్‌కి వెళ్ళాం.... మెస్ అంతా కాళీగా ఉంది.

ఫ్రెషర్స్ రాగింగ్ భయంవల్ల లేటుగా మెస్‌కి రావడం అలవాటు, ఆ రోజు ఒక్క ఫ్రెషర్ని కూడా మెస్‌లో చూడలేదు మెస్ బాయ్‌ని 'వీళ్ళంతా ఏరీ?' అని అడిగాను....

ఫ్రెషర్స్ స్ట్రైక్ చేస్తున్నారని, చెప్పాడు నేను సురేంద్ర మెస్ పూర్తిచేసి, తిన్నగా మా రూముకి వచ్చే బదులు, ఫ్రెషర్స్ సమావేశం అయిన రూముకి వెళ్ళి తలుపు కొట్టాం...

'ఎవరూ?' లోపలనుండి అడిగారు ఫష్టియర్ స్టూడెంట్స్.

'సూపరెంటెండెట్' అన్నా గొంతు పెద్దది చేసి.. సూపరెంటెండెంట్ వచ్చాడనుకుని బల్లల్నికొంచెం పక్కకి లాగి తలుపు తెరిచారు.

ఎదురుగా నిలబడ్డ నన్ను చూడగానే మళ్ళీ తలుపువేసేయబోయారు. కానీ ఇద్దరమే వచ్చాం మీకేం భయం లేదు, అని నేను హామీ ఇచ్చాక తలుపు వెయ్యకుండా పూర్తిగా తియ్యకుండా అలాగే ఉంచారు.

'ఎందుకు స్ట్రైక్ చేస్తున్నారని?' అడిగా....

'రేగింగ్ అన్ బేరబుల్ గా ఉందండీ!' అన్నారు ఫ్రెషర్స్

'మరి ఇంజనీరింగ్ కాలేజీలో రేగింగ్ ఉంటుందే' అన్నా నవ్వుతూ

'రేగింగ్ అంటే గుడ్డలప్పించడం, బూతుపనులు చేయడం కాదు కదండీ అన్నారు వాళ్ళు.. నేనింకేమీ మాట్లాడలేదు. 'కనీసం మెస్‌కి వెళ్ళండి.' అన్నా.. వాళ్ళు ఒప్పుకోలేదు.

అక్కడనుండి నా రూముకి వచ్చేసాను. మర్నాడు సూపరింటెండెంట్ వచ్చి సమస్య సాల్వ్ చేసాడు. అది వేరే విషయం.

✡ ✡ ✡

రాత్రి నేను ఫష్టియర్స్ దగ్గరికి వెళ్ళిమాట్లాడిన విషయం నరశింహులుకి తెలిసింది. సీనియర్స్‌కి వ్యతిరేకంగా ఫష్టియర్స్ స్ట్రైక్ చేస్తే, నేను వాళ్ళ దగ్గరకి వెళ్ళి సానుభూతి చూపించవలసిన అవసరం ఏముంది? అంటూ ప్రశ్న లేవదీసాడు. ఎవరేనా ఏదేనా ప్రశ్నిస్తే అక్కడే రాజకీయం మొదలవుతుంది అన్న విషయం నాకు తెలుసు!

ఆ ప్రశ్న సాయంకాలానికి 'నేను ప్రెసిడెంటుగా పోటీ చేయడానికి నిశ్చయించుకున్నానని ఫష్టియర్ మీద సానుభూతి చూపిస్తే, వాళ్ళ ఓట్లు పడతాయన్న ఆలోచనతో, నేనొక్కడ్నే ఫష్టియర్స్ ఉన్న రూముదగ్గరికి వెళ్ళి సానుభూతి చూపాననే పుకారుగా మారింది.

నరసింహులి వర్గం అంతా వెళ్ళి ఎల్కక్ట్రికల్ మధుతో ఈ విషయం చెప్పి ఈ విషయాన్ని ఇలా పోనివ్వకూడదని, ఏదో విధంగా నాకు బుద్ధి చెప్పాలని సలహా అడిగారు. ఎల్కక్ట్రికల్ మధు గోడమీద పిల్లిలాగ మీ ఇష్టం అన్నాడు.

హాష్టల్లో నాకు వ్యతిరేకంగా నిప్పు రాజుకుంటోందని నాకు తెలీదు. నా అలవాటు ప్రకారం సాయంకాలం రూముకొచ్చి, మెస్‌లో చాయ్ తాగి నిద్రపోయాను. అలా నిద్రపోవడం వలన రాత్రంతా ఫ్రెష్‌గా ఉంటుంది. చదువుకోడానికి బావుంటుంది. నేను సగం నిద్రలో ఉండగా, నా రూము తలుపు దబదబ చప్పుడైంది. నిద్ర చెదిరి తెలివివచ్చేసింది.

ఈ సమయంలో ఎవరు వచ్చి తలుపుకొడుతున్నారా? అని ఆశ్చర్యపోయా... నా రూమ్మేటు అవడు. అతనికి తెలుసు నేను నిద్రపోతానని, ఏడుగంటలవరకూ రూముకి రాడు. ఊళ్ళో తిరగడానికి పోతాడు. మరి ఈ సమయంలో ఎవరైవుంటారా? అని చేతివాచీ చూసుకున్నా... ఆరవుతోంది. లేచి రూములో లైటువేసా! లైటు కళ్ళల్లో పడి ఇబ్బంది పెట్టింది. తలుపు తెరిచాను. అప్పుడే చీకటి పడడం వల్ల వరండాలో చీకటిగా ఉంది. కాని వరండాలో వాళ్ళు రూములో లైటుకి కనిపిస్తున్నారు. దాదాపు నలభైమంది ఉంటారు. ఫైనలియర్సూ, తర్డియర్సూ, ఉన్నారు. వాళ్ళలో నరశింహులుగాని సురేంద్రగాని ఎల్కక్ట్రికల్ మధుగాని ఎవరూ లేరు ఉండరు కూడా...

'ఎందుకు? ' అని అడిగాను చికాకుగా..

'ఫష్టియర్స్ స్ట్రైక్ చేస్తుంటే మీ రెందుకు వాళ్ళదగ్గరికి వెళ్ళారు వాళ్ళకేం సలహా ఇచ్చారు చెప్పండి' అంటూ నిలదీసారు. నాకు నిద్రమత్తు అంతగా వదలలేదు నేనూ వరండాలోకి వెళ్ళా 'అసలు విషయం ఏమిటి?' అని అడిగా.. వాళ్ళడుగుతున్న దేమిటో అర్థంకాక. 'మీరు ఫష్టియర్స్ పట్ల అంత సానుభూతి చూపించవలసిన అవసరం ఏమిటి? మీరు వాళ్ళకి ఏదో సలహా ఇచ్చారు. అందుకే వాళ్ళు సీనియర్సుకి వ్యతిరేకంగా స్ట్రైక్ చేసారు. మీరూ వాళ్ళకి ఏం సలహా ఇచ్చారు. దానివల్ల ఫష్టియర్ వోట్లు మీకు పడచ్చుగాని, మేం మాత్రం సహించం' అంటూ ఏదేదో వాగారు.

వరండాలో నిలబడ్డ నాకు వాళ్ళేమంటున్నారో అర్థం అయేసరికికి టైముపట్టింది. వాళ్ళు అడుగుతున్న ప్రశ్నలకి సమాధానంగా 'నేను జూనియర్స్‌తో ఏం మాట్లాడానో సురేంద్రకి తెలుసును, తను కూడా నాతో వచ్చాడు. సురేంద్రని అడగండి' అన్నాను.

'నువ్వేం మాట్లాడావో చెప్పవోయ్' అన్నారెవరో గుంపులోంచి, నువ్వు అన్నందుకు నాకు కోపం వచ్చింది 'మర్యాదగా మాట్లాడండి' అన్నా..

'నీకు మర్యాదేమిటి, వెధవ ఓట్లకోసం జూనియర్స్ కాళ్ళుపట్టుకున్నాక' అన్నారింకెవరో వెనక గుంపులోవుండి.

వరండాలో చీకటిగా ఉంది. వెనకనుండి ఎవరు వాగుతున్నారో తెలియడంలేదు. వాగే వాళ్ళ విషయం తెలుసుకుందామని, వెళ్ళి వరండాలో లైటు వేసాను. నేనెందుకు లైటువేసానో వాళ్ళకి అర్థం అయింది.

'మమ్మల్ని గుర్తు పట్టి ఏం చేస్తావేమిటి?' అంటూ వెనక నుండి ముందువాళ్ళని తోసారు. ముందువాళ్ళు వచ్చి నామీదపడ్డారు.

నిద్రచెడిందన్న చికాకు, వీళ్ళ ప్రవర్తన నాలో సహనాన్ని చంపాయి. గుంపులో కొందర్ని తేలికగా గుర్తుపట్టాను. నరశింహులు తాలూకా మనుషులు చాలామంది ఉన్నారు.

'మీకు ప్రవర్తించడం రాకపోతే నేర్చుకోండి, మీ అడ్డమైన ప్రశ్నలకి నేను సమాధానం చెప్పను' అన్నాను.

దాంతో మాబుగా వున్న వాళ్ళందరిలో కలకలం మొదలయింది. తగలనియ్యమని కొందరు, హేళనగా, పిల్లికూతలు అవీ కూస్తూ కొందరు. వెక్కిరింతలతో కొందరూ, ఒకర్ని ఒకరు తోసుకుంటూ అందరూ కలిసి నా మీద పడే అవకాశం కోసం ఎదురు చూస్తున్నారనిపించింది.

ఇంక బయట నిలబడితే పరువు దక్కకపోవచ్చనిపించి, వాళ్ళని ఈసడించుకుంటూ గదిలోకి వెళ్ళి తలుపువేసుకున్నాను. నేను గదిలోకి వెళ్ళి తలుపేసుకున్నా వాళ్ళు వెళ్ళిపోలేదు. నా రూము తలుపుని దబదబా బాదుతున్నారు. తలుపు బద్దలుకొడతారా అనిపించేటట్టు కొడుతున్నారు. తలుపుకి పైనున్న వెంటిలేటరు నుండి, రాళ్ళు విసిరారు, ఏవేవో అరిచారు. అన్నీ చేసి ఇంక లాభం లేదనుకుని వెళ్ళిపోయారు.

✡✡✡

## 11

**మర్నాడు నాకు తెలిసిన వివరాలని** బట్టి, ఈ గొడవ వెనకాల నరశింహులు ఉన్నాడని అర్థం అయింది. నా ఫ్రెండ్స్, వెంకటేష్ నా దగ్గరకి వచ్చి గొడవ చేసిన వాళ్ళమీద సూపరెంటెండెంట్‌కి రిపోర్టు చెయ్యమన్నారు. కాని నేనందుకు ఒప్పుకోలేదు. ఎక్కడో ఏదో వక్రించింది! ఎక్కడ? ఆ వక్రం నాలో ఉందా? వాళ్ళలో ఉందా?

ఆ రోజు సాయంకాలం టౌనుకి వెళ్ళి, కొండ్రావుతో, రాజుతో మాట్లాడాను. వాళ్ళు హెల్ప్ చేస్తామన్నారు. ప్లాను చేసి ఆ రోజు నా రూము మీద పడ్డ నలుగురైదుగుర్ని తందామనే నిర్ణయానికి వచ్చాం. మనసు శాంతించింది. కాని వెనక్కి కాలేజీకి వస్తోంటే, ఈ ఏడాదితో చదువు పూర్తయిపోతుంది. అనవసరంగా లేనిపోని అహంకారంతో ఏదైనా తప్పుడు పనిచేసి, దొరికిపోతే మళ్ళీ మరో ఏడు వృధా అవుతుందేమో? అన్న అనేకమైన ఆలోచనలు మనసుని చికాకు పెడుతుండగా, కాస్త మనఃశాంతిగా ఉంటుందని, రాజు మాష్టారి ఇంటికి వెళ్ళాను.

ఆయనతో మాట్లాడుతూ..జరిగిన విషయాలన్నీ, చూచాయగా చెప్పాను.

ఆయన విచిత్రంగా కనుబొమలు ఎగరవేస్తూ 'ఏం ప్రెసిడెంట్‌గా పోటీ చేసే ఉద్దేశం ఉందేమిటి?' అనడిగారు.

'లేదు' అన్నా...

'ఈ గొడవలన్నిటికీ మూలం అక్కడుంది' అంటూ ఓ కథ చెప్పారు.

'పూర్వం ఒకడు పేంట్స్ కొనుక్కున్నాడట. దానిని తొడుక్కుని, రెండురోజుల తర్వాత జరగబోయే పెళ్ళికి వెళ్ళాలి, అదీ వాడికోరిక, ఆ పేంట్స్‌ని ఒకకొస వొకచెట్టుకి, రెండో కొస రెండో చెట్టుకి కట్టాడు.

దూరంగా వెళ్ళి పరిగెత్తుకుంటూ వచ్చి, ఆ పేంటులో దూరిన కాలుని బైటికి తీసి మళ్ళీ దూరంగా పోయి పరిగెత్తుకు వచ్చి, పేంట్స్‌లోకి దూకుతున్నాడు. దూకిన ప్రతీసారి ఏదో ఒక కాలే పేంట్‌లోకి వెళుతోంది. ఇలా చాలా ప్రయత్నాలు చేసి అలసిపోయాడు, కాని పట్టువదలలేదు. ఆ సమయంలో అటుపక్కగా కతను వెళుతూ వీడిప్రయాస చూసి 'ఇలా ఎందుకు చేస్తున్నావు?' అని అడిగాడు.

'ఈ పేంట్ తొడుక్కుని పెళ్ళికి వెళ్ళాలి నేను.' అన్నాడు వీడు.

ఆ దారిన పోయే అతను 'దానికింత రాద్ధాంతం ఎందుకురా?'అని పేంట్‌ని తీసుకుని, ముందు ఒక కాలుకి పేంటు తొడిగి, దాన్ని పట్టుకుని రెండో పేంటులో రెండో కాలు తొడిగి పేంట్ పూర్తిగా వేసుకున్నాడు.

దాంతో కుర్రాడు పేంట్స్ తొడుక్కోడం ఇంత తేలికా? అని పేంట్ తొడుక్కుని వెళ్ళిపోయాడు. అంటూ కథముగించి, జ్ఞానానికి, అజ్ఞానానికి ఉన్న తేడా ఏమిటంటే పేంట్స్ వేసుకోవడానికి, వేసుకోడం తెలియకపోడానికి ఉన్నంత తేడా మాత్రమే అంటూ ఇంకా ఏవేవో మాట్లాడారు.

ఆ కథ ద్వారా మాష్టారు చెబుదామనుకున్న విషయం ఏమిటా? అని ఆలోచించాను. ఆ రోజు రాత్రే హాష్టల్లో సురేంద్రని కలిసినప్పుడు 'జరిగిన గొడవగురించి మాట్లాడుతూ, నేను ప్రెసిడెంట్‌గా పోటీ చెయ్యనని, చేసే ఉద్దేశం లేదని, అనవసరంగా లేనిపోని గొడవల్లోకి, ఈడుస్తున్నారని' బాధపడ్డా....

సురేంద్ర మౌనంగా విన్నాడు... సురేంద్రకి తెలుసు గొడవ ఎవరు చేసారో? ఎవరు చేయించారో అంతేకాక నేను ఎవరికి ఈ సందేశం పంపిద్దామనుకున్నానో, అదివాళ్ళకి చేరుతుందని కూడా నాకు తెలుసు. నేననుకున్నట్టుగా నరసింహులుకి సందేశం అందింది. రెండు రోజుల తర్వాత నా రూముకి గొడవ చేసిన కొందర్ని తీసుకొచ్చి, నాకు 'సారీ' చెప్పించాడు.

'ఇలా జరిగిందని నాకు తెలీదు బాస్' అంటూ ఎంతో కలివిడిగా మాట్లాడాడు. ఆ రోజునుండి నాతో కలివిడిగా ఉంటూ, నా రూముకొస్తూ, నన్ను సలహాలు అడుగుతూ, నన్ను ఇంకో సమస్యలోకి నెట్టేసాడు.

✡✡✡

నరసింహులు నా దగ్గరికి రావడం, నాతో చనువుగా ఉండడం ఎలక్ట్రికల్ మధుకి నచ్చలేదు.

కాని ఏం చెయ్యడానికి తోచక 'వాళ్ళతో తిరుగుతావేమిటి బాస్' అనేవాడు. నా రూములో ఏం జరిగినా ఎలక్ట్రికల్ మధుకి తెలుస్తూండేది. దానికి కారణం నా రూం మేటు వాడికేస్టవడమే!

రోజులు గడుస్తున్నాయి ఎలక్షన్లు వచ్చేసాయి.

నరశింహులు, ఎలక్ట్రికల్ మధు ప్రెసిడెంట్స్‌గా నిలబడ్డారు. ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ప్రచారంలో ఒకరోజున, సైన్స్ కాలేజీ స్టూడెంట్స్ వెంకటేష్ తరపున ప్రచారానికి వచ్చి, నా రూములో పడుకున్నారు. మర్నాడు లేచి వెళ్ళిపోయారు.

తెల్లారి లేచాక, మా రూమ్మేటు తన జేబులో ఎనభై రూపాయలు పోయాయని చెప్పాడు నేను కాలేజీ కెళ్ళే తొందర్లో పెద్దగా పట్టించుకోలేదు. 'సరిగ్గా చూడు' అని చెప్పి వెళ్ళిపోయాను.

ఆ రోజు సాయంకాలానికి మా రూం మేటు తన డబ్బులు పోయిన విషయాన్ని మొత్తం హాస్టలంతా ప్రచారం చేసేసాడు, ఎలక్ట్రికల్ మధు నా రూము కొచ్చి, 'అలా డబ్బులు ఎలా పోతాయి? ఎవరో ఒకరు తీసి ఉండాలిగా అన్నాడు. వాడెందుకు ఈ విషయంలో ఇంత ఇంట్రస్టు తీసుకున్నాడో.. నాకప్పుడు అర్థంకాలా...!

అప్పుడు నాకు కూడా అనుమానం వచ్చింది. ఎవరో ఒకరు తీయకపోతే డబ్బులు ఎలా పోతాయి.

క్రితం రోజు రాత్రి నా గదిలో పడుకున్న ఐదుగురో నేనో తీసుండాలి అప్పటికే ఈ విషయం తెలిసి వెంకటేష్ వచ్చి విషయం తెలుసుకుని, 'రాత్రి నా గదిలో పడుకున్న వాళ్ళతో మాట్లాడతాను' అన్నాడు.

మర్నాడు ఆ విషయం నా కొలీగ్స్‌తో మాట్లాడాను. వెంకటేష్ సైన్స్ కాలేజీ స్టూడెంట్స్‌తో మాట్లాడాడు. ఎవరూ తీయలేదని తెలిసింది. కాని రూం మేటు డబ్బులు పోయాయి అంటున్నాడు కాబట్టి, అందరం తలో కాస్త వేసుకుని రూం మేటుకి డబ్బులు ఇచ్చేద్దామనే నిర్ణయానికి వచ్చాం, అదే నిర్ణయాన్ని రూం మేటుకి చెప్పాను, రూం మేటు కూడా తన డబ్బులు తనకి వస్తే చాలన్నట్టు ఊరుకున్నాడు. నా మనసు శాంతించింది.

✡✡✡

కాని మనశ్శాంతి మర్నాటికల్లా మాయమైంది.

మర్నాడు రూమ్మేటు నా దగ్గరకి వచ్చి.. 'వాళ్ళందరి దగ్గరా వసూలు చేయడం ఎందుకు, డబ్బులు పోడానికి మీరే కారణం మీరే తీసుంటారు ఇచ్చుకోండి' అన్నాడు.

నేను డంగైపోయా.. రూం మేటు చేత ఇలా మాట్లాడించింది ఎలక్ట్రికల్ మధు అన్న అనుమానం వచ్చింది. రూం మేటు నన్ను శంకించినందుకు చాలా బాధ కలిగింది. నెల మధ్యలో డబ్బుకి నేనెంత ఇబ్బంది పడతానో రూం మేటుకి బాగా తెలుసు, నా మెస్ బిల్లు పోనూ నా చేతిలో ఇరవై, ముప్పైరూపాయలు మించి మిగలవు...

నేను మిగతా వాళ్ళల్లా ఖర్చు పెట్టను. ఈ విషయం రూం మేటుకి తెలుసు అప్పుడప్పుడు వాడి డబ్బు మదం చూపించి 'తీసుకోండి సార్ డబ్బుకేముంది.' అంటాడు. అది నాకు నచ్చదు.

రూం మేటు నా రూములో చేరడానికి కారణం నేను ఇంజనీరింగ్ మెకానిక్స్, స్ట్రెంత్ ఆఫ్ మెటీరియల్స్ చెపుతానని, కాని వాడా సబ్జెక్ట్స్ చెప్పించుకు ఊరుకుంటే, సరిపోయేది. కాని డబ్బు విషయంలో నన్ను మాటమాటికీ తక్కువచేసి, నా మీద చూపే సానుభూతి భరింపరానిదిగా ఉంటోంది. కానీ వాడి వక్ర బుద్ధిని ఇంకొక్క ఏడాదే కదా అని భరిస్తున్నా. చందు రూం మేటుగా ఉన్నన్నాళ్ళు ఏ సమస్యా ఉండేదికాదు.

రూం మేటు సానుభూతి కాస్తా, అవమానించే స్థితికి మారడమో తాత్కాలికంగా తట్టుకోలేకపోయాను. ఛీ వెధవ ఎనభై రూపాయలు తీసుకొచ్చి వీడిమొహాన కొడితే సరి అనిపించింది.

ఆ ఆలోచనతోనే ఆ రోజు క్లాసుకి వెళ్ళకుండా, ఇంటికి వెళ్ళాను.

✡✡✡

నేను ఇంటికి వెళ్ళేసరికి అమ్మకి ఒంట్లో బాగాలేదు. అమ్మ మంచానికి అంటుకుపోయి ఉంది.

నే వచ్చానని తెలిసి మావయ్య వచ్చాడు. 'మీ అమ్మకి మూడురోజులనుండి ఒంట్లో బాగోలేదురా. ఒకటే దగ్గు డాక్టరు దగ్గరకి వెళ్ళమంటే ఏముందీ రేపు తగ్గిపోతుంది. కాని డాక్టరు దగ్గరకి వెళ్ళదే' అన్నాడు. మావయ్యకి ఏకోనేకోహమస్మి అన్న మంత్రం వచ్చు.. ఎవరి దగ్గర వాళ్ళ తాళం వేస్తాడు.

అమ్మని అడిగితే 'అబ్బే పరవాలేదు కొంచెం సుళువుగానే ఉంది డాక్టరు దగ్గరకి ఎందుకూ' అంది.

కాని అమ్మ మొహం చూస్తే, అమ్మ చెప్పిన సుళువు, ఎక్కడా కనబడలేదు. మొహం భారంగా ఉంది, ఒళ్ళు వేడిగా కాలిపోతోంది. అమ్మ పెట్టి తెరిచి చూసాను. పెట్టిలో ఐదు రూపాయలున్నాయి. డబ్బుల్లేకపోవడం వల్లే, అమ్మ తటపటాయిస్తోంది. ఏం చెయ్యాలా? అని రెండు నిమిషాలు ఆలోచించి, అమ్మ మెడలో డబ్బుల్లేకపోవడం వల్లే, అమ్మ తటపటాయిస్తోంది. ఏం చెయ్యాలా? అని రెండు నిమిషాలు ఆలోచించి, అమ్మ మెడలో గొలుసు తీసుకుని ఎప్పుడూ అప్పు పెట్టే అతని దగ్గరకి వెళ్ళా.., గొలుసు తాకట్టు పెట్టి, యాభైరూపాయలు అప్పుతెచ్చాను.

అమ్మని డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళా. డాక్టరు అమ్మకి ఇంజక్షను ఇచ్చి, మందులు రాసాడు. అమ్మని ఇంటి దగ్గర దిగబెట్టా. డాక్టరు కిచ్చింది, రిక్షాకిచ్చింది, మందులు పోను చేతిలో ఇరవైరూపాయలు మిగిలాయి. పదిరూపాయలు అమ్మకి ఇచ్చి, మావయ్య ఇంట్లో భోజనం చెయ్యమంటున్నా, వినిపించుకోకుండా కాలేజీకి బయలుదేరాను.

కాలేజీకి బస్సుమీద వెళ్ళబుద్ధి వెయ్యలేదు. నడుస్తూ జగదాంబా థియేటర్ వరకూ వెళ్ళి అక్కడ బస్సు ఎక్కుదామని, మెయిన్ రోడ్డు మీదకి వచ్చా...

మధ్యాహ్నం పదకొండు గంటలయిందేమో, మెయిన్ రోడ్డు రద్దీగా ఉంది. డేటైమ్‌కిల్లర్స్ అనబడే బస్సులు ఝూం అంటూ రోడ్డుమీద పోతున్నాయి. సింధీ పాన్ వాలా దగ్గర నిలబడి ఓ పేకెట్ 'కేప్ స్టన్' సిగిరెట్లు కొన్నా.. ఎందుకు అలా కొన్నానో నాకే అర్థంకాలేదు ఒక సిగరెట్టు అంటించి రోడ్డుమీద నడవడం మొదలు పెట్టా...

సిగరెట్టు పొగ లోపలికి వెళ్ళగానే, రూం మేటు డబ్బు జ్ఞాపకం వచ్చింది. దొంగతనం అంటగట్టిన రూం మేటు మీద తీరని కోపం, నా ఆర్థిక నిస్సహాయతకి కసి, అన్నీ కలిపి కడుపులో ఆకలిని చంపేసాయి, మెల్లగా దిక్కులు చూసుకుంటూ నడుస్తున్నాను.

వైజాగ్ ఎంపోరియం దగ్గరకి వచ్చేసరికి అక్కడ ఓ గోల్డు షాపు బయట గుమికూడిన జన్నాన్ని చూసి, కుతూహలం ఆపుకోలేక, జనం దగ్గరకి వెళ్ళా.. షాపు బయట ఎవడో నిలబడి షాపువాడ్ని నానాతిట్లూ తిడుతున్నాడు.. దానికి కారణం వీడు కరిగించడానికి, మూడు తులాల బంగారం ఇచ్చాడు. తరుగుపోయిందని షాపువాడు వీడిచేతిలో తులంన్నర బంగారం మాత్రమే పెట్టాడు. షాపువాడిని వీడు రోడ్డుమీద నిలబడి 'దొంగవెధవ' అంటూ బండబూతులు తిడుతున్నాడు. షాపువాడు వీడికి నచ్చ చెపుదామని చూసాడు.! వీడు వినలేదు. బంగారం ఇచ్చి ఉంటే విన్ను... కాని, షాపువాడు నచ్చచెప్పడంలో తరుగు బంగారం ఇస్తానన్న హామీ ఎక్కడాలేదు. అందుకే వీడు షాపువాడు చెప్పింది వినకుండా తిట్లు తిడుతున్నాడు. ఇంక ఇలా పనికిరాదని షాపువాడు గూర్ఖావాడ్ని పిలిచి వాడ్ని షాపు బైటకి ఈడ్పించేసాడు. వాడు షాపు బైట నిలబడి షాపువాడిని తిడుతున్నాడు. అక్కడ చేరిన జనంకి వీడిమీద సానుభూతి ఏర్పడింది. 'ఎవరూ ఏమీ పోగొట్టుకోడం, మోసపోడం, ప్రజలకి నచ్చదు. షాపువాడు తన పని తను చేసుకుంటూనే, గోల్డు ఫ్రేము కళ్ళద్దాలలోంచి షాపు ముందు గుమికూడిన ప్రజల్ని చూస్తున్నాడు. దాంతో ప్రజలకి షాపువాడంటే కసి పెరిగింది. బంగారం పోగొట్టుకున్న వాడికి సలహాలిస్తూ 'ఎంతయినా కంసాలాడ్ని నమ్ముతావయ్యా' అంటున్నారు.

'మరి బంగారం వస్తువు కరిగించడానికి డాక్టరు దగ్గరకి వెళతామండీ', అన్నాడో హాస్యప్రియుడు.

ఈ గందరగోళం జరుగుతుండగానే, పోలీసు ఇన్‌స్పెక్టర్ వచ్చాడు. పోలీసు ఇన్‌స్పెక్టర్ జనాన్ని తోసుకుని షాపు దగ్గరకి వచ్చి, అంతవరకూ షాపువాడిని తిడుతున్న వాడిని పట్టుకున్నాడు. 'నీకీ తులంన్నర బంగారమేనా ఎలా వచ్చింది?' అది చెప్పు, అంటూ వాడ్ని పోలీసు స్టేషను వేపు తీసుకు పోయాడు. ఇన్‌స్పెక్టరు వాడిని పట్టుకున్న తీరు, లాక్కెళ్ళిన లాఘవం, చూస్తే వీడు పాతదొంగే అనిపిస్తుంది. అంతవరకూ అక్కడ నిలబడి సలహాలిస్తున్న జనం వీడూ దొంగవెధవేనా! అనుకుంటూ ఈ లోకంలో ఎవర్ని నమ్ముకూడదు. అనవసరంగా అరగంట టైము వేస్టుచేసాం, అనుకుని ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

నేను నవ్వుకుంటూ ముందుకి నడిచా.. ఒక్క నిముషంలో సీనంతా మారిపోయింది. ఈ లోకంలో ఎవరు వక్రిస్తున్నారో, ఎవరు రుజు మార్గంలో పోతున్నారో చెప్పడం కష్టం! సానుభూతి షాపువాడి మీదకి మారిపోయింది.

ఇంతవరకూ నడుస్తున్నానేగాని, నెత్తిమీద ఎండని పట్టించుకోలేదు. నెత్తిమీద ఎండ చురుక్కు మనేసరికి అవతలి మునిసిపాలిటీ కొళాయి దగ్గర వరసగా క్యూలో బిందెలు పెట్టి ఉన్నాయి. కొళాయి ఒంటిగంటకి విప్పుతాడు.. కాబోలు, దూరంగా ఇళ్ళ అరుగుల మీద అమ్మలక్కలు చేరి, కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంతలో ఒకావిడ ఎవరో సరసరా నడిచి వచ్చి లైన్లలో పెట్టిన బిందెల్లో సిల్వర్ బిందెని తీసి రోడ్డు పక్కకి విసిరేసింది. వెంటనే అరుగు మీద కూర్చున్న ఇంకో ఆవిడ 'అమ్మ నీ చేతులుపడిపోనూ, నా బిందె నిన్నేం చేసిందే', అంటూ లేచి వచ్చింది.

బిందె పక్కన పడేసినావిడ 'నీ బిందె నన్నేటీ సెయనేదు, మావిక్కడ నీటి సుక్కనేకుండా తపించి పోతుంటే, నువ్వేమో బిందె పావలా సొప్పున అమ్ముకుంటున్నావు, ఆ మునిసిపాలిటీ చచ్చినోడు నీరొదల్డు... వదిల్నేదా పట్టుమని పదినిముషాలు పట్టుకోనీడు

తాగడానికి నీటి సుక్క నేక మేం సస్తూంటే, మేటనీ సోకి డబ్బుల్లేక నువు గిలగిల్లాడిపోతున్నావు మావంతా పట్టుకున్నాకే నీకు నీళ్ళు, అట్టే మాట్టాడేవంటే బింది కుళ్ళు కాలువలో పడీగల్ను జాగ్రత్త' అంది.

బిందెగలది వచ్చి 'నీ బాబుగారి సొమ్మేటి కుళాయి, అంత విరగ బడిపోతున్నావు.' అంటూ తగులుకుంది. ఇద్దరూ కలబడే టైముకి కొళాయిలిప్పేవాడు వచ్చాడు

'ఏట్రా ఇప్పతున్నావా?' అంది బింది విసిరేసినావిడ.

'ఇయాళ టేంకులు క్లీన్ చేసాం, నీళ్ళు రావు పొండెహె' అన్నాడు కొళాయిలిప్పేవాడు.

అంతే బిందెలన్నీ మాయమయ్యాయి. ఇళ్ళ గట్లన్నీ కాళీలయిపోయాయి. వాడు కొళాయి విప్పుంటే ఎవరు గెలుస్తారో చూద్దును, కాని ఆ అవకాశం కొళాయిలిప్పేవాడు లేకుండా చేసాడు.

నడుస్తున్న నాకు నీడలో పేవుమెంటు మీద బత్తాయి పళ్ళు అమ్ముతున్న అమ్మాయి కనిపించింది. పొద్దున్నే ఇంటిపన్లన్నీ ముగించి, ముస్తాబై పళ్ళగంప పట్టుకుని, మెయిన్ రోడ్డు మీదకొచ్చి, కోపరేటివ్ బేంక్ పక్కగా కూర్చుంటుంది. ఎంత పళ్ళమ్ముకునేది అయినా చాలా బావుంటుంది. తెల్లటి శరీరచ్చాయ, నల్ల కాటుక పెట్టిన కళ్ళు వాలుజడ తలనిండా పువ్వులు, తీర్చిదిద్దిన ముక్కు, ముక్కుని ఆశ్రయించి మెరిసిపోతున్న ముక్కుపుడక, సన్నటి పాలిస్టర్ చీరలో ఒకసారి చూస్తే మళ్ళీ చూడాలనిపిస్తుంది. మాట్లాడితే సరసం ఆడాలనిపించేంత మనసేస్తుంది.

ఒకసారి రాజగోపాల్‌తో బత్తాయిలుకొనడానికి, దాని దగ్గరకి వెళ్ళా, రాజగోపాల్ బత్తాయిలు బేరమాడుతూ, 'పళ్ళు డజను ఎంత, మంచివేనా రసముంటుందా?' అని అడుగుతున్నాడు.

నేను పక్కనే నిలబడి దానిమొహంలోకి చూస్తూ 'పండుకొనవచ్చు బాగానేవుంది' అన్నా.. నా మాటలో వంకర అది పట్టేసింది నవ్వుతూ 'బాబూ పండుకొనాలని ఉంటే కొనుబాబూ పళ్ళు మంచివే బావుంటాయి' అంది.

నా కొంటెతనం అది పసిగట్టేసిందని నా కర్థం అయినా తిట్టనందుకు సంతోషించా.. అక్కడినుండి వస్తుండగా రాజగోపాల్ మాత్రం 'ఈ రోజు తిట్లు తినే యోగం తప్పిందిరా. అదిగాని తిట్టిందంటే ఈ రోడ్డున ఇంక నడవలేము' అన్నాడు. ఆ రోజు నుండి నన్నెప్పుడు చూసినా అది హాస్యాలాడేది 'ఏం బాబూ ఒక్కసారేనా పండుకొనవా' అంటె... అక్కడ నిలబడి దానితో కబుర్లు చెప్పేవాడిని.

ఆ రోజు నడిచిపోతున్న నన్ను చూసి నవ్వింది. 'ఏం బాబూ ఎక్కడా కనబడ్డం లేదు.?' అనడిగింది. హాస్టల్లో ఉంటున్నానని చెప్పా...

'మీ నేస్తాయన కూడా కనబడలేదేం' అనడిగింది.

'బెంగుళూరు వెళ్ళాడు అక్కడ చదువుకుంటున్నాడు' అన్నా. అది నవ్వేసింది. దాని దగ్గర పదిపైసలిచ్చి జాంకాయ కొని.. అది కొరుక్కుంటూ ముందుకి వెళ్ళా.. బుక్ సెంటర్ తగిలింది. దాంట్లో దూరి కొత్త పాత పుస్తకాలు తిరగేసా... అప్పటికి వంటిగంటన్నర అయింది. బుక్ సెంటర్‌కి ఎదురుగా గోడమీద 'సాక్షి' సినీమా వాల్ పోస్టర్ ఆకర్షించింది. చూస్తున్న పుస్తకాల్ని విడిపించుకుని, మెయిన్ రోడ్డు మీదకి వచ్చి రిక్షా ఎక్కి విజయా గార్డెన్స్ దగ్గర దిగా... విజయా గార్డెన్స్‌లో టిఫిన్ చేసి, అక్కడ నుండి రామకృష్ణా ధియేటర్‌కి వెళ్ళా..... సాక్షి సినిమా పాతదే అవడం వల్ల ఎక్కువ మంది జనం లేరు టిక్కట్టు తీసుకుని, హాలులోకి వెళ్ళి ఒక మూల కూర్చున్నాక, ఎండలో తిరిగొచ్చిన శరీరం సేద తీరింది.

మళ్ళీ అదే ప్రశ్న ఏది వక్రించింది? నేను చెయ్యని దొంగతనానికి నేనెందుకు అవమానం పాలయ్యాను. నన్నెవరు అవమానం చేస్తున్నారు. నేనెందుకు భరిస్తున్నా.. భరించక చేసేదేమిటి? భరించి చేస్తున్నదేమిటి? ఎక్కడికి తప్పించుకు పోగలను? ఎవర్నించి

తప్పించుకోవాలనే ప్రయత్నం? ఇవన్నీ వక్రమయితే రుజుమార్గం ఏది? ఆత్మ ప్రభోధమా? సినిమా అయిపోగానే బైటకి వచ్చి బస్సు ఎక్కి హాస్టలుకి వచ్చేసాను.

నేను రూములోకి రాగానే రూం మేటు బైటకి వెళ్ళిపోయాడు, నేను రూముకి తాళం వేసి మెస్‌కి వెళ్ళి కాఫీ తాగి సిగరెట్టు వెలిగించి బైటకి వచ్చే సరికి, నాకు వెంకటేష్ ఎదురయాడు.

'ఏమిటిసార్ ఎక్కడికి వెళ్ళారు. పొద్దున్నుండి మీ గురించి వెదుకుతున్నా' అన్నాడు.

నేను 'ఇంటికి వెళ్ళా' అని చెప్పాను. నేను డబ్బుకోసమే ఇంటికి వెళ్ళానని గుర్తుపట్టాడు వెంకటేష్. ఎండకి మాడిపోయి నల్లబడిన నా మొహాన్ని చూసాడు.

'మీ రూం మేటు మాట మార్చినట్టు చెప్పకుండా ఇంకా ఏవేవో విషయాలు మాట్లాడుతూ వెంకటేష్‌తో నా రూముకి వచ్చాను.

నేను రూముకి వచ్చేసరికి రూములో ఎలక్ట్రికల్ మధు, రూపమ్ ఉన్నారు. నేను రూములోకి వెళ్ళగానే రూం మేటు 'నా ఎనభై రూపాయలు ఎప్పుడు ఇస్తారు?' అని అడిగాడు.

వెంకటేష్ ఏదో చెప్పబోయాడు. కాని వెంకటేష్‌ని నేను ఆగమని 'ఏ ఎనభైరూపాయలు?' అని అడిగా..

'అవే నా జేబులోంచి పోయినవి.'

'నా ఫేంటు జేబులోంచి'

'ఏ పేంట్'

'ఆ రోజు తొడుక్కున్న ఫేంటులోంచి'

'ఏ రోజు'

'డబ్బుపోయిన రోజు'

'డబ్బు పెట్టగానే పోయాయా? పెట్టిన ఎన్ని గంటలకి పోయాయి.'

రూం మేటులో అనుమానం పెరిగింది.

'నా డబ్బు ఇస్తారా? ఇవ్వరా?' అన్నాడు.

'ఏ డబ్బు'

'పోయిన డబ్బు'

'నీ డబ్బు పోయిందని నమ్మకం ఏమిటి?'

'నే చెపుతున్నానుగా'

'నే చెపుతున్నాను నువ్వు నీ జేబులో డబ్బే పెట్టలేదు.'

నా రూం మేటుకి నేనేం చెప్పదలచుకున్నానో అర్థం కాలేదు. కానీ ఎలక్ట్రికల్ మధుకి అర్థం అయింది. నేను మొండికేసానని 'పోనీలేవోయ్ అందరి దగ్గరా కలెక్ట్ చేసి ఇస్తానన్నావుగా, కలెక్ట్ చేసి ఇచ్చేయ్' అన్నాడు.

'ఇప్పుడు అది కూడా కుదరదు. నాకు రూం మేటు మీద అనుమానం అతని డబ్బులు పోలేదని' అని అన్నా...

ఇంక ఎలక్ట్రికల్ మధు మాట్లాడలేదు. 'మీ ఇద్దరి సమస్యా మీరే చూసుకోండి.' అని వెళ్ళిపోయాడు. రూపమ్‌తో కల్సి.

వెంకటేష్ నన్ను చిరునవ్వుతో చూసి, 'మళ్ళీ కలుద్దాం' అని వెళ్ళిపోయాడు

అందరూ రూం మేటుని వదిలి వెళ్ళిపోయేసరికి, రూం మేటు ఉడుక్కున్నాడు. మీ డిపార్ట్ మెంటు హెడ్‌కి చెపుతా.. ప్రిన్స్‌పాల్కి చెపుతా... అని విసురుగా గదిలోంచి వెళ్ళిపోయాడు.

అందరూ బైటకి వెళ్ళిపోయాక, మనసు శాంతించగా పక్క మీద వాలాను. అలసిన శరీరం నిద్రలోకి జారుకుంది.

✡✡✡

రూం మేటు ఈ విషయం మా డిపార్టు మెంటు హెడ్‌తోనూ ప్రిన్సిపల్ తోనూ కంప్లైంటు చేసాడు.

వాళ్ళు కూడా కలగచేసుకోకపోవడంతో, ఇంకేం చెయ్యలేక గమ్మున ఊరుకున్నాడు.

నేను రూంమేటుకి డబ్బు ఇవ్వకపోవడం అందరికీ నచ్చింది. ఇదంతా ఎలక్ట్రికల్ మధు నన్ను ఇరికించడానికి ఆడించిన నాటకం అని అనుకున్నారు.

ఎలక్షన్లు అయిపోయాయి. నరసింహులు ప్రెసిడెంట్‌గా గెలిచాడు కాలేజీ సద్దుమణిగింది. రోజులు గడిచిపోయాయి. ఫైనలియర్ పరీక్షలు వచ్చాయి అయిపోయాయి

అందరం కాలేజీ అనుభవాల్ని వెనక్కి వదలి ఎవరి ఉద్యోగాలు వాళ్ళు వెదుక్కుంటూ చెల్లాచెదరైపోయాం.

✡✡✡

## 12

***పరమధన సోపానపటం*** **ఇదో రుజు, వక్రమార్గాల మేలు** కలయిక. ఇందులో అన్నిటికన్నా కష్టమైన పని మానవ సంబంధాల్ని అర్ధం చేసుకోడం.. ఎవరు ఎప్పుడు ఏ స్వార్ధంతో మంచితనంతో.. త్యాగంతో.. ఈర్ష్యతో.. లేదా ఏ భావంతో ప్రవర్తిస్తారో తెలుసుకోడం కష్టం... 'యేకో నేకో హమస్మి' అన్న మంత్రం అందరికీ వచ్చు.. అదే మనుగడగా మనుషులు బతికేస్తున్నారా? లేక నిత్యావసర వస్తువుల్లో అదీ ఒకటా?

ఎందుకంటే.. బాల్యంలో పసితనపు తెర.. యవ్వనంలో తుందుడుకు పొర.. ఓ విధంగా మోసం చేస్తాయి. మనచుట్టూ చేరిన మనుషులు, ఆ తెరల్ని పొరల్ని ఆసరాగా చేసుకు వంచిస్తారు. మనకి 'యేకో నేకో హమస్మి' అన్న మత్రాన్ని అంటగడతారు. దాన్ని మనమీద రుద్దేస్తారు ఇన్ని చేసినా ఆ మంత్రం ఎప్పుడు ఉపయోగించాలి?... ఎప్పుడు మన్లో ఇంకోమనిషిని పిలవాలి? ఎవర్ని పిలవాలి? అన్నది మళ్ళీ మనమే నిర్ణయించుకోవాలి?

ఇదంతా పరమధన సోపానపటంలో స్పష్టంగా కనిపించే ఎగుడూ దిగుళ్ళు! ఈ పరమధన సోపాన పటం ఓ సర్‌ప్రైజ్! నాతో పనిఉన్నవాళ్ళూ, నాకు పనికొచ్చేవాళ్ళూ,... నాతో బంధుత్వం కలుపుకున్న వాళ్ళూ, నేను బంధువులుగా తలచినవాళ్ళూ, అందరూ ఏదో ఒక సర్‌ప్రైజ్ కలుగచేసినవాళ్ళే!

ఈ పరమధన సోపాన పటంలో.. పాములు నిచ్చెన్లే కాదు జంతు స్వభావం సంతరించుకున్న మనుష్యులు, మనిషి స్వభావాన్ని ప్రాక్టీస్ చేస్తున్న జంతువులు, ఉంటాయి. ఎందుకంటే ఎవరో మహానుభావుడు 'మేన్ ఈజ్ ది మిస్సింగ్ లింక్ బిట్వీన్ ఏప్స్ అండ్ హ్యూమన్ బీయింగ్స్' అన్నది అక్షరాల నిజం!

జీవితం సుతారంగా సుఖంగా గడుస్తోందనే భ్రమ! ఇంద్రజాలికుడు షోలో చిక్కుకున్న మనసు! అన్నీ మనవే, కానీ మనవి కాదు. అదొక విచిత్రం. అన్నింటికీ మించి ప్రతి గడిలో నేను అంతో ఎంతో లేదా కొంత, ప్రతీ బంధువులో నేను, ప్రతీ స్నేహితుడిలో నేను, అంతెందుకు ప్రతీ మనిషిలో నేను.. అందుకే 'యేకో నేకో హమస్మి!!. కానీ మా అందర్నీ ఒకే సూత్రం బంధించింది. అది ధనం అందుకే ఈ పుటలు పరమధన సోపానపటం.'

✡✡✡

డిగ్రీ పూర్తి చేసి ఇంటికి వచ్చి, ఉద్యోగం కోసం వెదకడం మొదలుపెట్టా... ఉద్యోగం విషయంలో చిన్నాన్న సహాయం చేసాడు. తనకి తెలిసిన సూపరెంటెండెంట్ ఇంజనీరు దగ్గరకి తీసుకు వెళ్ళాడు. ఆయన జూనియర్ ఇంజనీరు ఉద్యోగం అయితే చీఫ్ ఇంజినీరు ఎపాయింట్ చెయ్యాలి. అందాకా టెంపరరీగా రిజర్వాయర్ ప్రాజెక్ట్‌లో, వర్క్స్ ఇన్స్పెక్టర్‌గా వేస్తాను అన్నాడు.

ఏ ఉద్యోగం అయితేనేం వెంటనే ఎంతో కొంత డబ్బు వచ్చి జేబులో పడితే చాలు అన్న ఉద్దేశంతో, ఆ ఉద్యోగంలో జాయిన్ అయాను.

రిజర్వాయరు ప్రాజెక్ట్ విశాఖపట్నానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉంది. విశాఖపట్నం నుండి గోపాల పట్నం వెళ్ళి అక్కడ నుండి రెండు కిలోమీటర్లు నడిస్తే రిజర్వాయరు ప్రాజెక్ట్ అసిస్టెంటు ఇంజినీరు ఆఫీసుకి చేరతాం. రిజర్వాయర్ ప్రాజెక్ట్‌కి, అసిస్టెంటు ఇంజినీర్ ఆఫీసుకి మధ్య ఓ కిలోమీటరు దూరం ఉంది. అసిస్టెంటు ఇంజినీర్ ఆఫీస్‌కి కాస్త దూరంగా డిపార్ట్‌మెంట్ క్వార్టర్స్ ఉన్నాయి. వాటిలో సూపర్ వైజర్స్, జూనియర్ ఇంజినీర్లు, వర్కు ఇన్స్పెక్టర్లు, డ్రైవర్లు, ప్యూనులు, మిగతా స్టాఫూ ఉంటున్నారు.

ఈ క్వార్టర్లన్నీ రిజర్వాయరు ప్రాజెక్ట్ వర్క్ స్పాటుకన్నా, ఎత్తైన స్థలంలో ఉన్నాయి.

క్వార్టర్స్‌లో ఉన్న స్టాఫు కాకుండా, చాలా మంది విశాఖపట్నం నుండి, గోపాల పట్నం నుండి వస్తారు.

రిజర్వాయర్ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం, అక్కడ పారుతున్న ఏరుకి అడ్డగా మట్టి డామ్ కట్టడం, నీరు నిలబడి పోయి వెనక ఉన్న గ్రామాలని ముంచేయకుండా ఉండడానికి సర్ప్లస్‌వియర్ కట్టి దాని స్ట్రక్చరల్ స్టీల్ మెకానికల్ తలుపులు అమర్చడం.

నేను జాయిన్ అయిన నాటికి మట్టి డామ్ పని ముమ్మరంగా జరుగుతోంది. నన్ను క్వాలిటీ కంట్రోల్ డివిజన్‌లో వేసారు. మట్టి డామ్ నిర్మించడానికి ఉపయోగిస్తున్న మట్టిని బంటాల నుండి తీసుకొచ్చి, దానికి మేక్జిమమ్ డ్రై డెన్సిటీ, ఆప్టిమమ్ మోయిస్చర్ కట్టి, ఆ మట్టి, మట్టి డామ్‌లో ఉపయోగించడానికి పనికి వస్తుందా? రాదా? అని నిర్ణయించడం. ఉపయోగపడుతుందని నిర్ణయించిన మట్టితో కంట్రాక్టరు, మట్టి డామ్‌పై లేయరుగా వేసి తొక్కిస్తే, ఆ లేయర్ని పాస్ చేసి, దానిమీద మరో కొత్త లేయరు వేసుకోడానికి అనుమతినివ్వడం, మొదలైన పనులన్నీ మా క్వాలిటీ కంట్రోలు డివిజను చేస్తుంది.

నేను జాయిన్ అయిన రెండోరోజే మధ్యాహ్నం మూడుగంటలకి క్వాలిటీ కంట్రోలు సబ్ డివిజన్ అసిస్టెంటు ఇంజినీరు నన్ను పిలిచి 'ప్రస్తుతం వేసిన లేయర్ని, పదిసార్లు రోలరుతో తొక్కించాలి వెళ్ళి డామ్ సైటులో రాందాసు అని ఒక డ్రైవరు ఉంటాడు వాడికి చెప్పి పని పూర్తిచేయించండి, రేపు పొద్దున్న నుండీ కొత్తలేయరు వేసుకోమని కన్‌స్ట్రక్షన్ వాళ్ళకి చెప్పండి.' అంటూ నన్ను డామ్ సైటుకి పంపించాడు.

నేను డామ్ సైటుకి వెళ్ళాను. సైటులో వున్న కంట్రాక్టరు ఏజెంటుని 'రామదాసు ఎవరూ?' అని అడిగాను.

షెడ్ లోంచి నల్లగా పొడుగ్గా ఉన్న వ్యక్తి బయటకి వచ్చి 'నేనేసార్ ఏంకావాలి?' అని అడిగాడు.

'నిన్న వేసిన లేయర్ని మరో పది సార్లు తొక్కమని ఎ.యి.గారు చెప్పారు' అన్నాను.

'ఆ లేయర్ని తొక్కాలంటే రెండు గంటలేనా పడుతుంది సార్' అన్నాడు.

'ఇప్పుడు మూడయింది ఆఫీసు టైము అయిదు గంటలవరకూ కదా' అంటూ లీగల్ పాయింట్ తీసాను.

'నిజమే అనుకోండి కాని నాలుగు గంటల బస్సుకి మా పాపని తీసుకుని టౌను వెళ్ళాలనుకుంటున్నానండి పాపకి ఒంట్లో బాలేదు' అన్నాడు.

'పనున్నప్పుడు టౌను వెళితే ఎలా?' అన్నాను.

రామదాసు నన్నో నిముషం దీర్ఘంగా చూసి 'సరిలెండి అలాగే' అని ఎర్తుడాము మీదకి వెళ్ళాడు. వెళ్ళినవాడు వెంటనే తిరిగి వచ్చేసాడు. 'టైర్లలో గాలి లేదండి, వర్క్ షాపుకి తీసుకు వెళ్ళి గాలి కొట్టించి తీసుకు వస్తాను. మీరు వస్తారా, ఇక్కడ ఉంటారా!' అనడిగాడు.

'నేనిక్కడుంటాను. వెళ్ళి ఆ పని పూర్తి చేసుకురా' అని షెడ్లోకి వెళ్ళాను.

రామదాసు వర్క్‌షాపు వేపు వెళ్ళిపోయాడు. వెళ్ళిన వాడు గంటైనా తిరిగి రాలేదు. మట్టి డామ్ మీద ఇంజను చప్పుడు వినబడలేదు రామదాసు కోసం చూసి చూసి విసుగొచ్చింది. షెడ్ లోంచి బైటకి వచ్చి వర్క్యుషాపుకి వెళ్ళాను వర్క్యుషాపులో ఫోర్‌మెన్ ఒక్కడే కూర్చున్నాడు అతనికి నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

'రామదాసు వచ్చాడా?' అని అడిగాను.

'రాలేదే ఎందుకు?' అని తిరుగు ప్రశ్న వేసాడు ఫోర్‌మెన్.

'టైరులో గాలిపోయింది. గాలి కొట్టించాలని ఇటు వచ్చాడు. ' అన్నా....

'రామదాసు నడుపుతున్నది రోలరు వాటిని ఐరన్ టైర్స్, వాటిలో గాలిపోవడం ఏమిటి?' అన్నాడు ఫోర్‌మేన్.

నేను ఖంగుతిన్నాను. రామదాసు నన్ను మోసం చేసాడు. నిజమే రోలింగ్‌కి ఉపయోగించే రోలర్‌కి ఐరన్ టైర్స్ ఉంటాయి. వాటిలో గాలిపోవడం ఏమిటి? నా మనసులో అనుమానాన్ని పసిగట్టాడు. ఫోర్ మెన్ నన్ను చూసి నవ్వుతున్నాడు, నేను ఫూల్‌నవడం నాకు ఇష్టం లేదు. ఆఫీసుకెళ్ళి రామదాసు క్వార్టరు నెంబరు తెలుసుకుని, అతని క్వార్టరుకి వెళ్ళాను. రామదాసు క్వార్టరుకి తాళం వేసి ఉంది. చేసేదేం లేక తిన్నగా ఆఫీసుకి వచ్చేసాను. రేపు అసిస్టెంట్ ఇంజినీరు నా తెలివితక్కువతనం చూసి, నవ్వకమానడు అనుకున్నా...

✡✡✡

మర్నాడు ఉదయం రిజర్వాయర్ ప్రాజెక్ట్ సైటుకి బయలుదేరానేగాని, ఆలోచనలు బుర్రలో గిర్రున తిరుగుతున్నాయి. విషయం నాకు పూర్తిగా తెలియకపోవడం వల్ల రామదాసు చేతిలో మోసపోయాను. రోజూలాగ రామదాసు ఈ రోజు ఎనిమిదిన్నరకి సైటుకి వస్తాడు. అప్పుడు మొదలు పెట్టి లేయర్ని పదిసార్లు తొక్కడానికి పదిన్నర పదకొండు పడుతుంది. తొమ్మిది తొమ్మిదిన్నరకి అసిస్టెంటు ఇంజనీర్ వచ్చి జరిగింది తెలుసుకుని, నా తెలివి తక్కువతనానికి నవ్వినా, పైకి పనంతా పాడయిందని చిందులేస్తాడు.

ఈ ఆలోచనతో ప్రాజెక్ట్ సైటుకి ఎనిమిదిన్నరకి చేరుకున్నాను. సైటులో రామదాసు రోలర్‌తో లేయర్ని తొక్కుతున్నాడు. తిన్నగా రామదాసు దగ్గరకి వెళ్ళడానికి సిగ్గుపడ్డాను. అతని చేతిలో మోసపోయినందుకు, రామదాసు నా మొహం మీద నవ్వే నవ్వుని భరించలేక అతని దగ్గరకు వెళ్ళలేదు. కన్‌ట్రాక్టరు ఏజెంటు దగ్గరకి వెళ్ళి 'రామదాసు ఎప్పుడొచ్చాడు?' అనడిగాను.

తెల్లవారుతుండగా ఆరుగంటలకి వచ్చాడండి అని చెప్పాడు. నేనాశ్చర్యపోయాను. అంటే రామదాసు లేయరు తొక్కడం పూర్తిచేసాడన్నమాట, అసిస్టెంటు ఇంజినీరు వచ్చినా, చిందులేసే అవకాశం లేదు. నేను నా ఆలోచనలో ఉండగానే పని పూర్తిచేసి రామదాసు నా దగ్గరకి వచ్చి 'లేయరు తొక్కడం పూర్తయింది సార్' అన్నాడు. నేను రామదాసు మొహంలోకి తీక్షణంగా చూసాను.

'సారీ సర్ పాపకి వంట్లో బాగోలేదు. రెండురోజులు లేయరు తొక్కడం వల్ల టౌను వెళ్ళలేకపోయాను. అవసరం కొద్దీ టౌను వెళ్ళాల్సి వచ్చింది. అందుకే వెళ్ళాను.'

'దానికి అబద్ధం చెప్పడం ఎందుకూ?' అన్నాను.

'అబద్ధం చెప్పలేదు సార్ మీరు షీప్‌ఫుట్ రోలర్‌తో తొక్కాలి అన్నారేమో అనుకున్నాను. దాంతో తొక్కాలి అంటే ట్రాక్టరు కావాలి దాని ఫ్రంట్ వీలుకి గాలిలేదు, వస్తాను సార్' అని చెప్పి తొందరగా తన క్వార్టర్ వైపు వెళ్ళిపోయాడు. రామదాసు వెళ్ళిపోయాక, కంట్రాక్టరు ఏజెంట్ 'వట్టిదే సార్ వాడికి ఎప్పుడు ఏ రోలరుతో తొక్కాలో తెలుసు అబద్ధం చెప్పి వెళ్ళిపోయాడు. నిన్న' అన్నాడు.

ఎందుకో రామదాసు నిన్న చెప్పిన అబద్దం మీద కోపం రాలేదు. నిన్న తన అవసరం కొద్దీ పని తప్పించుకున్నా, ఈ రోజు సమయానికి పనిపూర్తిచేసాడు. పనిపట్ల రామదాసు చూపిన నిజాయితీ నాకు నచ్చింది. రామదాసు నచ్చాడు. అంటే రామదాసుతో ట్యూనింగ్ ఏర్పడింది. ఎందుకో రామదాసు చెప్పిన అబద్దం కన్నా.. అతని ప్రవర్తనలో రుజుమార్గం నన్ను ఆకట్టుకుంది.

రామదాసుతో ఈ అనుభవం జరిగిన పదిహేను రోజులకి, మరో విచిత్రమైన పరిస్థితుల్లో చిక్కుకున్నాను.

✡✡✡

నేను జాయిన్ అయిన పదిరోజులకి, అసిస్టెంటు ఇంజినీరు నన్ను క్వాలటీ కంట్రోలు టెస్టింగ్ ఇన్‌చార్జి దగ్గర వేసాడు. ఓ అయిదు రోజులనుండీ రోజు సైటుకి వెళ్ళడం సేంపుల్స్ కలెక్ట్ చెయ్యడం టెస్టింగులు చెయ్యడం సర్టిఫికేటు తయారు చెయ్యడం చేస్తున్నాను. దానికోసం నాకో చిన్న సీటు, చిన్న టేబులు ఆఫీసులో నాకో ఉనికి ఏర్పడ్డాయి.

ఇదిలా జరుగుతుండగా ఓ రోజు మధ్యాహ్నం ఆఫీసులో ప్యూనులు నాన్ టెక్నికల్ వర్క్ ఇన్స్పెక్టర్లు అందరూ 'ఏమయ్యారు వీళ్ళు' అని అడిగాను.

ఇవాళ లేబర్ పేమెంటు కదండీ, అందరూ కంట్రాక్టరు షెడ్ దగ్గరకి వెళ్ళారు. అని చెప్పారు.

చేతిలో చాలా కవర్లు ఉన్నాయి. అసిస్టెంటు ఇంజనీరుకి ఓ కవరు, జూనియర్స్‌కి తలో కవరు ఇచ్చి, నాకూ ఒక కవరు ఇచ్చాడు. నేను ఆఫీసు నుండి వెళ్ళిపోయే తొందర్లో కవర్ని టేబులు సొరుగులో పెట్టాను. ఆ రోజు శనివారం, మర్నాడు ఆదివారం ఆఫీసుకి శలవు, కవరు సంగతి మర్చిపోయాను.

ఇది జరిగిన వారం రోజులకి, ఆఫీసుకి అసిస్టెంటు ఇంజనీరు గాని జూనియర్ ఇంజనీర్స్ గాని రాకపోవడం వల్ల, నేనే మట్టి డామ్ మీద కొత్తగా వేసిన మట్టిని తొక్కించవలసి వచ్చింది... షీప్ ఫుట్ రోలరుతో, తొక్కించకుండా, టెన్ టన్ రోలరుతో తొక్కించేస్తున్నాడు. కంట్రాక్టరు ఏజెంట్, అలా చెయ్యవద్దని చెప్పాను. కాంట్రాక్టరు ఏజెంట్ నాకు ఏ జవాబు చెప్పలేదు. సరికదా పనిని ఆపలేదు కూడా..

కొంతసేపు అలా తొక్కించి ఆపేసి దానిమీద కొత్త లేయరు వేయడానికి మట్టిని తోలిస్తున్నాడు. దాంతో నాకు సహనం పోయింది. బంటాల నుండి వస్తున్న లారీలను ఆపించేసాను, ఏజెంట్ నాతో దెబ్బలాట పెట్టుకుందామని చూసాడు. కానీ నేను పడనివ్వక లారీలకి అడ్డునిలబడ్డాను, దాంతో లారీవాళ్ళు లారీ దిగి పక్కనున్న టీ కొట్టులోకి వెళ్ళిపోయారు. పని ఆగిపోయింది.

ఈ విషయం కాంట్రాక్టరుతో చెప్పడానికి ఏజెంట్ షెడ్‌లోకి వెళ్ళాడు. నేనూ వెనకే కంట్రాక్టరుకి ఈ విషయం వివరిద్దామని షెడ్‌కి వెళ్ళాను.

నేను షెడ్ చేరుకునేసరికి లోపలనుండి మాటలు వినిపిస్తున్నాయి. కంట్రాక్టరు ఏజెంట్‌ని అడుగుతున్నాడు, 'పేమెంట్స్ నాడు వీడు రాలేదా?' వీడు అన్న మాట నాకు బాధ కలిగించినా బైటే నిలబడి వాళ్ళ సంభాషణ విన్నా... 'రాలేదు సార్ సాయంకాలం వరకూ ఎదురు చూసి కవర్స్‌లో పెట్టి ఆఫీసులో ఇచ్చినా! తీసుకుండు! సొరుగులో పెట్టుకుండు' అని చెప్పాడు.

'దాని తెల్లెంగ తీసుకునే నీతులు చెపుతున్నాడా? ఆడబ్బగారి సొమ్మనుకున్నాడా?' అని ఆశ్చర్యపోయాడు కంట్రాక్టరు.

నా కప్పుడు ఆ రోజు తీసుకున్న కవరు జ్ఞాపకం వచ్చింది. అందులో ఏముంది? గబగబా ఆఫీసుకి వెళ్ళి, డ్రాయరు సొరుగుతీసి వెదికితే వెనక్కి వెళ్ళిపోయిన కవరు కనిపించింది. దాన్ని తీసి ఓపెన్ చేసి చూసా.. దాంట్లో రెండువందల రూపాయల నోట్లు ఉన్నాయి. అప్పుడు అర్ధం అయింది. కంట్రాక్టరు నా గురించి అంత చులకనగా మాట్లాడ్డానికి గల కారణం! వెంటనే ప్యూనుని సైటుకి పంపి

కంట్రాక్టరు ఏజెంటుని పిలిపించా ఏజెంటు ఆఫీసుకి వచ్చాడు. 'ఆ రోజు తొందరలో నేను కవరు విప్పి చూడలేదు. ఇలాంటివి నా కొద్దు' అంటూ కవరు ఏజెంటుకి ఇచ్చాను.

'పర్వాలేదు పర్వాలేదు సార్' అంటున్న ఏజెంటుని పట్టించుకోకుండా, ఏజెంటు చేతిలో కవరు పెట్టి, టైమవడంతో నేను బస్ స్టాపుకి వెళ్ళిపోయా..

✡✡✡

మర్నాడు ఆఫీసుకి వెళ్ళగానే డామ్ మీదకి వెళ్ళాను. క్రితం రాత్రి పాతలేయరు మీద పూర్తిగా మట్టిని పరిపించేసాడు కంట్రాక్టరు. అంటే నేను ఆఫీసునుండి వెళ్ళిపోగానే, నేనాపించిన పనిని కంటిన్యూ చేసాడు.

పాతలేయర్ని సరిగ్గా తొక్కలేదు క్వాలిటీ కంట్రోలు వాళ్ళు లేయరు పాస్ చెయ్యలేదు. దాని మీద కొత్త లేయరు వేసేసాడు, ఏజెంట్ తో దెబ్బలాట వేసుకున్నాను.

'కంట్రాక్టరు వెయ్యమని చెపితే నేనేం చేయను సార్?' ఏజెంటు తన అసహాతను చాటుకున్నాడు.

నేనింక డామ్ సైటులో చేసేదేంకనబడక వెనక్కి వచ్చేసా, అసిస్టెంటు ఇంజనీరుతో రిపోర్టు చేద్దామనుకున్నా... కాని నాకా అవసరం లేకపోయింది. నేనాఫీసుకి వెళ్ళేసరికి ఆయనే పిలిచాడు.

'నిన్న కొత్తలేయరు వేయకుండా అడ్డుకున్నావట?' అని అడిగాడు.

'ఊ' అన్నాను.

'ఎందుకు?'

'లేయర్ని షీప్ ఫుట్ రోలర్‌తో తొక్కాడు, దానివల్ల నీడింగ్ ఎఫెక్ట్ ఉండదు. క్వాలటీ కంట్రోలు సాంపిల్స్ తీయలేదు, లేయరు పాస్ చెయ్యలేదు. అందుకే కొత్తలేయరు వెయ్యకుండా ఆపాను' అన్నా....

నేను చెప్పిన దానికి సమాధానం చెప్పకుండా 'నిన్న మీరు వాడిపనిని మధ్యలో ఆపేసారట, అందుకు వాడికి లక్షరూపాయలు నష్టం వచ్చిందట, వెళ్ళి ఇ.ఇ.కి కంప్లైంట్ చేసాడు.' అన్నాడు అసిస్టెంట్ ఇంజనీరు..

'మరి టెండరులో చెప్పిన స్టాండర్డ్ ప్రకారం పని చెయ్యలేదు కదండి!' అని నసిగా.

'నిజమే అది మీ ఒక్కరి బాధ్యత కాదు, షీప్ ఫుట్ రోలరు లాగడానికి ట్రాక్టరు రిపేరులో ఉంది. లేయరు మధ్య బాండింగ్ తీసుకు రావాలంటే గునపంతో మొత్తం లేయర్ని చిన్న చిన్న కన్నాలు చేసి, దానిమీద కొత్తలేయరు వెయ్యచ్చు, కొత్తలేయరు వేసాక కూడా పాతలేయరు నుండి క్వాలిటీ కంట్రోలుకి కావలసిన సాంపిల్స్ తీసుకోవచ్చు. మీ పని మీ సుళువు చూసుకుని చేసుకుపోవడమే, వాడ్ని వాడిపని చేసుకోనివ్వండి. వాడి పని ఆపడానికి మీరెవ్వరు' అంటూ అసిస్టెంటు ఇంజనీర్ చీవాట్లేసాడు.

అప్పుడు నాకనిపించింది. ఆ రోజు అసిస్టెంటు ఇంజినీరు దగ్గరనుండి జూనియర్ ఇంజినీరు వరకూ కవర్లు అందాయి. ఆ కవర్ల ఉద్దేశం ఇలాంటిదేదేనా జరిగితే సర్దుకు పొమ్మనేనా? డబ్బుకి ఎంత పవరో..! నా ఆలోచనలు స్పష్టమైన రూపుదిద్దుకోకుండానే నన్ను సర్ప్లస్ వియర్ కన్‌స్ట్రక్షన్ సబ్ డివిజనుకి ట్రాన్సఫర్ చేసారు.

సర్‌ప్లస్‌వియర్ కన్‌స్ట్రక్షన్ వర్కు మొదలు పెట్టారు. సర్‌ప్లస్ వియర్ పునాది కోసం గొయ్యి తవ్వుతున్నారు. సర్‌ప్లస్‌వియరూ, గేటు స్ట్రక్చరూ, కలిసి చాలా ఎక్కువ బరువు పునాది మీదకి వస్తుంది. అందుకే చాలా పెద్ద పునాది గొయ్యి తవ్వుతున్నారు.

నేల మట్టం నుండి కొంచెం లోతుకి గొయ్యి తవ్వేసరికి పునాది గోతులోకి నీళ్ళు రావడం మొదలుపెట్టాయి. ముందుగా తీసిన బోర్ హోల్ డేటా సమాచారాన్ని బట్టి, నీటిమట్టం చాలా లోతుగా ఉన్నట్టు తెలిసింది. అయితే ఈ నీరు ఎక్కడ్నించి వస్తోంది. అన్న

విషయం ఎవరూ పట్టించుకోలేదు. కొందరు వర్షాకాలం తర్వాత భూమిలో నీటిమట్టం పెరిగింది అనుకున్నారు. రాత్రంతా గోతిలో నిండిన నీరుని మర్నాడు పంపులు పెట్టి తోడేసి, తవ్వకం పనిని కొనసాగిస్తున్నారు.

నీరు తోడెయ్యడానికి, చాలా సమయం, డబ్బూ, ఖర్చు అవుతున్నాయి. మొత్తానికి పడుతూ లేస్తూ పునాది గొయ్యి పూర్తిచేసారు. పునాది వెయ్యడానికి సామాన్లు కూర్చుకుంటున్నాడు కంట్రాక్టరు. గొయ్యి తవ్వడం పూర్తయింది కాబట్టి గొయ్యి విషయం మర్చిపోయారు. అందరూ...

✡ ✡ ✡

వర్కర్స్ క్వార్టర్స్‌కి రిజర్వాయరు పల్లంలో ఉంది. వర్కర్స్ క్వార్టర్స్ అంటే వర్కర్స్ క్వార్టర్స్, జూనియర్ ఇంజనీర్స్ క్వార్టర్స్, ఆఫీసులూ అన్నీ కలిపి ఎత్తైన స్థలంలో ఉన్నాయి. విటన్నింటికీ నీటిసప్లై కోసం పెద్ద వోవర్ హెడ్ టేంక్ ఉంది. వోవర్ హెడ్ టేంక్‌లకి పక్కగా డీప్ బోర్ వెల్స్ ఉన్నాయి. డీప్ వెల్స్ లోంచి నీటిని వోవర్ హెడ్ టేంక్ లోకి పంప్ చేసి, అక్కడ నుండి కాలనీకి సప్లై చేస్తారు. నాలుగైదురోజులుగా డిప్ వెల్ లో నీరు లేదని పంపింగ్ ఆగిపోయిందని, పంపింగ్ చేసేవాడు, చెపుతున్నాడు. ఆ రోజు ఫోర్తు గ్రేడ్ స్టాఫ్, మా క్వార్టర్స్‌కి నీళ్ళు రాలేదు అని అసిస్టెంటు ఇంజనీరుకి రిపోర్టు చేసారు.

అసిస్టెంటు ఇంజనీరు పంపింగ్ చేసేవాడిని పిలిచి విషయం ఏమిటి? అని అడిగారు.

ఈ రోజు నీరు జూనియర్ ఇంజినీరు క్వార్టర్స్‌కి ఇవ్వడానికే సరిపోయిందని, రేపటి నుండి ఎవరికివ్వడానికి నీరు లేదని చెప్పాడు.

దాంతో చాలామంది శలవు పెట్టి వెళ్ళిపోయారు. అసిస్టెంట్ ఇంజినీరు నీరు సప్లై అకస్మాత్తుగా ఎందుకు ఆగిపోయింది, అన్న విషయం చర్చించి మొత్తం కాలనీలో అక్కడక్కడ నూతులు అన్నీ పరిశీలించి, వివరాలు కనుక్కుని, వీటన్నింటినుండి నీరు మాయమైపోడానికి కారణం సర్ ప్లస్ వియర్ కోసం తవ్విన పునాది గొయ్యి అని నిర్ధారణ చేసాడు.

ఈ విషయం సూపరెండెంట్ ఇంజనీరుకి వివరించి చెప్పారు. ఆయన ఆయన బృందంతో సహా వచ్చారు. ఎన్నో తర్జన భర్జనలు జరిగాయి కానీ ఏం చెయ్యాలీ అన్నది మాత్రం తెలియలేదు.

తర్జన భర్జనలన్నీ సర్‌ప్లస్ వియర్ వ్యూపాయింట్ దగ్గర జరిగాయి. ఆ తర్జన భర్జల్లో నేను సర్‌ప్లస్ వియర్ ప్లాను పట్టుకుని నిలబడ్డాను. ప్లానుకి రెండో కొస జూనియర్ ఇంజినీరు పట్టుకున్నాడు. వాళ్ళ ఆలోచనల్ని బట్టి, సర్‌ప్లస్ వియర్ కన్‌స్ట్రక్షన్ అంచలంచలుగా చెయ్యాలి, అది త్రీ ఫేజెస్ లో జరగాలి.

ఒకేసారి ఫౌండేషను, స్ట్రక్చర్ కట్టడం కుదరదు. ఇదంతా జరిగేసరికి కనీసం మూడు నెలలేనా పడుతుంది. కానీ పని జరిపించడానికి పనివాళ్ళేరీ? చాలామంది శలవలు పెట్టి వెళ్ళిపోయారు.

సూపర్ వైజర్లు జూనియర్ ఇంజనీర్సు టౌనులో తమకి తెలుసున్న బంధువుల ఇళ్ళకి మారిపోయారు కానీ ఇదెన్నాళ్ళు!

వీళ్ళిలా తర్జన భర్జన పడుతుండగానే, నాకో చిన్న ఐడియా తట్టింది 'పునాది అడుగున లీన్ కాంక్రీటు చాపలా పరిపిస్తే ఈ 'సీపేజి' ఆగిపోవచ్చు అన్నాను.

నన్ను వెర్రి వెధవని చూసినట్టు చూసి 'లీను కాంక్రీటు వెయ్యడానికి ప్రొవిషను లేదు. రి ఇన్ ఫోర్సుడ్ కాంక్రీటు మేట్ వెయ్యవలసిందే' దానికి చాలా టైము పడుతుంది. ' అన్నాడు అసిస్టెంటు ఇంజినీరు.

'ప్రొవిషన్ లో లేదుగాని, అన్‌ఫోర్ సీన్ ప్రోబ్లమ్స్ సాల్వ్ చెయ్యడానికి, మిస్‌లీనియస్ ఎమౌంట్ ఉంది' అన్నాను.

నేనన్న మాటలు అసిస్టెంట్ ఇంజినీరుకి, ఎక్జిక్యూటివ్ ఇంజినీరుకి చికాకు కలిగించాయి. కానీ సూపరెంటెండెంట్ ఇంజినీరు నా మాటలు ఏకాగ్రత వినడంతో ఇద్దరూ ఏం మాట్లాడలేదు. ఆ విషయం అక్కడితో ఆగిపోయింది.

సూపరెంటెండెంట్ ఇంజనీరు వెళ్ళిపోయాడు.

కాని రెండు రోజుల్లో లారీలతో ఇసుక, బ్రోకెన్ స్టోన్, సిమెంటు వచ్చాయి. చాలామంది కూలీలని పెట్టి ఒకే రోజులో మొత్తం గోతిలో నీరు తోడేసి లీన్ కాంక్రీటు వేసేసారు. కాంక్రీటూ వేసిన నాలుగైదు రోజులకి కాలనీలో ఉన్న డీప్ వెల్స్‌లో నీరు ఊరింది.

✡ ✡ ✡

ఈ ఉద్యోగం ఇలా ఉండగానే, చీఫ్ ఇంజనీరు కార్యాలయం నుండి బి.యి. పాసయి వర్క్ ఇన్స్పెక్టరుగా, పనిచేస్తున్న వాళ్ళ డిటైల్స్ కావాలని అడిగారు.

విశాఖపట్నం సర్కిల్లో పనిచేస్తున్న వాళ్ళ డిటైల్స్ వెళ్ళాయి. డిటైల్స్‌ని బట్టి ఎక్కడ పనిచేస్తున్న వర్క్ ఇన్స్పెక్టర్లని అదే సర్కిల్లో జూనియర్ ఇంజినీర్స్ గా ఎపాయింట్ చేసారు.

సూపరెండెంట్ ఇంజినీరు నన్ను రిజర్వాయరు ప్రాజెక్టులోనే వేసారు. మా ఉద్యోగాలతో పాటు చాలామందిని రెగ్యులరైజ్ చేసారు. అందులో భాగంగా రామదాసుని డివిజనల్ ఆఫీసులో ఎక్జిక్యూటివ్ ఇంజినీరు దగ్గర జీపు డ్రైవరుగా వేసారు.

నా డిజిగ్నేషను మారడంతో నా బాధ్యత కూడా పెరిగింది. బాధ్యతలో భాగంగా ఆ రోజు సైటుకి వెళ్ళకుండా డివిజనల్ ఆఫీసుకి వెళ్ళాను.

నేను డివిజనల్ ఆఫీసుకి వచ్చానని ఎక్జిక్యూటివ్ ఇంజినీరుకి తెలిసి తన గదిలోకి రమ్మని పిలిచాడు.

అప్పటికి నా కర్థమయిందేమిటంటే చిన్న చిన్న అబద్దాలు ఆడకుండా రోజులు గడపడం కష్టం అని, అనచ్చు. అందుకే అబద్ధం ఆడవలసి వచ్చే విధంగా, ఎక్జిక్యూటివ్ ఇంజినీరు ఏ ప్రశ్నలూ వేయకుండా ఉంటే బావుండు అనుకుంటూ లోపలికి వెళ్ళాను.

'పని బాగా జరుగుతోందా?' అని అడిగాడు.

'ఊ' అన్నాను.

'గంటలో బయలుదేరి సైట్‌కి వెళుతున్నాము, ఎక్కడికీ వెళ్ళకు రడీగా ఉండు' అన్నాడు.

నా గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. 'సరే' అని బుర్ర ఊపి బైటకి వచ్చేసా...

ఏం చెయ్యాలో అర్థంకాలేదు. రిజర్వాయరు సైటులో అసిస్టెంటు ఇంజినీరుకి, కంట్రాక్టరుకి మధ్య చిన్న దెబ్బలాట జరిగింది. ఇప్పటివరకూ జరిగిన వర్కుకి పూర్తిగా బిల్లు చెయ్యమంటాడు కంట్రాక్టరు. గేట్ స్ట్రక్చరు పని మొదలు పెట్టమంటాడు అసిస్టెంటు ఇంజినీరు. ఇద్దరూ ఎవరి మాట మీద వాళ్ళు పట్టుదలతో ఉన్నారు.

'బిల్లు చేస్తే ఏం పోయింది?' అని అడిగా.. అసిస్టెంటు ఇంజినీరుని.

'కంట్రాక్టరు చాలా చురుకైనవాడు. ఇప్పటివరకూ చేసిన కాంక్రీటు పనిలో ఎక్కువ మార్జినుంటుంది. ఇప్పటివరకూ చేసిన కాంక్రీటు పనికి బిల్లు చేయించుకుని, ఈ డబ్బు పట్టుకుపోయి మరి కనబడడు. మళ్ళీ మనం ఇంకో కాంట్రాక్టరుని వెదుక్కోవాలి! '

'ఈ విషయం ఎక్జిక్యూటివ్ ఇంజినీరుగారికి చెపితే సరిపోదా?' నా ప్రశ్న.

అసిస్టెంటు ఇంజినీరు చిన్నగా నవ్వాడు 'నువ్వు కొత్త నీ కర్థంకాదు. ఈ కంట్రాక్టరు మనల్ని ఎందుకు కేర్ చెయ్యటంలేదో తెలుసా, కంట్రాక్టరుకి ఎక్జిక్యూటివ్ ఇంజినీరుకి మంచి టర్మ్స్ ఉన్నాయి. ఎక్జిక్యూటివ్ ఇంజినీరికి చెప్పడం దండగ. ఎక్జిక్యూటివ్ ఇంజినీరు మనల్ని బిల్లు చెయ్యండి ఆ పని మొదలుపెడతాడు అంటాడూ. మనకి ఇంకో దారి ఉండదు.'

'మనం వీడిని కోర్టుకి ఈడ్చలేమా?' అన్నాను.

'కోర్టుకి ఈడ్చవచ్చు, తీర్పు వచ్చే సరికి ఎన్నేళ్ళు పడుతుందో మనకే తెలీదు. కాంట్రాక్టరు ఇంకో పని చూసుకుంటాడు. నువ్వు ఇంకో డివిజన్‌కి ట్రాన్స్‌ఫర్ అయిపోతావు. నేను రిటైర్ కూడా అయిపోవచ్చు' అన్నాడు నవ్వుతూ.

అప్పుడు నా కర్థం అయిందేమిటంటే కంట్రాక్టరు తనకు అతిగా లాభాలు రాని పనిని చెయ్యడు.... ఎవరూ అతని చేత పనిచేయించలేరు.

ఈ ఆలోచనలన్నీ బుర్రని తొలిచేస్తుండగా, రామదాసు పలకరించాడు.

'పదకొండు గంటలకి కదండీ సైటు విజిట్' అన్నాడు.

'అవును' అన్నాను.

'ఏమిటి అదోలా ఉన్నారు?' అడిగాడు.

అసలు విషయం చూచాయగా రామదాసుకి చెప్పా... రామదాసు అంతా విని 'హో. హో' అలాగా అని 'నిన్న సాయంత్రం కాంట్రాక్టరు ఎక్జిక్యూటివ్ ఇంజినీరుగారింటికి వచ్చాడు ఇద్దరూ చాలాసేపు మాట్లాడుకున్నారు' అంటూ ఏదో చెప్పుకొచ్చాడు.

'కనీసం ఈ విషయం అసిస్టెంటు ఇంజినీరుకి తెలియచేసినా బావుండును' అన్నా.

'ఏం ఆయన సైటు ఆఫీసులో లేరా?' అని అడిగాడు.

'లేదు కాంటాక్టు చెయ్యడం కుదరలేదు.' అన్నా.

రామదాసు కాసేపు నన్ను సాలోచనగా చూసాడు. నేను రామదాసుతో మాట్లాడ్డానికి ఏం లేకపోవడంతో సర్కిల్ ఆఫీసుకి వెళ్ళాను. అక్కడ పని చూసుకుని పదకొండు గంటలకి డివిజనల్ ఆఫీసుకి వచ్చాను. సైటుకి బయలుదేరుదామని ఎక్జిక్యూటివ్ ఇంజినీరుగారికి చెప్పడానికి ఆయన రూములోకి వెళ్ళా...

ఆయన నన్ను చూసి 'జీపు హెడ్ లైట్లు హారన్ పనిచేయడం లేదట, జీపుని మెకానిక్ దగ్గరకి తీసుకెళ్ళాడు రామదాసు, నేను రేపు వస్తాలెండి, మీరు వెళ్ళిపొండి. ఈ విషయం అసిస్టెంటు ఇంజినీరుతో చెప్పండి' అన్నాడు.

బతికాంరా దేవుడా అనుకుని రామదాసు సమయస్ఫూర్తికి మనసులోనే మెచ్చుకుని, వెంటనే ప్రాజెక్ట్ సైటుకి వెళ్ళా, అసిస్టెంటు ఇంజినీర్ని వెదికి పట్టుకుని జరిగిన విషయం అంతా చెప్పాను. ఆయన దీర్ఘంగా ఆలోచించి, వెంటనే సూపరెంటెండెంట్ ఇంజినీరు దగ్గరకి ప్రయాణం కట్టాడు.

✡✡✡

మర్నాడు వస్తాడనుకున్న ఎక్జిక్యూటివ్ ఇంజినీరు రాలేదు. మూడురోజుల తర్వాత సూపరెంటెండెంట్ ఇంజినీరు ఎక్జిక్యూటివ్ ఇంజినీరు కలసి సైటు విజిటుకి వచ్చారు. కంట్రాక్టరుని స్టీలు వర్కు మొదలుపెట్టనందుకు సూపరెంటెండెంట్ ఇంజినీరు మందలించాడు. అక్కడితో ఆ సమస్య తీరిపోయింది.

సూపరెంటెండెంట్ ఇంజినీరు, ఎక్జిక్యూటివ్ ఇంజినీరు మిగతా పనులు సమీక్షించడానికి ముందుకెళ్ళారు. అసిస్టెంటు ఇంజినీరు రామదాసుని పిలిచి, కుశల ప్రశ్నలు వేసి యాభై రూపాయలు తీసి రామదాసు చేతిలో పెట్టి, పిల్లలకి 'ఎందుకులెండి సార్' అంటూనే యాభై రూపాయలు తీసుకున్నాడు రామదాసు.

✡✡✡

రోజూ పొద్దున్నే ప్రాజెక్టు సైటుకి వెళ్ళడం పగలు ఎనిమిది గంటల నుండి రాత్రి ఆరువరకూ సైటులో వర్కు... రోజంతా ఊపిరి సలపనంత బిజీ. కంట్రాక్టరు తన తరపున ఏ ఇంజినీరుని పెట్టుకోకపోవడం వల్ల అతని వర్కుకూడా నేనే చెయ్యవలసి వచ్చేది. అలా చేసినందుకు వారం వారం కంట్రాక్టరు ఇచ్చే పారితోషికం తీసుకుంటే సంతృప్తి ఉండేది.

కానీ ఆ పారితోషికం అంటే చిన్నచూపు ఉండేది. అలాగని కంట్రాక్టరు పని ఎగ్గొట్టడం కష్టమయేది. నేను అతని పని విషయంలో ఏ మాత్రం ఆలస్యం చేసినా అదీ డిపార్టుమెంటు పనే అన్నట్టు, ఎక్జిక్యూటివ్ ఇంజినీరు, అసిస్టెంటు ఇంజినీరు, నా మీద వత్తిడి తీసుకొచ్చి ఆ పని చేయించుకునేవారు. నాతో చనువుగా ఉంటూ నన్ను ఎక్స్ప్లాయిట్ చేస్తున్న అసిస్టెంటు ఇంజినీరు క్లచెస్ నుండి తప్పించుకోడం ఎలాగా? అన్నది నా ఆలోచన!

అది వక్రంలో వెళితే మంచిదా? రుజుమార్గాన్ని అనుసరిస్తే మంచిదా? రుజుమార్గం వలన ఘర్షణ, మనస్తాపం తప్పవు. ఉభయకుశలోపరి అయిన వక్రమార్గం కావాలి? నా పర్సనల్ వర్కు ఒకటి పెట్టుకుంటే, దాని పేరు చెప్పి ఈ వత్తిడి నుండి తప్పించుకోవచ్చు, అనిపించింది. ఎమ్. ఇ. చదివి ఈ ఉద్యోగంలోంచి మారిపోవడం మినహా మరోదారి కనబడలేదు.

ఎమ్.ఇ చదవాలంటే టౌనులో, డివిజనల్ ఆఫీసులోగాని, సర్కిల్ ఆఫీసులోగాని ఉండి చదవాలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు నాకు అంత ఫేవరు చేస్తాడని నేను అనుకోను. అందుకే విషయాని తెలుపుతూ సూపరెంటెండెంట్ ఇంజినీరుగారికి నన్ను సర్కిల్ ఆఫీసుకి మార్చమని అభ్యర్ధిస్తూ అప్లికేషను ఇచ్చాను.

ఆయన దాన్ని తీసుకుని 'సరె చూద్దాం' అన్నారు. ✡✡✡

# 13

**రోజులు గడిచిపోయాయి.** కాని 'సరె చూద్దాం' అన్న ఆయన మాట చేతల్లోకి రాలేదు. ఆయనకి చూడ్డం కుదరలేదు ఆ సమయంలోనే ఒక డ్రాఫ్ట్స్మేన్ ఎక్జిక్యూటివ్ ఇంజనీరు ఆఫీసు నుండి సర్కిల్ ఆఫీసుకి మారాడు. అతన్ని కలిసి ఎలా మారిపోయావు అని అడిగా...

'సూపరెంటెండ్ ఇంజినీరు పి.ఏ.కి రెండువందలు లంచం ఇచ్చాను.' అన్నాడు.

'ఎలా ఇచ్చావు' అని అడిగా....

'మా అంకుల్ చేత ఇప్పించా' అన్నాడు.

నాకు కూడా లంచం ఇచ్చి మారిపోడం మంచిది అనిపించింది. లంచం ఇవ్వడం తప్పేమో? లంచం పుచ్చుకోడం ఎంత తప్పో? లంచం ఇవ్వడం కూడా అంతే తప్పా? ఏది మంచి? ఏది తప్పు?, ఈ ఊగులాటలో కాలం వృధా చేస్తే ఎమ్.ఇలో జాయిన్ అయే రోజులు దగ్గర పడతాయి.

కాని నన్ను ఇరుకున పెట్టకుండా నా తరపున సూపరెంటెండెంట్ ఇంజినీరు పి.ఎ.కి లంచం ఇచ్చేవాళ్ళు నాకు కనబడలేదు. ఈ విషయం నా తలలో ఇంకి నా ఊగులాట నుండి బయట పడి సూపరెంటెండెంట్ ఇంజినీరు పి.ఎ.కి లంచం నేనే స్వయంగా ఇద్దామని నిర్ణయించుకునా! ఇది వక్రమా? సక్రమమా? అన్న అనుమానించే టైము లేకపోయింది. నిర్ణయించుకోగానే.. కాలం వృధా చెయ్యదల్చుకోలేదు.

✡✡✡

ఒకరోజు ఉదయాన్న ఏడుగంటలకి, తెల్లటికవరులో అయిదొందుల రూపాయలు పెట్టి, జేబులో పెట్టుకుని పి.ఎ ఇంటికి వెళ్ళా... ఇంట్లో వాళ్ళు వచ్చి పి.ఎ పూజ చేసుకుంటున్నారు. అని చెప్పారు. నన్ను కూర్చోమన్నారు. నేను హాల్లో కూర్చున్నాను. కాని నాలో ఏదో తప్పు చేస్తున్నాననే భావం వల్ల, ఒళ్ళంతా చమట్లు పట్టింది. ఏం జరుగుతుంది? కోపగించుకుంటాడా? సీక్రెసీ మెయింటెయిన్ చేయనందుకు విరుచుకు పడతాడా? అసలు డ్రాఫ్ట్ మేన్ చెప్పిన దాంట్లో ఎంత నిజం ఉంది. నేనిచ్చే డబ్బుని ఆయన తీసుకున్నా, దానికి

ఎంతవరకూ పనిచేసి పెడతాడు? పని చేసిపెట్టకపోతే ఈ అయిదొందలూ పోగొట్టుకున్నట్టేనా? అన్న ఆలోచనల్లో ఉండగానే లోపలినుండి పట్టుబట్టలు కట్టుకుని మెళ్ళో రుద్రాక్షమాలతో నుదిటి మీద కుంకుమ బొట్టుతో అప్పుడే పూజముగించి పి.ఎ. బైటకి వచ్చారు.

నేను లేచి నిలబడి, నమస్కారం చేసా.. (అతి వినయం). నటన ఎందుకంటే ఈ రకం పనుల్లో నాకు గౌరవం లేదు... అవసరం కొద్దీ చెయ్యక తప్పడంలేదు.

ఏమిటి పని? అన్నట్టుగా తల తాటించాడు.

'నేను సర్కిల్ ఆఫీసుకి మారిపోదామనుకుంటున్నానని, ఎమ్.ఇ చదువుదామని అప్లికేషన్ పెట్టానని' చెప్పా...

'సర్కిల్ ఆఫీసులో ఖాళీలు లేవే, అయినా అప్లికేషను పెట్టావా?' అనడిగారు.

'అప్లికేషను పెట్టానని సూపరెంటెండెంట్ ఇంజనీరుగార్ని కలిసా'నని చెప్పాను.

'హా హో' అని మళ్ళీ బుర్ర తాటించారాయన.

'ఈ విషయంలో హెల్ప్ చేయండిసార్' అంటూ తెచ్చిన కవర్‌ని టేబులు మీద పెట్టి, ఆయనకో నమస్కారం పెట్టి వెనక్కి తిరిగి చూడకుండా వచ్చేసాను. ఆయనకి దైవభీతి ఉంది.. మెళ్ళో రుద్రాక్షలు చెబుతున్నాయి.. పాపభీతి లేదు.... ఆయన చేస్తున్న పని చెబుతుంది.

పని జరిగిందా? సరి! లేదా అయిదొందలూ పోయినట్టే! అసలు ఇలా ట్రాన్స్‌ఫర్ చేయడానికి అయిదొందలు సరిపోతాయా? ఎక్కువా? తక్కువా? అన్నింటినీ మించి, సైటులో కంట్రాక్టరు దగ్గర సంపాదిస్తున్నాడు. అందులోది కొంత నాకిస్తున్నాడు. అన్న చులకన భావంతో ట్రాన్స్‌ఫర్ ఇంకొంచెం రోజులు ఆలస్యం చేస్తే, మరో తెల్లకవరుతో డబ్బుదొరుకుతుందని ఆశకు పోతాడేమో? అలా అయితే మళ్ళీ నన్ను పిలుస్తాడా? లేక కొన్నాళ్ళు చూసి నేనే ఆయన దగ్గరకు వెళ్ళాలా? ఈ ఆలోచనలతో పదిరోజులు గడిచాయి...

నా అనుమానాల్ని నివారిస్తూ సర్కిల్ ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఆర్డర్స్ వచ్చాయి. నా ట్రాన్స్‌ఫర్‌ని అడ్డుకుందామని ఎక్జిక్యూటివ్ ఇంజనీరు, చేసిన ప్రయత్నం ఫలించలేదు.

నేను సర్కిల్ ఆఫీసులో జాయిన్ అయిన నెలరోజులకి చేతన సర్కిల్ ఆఫీసులో డ్రాఫ్ట్స్ మేన్ (ఉమన్)గా జాయిన్ అయింది. చేతన సివిల్ ఇంజనీరింగులో డిప్లమా చేసింది.

ఆఫీసులో టెక్నికల్ సెక్షన్‌లో యువకుల మధ్య, చేతన భారీ ఎత్తున విడుదలైన రంగుల చిత్రంలా ఉంది. తాత్కాలికంగా చేతన సీటు నా పక్కనే పడింది. మిత్రబృందం నా చేత వందరూపాయలు ఖర్చు పెట్టించి పార్టీ చేసుకున్నారు.

చేతన ఛామన ఛాయగా సన్నగా పొట్టిగా ఉండి ఆకర్షణీయంగా కనబడదామని చేసుకున్న డాబుసరి అలంకరణతో డాబేగాని, అలంకరణ ఆమెకి ఏవిధమైన సహాయం చేయలేకపోయేది. అన్నింటికన్నా చెప్పదగింది, ఆమె ఆత్మ విశ్వాసం గురించి..

అది కొంచెం అతిగా ఉందేమో అనిపిస్తుంది. చేతనలో ఓ మంచి గుణం ఉంది. కూర్చుని మాట్లాడితే చాలా బావుంటుంది. బుర్రూపుతూ, మూతిముడుస్తూ, గారాలుపోతూ, పరిశీలించడానికి బావుండేది. కాని నిలబడి మాట్లాడితే, ఎవరో ఆట తెలియని వాడు బొమ్మని ఆడిస్తూ, వెంట్రిలాక్విజమ్ చేస్తున్నట్టుండేది. నాకు నచ్చని అనేక విషయాల్లో చేతన నిలబడి మాట్లాడడం ఒకటి. ఏదేనా విషయం ఆమెకి నచ్చక ఆవేశం వస్తే లేచి నిలబడి మాట్లాడేది. ఆవేశం వచ్చి చేతన నిలబడగానే, మురళి, నేనూ కెంటినుకి వెళ్ళిపోయేవాళ్ళం.

మురళి ఓ రోజు సీరియస్‌గా 'అసలే ఫ్లాట్ సర్ఫేసు దానిమీద పైటపాతికసార్లు సర్దుకోడం చాలా చికాకుగా ఉంటుందోయ్' అంటాడు.

మురళి జూనియర్ ఇంజనీరుగా సర్కిల్ ఆఫీసులో పనిచేస్తున్నాడు. నా పక్కసీటే కొంచెం సీరియస్ స్వభావం, కాని ఇద్దరం నెలరోజుల్లో మంచి స్నేహితులమైపోయాం మురళిని ఎనలైజు చేసినట్టే, నేను చేతనని ఎనలైజు చేసేలోపల, చేతన చాలా ఎడ్వాన్స్ అయిపోయి.. ఆఫీసులో బ్రహ్మచార్ల లిస్టు తయారుచేసింది. ఆ లిస్టులో మురళి, రజనీకాంత్, నేనూ ఉన్నాం!

మురళి చాలా రిజర్వుడు స్వభావం కలవాడు, ఎక్కువగా ఎవరితోనూ మాట్లాడడు. అంచేత చేతనకి మురళి అంటే భయం, మురళి వెంట పడితే తన ప్రేమ అంత తొందరగా సక్సెస్ కాదేమో అన్న డౌటు!

రెండు రజనీకాంత్ డ్రాఫ్ట్స్ మేన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. చేతనకి రజనీకాంత్ అంటే చులకన దానికి కారణం చేతన ఏం చెప్పినా, రజనీకాంత్ ఆ మాటని తెలుగులో మొదటిసారి వింటున్నట్టు, ఆశ్చర్యపోయేవాడు. చేతనకి అడివిరాముడు సినిమా నచ్చింది. ఆ మాట విన్న రజనీకాంత్ మా సీటు దగ్గరికి వచ్చాడు.

'అయ్యబాబోయ్, బావుండడమేమిటి, సూపర్బ్! ఎక్స్‌లెంట్! ఫెంటాష్టిక్!' అన్నాడు.

రజనీకాంత్ మెల్లిగా చేతన దగ్గర చనువుతీసుకోడానికి ప్రయత్నిస్తున్నాడు అనిపించింది. దానికి కారణం చేతనే, చేతనకి రజనీకాంత్ అందే మానిపండులా కనిపించాడు. అందని మానిపండు పుల్లన అందే మానిపండు అలుసు అని ఎవరూ అన్నట్టు లేదు కాని రజనీకాంత్ గడుసుగా ప్రవర్తిస్తున్నాడా? అని నా అనుమానం.

ఇంక చేతన లిస్టులో మూడోవాడిని నేను! ఎప్రోచబుల్ గా ఉండి అంటే, సీటుకి దగ్గరగా ఉండి, కొంచెం చేయూతనిస్తే, ప్రేమ అనే ఊబిలో దిగబడి పెళ్ళిపీటలమీదకి రెడీఅయిపోయే, రెడీమేడ్ పెళ్ళికొడుకులా కనబడివుంటా.. చేతన ఇవన్నీ చైతన్య వంతంగా ఆలోచించి, తన మొదటి జీతంతో ఆఫీసులో పార్టీ ఇచ్చింది. దానికి నేనూ, రజనీకాంత్ చాలా హెల్ప్ చేసాం, మురళి ఎంజాయ్ చేసాడు.

✡✡✡

ఆఫీసులో చేతన ప్రవర్తన చాలా వింతగా ఉండేది. నేను ఆఫీసులో ఉన్నప్పుడు రజనీకాంత్‌ని పట్టించుకునేది కాదు. నేను లేనప్పుడు రజనీకాంత్‌తో చాలా చనువుగా ఉండేది.

చేతన నాతో క్లోజ్‌గా ఉండేది. మాట్లాడుతూ నా కళ్ళల్లోకి చూసి నవ్వడం,నా క్రాఫ్‌ని చెరిపెయ్యడం, మృదువుగా చేతులమీద భుజాలమీద గిల్లడం, ఇవన్నీ చేస్తూ ఆమె నాకు చాలా క్లోజ్ అన్నట్టు ప్రవర్తించేది. నాకేదో ఫేవర్ చేస్తున్నాననుకునేది ఆమె చేసే ప్రతీచేతలోనూ అనుభూతి కరువవడం వల్ల నాలో ఆమెపట్ల ఇంట్రస్టు లేదు. కానీ ఇవన్నీ సరదా కలిగించేవి. నేను ఆమె చేతలకి ఆనందిస్తున్నవాడిలా నటిస్తూ, నా పనిలో సగం పని చేతనతో చేయించుకునేవాడిని. అందుకే ఆమె అప్పుడప్పుడు అధికారాన్ని ప్రదర్శించేది అది నాకు గమ్మత్తుగా ఉండేది.

✡✡✡

ఓ రోజు ఆఫీసులో ఎవరో ఫ్యాను పోయాడని శలవు ప్రకటించారు అప్పటికే ఆఫీసు స్టాపుకి కేరేజీలు వచ్చేసాయి. అందరూ భోజనాలు ముగించి, ఎవరి పనిమీద వాళ్ళు వెళ్ళిపోయారు. నేనూ మురళి స్టాపు క్లబ్బుకి బయలుదేరాం.

ఆ సమయంలో చేతన 'సినిమాకి వెళదాం వస్తావా?' అంది

చేతనతో ఒంటరిగా సినిమాకి వెళ్ళడానికి కొంత సందేహించి 'మురళిని పిలవనా?' అన్నాను.

చేతన 'ఎందుకూ వద్దు!' అన్నట్టు కళ్ళతో సైగచేసింది.

మురళితో నేను స్టాపు క్లబ్బుకి రానని చెప్పి, చేతనతో సినిమాకి వెళ్ళిపోయాను.

✡✡✡

సినిమా చాలా పాతది. హాలులో జనం అంతగా లేరు. అలాంటి సినిమా చేతన ఎందుకు సెలక్ట్ చేసింది? నా నుంచి ఏదేనా సాహసాన్ని ఆశిస్తోందా? అనేకమైన ఆలోచనలతో మనస్సు ఆత్మవంచన దిశగా ప్రయాణం చేస్తోంది. అంతేగాని చేతనకి ఇష్టమై ఈ సినిమాకి తీసుకొచ్చింది అంటే నమ్మబుద్ది వేయలేదు.

సినిమా మొదలైన పావుగంటకి గాని గేటుకీపరు తలుపులు వేయలేదు. వాడు తలుపువేసిన అయిదునిముషాలకి గాని హాలులో చీకటి విస్తరించలేదు. నేను చీకటి కోరుకుంటున్నానా? లేక చీకటి కలిగించే ధైర్యం, తెగింపుకి ఎదురుచూస్తున్నానా? నా మనసులో ఏదో ఉంది? ఏమిటది? అది పూర్తిగా రూపం దాల్చలేదు ఉద్వేగం వలన ఒకరకమైన టెన్షన్‌ని ఫీలవుతున్నాను. ఎందుకు?

నా టెన్షన్‌ని ఫీలవుతున్నాను. ఎందుకు?

నా టెన్షన్ లో నేను ఉండగానే సినిమా సగం అయిపోయింది. ఇంటర్వెల్ ఇచ్చారు. బైటకి వెళ్ళి రెండు డ్రింక్స్ తెచ్చాను. డ్రింక్స్ సిప్ చేస్తూ హాలంతా పరీక్షగా చూసాను.

సినిమా పాతదవడం వల్ల బాల్కనీలో ఎక్కువమంది జనంలేరు. మా `రో`లో మేమిద్దరమే, మా`రో`కి మూడు `రో`ల అవతలగా ఎవరో ముగ్గురున్నారు. నేను హాలుని గమనించడం ఆపి, చేతన వేపు చూసాను. చేతన కూడా హాలుని గమనిస్తోంది, నేను తనవేపు తిరిగేసరికి, చేతన హాలుని గమనించడం ఆపి డ్రింక్ బాటిల్ లోకి చూస్తూ సిప్ చేయసాగింది.

ఇంటర్వెల్ అయిపోగానే హాలువాడు తొందరగా తలుపులు వేసేసాడు. హాలులో చీకటి విస్తరించింది. సినిమా మొదలయింది. ఈసారి చీకటి నాకు ధైర్యాన్నిచ్చింది. నా కుర్చీలో మెల్లిగా కదిలి చేతన కూర్చున్న కుర్చీ హేండిలు మీద చెయ్యివేసాను. అదే హేండిలు మీద చేతన చెయ్యి ఉంది. చేతన చెయ్యి నా చేతికి చల్లగా తగులుతోంది. చేతన రియాక్షన్ కోసం ఎదురుచూసా.., చేతన చెయ్యి వెనక్కి తీసుకోలేదు. చేతన ఈ విషయమే పట్టించుకోకుండా సీరియస్‌గా సినిమా చూస్తోంది. నా చేతి స్పర్శని పట్టించుకోనంత ఇంట్రెస్టింగ్‌గా సినిమా ఉందంటే నమ్మబుద్ది వెయ్యలేదు.

నా చేతిని చేతన భుజం చుట్టూ వేసాను. చేతన కాదనలేదు కాని కొంచెం ముందుకి జరిగింది. ఆ సమయంలోనే నా చేతిని ఆమె భుజం మీదకి జార్చాను. ఆమె జాకెట్టు పైభాగాన మెడకింద ఖాళీగా ఉన్న స్థలంలో నా చేతివేళ్ళతో సుతారంగా రాసాను. చేతన నాకు అభ్యంతరం చెప్పలేదు. ఆ చీకటిలోనే నన్నోసారి చూసి, మళ్ళీ సినిమా చూడ్డంలో మునిగిపోయింది.

సీరియస్‌గా సినిమా చూస్తోంది అంటే నమ్మబుద్దివేయలేదు. నా చేతివేళ్ళకి అందకుండా ముందుకి జరుగుతున్న చేతన ప్రవర్తన బెట్టులా ఉంది ఆ సమయంలోనే నేను సాహసం చేసి చేతన భుజాలకింద చెయ్యి మార్చి, చేతనని నావేపు తిప్పుకుని, ఆమె పెదాలమీద ముద్దుపెట్టుకున్నాను.

ఆమె ఈ హఠాత్ సంఘటనని ఊహించి ఉండదు. నన్ను విడిపించుకుని వెళ్ళి దూరంగా ఇంకో కుర్చీలో కూర్చుంది.

చేతన నా ప్రవర్తనకి అభ్యంతరం చెబుతుందంటే నమ్మబుద్ది వెయ్యలేదు, ఏదో బెట్టు చేస్తుందనుకున్నా, ఇంతవరకూ ప్రోత్సహించిన చేతన అకస్మాత్తుగా ఎందుకిలా ప్రవర్తించింది, చేతన నైతిక జంఝాటం పడుతోందా? నేను తప్పుచేసానా? ఎక్కడో మనోకుహరాల్లో తెలిసీ తెలియని న్యూనతాభావం నన్ను లొంగదీసుకోడానికి ప్రయత్నిస్తోంది.

సినిమా అయిపోయింది. ఇద్దరం బైటికి వచ్చాం... హాలులో జరిగిన సంఘటన మా ఇద్దరినీ వెంటాడుతూ ఉందేమో! ఇద్దరం ఒకరితో ఒకరం మాట్లాడుకోలేదు. చేతన తన బస్ ఎక్కి వెళ్ళిపోయింది.

నా ఆలోచనల్లో తప్పు అన్న భావం నన్ను వశపరుచుకోకుండా నా ప్రవర్తన అనువైన కారణాలు వెతుక్కుంటున్నాను.

✡✡✡

మర్నాడు హాలులో జరిగిన విషయం మురళికి చెప్పా, మురళి నేననుకున్నంత ఆశ్చర్యపోలేదు. కాని సీరియస్‌గా 'నీతో సాయంకాలం మాట్లాడతా' అన్నాడు.

మురళి సీరియస్‌నెస్ హాస్యాస్పదంగా అనిపించి 'ఆడపిల్లతో సినిమాకి వెళితే వీడు సీరియస్ అయిపోతాడేమిటా?' అనుకున్నా.

సాయంత్రం ఆఫీసు అయిపోగానే ఇద్దరం బీచివొడ్డుకి వెళ్ళాం... ఎదురుగా సముద్రుడు ఉరుకులు పెడుతున్నాడు. నాకు సహనం తక్కువ.... మురళి చెప్పే నీతులు వినే ఓపిక, ఇంట్రష్టు లేవు. నా ఒక్క ముద్దుతో చేతన అపవిత్రం అయిపోదు... అన్నది నా ఉద్దేశం!

మురళి జంగిడీని పిలి వేరుశనగపలుకులు, మామిడికాయ ముక్కలు కొన్నాడు. ఇద్దరం మామిడి ముక్కలు తింటూ, బీచిలో జనాన్ని గమనిస్తున్నాం!

చీరరంగు, పావడా హంగు మనసుని ఆకట్టుకున్నంతగా, మరేవీ మనసుని ఆకట్టుకోలేవు. మాకు ఎదురుగా ఒక అమ్మాయి ఎర్రటిపావడాని మోకాళ్ళ వరకూ ఎత్తి, కెరటాలతో దోబూచులాడుతోంది. కెరటం వచ్చినప్పుడుల్లా ఒడ్డువేపు పరిగెట్టుకు వస్తోంది. ఆమె లేతమునిగాళ్ళు తెల్లగా గోరుతో గిచ్చితే పాలు కారుతాయా అనిపించేటట్టుగా ఉంది. సన్నటి పాముకుబుసం లాంటి ఓణీ వేసి, ఎర్రటి పావడాతో ఆమె సముద్రపు ఒడ్డుకు కొట్టుకొచ్చిన సాయం సంధ్యాబింబంలా ఉండి, మనసుకి ఆహ్లాదాన్ని కలుగచేస్తోంది.

నా తలపుల్లో నేనుండగానే, ఉపోద్ఘాతం లేకుండా 'పదిరోజుల క్రితం రజనీ, చేతన బీచిలో కనిపించారు.' అన్నాడు మురళి.

'అదేం గొప్ప విశేషం కాదు. చెప్పదలచుకున్నది సూటిగా చెప్పు' అన్నాను.

'సూటిగా చెప్పడానికే నిన్ను పిలిచాను.' అన్నాడు.

ఊ కొట్టి ఊరుకున్నాను.

'పదిరోజులు క్రితం రజనీ, చేతన బీచికొచ్చారు. ఏడుగంటలవరకూ కూర్చున్నారు. ఏడు గంటలతర్వాత లేచి పామ్ బీచివేపు వెళ్ళారు. ఆ సమయంలో పామ్ బీచి సైడ్ బాగా నిర్మానుష్యంగా ఉంది. నేను ఎనిమిదిగంటలవరకూ బీచిలో కూర్చుని, ఇంటికి వెళ్ళిపోదామని లేచి బస్టాప్‌కి వెళ్ళాను. బస్టాప్‌లో చీకటిగా ఉంది. బస్ వస్తే వెళ్ళి ఎక్కవచ్చులే అని నేను బస్ షాప్‌కి ఎదురుగా సిమెంటు చప్టామీద కూర్చున్నాను.

అప్పుడు చేతన ఎవరో వెనకాల తరుముతున్నట్టుగా, బస్ షాపుకి వచ్చింది. ఆమె గంట క్రితం నేను చూసినంత ఫ్రెష్‌గా లేదు. జుత్తు చెదిరివుంది. ఆమెలో ఏదో తెలియని అలజడి కనిపిస్తోంది. ఆమె ఇసుకలో కూర్చున్నదానిలాకాక, ఇసుకలో దొర్లినదానిలా, మాటమాటికి వంటికి, చీరకి అంటిన ఇసుక దులుపుకుంటోంది.

చేతన వెనకే రజనికాంత్ వచ్చాడు. రజనీకాంత్ చేతనతో ఏదో మాట్లాడబోయాడు... రజనీకాంత్‌కి ఆ అవకాశం ఇవ్వలేదు. బస్‌షాప్‌కి రెండో పక్కకి వెళ్ళిపోయింది చేతన. ఇంతలో బస్సు వచ్చింది. ఇద్దరూ ఎక్కి వెళ్ళిపోయారు. నేను వాళ్ళ కళ్ళబడడం ఇష్టంలేక మరో బస్సు కోసం ఉండిపోయాను.' అన్నాడు మురళి తను చూసిన దృశ్యాన్ని నెమరువేసుకున్నాడు.

'బావుంది మంచి ఇన్‌ఫర్మేషనే, కాని నేనేం చేతనని పెళ్ళాడబోవడంలేదు, వెనకబడుతోంది. సరదాగా కాలం గడపచ్చు అనిపించింది.' అన్నా...

'నువ్వు చేతనని పెళ్ళాడవని తెలుసు నువ్వేకాదు రజనీకాంత్ కూడా చేతనని పెళ్ళాడు, కానీ మీ ఇద్దరూ ఆమె బలహీనతని ఎక్స్‌ప్లోయిట్ చేస్తున్నారు. ఒకరకంగా ఆమెని మోసం చేస్తున్నారు' అన్నాడు.

'చేతనే మమ్మల్ని ప్రోవోక్ చేస్తోందేమో?' అన్నా...

'నిజమే చేతనే మిమ్మల్ని ప్రొవోక్ చేస్తోంది... దానికి కారణం ఆమె ఆర్థిక పరిస్థితి, లక్షల కట్నాలు, ఇచ్చుకోలేని మధ్యతరగతి బలహీనత, దానివల్ల కట్నం వలయంలోంచి తప్పించుకుందామని, దానికి తాను ఎవరినైనా ప్రేమించి పెళ్ళాడ్డమే పరిష్కారం అన్న అపరిపక్వ ఆలోచన కారణమేమో, విటన్నింటి వెనుక ఆమె ఆర్థికపరిస్థితిలో, నిస్సహాయతో, కారణం' అన్నాడు మురళి సాలోచనగా...

'దానికి నేనేం చెయ్యగలను?' అన్నా... వాడు చెప్పదలచింది, ఏమిటో నాకు స్పష్టంగా అర్థంకాక...

'ఆమెని ఎక్స్‌ప్లాయిట్ చెయ్యకు, నీ మనసులో ఆమెపట్ల ఏ విధమైన ఉద్దేశం లేనప్పుడు ఆమెకి దూరంగా ఉండు.' అన్నాడు.

'నేనామెని ఎక్స్‌ప్లాయిట్ చేసానని, నేను నీకు చెపితే తెలిసింది. లేకపోతేలేదు. నువ్వేదో స్నేహితుడవని నేను నీతో చెప్పాను. లేకపోతే ఎవరికీ ఈ విషయం తెలియదు. తెలియవలసిన అవసరంలేదు.' అన్నా చిరాకుగా.

'అంటే ఎవరికీ తెలియనంత వరకూ ఆమెని ఆమె బలహీనతల్ని నువ్వు ఎక్స్‌ప్లాయిట్ చెయ్యచ్చు అంటావు?'

'ఓ తప్పకుండా' అన్నా..

'ఆ ఆలోచన తప్పేమో.. ఒక్కసారి ఆలోచించుకో, మనం ఒకళ్ళకోసం మనం నిజాతీగా ఉంటాం, లేదా ఉండం. నీకోసం నువ్వు సిన్సియర్ గా ఉండు ఇతరుల మెప్పు కోసంకాదు' అంటూ మురళి ఏవేవో విషయాలు చెప్పాడు.

నేను వక్రించానని వాడి అంచనా అది ఎంతవరకూ నిజం? అన్న ఆలోచనల్లోకి జారుకున్నా.. కాని అప్పటికే మురళి ఏం చెప్పదలచుకున్నాడో అది నా బుర్రలోకి ఇంకింది. దాని గురించి ఆలోచించాను. ఆత్మవంచన అంతో ఇంతో నాలో ఉంది. జీవితంలో ప్రతీ స్టేజిలో నాతో మౌలిక సూత్రాలు! (ఇక్కడ మౌలిక విలువలు అవచ్చు) నామీద రుద్దుతున్నారు. నన్ను ప్రభావితుడ్ని చేస్తున్నారు.

అక్కడితో చేతనతో చనువుని తగ్గించేసాను.

✡✡✡

# 14

**మురళి స్వభావం క్లియర్‌గా ఉంటుంది.** తనకి నచ్చింది చేస్తాడు, తను ఏం చేసినా తనది, అంటూ ఓ లాజిక్‌ని ఏర్పరచుకుంటాడు.

నే చేతనని దూరంగా ఉంచిన, కొద్దిరోజులకే మార్చి ఎకౌంట్స్ క్లోజింగ్ హడావిడి వచ్చింది. అనేక డివిజన్స్ నుండి, బిల్స్ వచ్చిపడుతున్నాయి. వాటిని చెక్ చెయ్యడంలో నేనూ, మురళి బిజీ అయిపోయాం.

పగలు పదిగంటలనుండి అయిదు గంటలవరకూ బిల్స్ చెక్ చేస్తే, మార్చి నెలాఖరకి పనిలో సగం కూడా పూర్తికాదు. అలాకాక ఐదుగంటల తర్వాత నిర్మానుష్యంగా ఉన్న ఆఫీసులో కూర్చుని బిల్స్ చెక్ చెయ్యబుద్దివేసేది కాదు. ఆ సమయంలో మురళి తన దగ్గరకి వచ్చిన కంట్రాక్టర్లు దగ్గర వోవర్ టైం పేరుతో రెండొందలో, మూడొందలో తీసుకునేవాడు. నా కది కష్టం అనిపించి నేనేం తీసుకునేవాడిని కాదు. పని మాత్రం చేయక తప్పేది కాదు.

ఆ పని బిజీలో ఉండగానే, నే పూర్వం పనిచేసిన రిజర్వాయరు ప్రాజెక్టు నుండి, ఫ్లడ్ నుండి, ఫ్లడ్ ప్రొటెక్షన్ ఎంబాంక్ మెంటు(డామ్) బిల్స్ వచ్చాయి, అది చాలా పెద్ద పని నేనూ, మురళీ చేయవలసివచ్చింది.

అప్పటికే పని ఎక్కువై చిరాగ్గా ఉంది, దానికి తోడుగా కంట్రాక్టరు బిల్లు తొందరగా చేయమని బతిమాలడం మొదలుపెట్టాడు. దాంతో మురళి 'ఇక్కడ ఆఫీసులో నీకు బిల్లు చేస్తే ఇరవైరోజులు పైగా పడుతుంది.' అన్నాడు.

కంట్రాక్టరు వినయం నటిస్తూ 'చెప్పండిసార్.. మీకు నచ్చినట్టు ఏర్పాటు చేస్తాను' అన్నాడు.

'జూపిటర్ లాడ్జ్ బావుంటుంది' అన్నాడు మురళి.

✡ ✡ ✡

కంట్రాక్టరు జూపిటర్ లాడ్జ్‌లో డబుల్ రూము తీసుకున్నాడు. బిల్లులన్నీ అక్కడికి మారిపోయాయి. నేనూ మురళి మధ్యాహ్నం వరకూ సూపరింటెండెంట్ ఇంజినీరు ఆఫీసులో ఉండి, రెండు గంటలకి జూపిటర్ లాడ్జ్ చేరుకునేవాళ్ళం. స్వీట్స్ స్పెషల్ మీల్స్, ఒక కేసు బీరు బాటిల్స్, మాకోసం వచ్చేవి... మా రూము పక్కనే కంట్రాక్టరు ఏజెంటు రూము తీసుకున్నాడు. మాకు కావలసినవన్నీ తెచ్చిపెడుతుండేవాడు. మురళికి బీరంటే చాలా ఇష్టం, రాత్రి పన్నెండులోపల మూడో నాలుగో బీరు బాటిల్స్ అవగొట్టేవాడు. అప్పటికి మత్తు ఎక్కేది, పడుకునేవాడు.

నాకు మాత్రం బీరు బాటిల్స్‌తో ఆగేది కాదు. రాత్రి పదయేసరికి కంట్రాక్టరు ఏజెంట్ బేగ్ పైపర్ విస్కీగాని, బ్లాక్ నైటు విస్కీ గాని తెచ్చేవాడు. దాంతో ఆత్మ శాంతించేది. కన్ను మూతపడేది.

✡ ✡ ✡

ఆ రోజుతో బిల్లు చెయ్యడం అయిపోతుంది, ఇంకా చిన్న చిన్న పనులున్నాయి. మర్నాడు ఆఖరిరోజు అనగా కంట్రాక్టరు ఏజెంట్ రాత్రి ఎనిమిదిగంటలకి రిక్షావాడికి డబ్బులిచ్చి, కాల్‌గర్ల్‌ని తీసుకురమ్మన్నాడు.

వీడిచ్చిన డబ్బుతో బాగా తాగేసి, రిక్షావాడు నాసిరకం అమ్మాయిని తీసుకొచ్చాడు. అది కాస్తా మా రూములో చేరి మాతో సరసానికి దిగింది. ఏజెంట్ కూడా హేంగోవర్‌లో ఉన్నాడేమో, తానేదో ఘనకార్యం చేసాననిపించేలా వెకిలిగా నవ్వుతూ, మామీద జోకులెయ్యడం మొదలుపెట్టాడు.

ఈ వ్యవహారంతో మురళికి చిరాకేసింది ఏజెంట్‌ని, కాల్‌గర్ల్‌ని బైటికి పొమ్మని కసిరేసాడు. వాళ్ళిద్దరూ ఏజెంట్ రూములోకి వెళ్ళిపోయారు. వాళ్ళు ఏజెంట్ రూములోకి వెళ్ళిన కాసేపటికి, పని ఎంతవరకూ పూర్తయిందో తెలుసుకుందామని కంట్రాక్టరు వచ్చాడు.

కంట్రాక్టరుతో మురళి ఏజెంట్ చేసిన అల్లరి గురించి చెప్పాడు దాంతో కంట్రాక్టరుకి కోపం వచ్చి, ఏజెంట్‌ని పిలిచి నానా తిట్లూ తిట్టి వెళ్ళిపోయాడు. ఏజెంటు కోపంగా తన గదిలోకి వెళ్ళి, ఆ అమ్మాయిని బైటకి పంపేసాడు. ఆ అమ్మాయి అక్కడనుండి వెళ్ళిపోకుండా మేమున్న గదితలుపు తట్టింది. ఎవరో అనుకుని తలుపుతీసా.... ఆ అమ్మాయి నన్ను తప్పించుకుని లోపలికి వచ్చి...

'గొప్ప పనిచేసావయ్యా' అంది మురళితో

మురళి అవాక్కైపోయి, ఆ అమ్మాయిని చూస్తూ నిలబడిపోయాడు. 'నేనీ రాత్రంతా ఉండి ఏదో కొంత డబ్బు చేసుకుందామని వస్తే మంచి పనేచేసావు. నువ్వు మంచివాడివైతే ఆ మంచితనం నీ దగ్గర దాచుకో, దాన్ని ఊరోళ్ళందరి దగ్గరా ప్రదర్శించి మా పొట్టలు కొట్టడం దేనికి? మేం చేస్తున్న పని మాకు తెలీదనా నీతులు నీ దగ్గర్నుంచి నేర్చుకోవాలి! ఏజెంటుగాడు తాగిన మైకంలో నన్ను రూముబైట పెట్టి తలుపేసేసాడు. కానీ అర్ధరాత్రి వీధిలో కెళితే పోలీసుల పాలవక తప్పదు. ఏ పోలీసోడో నన్ను పట్టుకుని రాత్రికి ఉపయోగించుకుని, రేపు కోర్టులో పెడతాడు. ఆ జడ్జిబాబు యాభైరూపాయలు జరిమానా వేస్తాడు. ఉన్న సంపాదన పోయి, యాభైరూపాయలు బొక్కే' అంది.

మురళికి చిరాకేసి 'ఫో ఈ గదిలోంచి' అంటూ కసిరాడు.

ఆ అమ్మాయి మాట్లాడలేదు. ఓ మూలకెళ్ళి కూర్చుంది. దీనంగా కూర్చుంది. 'బాబ్బాబు రేపొద్దున్నే వెళ్ళిపోతాను, మిమ్మల్నేం ఇబ్బంది పెట్టను. దయచూడు బాబూ' అంటూ నమస్కారం పెట్టింది.

నాకూ మురళికి ఏమనాలో తోచలేదు రెండుగంటల ముందు ఆ అమ్మాయి చూపిన పొగరు, సరసం, వాటి వెనుక మాపట్ల ఉన్న తూష్ణీభావం, ఇప్పుడు ఆమె మొహంలో వెతికినా కనబడటం లేదు. దైన్యం భయం ఆ కళ్ళల్లో స్పష్టంగా కనబడుతున్నాయి. నేను పక్కమీద దుప్పటి తీసి ఆమె మీదకి విసిరాను. అది చూసి మురళి మరేం మాట్లాడకుండా పడుకున్నాడు. నేను కొంచెం పని మిగిలిపోతేం అదిచేస్తూ కూర్చున్నాను.

నే విసిరిన దుప్పటి నేలమీద పరుచుకుని పడుకుంది ఆ అమ్మాయి కాసేపటికి ఆ అమ్మాయి పడుకున్న దగ్గర్నించి వెక్కిళ్ళు వినిపించాయి. దానివలన చేస్తున్న పనికి అంతరాయం కలిగి పనిని పక్కకి పెట్టి వెనక దిళ్ళకి ఆనుకుని కూర్చున్నాను. ఆ అమ్మాయి ఏడుస్తూనే ఉంది. వెక్కిళ్ళు ఆగడం లేదు. వేషాలేస్తోందేమో అనిపించింది. చిరాగ్గా 'ఎందుకా ఏడుపు పడుకో' అని కసిరాను.

ఆ అమ్మాయి ఏడుపాపేసింది కాని తను పడుకున్న చోటునుండి లేచి కూర్చుంది. 'ఆకలేస్తోంది' అంది జాలిగా.

'ఇప్పుడు తినడానికేమున్నాయి. ఏం లేవు.' అన్నా...

'టేబులుమీది ఏదో పొట్లం ఉంది.' అంది నసుగుతూ.

నేను ఎదురుగా టేబులు మీద చూసా, కంట్రాక్టరు ఏజెంట్ తనకోసం తెచ్చుకున్న పొట్లం, గొడవ జరగడంతో అక్కడే వదిలేసి తనగదిలోకి వెళ్ళిపోయాడు.

'సర్లే తీసుకో' అన్నాను.

ఆ అమ్మాయి దుప్పటి మీంచి లేచి వెళ్ళి పొట్లం తీసుకుని మళ్ళీ దుప్పటిమీదకి వెళ్ళి కూర్చుంది, విప్పుకుతింటోంది.

ఈ గొడవ జరగకపోతే, ఈ రోజు రాత్రి భోజనం ఒక బీరు బాటిలు, వో యాభై రూపాయలు సంపాదించుకునేది. కాని మురళి గొడవ చెయ్యడంతో ప్రోగ్రామంతా తారుమారైంది.

ఆ అమ్మాయి మీద జాలివేసింది. ఆ అమ్మాయి వివరాలు తెల్సుకోవాలనిపించి 'నీ పేరు? ' అనడిగాను

ఆమెనే చూస్తూ.

'పెంటి' అంది.

అదేం పేరు అన్నా...

'అసలు పేరు పార్వతి, మస్తాను కంపెనీలోకి వచ్చాక ఈ పేరు వచ్చింది. విశాఖపట్నంలో మస్తాను కంపెనీకి మంచిపేరు, ఎక్కడనుండి పట్టుకొస్తాడో, మంచిగుంటల్ని పట్టుకొస్తాడని చెప్పుకుంటారు.'

'మరిప్పుడు మస్తాన్ కంపెనీలో లేవా?...'

'లేదు ఆ కంపెనీలో కొన్నాళ్ళే, ఇప్పుడు వాడ వీధిలో చిన్న గుడిసెలో ఉంటున్నా, నా బతుకు నేను బతుకుతున్నా' అంది

'మీదేవూరు?'

'గజపతి నగరం'

నాకింకేం అడగాలో అర్థంకాలేదు. గ్లాసులో పోసుకున్న బీరు సిప్ చేస్తూ తలగడా దిండుకి ఆనుకు కూర్చున్నా.. పెంటి తినడం పూర్తిచేసి ఆకులు డస్ట్‌బిన్‌లో పడేసి బాత్రూములోకి వెళ్ళి చెయ్యి కడుక్కుని, ఆ కొళాయినీళ్ళే కాసిన్ని తాగి వచ్చి తన దుప్పటి మీద కూర్చుంది. నేనే పనిచేయడం లేదని గమనించిందేమో, తను చెప్పడం మొదలుపెట్టింది. ఆ అమ్మాయి చెప్పే విషయంలో ఉండే రసికత... ఇంట్రస్టు కలగ జేసింది. మౌనంగా తను చెప్పింది వినసాగాను...

'గజపతి నగరానికి నాలుగుమైళ్ళ దూరంలో ఉంది మా ఇల్లు. మా అమ్మ పొలంలో పనికెళుతూండేది. అప్పటికి నాకు పన్నెండేళ్ళు, ఇంట్లో పనిచేస్తుండేదాన్ని... నాన్న ఏవో దొరల కొట్లాటలో పోయిండని చెప్పుకుంటారు. మా ఇంటికొకతను వస్తుండేవాడు. అమ్మ అతనితో చనువుగా ఉండేది. అతను మా ఇద్దరికీ బట్టలు తెచ్చేవాడు. ఇంట్లోకి అప్పుడప్పుడు కోడి మాంసం తీసుకొస్తుండేవాడు. అతను అమ్మలేనప్పుడు వస్తే నాతో పరాచకాలాడేవాడు. ఎక్కడెక్కడో చేతులువేసేవాడు. అతను చేసే పనులు నాలో ఓ విధమైన ఆవేశాన్ని కలుగచేసేవి.

ఆ రోజుల్లో నేను పెద్దమనిషిని అయాను. అతను అమ్మలేని సమయాల్లో తరుచుగా రావడం మొదలుపెట్టాడు. ఆ విషయం అమ్మ పసిగట్టి నన్ను తనతో పొలం పనిలోకి తీసుకెళ్ళిపోయింది.

పొలంలో దొరకొడుకు చూసే చూపులకి ఒళ్ళంతా తూట్లుపడ్డట్టుండేది. ఓరోజు దొర కొడుకు నవ్వుతూ చెయ్యి పట్టుకుని 'చాపేసేవేమిటే' అని అడిగాడు.

నేను బెదిరిపోయి ఏం చెప్పాలో తెలీక 'ఊ' అన్నాను.

ఇది జరిగిన రెండు రోజులకి దొరకొడుకు అమ్మని ఇంటి దగ్గర పనుందని పంపించి నన్ను కళ్ళం దగ్గరున్న పాకలోకి తీసుకెళ్ళాడు... భయం తప్ప అనుభవానికి ఇంకేమీ రాలేదు. కానీ దొరకొడుక్కి ఆ అనుభవం నచ్చినట్టుంది. చేతిలో రెండురూపాయలు పెట్టాడు. అదొక్కటే నాకు ఆనందం కలిగించింది. తర్వాత చాలా రోజులవరకు దొర కొడుకుని పొలంలో చూడలేదు. మళ్ళీ కొన్నాళ్ళ తర్వాత దొర కొడుకు మళ్ళీ పొలంలోకి వచ్చాడు నన్ను చూసాడు ఆరునెలల క్రితం చూసిన పార్వతిని కాదు అని అర్థం చేసుకున్నాడు ఎద ఉబ్బెత్తుగా దాచినా దాగని యవ్వనం, దాన్ని దాచడానికి అమం చింపి ఇచ్చిన చీర ముక్క నల్లగా నిగనిగలాడుతున్న బుగ్గల్లో అందం పరికిణీని గోచికట్టడం వల్ల నగ్నంగా ఉన్న ముంగాళ్ళు అతనిలో ఇన్నాళ్ళూ మరుపున పడ్డ అనుభవాన్ని జ్ఞప్తికి తెచ్చాయి.

నన్ను చూసి నవ్వుతూ కళ్ళం దగ్గిర చీపురుతో తుడిచి శుభ్రం చేసి పాకలో కుర్చీలు బైటవెయ్యి అని పురమాయించాడు. నేను బుర్ర ఊపి కళ్ళం దగ్గర పాకలో దూరాను. నావెనకే దొరకొడుకు కూడా పాకలో దూరాడు.

ఇలా నాలుగు రోజులు జరిగే సరికి దూరంగా పనిచేస్తున్న అమ్మ పసిగట్టింది. కానీ ఏమీ అనలేక పోయింది. దొరకొడుకు నాకు పని పురమాయించినప్పుడు. అదెందుకు బాబు నేను శుభ్రం చేస్తాను అంటూ కళ్ళం దగ్గర పాక దగ్గరకి వెళ్ళేది.

అమ్మ అలా పాక దగ్గరకి వెళ్ళడం దొర కొడుకు అర్థం చేసుకున్నాడు. తర్వాత దొర కొడుకు మళ్ళీ చాలా రోజులవరకూ పొలంలోకి రాలేదు. కనబడలేదు.

నేను కూడా నిరుత్సాహపడిపోయాను. డబ్బులు దొరికే అవకాశం పోయిందని కాని చాలారోజుల తర్వాత దొర కొడుకు ఓ మధ్యాహ్నం పొలంలోకి వచ్చాడు. అమ్మని కళ్ళం దగ్గర పనుంది వెళ్ళమన్నాడు. అమ్మ వెళ్ళింది. అమ్మ వెళ్ళిపోయాక నన్ను చూసి నవ్వి 'విజయనగరం సినిమాకి వస్తావేమిటే?' అనడిగాడు.

'అమ్మ?' అన్నాను భయంగా.

'ఫర్వాలేదు నే చెపుతాగా అన్నాడు.

అమ్మ కళ్ళం దగ్గర నుండి రాకుండానే దొరకొడుకుతో మోటారు బండిమీద విజయనగరం వెళ్ళిపోయాను. అక్కడ సినిమాకి వెళ్ళలేదు దొర కొడుకు ఫ్రెండింటికి తీసుకెళ్ళాడు. అక్కడ స్నానం చేసాను. ఎవరివో బట్టలుంటే కట్టుకున్నాను. ఆ ఇంటిలో ఎవరూలేరు. నేను దొరకొడుకే సాయంకాలం వరకూ గడిపి దొరకొడుకు ఇచ్చిన డబ్బులు తీసుకుని ఇంటికి చేరుకునే సరికి రాత్రి ఎనిమిదయింది.

ఇంటికి చేరుకోగానే, అమ్మ భద్రకాళిలా మీదపడి 'ఎక్కడికి పోయావే?' అంటూ చితకబాదింది. ఆ తర్వాత చాలారోజుల వరకూ నేను బైటకి పోలేదు కాని ఓ రోజు దొరకొడుకు అమ్మ ఇంట్లో లేనప్పుడు ఇంటికి వచ్చాడు. 'పట్నం వస్తావేమిటే, మోటారు బండిమీద తీసుకెళతాను' అన్నాడు.

నాకు పిచ్చి తెగింపు వచ్చేసింది. పట్నం వెళ్ళి సినిమా చూస్తాం, డ్రింకులు తాగుతాం కిందటిసారి బట్టలుకొంటానన్న దొరకొడుకు ఈసారి బట్టలుకొనచ్చు, తిరిగి ఇంటికి వస్తే ఏం జరుగుతుంది అమ్మ మరోసారి కొడుతుంది, రెండురోజుల్లో మర్చిపోతుంది.

ఈ ఆలోచన రాగానే తయారై దొరకొడుకు మోటారు సైకిలు మీద కూర్చున్నాను.

✡ ✡ ✡

ఈసారి దొరకొడుకు నేననుకున్నట్టుగా విజయనగరం తీసుకెళ్ళలేదు. డైరెక్ట్ గా విశాఖపట్నంలో ఒక ఫ్రెండ్ ఇంటికి తీసుకెళ్ళాడు. అక్కడ ఇంటిలో నలుగురు కూర్చుని పేకాట ఆడుకుంటున్నారు మధ్యన పెద్ద విస్కీ బాటిలు ఉంది. అందరూ తాగుతున్నారు. నన్ను స్నానం చేసి రమ్మన్నారు. నేను స్నానం చేసి వచ్చా... దొరకొడుకు 'తాగుతావేంటే?' అనడిగాడు. ఏం తాగుతున్నారో తెలియక 'ఊ' అన్నాను. ఒక చిన్నగ్లాసులో పోసి ఇచ్చాడు. నేను మామూలు డ్రింక్ తాగినట్టుగా, తాగాను. గొంతు మండింది పొలమారింది. మరి కొంచెం తాగాను. అలా తాగి ఆ గ్లాసులో పోసింది అంతా తాగేసాను. తల దిమ్ముగా తయారైంది అక్కడ ఉన్న దొరకొడుకూ ఫ్రెండ్సూ, సరసానికి దిగారు.

ఎవరు ఏం చేస్తున్నా అభ్యంతరం చెప్పలేకపోయాను. ఆ రోజు మత్తులో, అలసిన శరీరంతో నిద్రపోయాను. మర్నాడు లేచి చూసేసరికి దొరకొడుకూ లేడు అతని మోటారు బండీ లేదు. ఇంటి దగ్గర అమ్మని తలుచుకుంటే చాలా భయం వేసింది.

దొరకొడుకు ఫ్రెండ్ తనకి వంటమనిషి కావాలని నన్నక్కడ ఉండిపొమ్మన్నాడు. లోలోపల భయంగా ఉన్నా ఇంక చేసేదేం లేక విశాఖపట్నంలో దొరకొడుకు ఫ్రెండ్ ఇంట్లో ఉండిపోయాను.

మొదట కొన్ని నెలలవరకూ బాగానే ఉంది దొరకొడుకు ఫ్రెండ్ బట్టలు కొన్నాడు. రోల్డు గోల్డు వస్తువులు కొన్నాడు. నేను వంట చేసేదాన్ని, ఇంటి పనంతా చేసేదాన్ని, మధ్యలో రెండుసార్లు దొరకొడుకు వచ్చి 'ఇంటికి వచ్చేస్తావేమిటే? ' అనడిగాడు. రానని్నేసాను.

నేనా ఇంటిలో స్థిరపడుతున్న కొద్దీ, దొర ఫ్రెండ్ ప్రవర్తనలో మార్పు రాసాగింది. మొదట్లో ఏదో తెలీక పరాకుగా చురకపెట్టినట్లుగా సిగరెట్టుతో చురకలు పెట్టేవాడు. రాను రాను చిన్నదెబ్బలు పడుతుండేవి. కొన్నాళ్ళకి ఈ చురకలు దెబ్బలు నిత్యకృత్యం అయిపోయాయి నేను వాటిని సహించలేని స్థితికి చేరుకున్నాను. ఆ సందు చివరే మస్తాను కంపెనీ ఉండేది. వాళ్ళని రోజూ బజారు కెళ్ళి కూరలు తెస్తున్నప్పుడు చూసేదాన్ని, వాళ్ళు డబ్బు సంపాదిస్తారని అందుకే సంతోషంగా ఉంటారని తెలిసింది. నాకు వాళ్ళతో పరిచయం అయింది. అందులో ఒక అమ్మాయితో జరిగింది చెప్పా... ఆ అమ్మాయి నన్ను మస్తాను దగ్గరకి తీసుకెళ్ళింది. మస్తాను నన్ను దీర్ఘంగా చూసి ఇక్కడకి వచ్చేస్తావా? అని అడిగాడు. 'ఊ' అన్నాను మర్నాడే మస్తాను కంపెనీలోకి మారిపోయాను.

దొరకొడుకు ఫ్రెండ్ అల్లరి పెట్టబోయాడు. మస్తాన్‌కి పోలీసుల్లో ఉన్న పలుకుబడి వలన, ఆయనేం చేయలేకపోయాడు.

✡ ✡ ✡

మస్తాను కంపెనీలో నాకు మంచి డిమాండ్ ఉండేది. పెంటిగా పేరొచ్చింది. ఎవరేనా పేసింజరు వచ్చేసరికి అందరం వెళ్ళి లైన్లో నిలబడేవాళ్ళం. కొత్తవాళ్ళు మొహమాటంగా ఎంచుకునేవాళ్ళు, ఇలాంటి కంపెనీలకి అలవాటు పడ్డవాళ్ళు, భుజాలు నొక్కి, బుగ్గల మీద చిటికేసి, పిర్రలమీద కొట్టి, ఎంచుకునేవారు. ఏళ్ళు గడిచాయి. నాకు డిమాండ్ తగ్గింది. నన్ను ఎంచుకునే వాళ్ళు తగ్గారు.

అప్పుడే కంపెనీలో టిఫిన్లు టీలు తెచ్చే జుమ్మిగాడు 'నాతో వచ్చేస్తావా?' అనడిగాడు

'ఊఁ' అన్నా.... ఇద్దరం మస్తానుని అడిగి బైటకి వచ్చేసాం... వాడవీధిలో రైల్వే స్టేషను పక్కన, చిన్న బడ్డీ 'టీ' కొట్టుపెట్టాం, ఆ పక్కనే పాత ప్లాస్టిక్ షీట్లతో చిన్న గుడారంలా వేసుకున్నాం, మస్తాను డబ్బు సహాయం చేసాడు.

టీకొట్టు మీద వచ్చే ఆదాయం అంతంత మాత్రమే, అందుకే అప్పుడప్పుడు తెలిసిన రిక్షావాళ్ళు పిలిస్తే వెళ్ళి డబ్బులు సంపాదించుకుని వస్తాను' అంది పెంటి. ఆయాసం తీర్చుకుంటూ.

పెంటి చెప్పిన కథ నాకు సానుభూతి కలిగించలేదు. చిన్న సెక్సు కథ విన్నట్టుగా ఉద్రేకం కలిగింది అప్పటికి తాగిన బీరు పనిచెయ్యడం మొదలుపెట్టింది. మత్తు ఎక్కుతోంది.

'అయితే ఇదంతా పొట్టకోసం చేస్తున్నానంటావు' అన్నాను.

'ఊఁ' అంది పెంటి

పెంటి డబ్బు సంపాదనకి పాముతోక ఆధారంగా చేసుకుని ఎక్కసాగింది. పెంటి లక్ష్యం నెరవేరినా, చివర్న పాము తలవుంటుంది. అదికాటెయ్యక మానదు. బెడ్‌లైటు ఆర్పేసి తలగడాలు తలకింద అమర్చుకుని పడుకున్నాను.

'బాబూ ఒక విషయం అడగనా? ' అంది పెంటి, దాని కథ నేను వినేసరికి దానికి ధైర్యం వచ్చింది.

'ఏమిటి'? అన్నా... కళ్ళుమూసుకునే.

'మీరూ డబ్బుకోసమే ఇలా లాడ్జిల్లో గవర్నమెంటు పని చేస్తున్నారటకదా?' అంది. నాకు షాక్ కొట్టినట్టయింది, అంటే మేము కూడా డబ్బు కక్కుర్తితో కంట్రాక్టరు బిల్సు అర్ధరాత్రివరకూ చేస్తున్నామనా దీని ఉద్దేశం.. 'నీకెవరు చెప్పారు.?' అన్నాను.

'ఏజెంట్ గాడు చెప్పాడు తాగిన మైకంలో ఆ బాబుమీది కోపంతో నువ్వు చేస్తున్నదీ, వాళ్ళు చేస్తున్నదీ ఒకటే నువు పదికీ యాభైకీ కక్కుర్తిపడతావు, ఆళ్ళ కక్కుర్తి వేలల్లో ఉంటుంది. ఇద్దరికీ తేడా ఏం లేదు' అంటూ ఏవేవో వాగాడు. అంది పెంటి.

మొట్టికాయ మొట్టినట్టయింది. మేము డబ్బు సంపాదించడానికి నిచ్చెనలు పట్టుకుని ఎక్కుతున్నాం, కాని పక్కగడిలో పాములు పొంచి ఉన్నాయన్న విషయం పట్టించుకోడంలేదు. ఈ ఏమరిపాటు తనం దేనికి దారి తీస్తుందో? లేచి లైటు వేసాను అప్పటికే పెంటి అటు తిరిగి పడుకుంది. నేను లైటార్పి, మళ్ళీ పడుకున్నాను.

నేను రెండు రోజులుగా మనసులో పడుతున్న తర్జ భర్జనకి సమాధానం లభించినట్లయింది....

ఈ విషయం మురళితో మాట్లాడదామనుకున్నాను. కాని పెంటి మాటలు నన్ను ప్రభావితం చేసాయి. మురళితో ఈ విషయం చెప్పకూడదు, అనుకున్నాను. రేపు ఏం చెయ్యాలో నిర్ణయించుకుని శాంతించిన మనసుతో కళ్ళుమూసాను.

✡✡✡

మర్నాడు నాకు తెలివి వచ్చేసరికి ఎనిమిదయింది. మూలగా పడుకున్న పెంటిలేదు. పక్కనే పడుకున్న మురళిలేడు పక్కమీంచి లేచి మొహం కడుక్కుని స్నానం చేసి ఇంటికెళ్ళి భోజనం చేసి ఆఫీసుకి వెళ్ళేసరికి పదకొండు అయింది.

నే వెళ్ళేసరికి 'ఎటెండెన్స్ రిజిష్టరులో సంతకం మర్చిపోయాను' అన్నాను.

ఆయన ఎటెండెన్స్ రిజిష్టర్ని తీసుకుని సంతకం చేసి, వెనక్కి రాకుండా అక్కడే నిలబడ్డా.. ఆయన చేస్తున్న పనిలోంచి తలెత్తి 'ఏమిటి'? అన్నట్టు చూసారు.

'సర్ రిజర్వాయర్ మట్టి డాముకి, ఫ్లడ్‌ప్రొటెక్షన్ మట్టి డాముకి ఎష్టిమేషన్‌కి ఒకే రెడ్యూస్డ్ లెవెల్ వాడినా, బిల్స్ చేసినప్పుడు రెండు వేర్వేరు రెడ్యూస్డ్ లెవెల్స్ వాడారు. రెండిటికీ తేడా రెండున్నర మీటర్లు. దానిని పరిగణించకుండా బిల్స్ చేసారు. దానివల్ల కంట్రాక్టరు తను చేయని పనికి కూడా బిల్స్ చేసాడు' అన్నాను.

ఆయన సాలోచనగా నన్నోసారి చూసి, 'సరే' చూస్తాను అన్నారు. నేను బైటకి వచ్చేశాను. విషయాన్ని విషయాన్ని మురళికి చెప్పలేదు.

✡✡✡

## 15

**మర్నాడు సూపరెంటెండెంట్** ఇంజినీరు, రిజర్వాయర్ సైటు విజిట్‌కి వెళ్ళారు.

అక్కడ ఆయన ఇన్‌స్పెక్షన్ వెనక గల అసలు విషయం అర్థం అయిపోయింది. ఈ విషయం బైటకి రావడానికి ముఖ్యకారకుడ్ని నేనే, అని పసిగట్టారు. ఎందుకంటే బిల్లుచేసిన మురళికి సైటులో జరిగిన విషయాలు అంతగా గ్రహింపుకు రావు. అందుకే మురళి న్యూమరికల్ చెకింగ్‌కి మాత్రం పరిమితమైపోయాడు. మురళి వోవరాల్‌గా ప్రాజెక్ట్‌ని ఎప్పుడూ అధ్యయనం చెయ్యలేదు. ఇప్పుడు జరిగిన అవకతవకల వల్ల కొన్ని లక్షల రూపాయలు కంట్రాక్టర్ చెయ్యని పనికి పేమెంటు జరుగుతుంది.

ఇందులో ఎవరు ఎంత భాగస్వాములు అన్నది ఎవరికీ తెలీదు. ఇప్పుడు ఈ విషయం సూపరెంటెండెంట్ ఇంజినీరుగారికి తెలిసింది కాబట్టి అసిస్టెంటు ఇంజినీరు మొదలైన వాళ్ళు తప్పు జరిగిపోయిందని తప్పుకుంటారు. కానీ కంట్రాక్టరు రావలసిన లక్షలు పోయాయని బాధపడతాడు. అందుకే ఈ విషయం కంట్రాక్టరుకి తెలియగానే నా గురించి ఆఫీసులో అసహ్యంగా ప్రచారం చేసాడు.

ఈ విషయం మురళికి తెలిసి చాలా బాధపడ్డాడు.

'ఇలా ఎందుకు చేసావు? మన లెవెల్లోనే బిల్లుని ఆపేద్దుముకదా.. మనం వోవర్ టైముకి కంట్రాక్టరు దగ్గర డబ్బు పుచ్చుకుంటున్నాంగాని, తప్పుడు బిల్లు చెయ్యడానికి కాదు.' అన్నాడు నాతో.

అప్పుడు నేను ఆ రాత్రి పెంటి అన్నమాటలు వాడితో చెప్పి, 'ఆ ఆవేశంలో సూపరెంటెండెంట్ ఇంజినీరుకి చెప్పేసాను' అన్నాను.

'ఇక్కడ కావలసింది ఆవేశం కాదు ఆలోచన. ఒక నిజాన్ని, లేక తప్పుని బైట పెట్టడానికి అనేక మార్గాలున్నాయి. ఆ అసిస్టెంటు ఇంజినీరుని పిలిచి సూపరెంటెండెంట్ ఇంజినీరు ఎదురుగా పెట్టి ఏదో పొరపాటు జరిగినట్టుంది, చూడండి సార్ అన్నావనుకో ఆ!ఆ! పొరపాటు జరిగిపోయింది అని వప్పుకుని ఫ్రెష్‌బిల్ చేసి పంపిస్తాడు అసిస్టెంటు ఇంజినీరు'

'మరిప్పుడు?' అన్నాను ఆశ్చర్యంగా.

'ఇప్పుడు మనమేదో సత్యవంతులం, వాళ్ళేదో దొంగలూ, అన్నట్టు వచ్చింది సిట్యువేషన్. వాళ్ళు మనల్ని వదులుతారా అందుకే ఈ ప్రచారం, లాడ్జిల్లో బిల్లులు చేస్తున్నా మన్న పేరుతో, ముండల్ని తెప్పించుకుంటున్నామని అన్నారు. ఈ విషయం సూపరెంటెండెంట్ ఇంజినీరు చేరివుంటుంది.'

'చేరితే?' అన్నాను ఈ విషయాలన్నీ ముదుగా ఊహించనందుకు బాధపడుతూ.

'ఆయన ఈ విషయాన్ని ఎలా తీసుకుంటారో చూడాలి' అన్నాడు మురళి.

లాడ్జిలో బిల్లు చెయ్యకపోతే బిల్లులు అవవా? అవుతాయి అవవు అన్న ప్రశ్నలేదు. లాడ్జిలో బిల్లు చెయ్యడం రుజు మార్గం కాదు! వక్రం. రుజుప్రవర్తనే అని సూపరెంటెండెంట్ ఇంజినీరు అర్థం చేసుకోవాలి అంటే వాడు మనకి బంధువైవుండాలి. అయినా ఎక్కడో చిన్న ఆశ....

మురళి ఎన్ని చెప్పినా, నాకు సూపరెంటెండెంట్ గారి మీద నమ్మకం ఉంది. ఆయన నా నిజాయితీని శంకించరని, అసలు ఏ విషయం బయటకు వచ్చేవరకూ ఓపికగా కాచుకు కూర్చున్నాను.

నాలుగు రోజుల తర్వాత బిల్లు విషయం ఏం జరిగిందో తెలీదు గాని, నాకు రైవాడ ట్రాన్సఫర్ అయింది. మురళికి నర్సీపట్నం ట్రాన్సఫర్ అయింది.

నేనాశ్చర్యపోయాను. ట్రాన్సఫర్ ఆర్డర్ పట్టుకుని ఆయన గదిలోకి వెళ్ళాను.

ఆయన 'ఏమిటి?' అన్నట్టు చూసారు.

'సార్ నేను ఎమ్.ఇ. చదువుకుంటున్నాను ఇప్పుడు రైవాడ ప్రాజెక్ట్‌కి వెళ్ళిపోతే నా చదువు పాడైపోతుంది.' అన్నాను.

'మీకు ఉద్యోగం ఇచ్చింది ఆఫీసులో కూర్చుని బిల్లులు చెక్ చెయ్యడానికి లాడ్జిల్లో కూర్చుని మందు కొట్టడానికి కాదు, అని చికాకుగా మొహం పెట్టి వెళ్ళు బైటకి' అన్నారు.

ఆయన నన్ను విసుక్కోడంతో చాలా అవమానం ఫీలయాను. నేను చేసిన తపన ఏమిటో నాకు అర్థం కాలేదు, ఒకటి మాత్రం అర్థం అయింది నేను ***పెట్రోలు టాంక్ మీద కూర్చుని, ఎదుటివాడిమీద నిప్పురవ్వలు విసరడం మూర్ఖత్వం.***

ఇప్పుడు రైవాడ వెళ్ళిపోతే ఎమ్.ఇ. ఆగిపోతుంది జీవితాంతం ఇదే ఉద్యోగంలో ఉండిపోవాలి. ఏం చెయ్యాలి? అన్న ఆలోచనతో నేను ఊగుతుండగానే, మురళి నర్సీపట్నం వెళ్ళి జాయిన్ అయిపోయాడు. ప్రతి శనివారం ఇంటికి వస్తాడు. అప్పుడే కలవడం జరుగుతోంది.

✡ ✡ ✡

ఆ రోజు ఆదివారం మురళి నర్సీపట్నం నుండి వచ్చి ఉంటాడని మురళి ఇంటికి వెళ్ళాను. మురళి లేడు కాని వచ్చే అవకాశం ఉంది కూర్చోండి అంది మురళి సిస్టర్ రవళి.

రవళి బి.యస్సీ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. మెడిసన్ ఎంట్రన్స్ రాస్తోంది. రవళిని అప్పుడప్పుడు చూడ్డమేగాని, ఎప్పుడూ పలకరించి మాట్లాడలేదు. ఆ రోజు నేను వంటరిగా కూర్చున్నానని నాకు కంపెనీ ఇద్దామని తనూ వచ్చి డ్రాయింగ్ రూములో కూర్చుంది.

నేను తెలుగు వీక్లీ తిరగేస్తున్నా...

'మీ కథ చాలా బావుందండీ' అంది రవళి.

తిరగేస్తున్న వీక్లీని పక్కకి పెట్టి 'ఊహూ' అన్నాను నవ్వుతూ ఆమె కళ్ళల్లోకి చూసి, తర్వాత ఏం మాట్లాడాలో తెలీక మౌనం వహించింది రవళి.

'మీకు సాహిత్యం అంటే ఇష్టమా?'

'చదువుతాను.' అంటూ తనకి నచ్చిన రచయితల పేర్లు చెప్పింది.

రవళికి సాహిత్యం పై ఉన్న ఇంట్రస్టువల్ల, ఆమె వెలిబుచ్చే అభిప్రాయాలు సూటిగా ఉండి మనసుకు హత్తుకోవడం వల్ల నాకు రవళంటే ఇష్టం ఏర్పడింది. ఉద్యోగ విషయంలో చికాకుగా ఉన్న మనసుకి రవళితో సంభాషణ హాయి కలిగించింది.

ఆ రోజు రవళితో రెండు గంటల సేపు మాట్లాడాను. రవళిలో అందంలేదు, ఆకర్షణలేదు. సింప్లిసిటీ ఉంది. 'బి సింపుల్ ఇటీజ్ హేపీ, బట్ ఇటీజ్ టూ డిఫికల్ట్ బి సింపుల్' అన్నట్టు, రవళి సింపుల్‌గా ఉండ్డానికి పడ్డ కష్టం అంటే ఇష్టం వేసింది. మాటకూడా నిర్మలంగా ఉండి, మనసుకు హత్తుకుని 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్ కాకుండా లవ్ ఎట్ ఫస్ట్ టాక్, లవ్ ఎట్ ఫస్ట్ థాట్' అని మార్చుకుంటే బావుంటుందేమో!

మా మధ్య సంభాషణ ఎంతకీ తరగలేదు. కాని రవళిని అమ్మగారు లోపలికి పిలిచారు. ఇంక మురళి రాడని నిర్ణయించుకుని, నేను బైటకి వచ్చేసాను.

✡✡✡

రవళి పరిచయమైన తర్వాత, రవళిని కలుసుకోవాలని రవళితో మాట్లాడాలని, నాలో ఏదో తెలియని తహ తహ బయలుదేరింది. కాని ఏ కారణం లేకుండా మురళి ఇంటికి వెళ్ళడానికి మనసు వెనుదీసేది.

రవళిని కలుసుకోడానికి ఆదివారం వరకూ ఎదురు చూడవలసి వచ్చేది. రవళి నా హృదయంలో ఏవో తెలీని రహస్యద్వారాలు తెరిచింది. ఆ ద్వారం గుండా పోతున్న కొద్దీ నాలో ఇంత స్పందన, భావనావేశం ఉన్నాయంటే నాకే ఆశ్చర్యం వేసింది.

ప్రతినిమిషం రవళితో గడపాలని, రవళిని కలియాలని నా మనసులో జరుగుతున్న కలవరపాటు రవళికి చెపుదామని ఎంతో ప్రయత్నం చేసాను. కానీ నాలో పొంగుతున్న ఆవేశాన్ని నాలోనే దాచుకున్నా. ఈ భావావేశం మిధ్య అన్న అవసర ఆలోచన నన్ను పట్టి పీడించింది. దానికి కారణం ఉద్యోగం లేకపోవడం, సరైన ఆర్ధిక స్తోమత లేకపోతే, వైవాహిక జీవితం ఫెయిల్ అవుతుందనే ఆలోచన, నా మనసుకి కళ్ళెం వేసి ఆపాయి.

✡✡✡

ఆ రోజు ఉద్యోగానికి అప్లైచేయాలి, ట్రెజరీ చలాన్ అవసరమైతే కలక్టర్ ఆఫీసుకి వెళ్ళాను. చలాన్ కట్టమని తెలిసిన ఒకతనికి అప్పచెప్పి, ఇంటికి వెళ్ళడానికి కె.జి.హెచ్. బస్‌కి వచ్చా....

అప్పుడే బస్సు దిగుతున్న రవళి కనిపించింది. నేను బస్సు ఎక్కే ఉద్దేశం విరమించి రవళి ఎదురు వెళ్ళి పలకరించా.. రవళి కూడా పలకరించింది. పలకరింపులో హాయిఉంది.

'ఎక్కడికి వెళుతున్నావు?' అంటూ ప్రశ్నించా....

'రామకృష్ణా బీచికా?' అనడిగాను.

'ఇప్పుడే ఎవరూ ఉండరు ప్రశాంతంగా ఉంటుది' అంది.

'ఎందుకు ఒంటరితనం... ప్రశాంతత?' అనడిగా నవ్వుతూ.

'చదువుకోడానికి.. ' అంటూ పుస్తకం చూపించింది. ఆ పుస్తకం ఏమిటో తెలుసుకుందామనే కుతూహలంతో చెయ్యిచాచాను. పుస్తకం గురించి తెలుసుకోవలసింది అంతగా ఏం లేదన్నట్టుగా అట్ట తెరిచి చూపించింది. కాని పుస్తకం ఇవ్వలేదు. నిజంగానే పుస్తకం గురించి తెలుసుకోవలసింది ఏం లేదు అది మెడిసిన్ ఎంట్రన్స్ క్వశ్చన్ బేంక్. ఆ పుస్తకం చూసాక నేను నీరుగారిపోయా... రవళితో ఏ విధంగా మాటలు పొడిగించాలో అర్ధం కాలేదు.. ఇద్దరం కలిసి, రామకృష్ణా బీచికి చేరుకున్నాం.. రామకృష్ణా బీచికి కొంచెం దూరంగా సముద్రపు వడ్డున వో పగోడా ఉంది. అక్కడికి వెళ్ళాం.. పగోడా వరండాలో సముద్రపు అలలకి.. ఎదురుగా కూర్చున్నాం..

'రోజూ వస్తావా? '

'లేదు అప్పుడప్పుడు' అంది పొడిగా, రవళి మాట పెంచడానికి ప్రయత్నించడంలేదు. నేను మాటల్లో పెడితే విసుక్కుంటుందేమో! ఇద్దరం కూర్చున్న కాసేపటికి రవళి పుస్తకం తెరిచింది... కాసేపు చదివి పుస్తకంలోంచి తల ఎత్తి ఎదురుగా అలలని చూస్తూ కూర్చుంది.

నేను ఉండాలా? వెళ్ళిపోవాలా? రవళి ఏకాంతాన్ని పాడుచేస్తున్నానేమో? నాలో కొన్ని గుణాలు లోపించాయి. యౌవ్వనంలో ఉండవలసిన టెంపరితనం, చిలిపితనం, వోవిధమైన కాన్ఫిడెన్స్‌లేకపోవడం వల్ల, ఇంతమంచి పరిస్థితిలో కూడా మౌనంగా కూర్చునే

వున్నా.. ఈ వయసులో నా బాధ్యతని నేనే నెత్తిమీద వేసుకోడం ఆలోచనలో పెద్దరికం, మర్యాద, ప్రవర్తనలో గంభీరత చోటుచేసుకున్నాయేమో! అవి చాలా అస్వాభికం, భావుకత, ఉద్వేగం లేని యౌవ్వనం రాణించదేమో...

రవళి చేతుల్లోంచి పుస్తకం లాక్కుని 'తరువాత చదువుకుందుగానిలే కబుర్లు చెప్పు' అని అనలేకపోయాను. 'పద ఐస్ క్రీం తిందాం' అని రవళిని ఐస్ క్రీం పార్లర్‌కి తీసుకువెళ్ళలేకపోయా... రవళి చెవులకి ఊగుతున్న రింగులని పొగడలేకపోయా....

నేను మౌనంగా కూర్చోడానికి కూడా ఇబ్బంది పడ్డా, రవళితో వెళతానని చెప్పాను రవళి ఉండమననూ లేదు వెళ్ళ మననూ లేదు. నేను లేచి రోడ్డుమీదకి వచ్చేసా.. రోడ్డుమీదకి వచ్చేనేగాని, రవళిని వంటరిగా అక్కడ వదలి ముందుకి వెళ్ళబుద్ధివెయలేదు, ఏదో మాట్లాడాలి? ఏదో చెప్పాలి? కాని ఏమీ చెప్పలేకపోయా....

ఆమె చదువుని పాడుచేస్తున్నాననే శంక మనసులో ఎందుకు కలిగింది. పోనీ నేను వెళతానంటే రవళి ఆపచ్చుగా.. ఎందుకు ఆపలేదు? రవళికి నేనంటే ఇంట్రష్టు లేదేమో? రవళి మనసులో ఏముంది? ఇదే ప్రశ్న ఆలోచనల్లో మాటిమాటికి కెరటంలా మెలిపడి కలవరపెడుతోంది.

ఈ సమయాన్ని రవళి ఏకాంతాన్ని నేను సరిగ్గా వాడుకోలేకపోయాను. నాకేం కావాలో? ఆ సమయంలో నేను దేనికి ప్రాముఖ్యం ఇవ్వాలో నాకు తెలియకపోవడమే నాలో లోపమేమో? ఆలోచనల వేడి, గాడి తప్పిన భావనలు ఇంటికి పోనివ్వలేదు.

పాంబీచి హోటలు వేపు నడిచి, యూనివర్సిటీ క్వార్టర్స్ చేరుకుని, రాజు మాష్టారి ఇంటికి వెళ్ళా.. మూలిగే నక్కమీద తాడిపండు అన్నట్టు మాష్టారు ఇంట్లో లేరు.

ఎందుకో కసి పెరిగిపోయింది. జేబులో డబ్బులు ఉన్నా.. రోడ్డుమీద నడవడం మొదలుపెట్టా... యూనివర్సిటీ క్వార్టర్స్ నుండి మా ఇల్లు ఆరుకిలోమీటర్లు!

నేను నడుస్తున్నానేగాని, నా మనసు రామకృష్ణా బీచిలో పగోడా దగ్గర కూర్చున్న రవళి వేపే వెళుతోంది. శరీరం మాత్రం జగదాంబా థియేటరు వైపు వెళుతోంది. ఎండ తీక్షత పెరిగింది. ఆకలి నీరసం అలసట ఇవేవీ మనసుని బాధ పెట్టడం లేదు.

పగోడా నీడ దగ్గర కూర్చున్న రవళి ఏకాంతాన్ని, నేను పంచుకోలేకపోయానన్న భావం ఆకృతి చెంది తప్పుచేసాననే ఆలోచన నన్ను శాంతంగా ఉండనీయడం లేదు. నా మనసుని సమాధానపరుచుకుని, మళ్ళీ రవళి దగ్గరికి వెళదామని నిర్ణయించుకున్నా.... అప్పటికే ఆ ఎండలో నడుస్తూ జగదాంబా థియేటర్‌కి చేరుకున్నాను.

జగదాంబ ఎదురుగా బస్‌స్టాప్ దగ్గర నిలుచున్నా. రామకృష్ణా బీచికి వెళ్ళే బస్ ఎంతకీ రాలేదు. ఇంకా ఆలస్యం అవుతే రవళి వెళ్ళిపోవచ్చు అన్న ఆలోచనతో కె.జి.హెచ్. వెళ్ళే బస్సు ఎక్కి కె.జి.హెచ్ దగ్గర దిగి, రామకృష్ణా బీచి వేపు నడిచాను.

మధ్యాహ్నం ఒంటిగంట అయింది. నెత్తిమీద ఎండ మండిపోతోంది. కడుపులో ఆకలికి పేగులు అరుస్తున్నాయి. అయినా ఏదో ఆశ ఏదో నమ్మకం, నన్ను నడిపిస్తోంది. దేనికోసమో మనసు తహ తహలాడిపోతోంది. రవళి కూడా నేను వెనక్కి వస్తాననే ఆలోచనతో అక్కడే ఉంటుంది, అన్న నమ్మకం శక్తిని పుట్టించి నన్ను నడిపిస్తోంది.

నేనేమిటి ఆలోచిస్తున్నాను. ఏం చేస్తున్నాను అన్న దాంట్లో వివేకం ఎంత మాత్రం లేకపోవచ్చు, అన్ని ఆలోచనలకీ స్వస్తి చెప్పి కాళ్ళు కదులుతున్నాయి. కళ్ళు వెదుకుతున్నాయి. పగోడా దగ్గరకి వెళ్ళి చూసా.. అక్కడ ఎవరూ లేరు. పగోడా దగ్గరకి వెళ్ళి మెట్లెక్కి వరండాలోకి వెళ్ళి, రవళి కూర్చున్న దగ్గర చూసాను. ఎక్కడా ఎవరూ లేరు. ఎండ తీవ్రతకి, నడచిన నడకకి నోరు ఎండిపోతోంది. నాలిక పిడచ కట్టుకు పోతోంది. నీరసం ఆవరించింది, రవళి కూర్చున్న దగ్గర చతికిలబడ్డాను. కూర్చోలేక అక్కడే నేలమీద పడుకున్నాను. కళ్ళు చీకట్లు కమ్మినట్టయాయి. ...

కళ్ళు మూసుకున్నా.. మనసు నిండా సముద్రపు హోరు, చెవుల్లో అలల సణుగుడు అలా ఎంతసేపు పడుకున్నానో తెలియదు. కాస్త సేదదీరి కళ్ళు తెరిచేసరికి, మధ్యాహ్నం రెండు గంటలయింది. ఎండ తీక్షణత తగ్గలేదు. పగోడా దగ్గర్నుంచి మెల్లగా నడుచుకుంటూ రోడ్డుమీదకి వచ్చి, బస్సు పట్టుకుని ఇంటికి వచ్చేసరికి, అమ్మ 'ఏరా ఎక్కడికి పోయావు, తిండి తిప్పలు లేకుండా?' అంది.

అసలే చికాకుగా ఉందేమో 'హూ అన్నం పెట్టు' అని విసుక్కున్నాను.

అమ్మ అన్నం పెట్టింది. పక్కకి వెళ్ళి కూర్చుని కళ్ళంట నీళ్ళు పెట్టుకుంది.

'చిన్న పిల్లల్ని విసుక్కున్నట్టు విసుక్కున్నాడు, పెద్దదాన్నన్న ఆలోచనే లేదు. ' అంటూ సణుక్కుంది. మనసులో ఆలోచనలు అమమ్మీద విసుక్కున్నాను. దానికి అమ్మ ఇంకోలా ఎందుకు అర్థం చేసుకుంటుంది. నా మనసే బావుండలేదు. అని అర్థం చేసుకోదేం? 'ఏరా ఏమైంది అంతలా విసుక్కున్నావు?' అని సానుభూతిగా ఒక్కమాట అనదేం. భోజనం అయిందనిపించి, నా గదిలోకి వెళ్ళి మంచం మీద వాలా.. మంచి నిద్రపట్టేసింది.

✡ ✡ ✡

రైవాడ వెళ్ళి జాయిన్ అవకపోవడం వల్ల ఉద్యోగం పోయినట్టే! దానితో మళ్ళీ ఆర్థిక సమస్యలు! ఎంత కాన్ఫిడెంట్‌గా ఉందామన్నా, ఉండలేకపోతున్నా.. మనసు నిండా మళ్ళీ ఆర్థిక సమస్యలు పట్టుకు పీడించడంతో, రవళి పట్ల ఆకర్షణ తగ్గింది. కాని అభిమానం పోలేదు. అంతవరకూ కూడేసిన డబ్బు తరిగి పోతోంది. అమ్మని డబ్బు అడగచ్చుకాని, అడగబుద్ధి వెయ్యలేదు.

ఎమ్. ఇ. అయిదవ సెమిష్టర్‌లో ప్రవేశించా.. ముందు మూడు సెమిష్టర్లు సమయం చాలక పరీక్షలు రాయలేదు. ఆ పరీక్షలకి ప్రిపేరయి రాసాను.

ఈ పరీక్షలు.. చదువు.. టెంపరరీ ఉద్యోగం కోసం వేట.. అనే విషయాల్లో పడి రవళిని హృదయపు లోతుల్లో ఎక్కడో సమాధి చేసేసాను. అప్పుడప్పుడు తను ఇంకా ఆ లోతుల్లో ఉన్నానని తెలియచేసేది.

కాని నాలో భవిష్యత్తు పట్ల ఆందోళన, కెరీర్ పట్ల అనిశ్చిత పరిస్థితి ఏర్పడి, ఆమెని డామినేట్ చెయ్యనివ్వలేదు. ముగిసింది. నాలో రాద్దామనే కుతూహలాన్ని అందని మానిపండా? అనిపించేంతగా చేసింది.

ఈ పరమథనసోపాన పటంలో అన్ని గళ్ళల్లోనూ పాములే కనిపిస్తున్నాయి. ఎమ్.ఇ. ని వదిలి రైవాడ వెళ్ళి జాయిన్ అవవలసింది. అని కొన్నాళ్ళు ఆలోచించాను. ఎవరు ఎలా పోతే మనకేం అని ఆలోచించకుండా లేనిపోని నైతిక భారాన్ని నెత్తికెక్కించుకుని, సూపరెంటెండెంట్ ఇంజినీరుకి ఎందుకు చెప్పానా? అని పశ్చాత్తాపం, కొన్నాళ్ళు జరిగినవేవీ రివైండ్ అవవు. ముందు ముందు ఏం జరుగుతుందో అదీ స్పష్టంగా లేదు. ఈ ఆర్థిక పటంలో పడి కొట్టుకుంటుండగా, చిన్న ఊత అన్నట్టుగా ఓ ప్రైవేటు ఇంజినీరు కాలేజీనుండి లెక్చరర్ పోష్టుకి ఇంటర్వ్యూకి రమ్మని వచ్చింది. ఎమ్.ఇ పూర్తవ్వలేదు. కాబట్టి ఉద్యోగం వస్తుందా? రాదా? అనే మీమాంస అలాగే ఉంది ఇంటర్వ్యూలో నువ్వు మాకెందుకూ పనికి రావు అన్నట్టు ప్రవర్తించారు. ఇంటర్వ్యూ అయిన పదిహేను రోజులకి టీచింగ్ అసిస్టెంటుగా ఎపాయింట్ మెంటు ఆర్డరు వచ్చింది.

✡ ✡ ✡

ఉద్యోగంలో జాయిన్ అయిన రెండు నెలలకి, అంతఃకరణలో అణిగి మణిగి ఉన్న, రవళి నీటిపై నావలా పైకి తేలిమనసులో ఓలలాడింది.

పెళ్ళి చేసుకోవా అని అమ్మ, బంధువుల ఒత్తిడి ఎక్కువైంది. రవళి విషయం ఏదో ఒకటి తేల్చుకుందామని రవళికి డైరెక్ట్‌గా మేరేజ్ ప్రొపోజల్ చేద్దామని, రవళి ఇంటికి వెళ్ళాను. రవళికి మెడిసిన్ సీటు రాలేదు. బియస్సీలో కంటిన్యూ అవుతోంది.

నేను వెళ్ళేసరికి రవళి ఎక్కడికో వెళుతోంది. ఇంట్లో మురళి ఉండడని తెలిసీ 'మురళి ఉన్నాడా?' అని అడిగాను.

'లేడు' అంది.

'ఎక్కడికి వెళుతున్నావ్!'

'మెడికల్ షాపుకి'

'ఎవరికి వంట్లో బాగులేదు. అమ్మకి బి.పి మాత్రలు అయిపోయాయి.'

వోహ్హ అన్నా.. నాకు తెలుసు నేనెప్పుడూ 'హోహ్హ' అనను. ఆ రోజు చాలా నెర్వస్‌గా ఉంది. రవళి మెల్లగా నడుస్తోంది. రవళి ఏమైనా మాట్లాడితే బావుండును అనిపిస్తోంది. కాని రవళికి ఆ ఉద్దేశం లేదు. రవళి చూపులో నా పట్ల మునుపటి ఇంట్రెస్టు కనబడటం లేదు అది నాకు తెలుస్తోంది. కాని నా అహంకారం మబ్బులా ఆ ఆలోచనని కప్పేసింది.

ఇద్దరం మౌనంగా నడుచుకుంటూ రోడ్డు జంక్షనుకి వచ్చాం, రవళి అక్కడే పక్కనే ఉన్న మెడికల్ షాపులో దూరింది. రవళి నన్ను తనతో రమ్మనలేదు. కాని నేను ఆమె వెనకాలే మెడికల్ షాపులో దూరాను. రవళి చీటీ చూపించి ఏవో మందులు అడుగుతోంది.

నేను కేష్ కౌంటర్ దగ్గర నిలబడ్డాను. కేష్ కౌంటర్ పక్కగా వేలాడుతున్న తెల్లకాగితపు చీట్ల దొంతి చూసాను. షాపువాడ్ని ఒక చీటీ ఇమ్మని అడిగాను. వాడు చిన్నచీటీ తెంపి ఇచ్చాడు. ఆ చీటీ మీద 'రవళీ నీకిష్టమైతే మేరేజ్ చేసుకుంటాను, నీ ఇష్టం తెలియచెయ్యి' అని రాసాను. కాగితం చివర్న నా ఆఫీసు ఫోన్ నెంబరు రాసాను. చీటీమడిచి జేబులో పెట్టుకున్నాను.

షాపులో మందులు కోనడం అయిపోయాక, ఇద్దరం బైటకి వచ్చాము. నా చేతిలో చీటీని రవళికి ఎలా ఇవ్వాలి? ఎప్పుడు ఇవ్వాలి? అన్న ఆలోచనతో రవళితో పాటు నేనూ నడుస్తున్నాను. సందులో దీపాలు గుడ్డి దీపాల్లా ఉన్నాయి. రవళితో నేను వాళ్ళ ఇంటికి వెళ్ళినా, ఆ వెలుగులో, ఆ డ్రాయింగ్ హాలులో నేను ఆమెకి సందేశాన్ని ఇవ్వలేకపోవచ్చు, అన్న ఆలోచనతో జేబులోంచి కాగితాన్ని తీసి 'రవళీ ఇది చదువుకో నీ అభిప్రాయం తెలియచెయ్యి' అని చెప్పి ఆమె చేతిలో కాగితాన్ని పెట్టి 'వస్తా' అని చెప్పి, వెనక్కి తిరిగి బస్ స్టాపుకి వచ్చేసాను.

బస్ స్టాపుకి వచ్చేసానేగాని, మనసింకా రవళితోనే ఉంది. రవళి చీటీని చదివి, నన్ను వెతుక్కుంటూ బస్‌స్టాప్‌కి వస్తుందని, నాలో ఎక్కడో ఏదో తెలియని ఆశ, వస్తే బావుండును. అనే ఆలోచన బస్ స్టాపు దగ్గర గంటసేపు నిలబడ్డాను. వచ్చిన బస్సులేవీ ఎక్కలేదు. గంట గడిచినా రవళి కనుచూపు మేరలో కనబడలేదు. రవళి తన ఇష్టం చెప్పడానికి ఏ మాత్రం ఎక్స్పెట్ అవలేదు అంటే నమ్మబుద్ది వెయ్యలేదు.

చీకటి వల్ల కళ్ళకి చూపు మేర ఎలా తగ్గిందో మనసులో 'విష్ ఫుల్ థింకింగ్' వల్ల బుద్దికి నిజాన్ని గ్రహించే జ్ఞానం సన్నగిల్లింది.

బస్‌స్టాపునుండి బయలుదేరి రవళి ఇంటివేపు నడిచా, సందులో చీకటిగా ఉంది. ఎవరూ నడుస్తున్న జాడలేదు. రవళి ఇంటిమీదుగా వెళుతూ, ఇంటిలోకి చూసాను. ఇంటి బయట తలుపు వేసి ఉంది. ఇంట్లో అలికిడి లేదు. ఇంట్లో ఏ అలికిడైనా ఉండాలని ఎందుకనుకున్నాను. రవళి ఇష్టాన్ని తెలుసుకోవాలనే కుతూహలం ఉంటే, రవళితో ముఖాముఖీ ఎందుకు చెప్పలేదు. ఇవన్నీ ప్రశ్నలు సమాధానం లేని ప్రశ్నలు మళ్ళీ బస్ స్టాపుకి వచ్చి బస్ ఎక్కి ఇంటికి వచ్చేసాను.

✡ ✡ ✡

# 16

**రెండు రోజులైనా రవళి నుండి సమాధానం రాకపోయేసరికి,** తెగించి రవళి ఇంటికి ఫోను చేసాను. రవళే ఫోను ఎత్తింది. అటుపక్కనుండి రవళే మాట్లాడుతోందని అర్థం చేసుకున్నాక 'రవళీ ఏ విషయం చెప్పలేదేం?' అనడిగాను. రవళి మౌనంగా ఉంది.

'నేను ఇచ్చిన కాగితం చదవలేదా?'

రవళి మౌనమే సమాధానం

'నా మేరేజ్ ప్రపోజల్ నీకిష్టం లేదా?' అనడిగా తెగేసి,

'సారీ' అంది నీరసంగా. నేను షాక్ అయ్యా... పరస్పర ఆకర్షణవున్న సమయంలో నిర్లిప్తంగా ఉండడం రవళి ఇంకోలా అర్థం చేసుకుందేమో! కనీసం రవళి మాట పొడిగించలేదు.. పొడిపొడిగా సమాధానం చెపుతోంది. నా ఆలోచనల్లో నేను ఉండగానే రవళి అటుపక్క ఫోను పెట్టేసింది.

మనసు నిండా ఆలోచనలు రవళి దేనికి వెనుదీసింది. కట్నం భయమా? నా అహంకారం వల్ల దెబ్బ తిందా? లేక రవళిలో ఇన్ఫేరియారిటీ కాంప్లెక్స్ ఉందా? ఇలా అనేక రకాల ఆలోచనలు, కానీ ఆ రోజే రాత్రి చీకటిలో రోడ్డు మీద నేనామెకిచ్చిన చీటి వెతికితే కనబడదేమో? అన్న ఆలోచన రాలేదు.

✡✡✡

రవళి ప్రవర్తన విచిత్రంగా కనిపించింది. రవళి తిరస్కారం... రవళి మీద కసితో ఏవేవో ఊహించడం మొదలుపెట్టాను. రవళిని పెళ్ళిచేసుకోడం ద్వారా ఆమెకి ఉపకారం చేస్తున్నాననుకున్నాను. రవళి కుటుంబం సామాన్యమైన కుటుంబం, రవళి నాన్నగారు రిటైరై ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు.

మురళి ఉద్యోగం చేస్తే గాని కుదరని పరిస్థితి. రవళి పెళ్ళి వాళ్ళకి సమస్యే! కాని రవళి ఇవేమీ ఆలోచించకుండా నన్ను తిరస్కరించిందా? రవళిలో అహంకారాన్ని అంచనా వెయ్యడానికి ఆలోచన్ని వృధా చేసాను.

నన్ను నేను అంచనా వేసుకోవలసింది.

రోజులు సాఫీగా సాగుతున్నాయి, కానీ సోపానపటంలో పాములికి కొదవలేదు. ఆ సమయంలోనే నే పనిచేస్తున్న కాలేజీలో ఒక కొలిగ్ రాత్రి ఎనిమిది గంటలకి స్కూటరేసుకు మా ఇంటికి వచ్చాడు. 'నిన్ను ప్రిన్సిపల్‌గారు రమ్మన్నారు.' అంటూ స్కూటరు మీద నన్ను కూర్చోబెట్టుకుని కాలేజీకి తీసుకువెళ్ళాడు.

నేను కాలేజీకి వెళ్ళేసరికి ప్రిన్సిపల్‌గారి రూములో లైటు వెలుగుతోంది. నేను ప్రిన్సిపల్‌గారి రూములోకి వెళ్ళా, ప్రిన్సిపల్‌గారి రూములో మా డిపార్టుమెంటు హెడ్డూ, హాస్టలు వార్డెనూ, ప్రిన్సిపల్‌గారూ, కూర్చుని ఏదో విషయాన్ని తీవ్రంగా చర్చిస్తున్నారు. నన్ను చూడగానే 'అదిగో వచ్చాడు'. అంటూ సర్దుకు కూర్చున్నారు.

హెడ్డు 'రా కూర్చో' అన్నట్టు సైగ చేసారు. నేను వెళ్ళి ప్రిన్సిపల్‌గారి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాను. నేను కూర్చున్నాక ప్రిన్సిపల్‌గారు డ్రాయరు సొరుగులోంచి ఒక కాగితం తీసి నాకిచ్చి చదవమన్నారు. నేనా కాగితం చదువుతున్నంతసేపూ నా మొహంలో మారే భావాల్ని చదువుతూ కూర్చున్నారు ముగ్గురూ!

కాగితం చదవడం ముగించేసరికి, నాకు ముచ్చెమటలు పట్టాయి.

'స్ట్రైకులు చేసి నిరాహారదీక్షలు చేసి, మార్కులు తెచ్చుకోగలమంటే అది వాళ్ళ భ్రమ, కాని స్టూడెంట్స్ రాసిచ్చిందాన్ని బట్టి ఆలోచిస్తే రేపువాళ్ళు కాలేజీ ముందు ఏదో గొడవ మొదలు పెడతారు. ప్రస్తుతం స్టూడెంట్స్ గొడవ మొదలుపెట్టకుండా ఆపాలి' అన్నారు ప్రిన్సిపల్.

నేను నిస్సహాయుడిగా ప్రిన్సిపాల్ వేపు చూసాను. కాని ఆయన అన్న మాటలు నాకు వచ్చాయి.

ప్రిన్సిపల్‌గారే 'ఏమైందో చెప్పండి, ఈ గొడవకి కారణం ఏమైవుంటుందో చెప్పండి' అన్నారు.

గొడవకి కారణం స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంటుని నేను నా సబ్జెక్టులో ఫెయిల్ చెయ్యడమే! అతను రాసిచ్చిన ఎసైన్‌మెంటు టైము దాటిపోవడం, ఎసైన్‌మెంటు అతను ఎవరి చేతో రాయించడం, కారణాలు.

దానివల్ల స్టూడెంటు యూనియన్ ప్రెసిడెంట్స్‌ని వెనుకేసుకొచ్చి నా మీద ఏవో లేనిపోనివి రాసి, ఆఖరిగా నేను క్లాసులో సరిగా బోధపర్చలేక ప్రశ్నలడిగిన విద్యార్థుల్ని ఇంటెన్షనల్‌గా ఫెయిల్ చేస్తానని ఆ ఉత్తరంలో రాసాడు.

నేను ప్రిన్సిపాల్ గారితో 'ఇదంతా ఇంటెన్షనల్ కాదని, ఫెయిల్ అయిన విద్యార్థుల ఎసైన్‌మెంట్స్ నా దగ్గర ఉన్నాయని అన్నాను. ఆయన నన్ను అనునయిస్తున్నట్టుగా 'ఎసైన్‌మెంట్స్‌ని మరో సీనియర్ ప్రొఫెసర్ చేత కరెక్షన్ చేయిద్దామని ఆయన ఏ నిర్ణయం తీసుకుంటే అది అమలు చేద్దామని' అన్నారు. నేనందుకు ఒప్పుకున్నాను.

ఎసైన్ మెంట్స్ అన్నీ సీనియర్ ప్రొఫెసర్‌కి అందచేసాను. ఈ విషయం తెలిసి స్టూడెంట్స్ మర్నాడు గొడవ చెయ్యకుండా వెనక్కి తగ్గారు. స్ట్రైక్ ఆగిపోయింది.

సీనియర్ ప్రొఫెసర్ ఏ నిర్ణయం తీసుకున్నది. నాకు తెలియలేదు. కాని రిజల్ట్స్ వచ్చాక తెలిసింది. నేను ఫెయిల్ చేసిన స్టూడెంట్స్ అందరూ ఆ సబ్జెక్టులో పాసయారని!

రవళితో జరిగిన అనుభవం వల్ల, కాలేజీలో జరిగిన అనుభవం వల్ల, నేను ప్రయాణం చేస్తున్న అహంకారపు బెలూనులో గాలిపోయి నన్ను నేలమీద నిలబెట్టింది. ఒక విధంగా అది నాకు మంచే చేసింది. ఇది జరిగిన తర్వాత నేను జాగ్రత్త వహించాను. అటువంటి సమస్యలు నా వృత్తిలోకి రాకుండా జాగ్రత్త వహించాను. విలువల్ని పట్టించుకోడం మానేసాను. విలువల్ని భూస్థాపితం చెయ్యలేదు.

✡✡✡

ఉద్యోగం అనే నావ సాఫీగా సాగిపోతోంది. జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకున్నాను. ధనానికి సంబంధించిన పాములేవీ మింగలేవని అర్థం అయింది. కాని జీవిత పటంలో పాములకి కొరతలేదు. మరో పాము గురించి చెపుతాను.

కొన్ని పాముకాటులు మత్తెక్కిస్తాయి. ఆఫ్రికా దేశాల్లో ఈ పాములచేత నాలుక చివర్లో కాటేయించు కుంటారని విన్నాను. ప్రతిమనిషి జీవితంలోనూ ఈ పాము ఇష్టంగానో అయిష్టంగానో కాటెయ్యక మానదు. దీని మత్తులో పడ్డం తప్పదు. కాని మత్తులో గళ్ళు దిగజారేడా? ఎగబాకేడా? అన్న తేడా తెలియదు.

ఈ పాము పేరు పెళ్ళి! జీవితంలో ఆర్థిక సమస్యలు తీరిపోగానే మన చుట్టుపక్కల వాళ్ళు, పెళ్ళి తప్ప ఇంక ఫ్యూచరు లేదనే నిర్ణయానికి వస్తారు! నేను కూడా అలాంటి నిర్ణయానికి వచ్చాననుకుంటాను. అందుకే రోజుకో అమ్మాయి గుణగణాల బుర్రకథ నా ముందు జరుగుతోంటే శ్రద్ధగా వింటున్నా! కొందరు గడుసు బంధువులు ఆదివారాలు నన్ను వాళ్ళింటికి భోజనానికి పిలిచి, అమ్మాయిల్ని చూపించేయడం మొదలు పెట్టారు. నేను కాదంటున్న అమ్మాయిల సంఖ్య పెరిగిపోతోంది. దానితో బంధువుల మూతి విరుపులూ పెరిగిపోతున్నాయి.

ఈ వ్యవహారంలో భాగంగానే ఒక ఆదివారం బృహతిని చూడ్డం పడింది. బృహతిలో లోపాలు వెదకడం నాకు సాధ్యం కాలేదు, మరిన్ని వివరాలు తెలుసుకోడానికి ప్రయత్నించాను దానితో చిన్నాకి బృహతి నచ్చిందని తండ్రికి తెలియచేసారు.

బృహతి తండ్రి మా ఇంటికి వచ్చి, అబ్బాయి రత్నంలాంటివాడు, ముత్యంలాంటివాడు, ఎంతకట్నం ఇవ్వడానికేనా సిద్ధమే, అంటూ పెళ్ళి మాటలు మొదలుపెట్టాడు.

నేను కట్నం లేకుండా చేసుకుంటాను అన్నాను. అమ్మకి అది నచ్చలేదు. అమ్మాయికి ఏం పెడతారు పదితులాల బంగారమా? అంటూ బేరం సాగించింది. రత్నంలాంటి అబ్బాయికి ఏమిచ్చినా పర్వాలేదు అన్న బృహతి తండ్రి, నా మనసు తెలుసుకోగానే, 'అబ్బాయి అంత మంచి మనసుతో కట్నం తీసుకోనని, మీరంత మొండిపట్టు పట్టకూడదు అక్కయ్యగారూ' అంటూ రెండు తులాల బంగారం పెట్టడానికి మాత్రం ఒప్పుకుని, తాంబూలాలు పుచ్చుకున్నాడు.

బృహతి అక్క పెళ్ళికొడుకు చవగ్గా వచ్చాడు అందట... మన సమాజంలో మార్కెట్ ఓరియంటెడ్ మెంటాలిటి ప్రాచీనంగా ఉందని అర్థం చేసుకున్నా..

✡ ✡ ✡

పెళ్ళి ఘనంగా జరిగిందా? ఘనంగా జరిగినట్టు అనిపించిందా? అంతా అయోమయం పెళ్ళి జరిగి పోయింది.

బృహతి అందంగా ఉంటుంది చదువుకుంది మొదటిరోజు రాత్రి, సిగ్గుపడకుండా ఏవేవో కబుర్లు చెప్పింది. పెళ్ళి కార్యక్రమంలో పాల్గొన్న అలసట వల్ల, ఇద్దరిలో అనుభూతి లోపించింది.

బృహతి కాపురానికి వచ్చిన కొన్నాళ్ళకి నాకో విషయం అర్థం అయింది ఒక్క రాత్రిళ్ళు మాత్రమే కాకుండా ప్రతీ చిన్న విషయానికి నేను బృహతి మీద ఆధారపడుతున్నాను.

బృహతి మా ఇంటికి కొత్తమనిషిగా వచ్చినా చాలా తేలికగా మా ఇంటివాతావరణంలో పెనిట్రేట్ అయింది. అమ్మని తన ఎడాప్టివ్ నేచర్ వల్ల ప్రసన్నం చేసుకుంది. ఆమెలో మాటనేర్పు, చురుకుతనం నాలో వో విధమైన విశ్వాసం కలుగచేసాయి. మొత్తం ఇంటి బాధ్యతంతా ఆమెకి అప్పగించేసాను.

బృహతిలో నేర్పు వోర్పు ఎదుటివాళ్ళ అభిప్రాయాల్ని ఓపికతో విని, మొత్తం విషయం గ్రహించి, దాన్ని తన కనుకూలంగా మలచుకుని, తన ఇష్టాన్ని మృదువుగా రేషనల్‌గా తన మాటకారితనంతో రీజనింగ్ చూపించి, ఎదుటివాళ్ళని ఒప్పించి తన దారిలోకి తెచ్చుకోడం లాంటివి ఆమెకి పెట్టని భూషణాలు. బృహతి మీద నాకు విశ్వాసం పెరిగిన కొద్దీ బృహతికి తనమీద తనకి నమ్మకం పెరిగి నా ప్రాముఖ్యతని ఇంటి విషయాల్లో తగ్గించింది. అప్పుడప్పుడు నాకు బృహతిలో ఇద్దరు బృహతులు ఉన్నారా? అన్న అనుమానం కలుగుతోంది.

✡ ✡ ✡

కొత్తదాంపత్యంలో తీయదనం, పొందులో వెచ్చదనం గుర్తుంచుకో తగ్గంత మనసులోకి ఇంకలేదు. బృహతితో పొందు అవసరంతో ఆగిపోయింది. కాని మందులా నిషా పుట్టించలేదు.

ఎదురుగా ఏ సిగ్గులూ పోకుండా చీర మార్చుకునేది. కనీసం మీరు పక్కకి తిరగండి అంటూ సిగ్గులు పోయి నన్నాకర్షించే ప్రయత్నం ఏదీ చేసేది కాదు.

ఆమె నేచర్‌లో బెట్టు చెయ్యడం, సిగ్గులు పోవడం, మత్తుగా మైమరచిపోవడం అన్నవి లేవు. అంతా యాంత్రికం అవసరం అంతే! మనసులో మాట చెపుదామని ఎన్నోసార్లు ప్రయత్నించాను. కాని చెప్పలేకపోయాను. బృహతి నేచర్ని నాకు అనుకూలంగా మార్చుకోలేకపోయాను.

సంసారనావ అలలమీద ఓలలాడుతూ వయ్యారాలతో సాగుతున్నట్టుకాక, ఎవరో బలవంతంగా తాడుకట్టి ఈడుస్తున్నట్టుగా సాగి, మజలీ దగ్గర ఆగి, బరువెక్కింది. బృహతి కడుపుతో ఉంది.

✡✡✡

ఝరి పుట్టిన తర్వాత బృహతి ప్రవర్తనలో మార్పు వచ్చింది. కాన్ఫిడెన్స్ పెరిగింది. స్వతంత్రంగా వ్యవహరించడం మొదలుపెట్టింది. అది నాకు నచ్చేదికాదు. బృహతి స్వతంత్రభావాల్లో పక్షపాత ధోరణి, వంచన చోటు చేసుకున్నాయా? అన్న అనుమానం నాలో తలెత్తింది.

కాని బృహతి కూడా మాలో మనిషేకదా అలా ఎందుకు ప్రవర్తిస్తుంది. ఆమె స్వతంత్రంగా మసలడం నాకు ఎందుకు నచ్చడం లేదు అన్న ఆలోచన వెంటాడేది.

ఆ సమయంలో ఓ రోజు పిన్ని వచ్చింది. మూడు రోజులుంది. నా పెళ్ళికి పిన్ని రాలేదు. అది దృష్టిలో పెట్టుకుని, మా దంపతుల్ని చూద్దామని పిన్ని వచ్చింది. పిన్ని రాకతో అమ్మకి ఉత్సాహం వచ్చింది.

పిన్ని వెళ్ళిపోయేటప్పుడు చీరపెట్టమని అమ్మ బృహతికి పురమాయించింది. ఎందుకంటే నా జీతం అంతా బేంకులో వేస్తాను బృహతే బేంక్‌కి వెళ్ళి డబ్బులు తేవడం, ఇల్లు మేనేజ్ చేయడం చేస్తుంది. అందుకే అమ్మ చీర విషయం నాకు చెప్పకుండా బృహతికి చెప్పింది.

కాని బృహతి తెచ్చిన చీర అమ్మకి నచ్చలేదు. ఆ చీర మరీ సామాన్యం కాకపోయినా మంచిది మాత్రం కాదు. ధర పరంగా.. పిన్ని వెళ్ళిపోయిన తర్వాత 'అదేమిటే అలాంటి చీర తెచ్చావు. ఎప్పుడూ అదిరానే రాదు పెట్టేదే మంచి చీర పెట్టవలసింది.' అంది.

'నేనూ అదే అన్నానండి కాని ఆయన ఖర్చులు ఎక్కువగా ఉన్నాయి ఇప్పటికిలా సరిపెట్టు, ఈసారి వచ్చినప్పుడు చూద్దాం', అన్నారండి అంది బృహతి.

అమ్మ మనసులో బాధపడినా పైకి మాత్రం ఏమనలేదు. ఈ సంఘటన జరిగిన కొద్దిరోజుల్లోనే బృహతి అక్క ఝరిని చూద్దామని వచ్చి, ఝరికి బొమ్మలూ అవీ తెచ్చి ఒక్కరోజు మాత్రమే ఉంది. వదినగారు వెళ్ళిపోతున్నప్పుడు బృహతి మంచి ఖరీదైన చీరకొని పెట్టింది. రెండుచీరలకి ఉన్న తేడా అమ్మ పసిగట్టింది. వదినగారు వెళ్ళిపోయాక 'ఏరా ఇప్పుడు ఖర్చులు లేవా?' అంది.

'ఖర్చులేమిటి?' అన్నాను నేను ఆశ్చర్యంగా

'పిన్నికి మంచి చీర కొనరా అంటే ఎక్కడలేని ఖర్చులూ వచ్చేసాయి. నీకు?' అంది.

ఏదో తేడా జరిగిందని, అది బృహతే చేసిందని నాకు అర్థమయింది. కాని బయట పడకుండా 'ఖర్చులు అప్పుడూ ఉన్నాయి ఇప్పుడూ ఉన్నాయి' అన్నాను.

'ఏమోలే రాకరాక వచ్చింది మంచి చీరైనా పెట్టలేకపోయాం.' అమ్మ విషయం తేల్చీతేల్చకుండా...

కాని విషయం నా కర్థమైపోయింది. పిన్నికి కొన్న చీర, వదినగారికి పెట్టిన చీరల్లో తేడా గురించి అమ్మ మాట్లాడుతోంది. నేను బృహతి వంచనా శిల్పం గురించి ఆలోచిస్తున్నాను. కాని చేసేదేం లేదు. ఏమేనా అంటే మీపన్లు మీరే చేసుకోండి. 'నా దేముంది ఇంత ఉడకేసి పడేస్తాను' అంటుంది.

ఏ విషయంలోనూ కలుగచేసుకోదు. పైగా మీరే ఖర్చులు తగ్గించుకోమన్నారు. అంటుంది. నేను ఎప్పుడో అలా అని ఉంటాను.

అది ఏ సందర్భంలో ఉపయోగించుకోవాలో ఏ సందర్భంలో ఉపయోగించకూడదో బృహతి ఇష్టమై కూర్చుంది. ఈ విషయంలో నేను బృహతిని నిలదీసి ప్రశ్నించవచ్చు, ఘర్షణ జరుగుతుంది. కాని జరిగిన తేడాని సరిచెయ్యలేను. అందుకే మౌనం వహించాను.

✡✡✡

ఇలాంటి చిన్న చిన్న తేడాల వల్ల బృహతి మనస్తత్వం అర్ధం అయింది కాని, నేను ఇంటి పనులకు బృహతి మీద ఆధారపడడం, అమ్మ పూజలు, దేముడూ అంటూ ఏ విషయాన్నీ పట్టించుకోక పోవడం. ఝురి పసితనంతో ఆడుకుంటూ, నా కథల ప్రపంచంలో విహరించుకుంటూ లౌకికమైన అన్ని విషయాలూ బృహతికి వదిలేసాను. ఝురికి మూడో ఏడు జరుగుతుండగా అరణి పుట్టింది. రెండో పిల్ల కూడా ఆడపిల్లే పుట్టడం అమ్మకి నచ్చలేదు.

బృహతి కడుపుతో ఉన్నప్పటినుండి, ఇద్దరితో ఆపేస్తాము ఆపరేషను చేయించేస్తాను అని మేమిద్దరం అనడం వల్ల అమ్మకి అనుమానం వచ్చింది.

'ఏరా రెండోది కూడా ఆడపిల్లే ఆపరేషన్ చేయించకు మూడోసారి కొడుకు పుడతాడేమో' అంది.

'మూడోసారి కొడుకు కాక కూతురే పుడితే?' అన్నాను.

'కూతురు పుట్టేక మాత్రం తెలిసేదేముంది.' అన్నాను.

ఈ విషయంలో బృహతి ఆలోచన ఏమిటా? అని ఆలోచించాను. బృహతి ఏ విషయం చెప్పదు పరిస్థితి నాకు సానుకూలంగా ఉంటే సరి, లేకపోతే వెటకారం చేస్తుంది. ఇవన్నీ ఆలోచించి తెగేసి, బృహతికి ఆపరేషన్ చేయించేసాను.

✡✡✡

అరణి పుట్టడం చాలా అర్భకంగా పుట్టింది. పెరుగుతున్న అరణిలో, పసితనంలో ఉండవలసిన ఆకర్షణ, చలాకీ లేవు ఎత్తుకుంటే తెల్లటి గుడ్లు వేసుకు చూసేది. కాని కేరింతలు కొట్టేదికాదు, అందుకే ఎత్తుకున్న వెంటనే దించ బుద్ధివేసేది.

అరణి సంగతి అలావుంటే బృహతి ప్రవర్తన వేరుగా మారింది. బృహతిలో స్వాభావికం చచ్చిపోయింది. ఏదో నటన చోటు చేసుకుంది. ఇవన్నీ ఇలా అనిపించడానికి కారణం నా మనస్సేమో? లేక నా నిర్లిప్తత, జీవితం పట్ల నిరుత్సాహం కారణాలు కావచ్చు. ఈ నిర్లిప్తత పోయి జీవితం పట్ల ఉత్సాహం ఎలా కలుగుతుందో అర్ధం కావడం లేదు.

సుఖం అంటే అందరికీ అనుకూలమైన భావన అనే నిర్వచనాన్ని ఒప్పుకుని, ఇల్లు బృహతికి అప్పచెప్పి, దానికి అనుగుణంగా ఇంటివేపు వీపు తిప్పి దూరంగా రోడ్డుమీద వచ్చేపోయే జనాన్ని చూస్తూ కూర్చోడం తప్పించి నే చేయగలిగింది ఏదీలేదు అని నిర్ణయానికి వచ్చాను.

✡✡✡

ఈ సంసారమంతా బృహతిదే అన్నట్టు ఉంది. బృహతి కూడా అలాగే ప్రవర్తిస్తోంది. బృహతికి 'షో' మీద ఇంట్రెస్టు. నన్ను కూడా కొన్ని విషయాల్లో తీసి పారేస్తోంది. బృహతికి అమ్మ నసలాగ, నేను నంగిరిలాగ, అర్భకపు అరణి దేభ్యంలాగ కనబడుతున్నాం. నేనెప్పుడైనా బృహతిని కోపగించుకుంటే విషయాన్ని హాస్యంలోకి మళ్ళించి, జీవంలేని చిరునవ్వు ఒకటి నా మొహం మీదే నవ్వేసేది. విషయం మార్చేసేది, బృహతి అభిప్రాయాలవల్ల, ఈ ఇంటిని నడపడానికి ఇంతకన్నా చేసేదేం లేదు... అన్న జడత్వంలో స్థిరపడిపోయాను.

✡✡✡

# 17

**అర్భకంగా ఉన్న అరణికి** ఏడాదిన్నర వెళ్ళినా మాటలు రాలేదు. డాక్టరుకి చూపించాను. లాభం లేకపోయింది. మాట రాకపోవడమేకాక వినబడకపోవడం ఏదేనా ఉందా? అని పరీక్ష చేయించాను. కాని వినబడకపోలేదు గొంతులో స్వరపేటికలో ఏదో లోపం వల్ల మాటలు రావని చెప్పారు డాక్టర్లు, అరణి ఎదుగుతున్న కొద్దీ సైగల భాష పెరిగింది. సైగలద్వారా తన అవసరాలని చెపుతోంది.

మొదటగా అరణి సైగలద్వారా ఆకలిని తెలియచేసింది. అరణి మూగవేదన అప్పుడప్పుడు నా మనసును పట్టిపీడించినా, ఆమె వేదనని తీర్చలేని నా నిస్సహాయత నాకు చాలా బాధకలిగేది.

తల్లిగా బృహతి ఝరి అంటేనే తనకి ఇష్టం అన్నట్టుగా ప్రవర్తించేది. బృహతి ప్రవర్తనని సరిదిద్దే శక్తి నాలో ఉండేదికాదు. బృహతి ఎక్కడికి వెళ్ళినా ఫంక్షన్లకి, పుట్టినరోజులకి, పేరంటాలకి ఎక్కడికి వెళ్ళినా ఝరిని వెంటబెట్టుకు వెళ్ళేది.. అరణిని ఇంటి దగ్గర వదిలేసేది.

ముసలితనంతో అమ్మ, మూగతనంతో అరణి దగ్గరయ్యారు. ఈ ఇంటిలో అరణిని సానుభూతి చూపించి దగ్గర తీసేది అమ్మ ఒక్కరే! పిలిస్తే పలకలేని అరణిని చూస్తే గుండెల్లో చితుకుల మంటలా అనిపించి సాధ్యమైనంత దూరంగా ఉండేవాడిని, అరణికి అన్యాయం చేస్తున్నది స్వంత తల్లే కాబట్టి ఏమీ అనలేక ఊరుకున్నా....

అరణి ఏనాడూ తనకి అని కొన్న బట్టలు వేసుకోలేదు. ఝరికి పొట్టి అయిపోయినవి, ఝరికి ఇష్టంలేనివి అరణి వేసుకునేది ఝరికి కొన్న బొమ్మల్లో విరిగినవి, మాసిపోయినవి అరణికి ఇస్తే వాటితో ఆడుకునేది.

బృహతే కాక ఝరి కూడా అరణి మీద పెత్తనం చెలాయించేది. ఏదో కొత్తదనం అన్నట్టుగా నాలుగేళ్ళకి ఝరిని కాన్వెంటులో వేసాం. యూనిఫారం వేసుకుని, గుండ్రంగా గుడ్లు తిప్పుకుంటూ హడావిడి పడే ఝరిని చూస్తే ముచ్చట.

మేము ఝరి విషయంలో పడే ముచ్చటని మూగగా గమనించే అరణిలో ఏఏ భావాలు చోటుచేసుకుంటున్నాయో గమనించేటంత సహనం భగవంతుడు మా ఇద్దరికీ ఇవ్వలేదు.

ఝరి స్కూలుకి వెళ్ళిన తర్వాత అరణి మరీ ఒంటరిదైపోయింది. ఝరి ఆడుకుంటున్నా, ఝరి మాతో కబుర్లు చెబుతున్నా, ఝరి మా దగ్గర ముద్దులు గుడుస్తున్నా, వెనకాలే నిలబడి ఇవన్నీ తనూ చేస్తున్నట్టు ఫీలయి ఆనందించే అరణికి, ఝరి స్కూలుకి వెళ్ళిపోవడంతో ఆలంబన పోగొట్టుకుంది.

ఝరి మంచి బొమ్మలు దాచేసుకుంటే, విరిగిన బొమ్మలతో మూలగా కూర్చుని ఆడుకునేది. అందులో ఆట తక్కువ వేదన ఎక్కువ ఉండేది.

బృహతికి గాని, నాకుగాని అరణి పక్కన కూర్చుని దాని సైగలని అర్థం చేసుకుని, దానితో కబుర్లు చెప్పే ఓపిక సహనం ఉండేది కావు ఉండవు కూడా!...

'అసలే పనవక చస్తుంటే, నీ మూగసైగలతో నన్ను చంపకు' అంటూ విసుక్కునే బృహతిని చూస్తే అరణికి భయం. నా దగ్గరకు చేరిన అరణిని అది చేసే సైగలని చూసి విసుగొచ్చినా 'నాకు క్లాసుందమ్మా చదువుకోవాలి' అంటూ మృదువుగా చెప్పి బయటకు పంపితే నన్ను అరణి చూసే చూపు కొరకంచులా అంటేది.

దీనికి అరణి అనే పేరెందుకు పెట్టానా? అని బాధపడేవాడిని.

ఝరి పసితనంతో చిలిపి చేష్టలతో మా మనసులు నిండిపోయాయి. అందుకే అరణిలో జాలికి నిస్సహాయతకి మా మనస్సులో చోటు దొరకలేదేమో?

●●●

నాలుగు గంటలకి కాలేజీనుండి ఇల్లు చేరుకుని ఫేంట్స్ నుండి లుంగీలోకి మారి, మంచం ఎక్కి దిండునానుకుని, కిటికీలోనుండి దూరంగా కనిపించే నాలుగు రోడ్ల కూడలి చూస్తుంటే చాలా గమ్మత్తుగా ఉండేది. ఎన్ని సవాళ్ళను ఎదుర్కొనేది!

మారుతీకారువాడు వెనక్కి తగ్గుతాడా? రిక్షావాడు వెనక్కి తగ్గుతాడా? ఎవరు వెనక్కి తగ్గి ఎవరికి చోటిస్తారు? ఎద్దరిలో ఎవరు ఎవరికి లొంగుతారు. రిక్షావాడివాలకం చూస్తుంటే బేరమేనా వదిలేస్తాడుగాని దారి మాత్రం ఇవ్వడు అనిపించింది. మారుతీకారు వాడు దిగి వాడికేదో చెపుతున్నాడు, రిక్షావాడు వెనకాల నిలబడిపోయిన రిక్షాల్ని తోపుడు బండిని చూపించి వెనక్కి మళ్ళడం కష్టం అని వివరిస్తున్నాడు. రిక్షావాడికీ మారుతీకారువాడికీ జరుగుతున్న ఘర్షణ మంచి రసపట్టులో ఉండగా బృహతి వంటింట్లోంచి కేక పెట్టింది. 'అన్నీ పక్కమీదకే సప్లై చెయ్యాలంటే కష్టం కాస్త దిగిరండి కాళ్ళేం అరిగిపోవు. డైనింగ్ టేబులుమీద టిఫిను పెట్టేను' అని.

నేను ఎటూ తేల్చుకోలేక బృహతి చేత మరో కేక పెట్టించుకోడం ఇష్టం లేక డైనింగ్ టేబులు దగ్గరకి వెళ్ళాను. టిఫిన్ కాఫీ ముగించి వచ్చేసరికి, జంక్షనులో మారుతీకారూ లేదు, రిక్షావాడూ లేడు.

ఆ సంఘటన మీద కథ రాద్దామని కాగితాలు తీసాను.

'నాన్నా ఇవాళ క్లాసులో ఏమైంది అనుకున్నావ్?' అంటూ ఝురి వచ్చి మంచం ఎక్కింది. కథ రాయకుండానే కంచికి వెళ్ళిపోయింది.

సెంటర్‌ని చూస్తూ కాలం గడపడం చాలతేలికగా ఉండేది. జంక్షనులో ఎదురుగా వచ్చేవాళ్ళని తప్పుకోవాలనే తపనతో సైకిలు మీంచి పడ్డాడు పాలవాడు. పావుబిందెడు పాలు ఒంపేసుకున్నాడు పావుబిందెడు పాలకోసం వాడు మళ్ళీ ఇంటికి వెళ్ళడు, ఆ వీధిలో వాడికలనీ ఒదులుకోడు.. మరి ఏం చేస్తాడు.? పాలల్లో నీళ్ళు కలుపుతాడు ఎక్కడ? చాల విచిత్రమైన ధర్మ సంకటం! పాలవాడ్నే గమనిస్తున్నాను. చీకటి పడిపోతోంది. అయినా పాలవాడ్ని నాదృష్టిలోంచి పోనివ్వకుండా జాగ్రత్తగా గమనిస్తున్నాను. కొంతసేపటికి పాలవాడు ఒట్టి బిందెల్ని తీసుకుని వెనక్కి వెళ్ళిపోయాడు. అందరికీ పాలివ్వడం పూర్తయిపోయింది. నీళ్ళెక్కడ కలిపేడో తెలుసుకోలేకపోయాను. వాడి వృత్తిలో వాడు గొప్పవాడు.

●●●

ఇంటి విషయాల్లో ఆసక్తి లేకపోవడానికి కారణం నాకు లౌక్యం తెలీదనే చిన్న కామెంటుతో నా ఆలోచనని నన్నూ పట్టించుకోని బృహతి, బృహతితో తర్కించి ఆమెని నా దారికి తెద్దామనే ఆలోచనని వదిలేసి చాలా రోజులయింది. ఆమెని వ్యతిరేకించి నా అంతట నేను చేసిన ప్రయత్నాలు నా దృష్టిలో ఫలించినా బృహతి దృష్టిలో బెడిసికొట్టినట్టేవుండేవి. ఒకవేళ నా ప్రయత్నం ఫలించకపోతే, బృహతి వెక్కిరింపు చాలా ఎక్కువ మోతాదులో ఉండేది. దానికి తందాన అంటూ ఝురి నవ్వు. భరించరానిదిగా ఉండేది.

అలాటి వాటిల్లో అరణి చదువు విషయం ఒకటి! అరణిని ఝురి చదువుతున్న స్కూలులోనే జాయిన్ చేస్తానని నేను బృహతితో తెగేసి చెప్పేసాను.

'ఆ మూగదానికి కాన్వెంటులో సీటెవడిస్తాడు? మీ భ్రమ' అంది.

ఆ మాటవిని అరణి నన్ను దీనంగా చూసింది. పక్కనే కూర్చుని హోం వర్కు చేసుకుంటున్న ఝురి కిసుక్కున నవ్వింది.

అరణి దీనంగా చూస్తున్న చూపుల్ని తట్టుకోలే.. 'డొనేషను కట్టేస్తే వాడే జాయిన్ చేసుకుంటాడు.' అన్నాను.

'మీరు డబ్బు తగలెయ్యడమే కాని దానికి చదువురాదు. ఇంటిలోనే ఉండనివ్వండి. నేనే ఏదో అక్షరం ముక్కనేర్పి ఇంటిపని నేర్పుతాను' అంది.

'నీ ఇంటిపనికి వో పనిపిల్లని పెట్టుకో అసలే అది మూగది. దానికి చదువుకూడా రాకపోతే ఎలా? కాన్వెంట్లో జాయిన్ చేస్తాను.' అన్నాను ధ్రుఢంగా

బృహతి ఎన్ని విధాలు చెప్పాలో అన్నివిధాలా నాకు చెప్పింది కాని నేను మొండికేసాను. మర్నాడు కాన్వెంటుకి వెళ్ళి నన్ను నేను పరిచయం చేసుకుని అరణిని కాన్వెంటులో జాయిన్ చేద్దామనుకుంటున్నా అని చెప్పాను.

ప్రిన్సిపల్ చాలా ఆనందించి అప్లికేషన్ ఇచ్చింది. అన్నీ నింపి 'ఎంతకట్టాలి? ' అంటూ డబ్బు పైకి తీసాను. ప్రిన్సిపల్ ఎంత కట్టాలో చెప్పింది.

ఇంక అరణి స్కూల్లో జాయిన్ అవడం ఖాయం అనిపించాక, ఎందుకేనా మంచిది అరణి గురించి ప్రత్యేక శ్రద్ధ చూపించమని ప్రిన్సిపల్‌తో చెప్పాలని 'అరణిని జాగ్రత్తగా కనిపెట్టిచూడండి' అన్నాను.

'తప్పకుండా ఝురి విషయం వేరు, అరణి విషయం వేరు.' అన్నాను సందేహంగా.

'పర్వాలేదు సందేహించకండి. పాప ఎక్కువ అల్లరి చేస్తుందా?' అనడిగింది. ప్రిన్సిపల్ నవ్వుతూ.

'కాదు అరణి మూగది మాట్లాడలేదు ఏం కావాలన్నా సైగల ద్వారా తెలియ చేస్తుంది' అన్నాను.

ప్రిన్సిపాల్ మొహం మాడిపోయింది. కుర్చీ వెనక్కి చేరబడి రెండు నిమిషాలు ఆలోచించింది. నేను ప్రిన్సిపల్ ఏమంటుందా? అని ఆమె మొహంలోకి చూస్తూ కూర్చున్నాను. నా ఆలోచనల నుండి నేను తేరుకోనేలేదు. ప్రిన్సిపల్ నిర్ణయానికి వచ్చినదానిలా ముందుకి వంగి టేబులు మీద అప్లికేషన్ తీసి చింపి పక్కనున్న చెత్తబుట్టలో పారేసింది నేను నిశ్చేష్టుడనైపోయాను.

'మూగ చెముడు పిల్లలకి ప్రత్యేకమైన స్కూళ్ళు ఉన్నాయి. అందులో జాయిన్ చెయ్యండి' అంది.

'అరణి మూగదేకాని, చెవిటిది కాదు' అన్నాను. తడారిపోయిన గొంతుతో...

'అదేంగొప్ప విషయం కాదు. మీ పాప పక్కనున్న పిల్లలతో సైగలు చేసి కమ్యూనికేట్ చేసి మాట్లాడుతుంది. ఇంక వాళ్ళు కూడా అదే మొదలు పెడతారు. వాళ్ళ తల్లితండ్రులనుండి లేనిపోని కంప్లైంట్స్ వస్తాయి. ఐ కెనాట్ టేక్ హర్' అంది ద్రృఢంగా.

నేనెంత బతిమాలినా ప్రిన్సిపల్ ఉద్దేశం మార్చలేకపోయాను. నిరాశగా ఇంటికి తిరిగి వచ్చేసాను.

●●●

నా మనసులో ఏదీ దాగదు జరిగిన విషయం బృహతికి చెప్పాను.

'నేను ముందే చెప్పాను. మీరు వినలేదు. ఈ విషయం తెలుసుకోడానికి అంతదూరం పోనక్కరలేదు. బుర్ర ఉపయోగిస్తే చాలు' అంటూ వెక్కిరించింది. కాని నా బాధని అర్ధం చేసుకోలేదు.

అరణికి నోరులేనందుకు మంచి చదువు చెప్పిద్దామన్న నా ఆలోచనని, తను పట్టించుకోలేదు. అందుకే బాధ కలిగింది. దుఃఖం వచ్చింది. దుఃఖం అంటే 'విచ్ ఈజ్ ఎక్స్‌పీరియన్స్‌డ్ బై ఆల్ విత్ డిస్ ఎగ్రీయబుల్ ఫీలింగ్' అన్న విషయం తట్టింది. డబ్బు ఖర్చుపెట్టి చేయలేని పనులున్నాయని నమ్మవలసివచ్చింది. అరణి డిస్ ఎబిలిటీ అంటే భయం వేసింది. భవిష్యత్తులో ఇది ఎటువంటి సమస్యలు తెచ్చిపెడుతుందా? అన్న ఆలోచన కృంగదీసింది.

కాని ఆ సమస్యేదో తొందరగానే తలుపు తడుతుందని తెలుసుకోలేకపోయాను.

●●●

అరణిని మునిసిపల్ స్కూల్లో జాయిన్ చెయ్యడం ఇష్టం లేకపోయినా తప్పనిసరి అవడం వల్ల, వీధిలో ఉన్న మునిసిపల్ ఎలిమెంటరీ స్కూలులో వేసాను.

అరణికి ఝురికి కొన్నట్టు పుస్తకాల సంచీ, రకరకాల రంగుల బొమ్మలతో పుస్తకాలుగాని కొనలేదు. యూనిఫారం లేనేలేదు. పుస్తకాల సంచీ కొంటానంటే 'ఎందుకూ ఖర్చు దండగ' అంటూ ఝురికి కిందటేడు వాడిన బేగ్‌కి తాడు ఊడిపోతే దాన్ని కుట్టించి దాంట్లో పలకా బలపం పెట్టి అరణిని స్కూలికి తీసుకెళ్ళి జాయిన్ చేసింది బృహతే!

తనకి జరుగుతున్న అన్యాయాన్ని ప్రతిఘటించలేక మమ్మల్ని దీర్ఘంగా చూసే అరణి చూపుల్ని బృహతి పట్టించుకునేదికాదు. `ఎందుకిలా గుడ్లేసుకు చూస్తావ్` అంటూ కసురుకునేది. నాకు మాత్రం ఆ చూపుల్ని `గుడ్లు` అని తీసేయలేకపోయేవాడిని. అవి అగ్నిగోళాల్లా దూరంనుండే దహించేవి.

అరణి విషయంలో అన్యాయం చెయ్యలేదని, ఆమెని దేవుడే అన్యాయం చేసాడని వివరించి చెప్పుదామనిపించింది. కాన్వెంటు ప్రిన్సిపల్ ఆమె చదువుకి అడ్డంగా ఉందని, ఆ స్కూళ్ళల్లో ఆడంబరం ముఖ్యమని, చిన్న చిన్న పిల్లలు పాడే రైమ్స్ ప్రదర్శనవల్లే కాన్వెంటు అభివృద్ధి చెందుతుందని కృత్రిమంగా స్టైలుగా మాట్లాడే ఇంగ్లీషు భాషే కాన్వెంట్‌లకి పునాది, అని వివరించి చెపితే అరణికి అర్థం అవుతుందా? నా మనసులో బాధని నేను దిగమింగి ఊరుకున్నాను.

అరణి మునిసిపల్ స్కూల్లో ఇమడలేదు. ఒకరోజు పిల్లలు తలమీద ఇసక పోసారు, ఓ రోజు గౌను చింపేసారు, ఓ రోజు పలక విరగగొట్టారు.

స్కూలులో తోటిపిల్లలు పెట్టే హింసని భరిస్తూ, ఇంట్లో బృహతి విసుగుని తట్టుకుంటూ, రోజూ స్కూలుకెళ్ళి వస్తోంది అరణి.

ఆ సమయంలో అమ్మకి సుస్తీ చేసింది. మంచం మీద నుండి కదలలేని పరిస్థితి. బృహతికి ఇంటి పనుల్తో తీరిక కుదరక, అరణిని స్కూలు మానిపించి అమ్మదగ్గర ఉంచింది. అరణికి, అమ్మకి మంచి దోస్తీ ఉంది. అరణి సైగల భాష అమ్మకే అర్థమయ్యేది. అరణి సైగల్ని, నేనూ, బృహతి, ఝరి, పట్టించుకోకపోతే మామ్మ దగ్గర చేరి తన ఊహలని సైగలద్వారా వివరిస్తూ ఎప్రిసియేషను సంపాదించింది అరణి.

ఇప్పుడు అపస్మారక స్థితిలో మంచం మీద పడున్న అమ్మని చూసి దిగులుపెట్టుకుంది అరణి. అమ్మ పక్కనుండి కదిలేది కాదు. బృహతి ఇచ్చిన కాఫీ మందులు మామ్మకి ఇవ్వడం ఆ గ్లాసులు తీసుకొచ్చి కడిగి బృహతికి ఇవ్వడం ఎప్పుడు మామ్మకి ఏ అవసరం వస్తుందో అని మామ్మ మంచం పక్క నుండి కదలకుండా కనిపెట్టుకు చూసేది.

అమ్మని పూర్తిగా అరణికి వదిలేసి బృహతి నిశ్చింతగా ఉండేది. అది నాకు నచ్చేదికాదు. బృహతిని ఈ విషయంలో మందలించాను.

`ఇంటిపని మానేసి నేను మీ అమ్మగారి దగ్గర కూర్చుంటాను. పొద్దున్న లేచింది మొదలు ఝరిని తయారు చేయడం స్కూలికి పంపడం మీ టిఫిను, మధ్యాహ్నం వంట, అన్నీ మీరు చూసుకోండి` అంది బృహతి.

బృహతి తర్కం బృహతిదేగాని కనీసం నన్ను అర్థం చేసుకోడానికి ప్రయత్నించేదికాదు అలాగని బృహతి అమాయకురాలని కాదు ఆమెకి నా మనసులో మాట తెలుసుకాని చేయదు. ఆ అవసరం తనకి లేదు అన్నట్టు ప్రవర్తించేది. ఆ పనిని తప్పించుకోడానికి మిగతా వన్నీ వంకలు అని నాకెందుకో అంతరంలో అనిపించింది.

అయిదేళ్ళ అరణికి అమ్మ బాధ్యత అప్పచెప్పి ఊరుకున్నాను. నాలుగురోజుల తర్వాత అమ్మకి జ్వరం తగ్గింది. దిండుకి ఆనుకుని కూర్చుంటోంది.

●●●

ఆ రోజు సాయంకాలం కాలేజీ నుండి ఇంటికి వచ్చేసరికి అమ్మ, అరణి ఏవో సైగలు చేసుకుంటున్నారు.

అరణి బొటనవేలు చూపించి బుర్ర అడ్డంగా ఊపింది. అమ్మ ఎక్కడకి అన్నట్టు సైగచేసింది. అరణి ఒక అరచేతి మీద నాలుగు మాటలు రాసి చెయ్యి అడ్డంగా ఊపింది. తర్వాత ముక్కుమీద వేలు పెట్టి విసురుతున్నట్టుగా సైగచేసి బొటనవేలుతో తాగుతున్నట్టు సైగచేసింది.

అమ్మ తేరుకుందంటే, నాకు కొంచెం టెన్షన్ తగ్గింది, నేను నవ్వుతూ అమ్మ దగ్గరకి వెళ్ళి కూర్చున్నాను. ‘ఏమిటే మాట్లాడుకుంటున్నారు. అరణి సైగలు నాకేం అర్థం కావడంలేదు‘ అన్నాను.

‘బొటనవేలు చూపించిందా అంటే నువ్వు, అరచేతిమీద రాసింది అంటే కాలేజీ నుండి రాలేదని సైగచేసి చెప్పింది. ముక్కు మీద వేలు పెట్టింది అంటే మీ ఆవిడ ముక్కుపుడుక ఉందిగా అది దానికి సంకేతం. పొయ్యి విసురుతున్నట్టు చూపించింది అంటే, కాఫీ పెడుతోందని అర్థం‘ అంది అమ్మ అరణిని ముద్దుపెట్టుకుంటూ. నాకు అరణిని చూసి జాలేసింది.

నేను వచ్చినట్టు పసిగట్టిన బృహతి రెండు గ్లాసుల్లో కాఫీ తీసుకొచ్చి నాకూ అమ్మకి ఇచ్చి మళ్ళీ కిచెన్‌లోకి వెళ్ళి ఇంకో గ్లాసులో అరణికి పాలు తీసుకొచ్చి, అమ్మగదిలోనే మంచానికి దూరంగా నేలమీద కూర్చుంది. అమ్మ తేరుకోడంతో బృహతి కూడా రిలాక్స్ అయింది.

అమ్మ కాఫీ తాగుతూ ‘చిన్నా అరణి చాలా తెలివైందిరా‘ అంది.

అది బృహతికి నచ్చలేదు. దాని తెలివితేటల్ని మెచ్చుకోవాలి అంది ఈసడింపుగా నేను మధ్యలో మాట్లాడలేదు. అమ్మ చేసిన కామెంటుకి అరణి కళ్ళల్లో వెలుగు, బృహతి చేసిన ఈసడింపుకి అవే కళ్ళల్లో నిర్లిప్తతా చోటుచేసుకున్నాయి.

తను పాలు తాగడం అయిపోయాక మామ్మ కాఫీ తాగేంతవరకూ ఆగి మామ్మ తాగిన గ్లాసు, నా గ్లాసు, బృహతి గ్లాసు తీసుకెళ్ళి కిచెన్‌లో సింక్ దగ్గర పెట్టేసి వచ్చింది అరణి. ఆ అలవాటు బృహతి చేసింది. ఎప్పుడేనా అరణి గ్లాసులు తీయడం మర్చిపోతే ‘అమ్మా మూగ మహారాణి, కప్పు తీయడం కూడా కష్టం అయిపోయిందా?‘ అంటూ వెక్కిరించేది. కాని అరణి ఉక్రోషంగా ‘ఆ గ్లాసునాది కాదు అక్కది‘ అన్నట్టుగా ఝురిని చూపించి సైగచేసేది.

ఈ మూగ కుంరది నన్ను తప్పుపట్టడం ఏమిటి? అనుకునేదేమో బృహతి. ‘ఎవరు తాగిందయితేనేమి? అది నీ అక్కదేకదా పైదికాదు. ఆ మాత్రం తియ్యచ్చు‘ అంటూ అరణినే విసుక్కునేది. కాని ఝురిని మాత్రం ఏమనేదికాదు.

ఈ విదిలింపులు ఈసడింపులు అరణికి అలవాటైపోయాయి. అందుకే మౌనంగా తమ పనులు తను చేసుకుపోతుంది. గ్లాసులు తీసుకెళుతున్న అరణి వేపు చూసి అమ్మ కళ్ళవెంట నీరు పెట్టుకుంది.

'పాపం నోరులేనిదిరా ఎలా బతుకుతుందో ఏమిటో?'' అంది జాలిగా.

‘తెలివి ఉందన్నారుగా అది పెట్టుకు బతుకుతుంది లెండి‘ అంది బృహతి విరుపు మాటగా.

‘తదాస్తు దేవతలుంటారే వాళ్ళు మన మాటల్ని వింటారు. తదాస్తు అంటారు' అంది నవ్వుతూ.

మా సమావేశానికి ఆటంకం కలిగిస్తూ ఝురి స్కూలునుండి వచ్చింది. అది వచ్చింది అంటే హడావిడే! బృహతిలేచి వెళ్ళిపోయింది. నేను అమ్మ దగ్గర ఎందుకు కూర్చున్నానో నాకే అర్థంకాలేదు. రాత్రి బృహతి భోజనానికి పిలిచేవరకూ కూర్చున్నాను.

అమ్మ, అరణి చేసుకునే సైగల వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాను ముగ్గురం నవుకున్నాం.

చాలా రోజుల తర్వాత తేలికైన మనసుతో ఇంట్లో గడిపాను. ఆ రోజు ఇంటివేపు వీపు పెట్టి ఆత్మని నాలుగురోడ్ల కూడలికి పంపించలేదు.

●●●

# 18

**అర్థరాత్రి బృహతి నన్ను తట్టిలేపగా,** నాకు తెలివి వచ్చింది. 'అత్తయ్యగారికి గుర్రులా వస్తోంది చూడండి.' అంది. నిద్రలేచిన వెంటనే నరాల్లో రక్తం అంతా ఒక్కసారిగా గుండెల్లోకి దూసుకెళ్ళినట్లయింది. నా గుండె చప్పుడు నాకు స్పష్టంగా వినిపిస్తోంది. ఉద్వేగం తగ్గేవరకూ మంచం మీద కూర్చున్నాను. బృహతి టేబులు మీద జగ్‌లోంచి మంచినీళ్ళు తీసుకొచ్చి ఇచ్చింది. మంచినీళ్ళు తాగాక గుండె దడ కొంచెం తగ్గింది.

పక్కమీంచి లేచి అమ్మ గదిలోకి వెళ్ళాను. అమ్మ గదిలో జీరో వాట్ బల్బు వెలుగుతోంది. వెళ్ళగానే పెద్దలైటు వేసాను అమ్మ గొంతుకలో నుండి గురక వినిపిస్తోంది. అది నిద్రలో గురకలా కాక, కొంచెం పెద్దదిగా ఉంది.

అమ్మ పక్కనే మంచం మీద అరణి పడుకునుంది. మంచి నిద్రలో ఉంది. దాన్ని దాని మంచం మీదనుండి తీసుకెళ్ళి నా గదిలో నా మంచం మీద పడుకోబెట్టాను. మళ్ళీ అమ్మ గదిలోకి వెళ్ళాను. అమ్మ మంచం మీద కూర్చున్నాను అమ్మకి ఊపిరి తీసుకోడం కష్టం అవుతోంది. గురక పెరిగిపోతోంది.

"సాయంకాలం వరకూ బావుంది కదా, ఇంతట్లో ఏమైంది?" అన్నాను. బృహతి సమాధానం చెప్పలేదు. భయంగా చూస్తూ కూర్చుంది. "కిందకి వెళ్ళి మావయ్యని పిలుచుకురా" అన్నాను. బృహతి కిందకి వెళ్ళి మావయ్యని లేపి తీసుకొచ్చింది. మావయ్య వచ్చాక "మావయ్యా అమ్మకి సడన్‌గా ఆరోగ్యం చెడింది. డాక్టర్ని పిలుస్తాను." అని లేచాను.

మావయ్య అమ్మని దీర్ఘంగా చూసి, కనురెప్పలు తెరిచి చూసాడు. నల్లగుడ్డు ఎక్కడా కనబడలేదు పైకి తెల్లగుడ్డు మాత్రమే స్పష్టంగా కనిపిస్తున్నాయి.

మావయ్య నన్ను చూసి "చిన్నా డాక్టరు అవసరం ఉండదు, చాపేదేనా ఉందా?" అనడిగాడు.

"ఎందుకూ?" అనడిగాను అమాయకంగా.

"అక్కయ్యని మంచం మీదనుండి దింపితే మంచిది" అన్నాడు. అప్పటికి మావయ్య ఏం చెప్పదలచుకున్నాడో అర్థం అయింది.

నా స్వరం వణికింది "చాప వుందా?" అనడిగాను బృహతిని, లేదన్నట్టు బుర్ర ఊపింది బృహతి భయంగా. "సరిలే" అన్నాడు మావయ్య.

అమ్మ గుండెల్ని ఎగరేస్తున్న ఊపిరి, దాని ఉధ్ధృతం తగ్గింది. ఆ ఊపిరి గొంతులో చేరింది. గొంతుకలో కోడిపిల్లలా ఆడుతున్న అంగుడి స్పష్టంగా కనిపిస్తోంది. తర్వాత చిన్న శబ్దం చేస్తూ నోరు తెరుచుకుంది. అమ్మ శ్వాస నిలిచిపోయింది.

అందరం జరుగుతున్నది చూస్తూ నిశ్చేష్టులమై నిలబడి పోయాం. అప్పుడే అత్తయ్య మేడమీద గదిలోకి వచ్చి చూసి "అదేమిటి మంచం మీదే ఉంచేసారు." అంది.

మా అమ్మ ఎక్కడ పోతే ఆవిడకెందుకో? లోకులకి అఖ్ఖర్లేని విషయాలంటూ ఉండవు. అనిపించింది నాకు. మావయ్య మాత్రం ఏ సమాధానం చెప్పలేదు.

●●●

తెల్లవారే వరకూ అమ్మ చుట్టూ కూర్చున్నాం అందరం. టెలిగ్రాములిచ్చి తెప్పించేంత దగ్గర బంధువులెవరూ లేరు. శవం దగ్గర కూర్చున్న మాకు టీ పెట్టి ఇచ్చింది అత్త.

తెల్లవారాక నిద్రలేచిన ఝరి బృహతిని వెదుక్కుంటూ అమ్మ గదిలోకి వచ్చింది. మామ్మ గదిలో పీక్కుపోయిన మొహాలతో ఉన్న మమ్మల్ని చూసి బిక్కచచ్చిపోయింది. బృహతి వెళ్ళి ఝరిని తీసుకొచ్చి "ఇవాళ స్కూలుకెళ్ళద్దులే తల్లీ" అంది. ఝరి బుద్ధిగా తలవూపింది.

ఝరి లేచిన అరగంటకి అరణి లేచింది. లేచి మామ్మ గదిలోకి వచ్చింది. బృహతి అరణిని దగ్గరగా రమ్మనమని సైగచేసింది. అరణి బెదురుతూ అందరి మొహాల్లోకి చూసూ బృహతి దగ్గరకి వెళ్ళింది. బృహతి పక్కగా కూర్చుంది. అందర్నీ మార్చి మార్చి చూస్తోంది. ఏదో తేడా జరిగిందని అరణికి తెలుస్తోంది. కాని అదేమిటో ఆ పసివయసుకు అర్థమవడంలేదు.

మావయ్య మిగతా ఏర్పాట్లు చేయడానికి వెళ్ళాడు. అపరకర్మలు చేసే బ్రాహ్మడిని తీసుకొచ్చాడు. వాడు ఇంటికి వచ్చి "శవవాహకులకి, శ్మశానంలో దహన కార్యక్రమానికి అస్థికలు గోదావరిలో కలిపే కార్యక్రమానికి తొమ్మిది రోజులవరకూ మొత్తం కలిపి పదివేలు ఇప్పించండి" అన్నాడు.

మావయ్య దురుసుగా "ఎంతమందికి కర్మ చెయ్యాలనుకుంటున్నావు. పోయింది ఆవిడ ఒకర్తే" అన్నాడు. "అబ్బే నాకు కిట్టదండీ" అంటూ మేడమెట్లు దిగిపోయాడు బ్రాహ్మడు.

"ఏం చెయ్యమంటావురా?" అని అడిగాడు మావయ్య నన్ను చూసి..

"నేనేం చెయ్యమంటాను? బేరం ఆడే స్థితిలో లేను" విసుగ్గా మొహం పెట్టాను.

"సరేలే అని కిందకి వెళ్ళి బ్రాహ్మడిని మొత్తం కార్యక్రమాలకి ఎనిమిదివేలకి ఒప్పించాడు. బ్రాహ్మడు ఒప్పుకున్నది మొదలు హడావిడి మొదలైంది. తన వెంట వచ్చిన వాడికి ఏవేవో పురమాయించాడు. మళ్ళీ మేడమీదకి వచ్చాడు.

తన తంతు మొదలుపెట్టాడు నా మెళ్ళో ఝుంఝుంలేదని, అమ్మ మంచం మీద పోయినందుకు, ప్రాయశ్చిత్తం అంటూ పరిషత్తుకి అయిదుకేజీల బియ్యం ఇమ్మని తనే పుచ్చుకున్నాడు.

ఈలోగా శవవాహకులు, రావలసిన సామాన్లు వచ్చాయి శవస్నానంతో కర్మతంతు మొదలైంది. శవం నోట్లో ఏవేవో వేసాడు. ఏవేవో మంత్రాలు చదివాడు. శవం నోట్లో చిన్న బంగారం ముక్క వెయ్యాలి అన్నాడు.

దానికోసం అరణి చెవిని వున్న పోగులో చిన్న ముక్క కట్ చేసి ఇచ్చింది బృహతి. దాన్ని నోట్లో వేస్తానన్నట్టు నోటి దగ్గరకి తీసుకెళ్ళాడు.

"మేడమీద తంతు పూర్తయాక శవాన్ని బైటకి తీసుకెళ్ళడానికి అభ్యంతరం ఉంది. అందుకే ఈ తంతు ఇక్కడే పూర్తిచేసాను" అన్నాడు.

"ఏమిటి?" అన్నాను నేను.

"శవాన్ని మూడు ద్వారాలు దాటించుకూడదు" అన్నాడు.

ప్రాణం పోయేసరికి అమ్మ శవంగా మారిపోయింది. "నాకలాంటి నమ్మకాలు లేవు" అందామనుకున్నాను. కాని ఏమనకుండా చిరాగ్గా మొహం పెట్టి మావయ్యవేపు చూసాను

నా విసుగు గ్రహించిన మావయ్య బ్రాహ్మడిని చూస్తూ "వాడికలాంటి నమ్మకాలేం లేవండి" అన్నాడు.

"మీ ఇష్టం.. అలా తీసుకెళితే ఇంటికే అరిష్టం" అన్నాడు.

వెంటనే బృహతి కలుగచేసుకుంది. "ఆయన నమ్మకాలకేం గాని నిండుగా ఆడేపాడే పిల్లలున్న ఇల్లు. ఏ చెడు జరిగినా దీనివల్లే జరిగింది అన్న శంక పీడిస్తుంది. మీకు తోచినట్లు చెయ్యండి. బాబయ్యగారూ" అంది మావయ్యని చూస్తూ.

ఈ ఇల్లు అమ్మది, ఆస్థి అమ్మది, ప్రాణం పోయేసరికి, ఆస్తిని కాపాడుకోడానికి ఎంత ఆరాటపడిపోతున్నామో? అనిపించింది ఇంక నేనుమాట్లాడక తప్పదు అనిపించింది.

"ఇంక చర్చ అనవసరం. ఇల్లు వదిలి పెట్టాల్సి వస్తే వదిలిపెడదాం ఈ ఇల్లు "అమ్మది" ఇంకేం ఆలోచించకండి." అన్నాను విసుగ్గా!

"అదికాదు చిన్నా, ఇంట్లో రెండు మూడిళ్ళ వాళ్ళున్నారు, సడెన్‌గా పదిరోజుల్లో ఖాళీ చేసి, ఇంకో ఇల్లు చూసుకోమంటే కష్టంకదా, అలాగని శంకతో ఇంట్లో ఉండనూ లేరు. ఆలోచించు" అన్నాడు మామయ్య.

ఇక్కడ కూడా పరమ పదానికి అమ్మ చేరుకుంటే పరమధనానికి ఎక్కువ విలువనిచ్చానేమో? నిజమే పదిరోజుల్లో ఇంకో ఇంటికి మారాలంటే ఎంతయాతన? అలాగని అందర్నీ కాదని ఈ ఇంట్లో ఉండనూ లేను. బృహతి ఉండనివ్వదు. ఆలోచన్లు తలని గింగుర్లెత్తించాయి. అయినా బింకం కోల్పోకుండా "మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి" అన్నాను చికాకుగా..

అంతే మావయ్య మార్కెట్టు సెంటరుకి వెళ్ళి, ఇద్దరు కూలీలని తీసుకొచ్చాడు. వీధి ద్వారబంధానికి పక్కగా ఉన్న గోడ మనుషులు దూరేంత మేర కొట్టించేసాడు.

శవవాహకులు శవాన్ని ఎత్తడానికి సర్దుకున్నారు. బ్రాహ్మడు అందరినీ వచ్చి అమ్మ పాదాలకి నమస్కారం చెయ్యమన్నాడు.

బృహతి, అత్తయ్య మావయ్య అమ్మ కాళ్ళకి నమస్కారం చేసారు. ఝరి బెరుగ్గా వెళ్ళి అమ్మ పాదాల దగ్గర నిలబడి నమస్కారం పెట్టానా లేదా అన్నట్టుగా పెట్టి వెనక్కి వచ్చేసింది.

అరణిని తీసుకుని అమ్మ కాళ్ళదగ్గరకి వెళ్ళింది బృహతి, అరణి అందర్నీ బెరుగ్గా భయంగా చూస్తూ మామ్మ కాళ్ళదగ్గరకి వెళ్ళింది. బృహతి అరణి రెండుచేతులూ నమస్కారం పెట్టిస్తున్నట్టుగా దగ్గరగా చేర్చింది. మామ్మ పడుకున్న తీరు మొహంలో జడత్వం మామ్మకి ఏదో అయిందని, ఈ మామ్మ మునపటి  మామ్మ కాదని అర్థం అయింది. అరణికి ఆ చిన్నారి మనసులో ఏముందో ఏమో? ఎవరో చెప్పినట్టుగా మేమెవ్వరం ఊహించని విధంగా అరణి శవం కాళ్ళ దగ్గర చతికిలబడింది. వెక్కి వెక్కి ఏడుస్తోంది.

బృహతి, నేనూ, మావయ్యా అక్కడ ఉన్న వాళ్ళందరం ఆశ్చర్యపోయాం! అమ్మ పోయిన తర్వాత శవాన్ని చూసి గుండెల్లో దుఃఖం పొంగి, మనసు కదిలేలా ఏడ్చినది అరణే అనిపించింది. అరణి ఏడుపు అందర్నీ కదిలించింది. మావయ్య చెమర్చిన కళ్ళు తుడుకున్నాడు. బృహతి ముక్కు ఎగబీల్చింది. ఝరి కూడా బైటకి ఏడ్చేసింది. నాకు కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

అమ్మని నలుగురు వాహకులూ, భుజాలదగ్గర కాళ్ళ దగ్గర ఎత్తి కిందకి తీసుకెళ్ళారు.

●●●

అమ్మ పోయిన తర్వాత పదిరోజులూ మిగతా తతంగం అంతా మావయ్యే జరిపించాడు. శవదహనం మొదలు పదిరోజుల కర్మా పది పదకొండు పన్నెండు రోజుల తంతు చాలా ఘనంగా జరిగింది. ఇంటిలో పెద్దవాళ్ళు పోతే పెళ్ళిలా ఘనంగా చెయ్యాలి అంటారు. అలాగే జరిగింది.

కర్మ చేస్తున్నన్నాళ్ళూ నేను, బృహతి, ఝరి, అరణి ప్రత్యేకంగా ఒక గదిలో ఉండేవాళ్ళం. ఇటు నా తరపువాళ్ళూ, అటు అమ్మ తరపువాళ్ళూ, 'బృహతీ! దీన్ని తియ్యి ఇది మమ్మల్ని ముట్టుకుంటుంది', అంటూ విసుక్కుని కొంపలు మునిగేటట్టు అరిచే బంధువులనీ అర్థం చేసుకోలేక, అరణి దిగులు పడింది.

పన్నెండోరోజు పూర్తవగానే బంధువులందరూ నిష్క్రమించారు. వెళ్ళేముందు జాగ్రత్తగా ఉండమని మావయ్య మీ అమ్మ చావుపేరుతో చాలా డబ్బు చేసుకున్నాడని, కావాలంటే లెక్కలు అడిగి చూడమని హెచ్చరించి మరీ వెళ్ళారు.

కర్మకాండలోనూ, మిగతా ఎరేంజ్‌మెంట్స్‌లోనూ, మావయ్యా డబ్బులు కొట్టేసినట్టు నాకు తెలుస్తూనే ఉంది. కాని ఏం చెయ్యలేను. నేను పూర్తిగా మావయ్యమీదే ఆధారపడ్డాను. కాని ఆ రోజు కర్మ చేయించిన బ్రాహ్మడికి ఫైనల్ పేమెంటు ఇవ్వాలి. అతను వచ్చి మావయ్య ఇంట్లో కూర్చున్నాడు.

మావయ్య మేడమీదకి వచ్చి "చిన్నా కర్మ చేయించిన బ్రాహ్మడు వచ్చాడు. లెఖ్ఖ అడుగుతున్నాడు, ఇంకో రెండువేలు ఇవ్వాలి మనం" అన్నాడు.

"అలాగే" అని చెప్పి రెండువేలూ తీసి, "పద మావయ్యా" అని కిందవాటాలో మావయ్య ఇంటికి వెళ్ళాను.

మావయ్య ఇంటిలో బ్రాహ్మడిని చూసి "ఎంత ఇవ్వాలండీ" అనడిగాను.

"వెయ్యి రూపాలొస్తాయండీ" అన్నాడా బ్రాహ్మడు వినయంగా

ప్రశ్నార్థకంగా మావయ్యవేపు చూసాను. మావయ్య మాత్రం నిదానంగా "మీకు ముందెంత ఇచ్చామేమిటి?" అనడిగాడు బ్రాహ్మడ్ని.

"ఏడువేలండి, మీరే ఇచ్చారు కదా అప్పుడే మర్చిపోయారా?" అన్నాడాయన.

"ఏడిచ్చానూ.. అరే ఇచ్చాననుకున్నారా చిన్నా. మరీ పని వత్తిడి, వల్ల ఎంతిచ్చానో మర్చేపోయాను." అన్నాడు మావయ్య అదేం గొప్పవిషయం కానట్టు.

నేనింకేం తర్కించకుండా వెయ్యిరూపాయలు బ్రాహ్మడి చేతిలో పెట్టి మేడమీదకి వచ్చేసాను.

●●●

అమ్మ పోయినందుకు మైలపట్టి కర్మచేసిన పన్నెండురోజులూ నెత్తిమీంచి స్నానాలు చెయ్యడం వలన, కర్మ తంతు కోసం రోజూ చాకలి పేటకి నడిచి వెళ్ళి, నడిచి వచ్చిన అలసట వల్ల జ్వరం వచ్చింది.

నా జ్వరం రెండు మూడురోజులు ఉంది. ఆ మూడురోజులూ ఇంట్లో ఏం జరుగుతూందో నేను గ్రహించలేకపోయాను. ఝురి స్కూలు హడావిడిలోనూ, బృహతి తనపనితోనూ తీరిక లేకుండా ఉన్నారు. అరణిని పట్టించుకోలేదు.

అరణికి నేస్తంగా ఉన్న అమ్మ ఒక్కసారి ఇంట్లోంచి మాయమయింది. శుద్ధి అయి ఇంట్లోకి వచ్చింది మొదలు అమ్మ గదిలోకి వెళుతోంది. అమ్మ మంచం మీదే పోవడం వలన అమ్మ మంచం, పక్క బట్టలూ బయట పారేసాం. ఎవరో పట్టుకుపోయారు. అమ్మ మంచం ఉన్న చోట వెలితిగా ఉంది. అరణి ఆ చోటునే దీర్ఘంగా చూస్తోంది.

అమ్మ పోయాక ఆ గదిని బాగుచేయించి గాని, వాడకూడదని దాన్ని అలాగే ఉంచాం, బైటనుండి గడియవేసేవాళ్ళం. జ్వరం నుండి తేరుకున్న రెండోరోజు సాయంకాలం ఝురి స్కూలునుండి రాగానే, ఝురికి పాలుఇస్తూ "అరణీ" అని పిలిచింది బృహతి, అరణి ఎంతకీ రాలేదు. బృహతి 'ఇదెక్కడికి పోయిందో, సరిగ్గా పాలు తాగేవేళకే దాటేస్తుంది' అంటూ విసుక్కుంది.

అలా పిలిస్తే రాని అరణి, అరగంటయినా రాలేదు. గంటైనా కనబడలేదు. అరణి ఎక్కడకీ ఆటలకి వెళ్ళదు. ఎవరింట్లోనైనా కూర్చుని టి.వి చూస్తోందేమో అని నేనూ బృహతి తెగవెతికాం. అరణి ఎక్కడా దొరకలేదు. ఎంతవెదికినా కనబడలేదు. చీకటి పడుతున్నకొద్దీ ఆరాటం ఎక్కువైంది.

మావయ్య "పోలీసు రిపోర్టు ఇస్తే బావుంటుందిరా" అన్నాడు. నేనేం మాట్లాడలేదు. మూగది ఎక్కడికి వెళ్ళిపోతుంది? దాని మనసులో ఏముంది? ఎందుకు వెళ్ళిపోతుంది? మామ్మ లేదు కాబట్టి మేమెవ్వరం దాన్ని అభిమానంగా చూడం అనుకుందా? ఇవన్నీ అర్ధం కాని ప్రశ్నలు అసలు ఎవరేనా "నువ్వు ఎవరు?" అంటే సమాధానం చెప్పలేదు. అలాంటిదాన్ని ఎవరేనా వెనక్కి ఎలా తీసుకొస్తారు? ఏవేవో ఆలోచనలు భయంకరమైన ఆలోచనలు, బృహతి కూడా దిగులుపడింది.

"ఎక్కడికి పోయిందో వెర్రిపిల్ల" అంటూ కళ్ళంట నీళ్ళెట్టుకుంది.

మావయ్యకి నేనేం సమాధానం చెప్పకపోయేసరికి, ఏదో ఒకటి అనాలన్నట్టుగా "ఒరేయ్ మేడమీద గదులు బాగా చూసారా?" అన్నాడు.

"ఆ అంతా వెదికాను." అంది బృహతి.

"అక్కయ్య గది" అన్నాడు మావయ్య అనుమానంగా.

"అత్తయ్యగారి గది తలుపులు దగ్గరగా వేసున్నాయి, నేనే తలుపు తీసి చూసాను. లోపల ఎవరూ లేరు. గడియ పెట్టేసాను" అంది బృహతి.

"ఎందుకేనా మంచిది అక్కయ్య గదిలో మరోసారి చూడు" అన్నాడు మావయ్య. బృహతికి తనమీద తనకి నమ్మకం ఎక్కువ. అందుకే కూర్చున్నచోటునుండి కదలకుండానే ఝురిని పిలిచి "మామ్మగది తలుపులు తీసి చూడవే" అంది.

ఝురి మేడమీదకి వెళ్ళి అమ్మ గది తలుపు తీసి గదిలో లైటు వేసింది. గదిలో చుట్టూ చూసి ఉద్వేగంగా బైటకి పరిగెత్తుకొచ్చి, "అమ్మా చెల్లి" అంటూ అరిచింది.

అందరం ఆదుర్దాగా అమ్మ గదిలోకి వెళ్ళాం. అమ్మ గదిలో అమ్మ మంచం ఉండే మూలగా అరణి ముడుచుకు పడుకుంది. అందుకే బయటనుండి తొంగి చూసిన బృహతికి అరణి కనబడలేదు.

అరణి కనబడేసరికి అంతవరకూ దానికోసం పడ్డ వేదనని మర్చిపోయింది బృహతి "నలుసులా ముంగిలా ఉంటుందేగాని, మా ప్రాణాలు తోడేస్తోంది." అంటూ అరణిని లేపడానికి దాని దగ్గరకి విసురుగా వెళ్ళి దాని గౌనుకిందగా ముణుకులమీద చిన్నగా తట్టింది. తట్టిన వెంటనే చెయ్యని షాకు తగిలినట్టు వెనక్కి తీసుకుంది. "ఏమండీ!" అని అరిచింది భయంగా.

నేను కూడా ఆత్రుతగా అరణి దగ్గరకి వెళ్ళాను. అరణి వంటిమీద చెయ్యివేసి చూసాను. అరణి వళ్ళు కాలిపోతోంది. అరణిని రెండు చేతులతో ఎత్తి తీసుకొచ్చి నా పక్కమీద పడుకోబెట్టాను. జ్వరాన్ని చూశాను.

నూటనాలుగు జ్వరం ఉంది. డాక్టర్ని తీసుకొచ్చాను. డాక్టరు ఇంజక్షన్ ఇచ్చాడు.

●●●

నాలుగురోజులైనా అరణి జ్వరం తగ్గుముఖం పట్టలేదు. నా గదిలోనే అరణికి వేరుగా మూలని మంచంవేసి పడుకోబెట్టాం. బృహతి అరణికి దేనికీ తక్కువ  కాకుండా సేవ చేస్తోంది. మందులివ్వడం, సమయానికి పాలు తాగించడం వంటికీ తలకీ నూనె రాయడం తీరిక సమయాల్లో దగ్గర కూర్చుని కాళ్ళు రాయడం చేస్తోంది. అరణి కళ్ళు తెరిచినప్పుడు "ఎలా ఉందమ్మా తలనొప్పిగా ఉందా?" "ఆకలేస్తోందా?" అని అనునయంగా లాలిస్తూ అడుగుతోంది. ఎక్కడా విసుగన్నది కనబడనివ్వడం లేదు. బృహతిలో ఈ మార్పు నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది.

నేను కాలేజీ పనిలోనూ ఝురి స్కూలు హడావిడిలోనూ, తీరిక లేకుండా ఉండేవాళ్ళం. కాని సాయంకాలం కాలేజీ నుండి ఇంటికి వచ్చేసరికి నలిపిన కాడ వత్తిలా మంచాన్ని అతుక్కుపోయిన అరణిని చూస్తే నా గుండె తరుక్కుపోయేది. ఇంటికి రాగానే వెళ్ళి అరణి నుదుటి మీద చెయ్యి వేసి చూసేవాడిని, నా చేతి స్పర్శను గురించినట్లుగా కళ్ళు తెరిచి చూసేది. మళ్ళీ కళ్ళు మూసుకుని పక్కకి తిరిగి పడుకునేది. ఎవరెన్ని చేస్తున్నా అరణి జ్వరం ఒక్క డిగ్రీకూడా తగ్గలేదు. జ్వరం వచ్చి నాలుగురోజులు పైగా అయింది. అందరి మనసుల్లోనూ ఏదో తెలియని బాధ చోటుచేసుకుంది.

ఆ రోజు డాక్టరు ఇంజక్షను ఇచ్చి "కోర్సు కంప్లీటు అయింది, వాళ్ళ మామ్మ గురించి బెంగ పెట్టుకుందేమో?" అన్నాడు

"ఊ" కొట్టడం తప్పించి నేనేం చెయ్యలేకపోయాను.

డాక్టరు వెళ్ళిపోయాక బృహతి అరణి మంచం మీద కూర్చుంది. అరణి చేతిని తన చేతిలోకి తీసుకుంది. మంచం మీద కూర్చున్నది అమ్మే అని తెలిసి, కళ్ళు మూసుకునే పడుకుంది అరణి.

నేను నా మంచమీద కూర్చుని ఆల్బర్ట్ కామూది. ''హేపీ డెత్'' నవల చదువుతున్నాను. నా మంచం మీదే ఓ మూల ఝరి కూర్చుని హోం వర్కు చేసుకుంటూ మధ్యలో నన్ను డౌట్లు అడుగుతోంది.

బృహతి అరణిచేతిని కాసేపు రాసి, ''అరణీ'' అనిపిలిచింది. అరణి కళ్ళు తెరవలేదు.

''తల్లీ.. అరణీ'' అనిపిలిచింది. బృహతి అరణిని ఎప్పుడూ ఈసడిస్తూ పిలవడమే కాని ''తల్లీ'' అని ఆప్యాయంగా పిలిచినట్లులేదు. ఈ పిలుపులో ప్రత్యేకతని గుర్తించి, నేను నవలలోంచి, ఝరి హోం వర్కు పుస్తకాలలోంచి తలెత్తి చూసాం.

''తల్లీ అరణీ'' అన్న పిలుపు అరణికి కూడా కొత్తగా అనిపించి.. కళ్ళు తెరిచి చూసింది.

''మామ్మకోసం బెంగపెట్టుకున్నావా?'' అంది బృహతి గొంతుకలో సన్నని ఒణుకు వెన్ను జలదరింపచేసే వొణుకు స్పష్టంగా వినిపించింది. నేనూ ఝరి అవాక్కయి బృహతినే చూస్తున్నాము. అరణి తల్లినే చూస్తూ రెప్పవేయడం మర్చిపోయింది.

''బెంగెందుకమ్మా నీతో నేను మాట్లాడుతానుగా, నేను లేనూ, ఇంకెప్పుడూ నిన్ను విసుక్కోనమ్మా'' అంది అంటూనే బృహతి గొంతుక పూడుకుపోయింది. కళ్ళమ్మట ధారాపాతంగా కన్నీళ్ళు వచ్చేస్తున్నాయి. అరణిని రెండు చేతులతో గుండెలకి హత్తుకుని, వెక్కి వెక్కి ఏడ్చింది. నేనూ ఝరి ఏదో అద్భుత దృశ్యం చూస్తున్నవాళ్ళలాగ నిశ్చేష్టులమయిపోయాము. నేనే తొందరగా తెరుకున్నాను. ''బృహతీ'' అని పిలిచాను.

బృహతి ఏడుపు ఆపుకుంది మంచం దండిమీద బుర్ర ఆనించింది కాని పైకెత్తలేదు. గుండెల్లోంచి ఎగతంతున్న ఏడుపుని కంట్రోలు చేసుకోడానికి ప్రయత్నిస్తోంది. అరణి చెయ్యి తల్లి మీదవేసి కలా? నిజమా? అన్నట్టు కళ్ళప్పగించి చూస్తోంది.

ఒక తల్లి ప్రయాణించిన రుజుమార్గాన్ని చూస్తున్నా. ఒక తల్లిని చూస్తున్నా! బృహతి ఎక్కడా కనిపించలేదు. కనుకొనకుల్లో నీరం మెరిసింది. ఝరి వెక్కిళ్ళకి చలించా. ఝరి చేస్తున్న పనిని పక్కకి పెట్టి అరణి మంచం దగ్గరికెళ్ళి అరణి చేతిని తనచేతుల్లోకి తీసుకుంది.

కాసేపటికి బృహతి తేరుకుంది. అరణి మంచం మీంచి లేచి బాత్రూములో కెళ్ళి మొహం కడుక్కుని వచ్చింది. అద్దం దగ్గరికి వెళ్ళి బొట్టు పెట్టుకుని డాబామీదకి వెళ్ళింది. ఎదురుగా నాలుగురోడ్ల కూడలిని చూస్తూ నిలబడింది.

అరణికి నచ్చచెప్పడం వలన మనసు తేలికపడిందో? అరణి పరిస్థితిని తలుచుకుని మనసు భారంగా తయారైందో గుర్తించలేకపోయాను.

●●●

మర్నాడు అమ్మ ఫోటో నెగిటివ్‌ని కడిగించి పెద్ద వాల్ హేంగింగ్‌లా తయారు చేయించి తీసుకొచ్చాను. ''అరణీ మామ్మరా?'' అంటూ అరణికి చూపించాను. అరణి ఫోటోని చూసి నవ్వింది. ఆ రోజు రాత్రి డాక్టరు వచ్చి, అరణిని పరీక్ష చేసి ఎందుకన్నాడో ''క్వైట్ రిమార్కబుల్ ఛేంజ్'' అన్నాడు.

అరణి తేరుకోవడం మొదలుపెట్టింది. జ్వరం తగ్గింది. మంచం మీద లేచి కూర్చుంటోంది. లైటుగా ఆహారం తీసుకుంటుంది.

అరణి తిరిగి మామూలు మనిషి అవడానికి కారణం మందులా? అమ్మ ఫోటోనా? బృహతా? ఎంత ఆలోచించినా, ఎంతకాదనుకున్నా బృహతే కారణం అని అర్థం అవుతోంది.

నేను అరణి మీద, చూపే సానుభూతి, అమ్మ నిర్జీవపు ఫోటో, బృహతి చేసే సేవలు, అరణికి అక్కరలేకలేకపోయాయి కానీ ఆ రోజు బృహతి అరణిని దగ్గరగా తీసుకుని మామ్మలేని చోటు నేను తీరుస్తాను అని చెప్పి అరణిలో నమ్మకం కలగచేసింది. అరణి బైటకి

చెప్పలేకపోయినా తన్నభిమానించే మనుషులకోసం తపించిపోతోంది. ఆ తపనకి బృహతి స్వాంతన చేకూర్చింది. అందుకే తేరుకుంది. మనిషికి మనిషి అవసరం ఎంతుందో? అనిపించింది.

●●●

ఇది జరిగిన తర్వాత బృహతి అరణి విషయంలో నిరాశక్తత చూపించలేదు. అరణిలో కూడా మార్పు వచ్చింది.

ఇంతకు ముందులా బెరుకుగా ఉండడంలేదు. తల్లితో ట్యూనింగ్ ఏర్పడినప్పటినుండి వచ్చీరాని స్వరంతో పైకి అమ అంటోంది నన్ను నాన్న అంటోంది. బృహతి వెనకాలవుండి అన్నీ అందిస్తోంది పనులన్నీ చేసి పెడుతోంది.

వోసారి మేమందరం డ్రాయింగ్ రూములో కూర్చుని మాట్లాడుకుంటూ కాఫీలు తాగి గ్లాసులు టీపాయ్ మీద పెట్టాం, అరణి లేచి గ్లాసులు తీస్తోంది సింకులో వేయడానికి, "అరణీ అవక్కడ ఉండనీ నే తీస్తాలే" అంది బృహతి.

అరణి బృహతివేపు తిరిగి చిరునవ్వు నవ్వి గ్లాసులు తీసికెళ్ళి సింక్‌లో పెట్టింది. ఇదే పనిని ఇంతకుముందు బెరుకుగా భయపడుతూ చేసే అరణి. ఇప్పుడు సంతోషంతో చేస్తోంది.

అరణి వెళ్ళిపోయాక బృహతి నన్ను చూసి "అరణిని మంచి స్కూల్లో వేయిస్తే బావుంటుంది" అంది.

"ఒకసారి ప్రయత్నించాను. ఏం జరిగిందో నీకు తెలుసు" అన్నాను.

"అప్పటి సంగతి వేరు. మీ ఫ్రెండు ఒకతను డి.ఇ.వో గా ఉన్నారన్నారు కదా ఆయన ద్వారా ట్రై చెయ్యండి" అంది.

ఈ సలహా అద్భుతంగా తోచి, "రేపే ట్రై చేస్తాను." అన్నాను ఉత్సాహంగా.

నా ప్రయత్నం ఫలించింది. అరణి కాన్వెంటులో కాకపోయినా డి.ఎ.వి స్కూలులో సీటు వచ్చింది.

ఝరితో సమానంగా కొత్తస్కూలు డ్రెస్ వేసుకుని పుస్తకాలని కొత్త బాగ్‌లో పెట్టుకుని స్కూలుకి బయలుదేరిన అరణి మొహంలో మెరిసిన మెరుపు నా జన్మలో మర్చిపోలేను.

●●●

అరణి స్కూల్లో చేరిన మొదటి ఏడు, అరణికి కష్టంగా గడిచింది, కానీ మునిసిపల్ ఎలిమెంట్రీ స్కూలు పిల్లలు పెట్టిన అల్లరి, చేసిన హేళనతో పోలిస్తే డి.ఎ.వి. స్కూల్లో ఉన్న డిసిప్లిన్ వల్ల, తీవ్రంగా లేదు.

డి.ఎ.వి. స్కూల్లో కూడా అంతో ఎంతో హేళనకి గురయింది. చెప్పుకునే నోరు లేదు. కాబట్టి బైటకి చెప్పుకోలేకపోయింది. కాని అరణిలో దిగులుని, భయాన్ని పసిగట్టినప్పుడల్లా బృహతి అరణిని సముదాయించేది. ధైర్యం చెప్పేది. తల్లి తలుచుకుంటే ఏమైనా చెయ్యగలదని నా కర్థం అయింది.

వీళ్ళిద్దరి చదువులూ గాడిలో పడటంతో, నేను రిలీఫ్ ఫీలయ్యా కాని..

రిలీఫ్ అన్నది తాత్కాలికమే, ***నిరంతర ప్రయాణం చేసేవాళ్ళకి జీవితంలో ఏవో సమస్యలు, ఎప్పుడో ఒకప్పుడు వస్తూనే ఉంటాయి. వాటికి అడ్డంటూ ఉండదు. కొన్ని మన ప్రయత్నంతో పరిష్కరించుకుంటాం. కొన్ని కాలక్రమాన పరిష్కరించబడతాయి.***

***కొన్ని సమస్యలు పరిష్కరింపబడవు. కాలక్రమాన మరుగున పడిపోతాయి, మనమే వాటిని తప్పించుకుని, మర్చిపోయి, మనదారిని మనం ప్రయాణిస్తాం!***

అలాంటి అనేక సమస్యల్లో ఉద్యోగంలో ప్రమోషను ఒకటి!

●●●

## 19

***తేరా ఇన్సాఫ్ ఘబా రహా (హమ్ రహా బేఖబర్)***

ప్రమోషన్స్ కోసం జరిగిన ఇంటర్వ్యూలో మేనేజ్ మెంటు నా పేరుని తిరస్కరించారు, అని తెలిసి ప్రపంచంలో ఉన్న చెడులన్నీ నాకే జరుగుతున్నాయి అన్న అభిప్రాయం కలిగింది. అది అక్కడ నుండి తప్పొప్పులెంచడం మొదలు పెడితే మేనేజ్ మెంటుకి కేష్ట. చెంచాగిరి ముఖ్యంకాని క్వాలిఫికేషన్స్ చూసి ప్రమోషన్స్ ఇవ్వలేదు అన్న సీదా సాదా అభిప్రాయం కలిగింది.

ఈ అభిప్రాయం కూడా ప్రమోషన్స్ రానివాళ్ళ సమూహంలో తిరగడం వల్ల కలిగి ఉండచ్చు! అసంతృప్తి చాలామందిలో ఉంది, వీరందరినీ సంఘటితం ఎందుకు చెయ్యకూడదు? అనే ఆలోచన.. ఆలోచన కలగడమే తడవుగా మేనేజ్మెంటుపై అసంతృప్తితో ఉన్నవాళ్ళ లిష్టు తయారుచేసా.. మొత్తం రెండువందలమంది టీచర్సులోనూ నూటపాతిక మంది ప్రమోషన్లు రాకో, రెగ్యులరైజేషను అవకో మేనేజ్మెంట్ పట్ల అసంతృప్తితో ఉన్నారు.

వాళ్ళందరిలో ముఖ్యుడు మల్లికార్జురావు, మల్లికార్జురావు ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిపార్ట్ మెంటులో రీడరు, అతనా పోష్టులో గత ఇరవై ఏళ్ళుగా వడిలి పోతున్నాడు.

నా ఉద్దేశాన్ని మల్లికార్జురావుకి చెప్పి, తయారు చేసిన లిష్టుని చూపించా.. ఆ లిష్టులో ప్రథమంగా ఉన్న లింగమూర్తిగారి పేరుని చూసి ఆశ్చర్యపోయాడు. లింగమూర్తిగారు మా డిపార్టుమెంటు హెడ్డు. ఆయన ప్రోత్సాహంతో మేం తలపెట్టిన పని సగం అయిపోయినంత తేలికపడ్డాం ...

ఇంజనీరింగ్ కాలేజీ పేరు మీద టీచర్సు అసోసియేషను, అన్న సంస్థని ఏర్పరచి, దానిపేర కార్డులు ప్రింటు చేయించి అందరు టీచర్లూ సమావేశానికి రావలసిందిగా కోరుతూ ఇన్విటేషను పంచాం. ఇన్విటేషన్ కార్డులు పుచ్చుకున్న వాళ్ళందరూ సమావేశానికి రాలేదు ఈ మేనేజ్మెంటులో టీచర్లు కష్టాలుపడుతున్నారని నిన్న మొన్నటి వరకూ వాపోయినవాళ్ళల్లో కూడా చాలామంది సమావేశానికి రాలేదు.

ఆ రోజు సమావేశానికి ఓ ముప్పైమంది మాత్రం వచ్చారు. సమావేశానికి వచ్చిన సంఖ్య నన్ను చాలా నిరుత్సాహపరిచింది. కాని లింగమూర్తిగారు నన్ను ఉత్సాహపరుస్తూ "ఇందులో నిరుత్సాహపడవలసిన పనిలేదు. అని సమావేశాన్ని సంబోధిస్తూ" మనం ఈ కాలేజీ మేనేజ్మెంటుకి రుణపడి ఉన్నాం. ఈ కాలేజీలో ఇన్నాళ్ళ సర్వీసులోనూ మనకి కష్టాలన్నవి తెలియలేదు. ఇప్పుడు కూడా మనకి జీవితం గడవడం కష్టంగా లేదు. కాని గడుస్తున్న జీవితం కష్టాన్ని కలిగిస్తోంది. దానికి ఈ కాలేజీ మేనేజ్మెంటు కొంతవరకూ కారణం. మనకి కష్టం కలిగినప్పుడు మేనేజ్మెంటుతో కాక ఎవరితో చెప్పుకుంటాం, ఈ కాలేజీకి మనం ఎంత రుణపడి ఉన్నామో? ఈ కాలేజీ కూడా మనకి అంతే రుణపడి ఉంది. ఈ కాలేజీని మనం సర్వశక్తులూ ధారపోసి అభివృద్ధి చేసాం. కాలేజీకి పేరు తెచ్చాం. మన సమస్యల్ని మేనేజ్మెంటుకి తెలియచెప్పి పరిష్కరించుకోడానికే, ఈ అసోసియేషన్ మొదలుపెడుతున్నాం, ఈ అసోసియేషన్ రూపురేఖలు నిర్ణయించడానికే మనం ఇక్కడ సమావేశమయాం. మీ అందరికీ నా శుభాకాంక్షలు' అంటూ ముగించారు.

ఆ రోజు సమావేశంలో టీచర్సు అసోసియేషనుకి లింగమూర్తిగారిని ప్రెసిడెంటుగానూ, మల్లికార్జురావుని సెక్రటరీగానూ, మెకానికల్ డిపార్టుమెంటునుండి మధుసూధనరావుని ట్రెజరర్ గానూ, ఏకగ్రీవంగా నియమించి, నన్ను అందరూ జాయింట్ సెక్రటరీగా ఉండమన్నారు. నేను అంగీకరించాను.

అసోసియేషను స్థాపించగానే ఏవేనా మిరకిల్స్ జరుగుతాయనుకుంటే, అదీ భ్రమే! కాని అసోసియేషను స్థాపించిన నాలుగురోజులకి, ఎక్జిక్యూటివ్ మెంబర్స్ నలుగురు రిజైన్ చేసేసారు.

లింగమూర్తిగారు వాళ్ళని రిఫర్ చేస్తూ "పిరికివెధవలు మేనేజ్ మెంటు బెదిరింపులకి లొంగిపోయారు అన్నారు. సమయం మించిపోకుండా ప్రమోషన్సూ, కావలసిన ఎడ్మినిస్ట్రేషన్ పోస్టులూ లభించాయి. సరదా తీరిపోయింది. అందుకే తెగించి అసోసియేషను ప్రెసిడెంట్‌గా ఉండడానికి ఒప్పుకున్నాడు. అతనికే మాత్రం ప్రిన్సిపల్ అవుతానని నమ్మకమున్నా, మన అసోసియేషన్ చుట్టుపక్కలకి వచ్చేవాడు కాదు. "వృద్ధనారీ పతివ్రతా" అన్నాడు.

నాకూ నిజమే అనిపించింది. లింగమూర్తిగారికి ఇంకో రెండేళ్ళు సర్వీసు మాత్రమే ఉంది. ఇద్దరమ్మాయిలకీ పెళ్ళిచేసేసారు. ఉన్న ఒక్క పుత్రరత్నం స్టీలు ప్లాంట్లో పని చేస్తున్నాడు. అందుకే ఆయన నిశ్చింతగా అసోసియేషనులో చేరారని, లేకపోతే ఆయన మనస్తత్వానికి అసోసియేషను పనికి రాదని అనేవారు.

*****

అసోసియేషను మీటింగ్‌లు జరుగుతున్నాయి. అనేక విషయాల మీద వాదోపవాదాలు, జరుగుతున్నాయి. అసోసియేషను తరపునుండి రెండు, మూడు రిప్రెజెంటేషన్లు మేనేజ్‌మెంటుకి సమర్పించుకున్నాం. వాటికి నేటికీ మేనేజ్‌మెంటు నుండి సమాధానం రాలేదు.

ప్రతి మీటింగ్ లోనూ, అవే విషయాలు, అవే సమస్యలు మీద చర్చ జరగడం వల్ల "రిపీట్ ది సేమ్ డోస్ అంటిల్ పేషెంట్ డైస్" అన్న సామెతలాగ, అసోసియేషను మీటింగ్‌లకి వచ్చే సభ్యులు పలచబడ్డారు.

అసోసియేషను డబ్బులు వసూలు చెయ్యడం తప్ప ఇంకో పని చెయ్యడానికి దమ్ములేవని, ప్రచారం మొదలయింది. అలాంటి పరిస్థితుల్లో లింగమూర్తిగారు "ఏదో ఒక కార్యక్రమాన్ని అమలు చెయ్యాలోయ్, ఇలా మీటింగ్‌లు పెడుతూ కూర్చుంటే సరిపోదు" అంటూ మల్లికార్జునరావుని, నన్నూ, తొందరపెట్టారు. నిజమే తొందరలో ఏదో చెయ్యకపోతే అసోసియేషను చిక్కి శల్యం అయేట్టుగా ఉంది.

అంతేకాక మేనేజ్‌మెంటు కటాక్షంతో ప్రమోషన్ల రూపంలోనో, ఎడ్మినిస్ట్రేటివ్ పోస్టుల రూపంలోనో తమ సర్వీసుల్ని పండించుకున్న ప్రొఫెసర్లూ, తదితరులూ, అసోసియేషను మొదలైన తర్వాత, అసోసియేషను సభ్యుల్ని అంటరానివాళ్ళన్నట్టు దూరంగా ఉంచారు. అసోసియేషను సభ్యులతో మాట్లాడితే మేనేజ్‌మెంటుకి తెలిసిపోతుందేమో తమ ప్రివిలేజస్‌కి ముప్పు వస్తుందేమో? అన్నట్టుగా, కేంటిన్లోనూ, లైబ్రరీల్లోనూ, అసోసియేషను సభ్యులకి దూరంగా ఉంటూ అసోసియేషను వాళ్ళంటే ద్రోహులనో, మేనేజ్‌మెంటుకి కృతఘ్నులనో అన్నట్టుగా ప్రవర్తించసాగారు.

దీనివల్ల కాలేజిలో టీచింగ్ కమ్యూనిటీ రెండుగా విడిపోయింది. ఇది అక్కడితో ఆగక పుకార్లు లేవదీయడం మొదలుపెట్టారు. అసోసియేషను సెక్రటరీని సస్పెండు చేసారనో, ట్రెజరర్‌కి ఇంక్రిమెంటు నిలిపేసారనో అసోసియేషన్ ప్రెసిడెంటు, మేనేజ్‌మెంటు వేపు మారిపోయి అసోసియేషన్ని ముంచేసాడనో, ఏదో ఒక పుకారు రోజుకోటి!

ఈ పుకార్లు నిజమనుకునేవాళ్ళు, వీటి గురించి చర్చించుకునేవాళ్ళు, అలాంటి పుకార్లలలో బలమైన పుకారు "లింగమూర్తిగారు ప్రిన్సిపల్ అవుతున్నాని, అసోసియేషను వదిలేస్తున్నారని" ఈ పుకారుని నేను కూడా నమ్మక తప్పలేదు. ఆ విషయం కనుక్కోడానికి సరాసరి ఆయన దగ్గరకే వెళ్ళాను.

ఆయన తేలిగ్గా నవ్వేస్తూ "ఈ పుకార్ల ప్రభావం నీ మీద కూడా పడిందన్నమాట. నువ్విన్నది నిజంగా పుకారే, ఈ పుకార్లనుండి బయటపడాలంటే, మన అసోసియేషను ఏదో ఒకటి చెయ్యాలి అన్న ఉద్దేశంతో అన్ని యూనివర్సిటీల్లోనూ, కొత్త పేస్కేల్స్ అమలు

చేసారు కానీ మేనేజ్ మెంట్ ఈ కాలేజీలో కొత్త పేస్కేల్స్ అమలు చెయ్యనందుకు నిరసనగా అసోసియేషను సభ్యులందరూ బ్లాక్ బేడ్జెస్ ధరించాలని అసోసియేషను ఎక్జిక్యూటివ్ నిర్ణయించింది.

ఆ రోజునుండి అందరం బ్లాక్ బేడ్జెస్ ధరించాలని పెట్టుకుని కాలేజీలో తిరగడం మొదలుపెట్టాం. ఈ నిరసన ప్రదర్శన మొదలైన నాలుగురోజుల తర్వాత, విచిత్రమైన కథలు మొదలయ్యాయి.

అసోసియేషను మెంబరే ఒక ప్రొఫెసర్, మేనేజ్‌మెంట్ సెక్రటరీ ఎదురుబడేసరికి బ్లాక్ బేడ్జి తీసి జేబులో పెట్టేసుకున్నాడనీ, ఇంకో ప్రొఫెసర్ "బ్లేక్ బేడ్జీలకి మేనేజ్‌మెంటు జడిసేట్టయితే, నేను బ్లాక్ ఫేంటూ, బ్లాక్ షర్టు, వేసుకొద్దును' అని అసోసియేషను మెంబర్లని ఎద్దేవా చేసాడని విన్నాం. కానీ ఓ కొలీగ్ నా మొహం మీదే "ఇదేమిటోయ్ బ్లాక్ బేడ్జెస్ పెట్టుకున్నారు. మీరంతా అయ్యప్ప మినీ భక్తులా" అంటూ జోక్ చేసాడు.

బ్లాక్ బాడ్జీల తతంగం కొన్నాళ్ళు గడిచాక ఎక్జిక్యూటివ్ కమిటీ సభ్యులు మేనేజ్‌మెంటుకి తమ నిరసన తెలియచేస్తూ, కాలేజీ గేటు ముందు ఓ రోజు హంగర్ స్ట్రైక్ చేసారు. దానివల్ల కూడా మేనేజ్‌మెంటులో ఏ చలనం కలగలేదు.

*****

మేం హంగర్ స్ట్రైక్ చేసామన్న విషయం పేపర్లో న్యూసుగా వచ్చింది. ఆ న్యూసుతో పాటు కాలేజీలో టీచర్ల పరిస్థితి వివరిస్తూ మల్లికార్జునరావు ఇచ్చిన్ స్టేట్‌మెంటు కూడా వచ్చింది.

పేపర్లో పడ్డ న్యూసుని చదివి ప్రజలు ఏం అర్థం చేసుకున్నారు. టీచర్లకి మంచేం జరిగింది అన్నది వదిలి పెడితే...

ఆ పేపర్ న్యూసుకి స్పందించిన వ్యక్తి రామకృష్ణయ్యగారు.

రామకృష్ణయ్య టీచర్స్ ఫెడరేషనుకి అధ్యక్షులు. ఆంధ్రలో లెజిస్టేటివ్ కౌన్సిలు ఉన్నన్నాళ్ళూ, ఆయన గ్రాడ్యుయేట్ కాంస్టిట్యుయెన్సీ నుండి లెజిస్లేటివ్ కౌన్సిలుకి ఎన్నికయ్యేవారు. ప్రస్తుతం ఆయన ఎమ్.ఎల్.సి కాకపోయినా, గవర్నమెంటులోనూ, ప్రజలలోనూ మంచి పలుకుబడి ఉంది. అంతేకాక ఆయనకి నిశ్వార్థపరుడు, నిరాండంబరుడు అనికూడా పేరుంది. అలాంటి రామకృష్ణయ్య, మల్లికార్జునరావుకి ఉత్తరం రాసారు.

ఆ ఉత్తరం అసోసియేషన్ సభ్యుల్లో మంచి ఉత్సాహం తెచ్చింది. మల్లికార్జునరావు రామకృష్ణయ్యతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాల ఫలితంగా రామకృష్ణయ్య మా కాలేజీకి వచ్చి అసోసియేషను మీటింగ్‌లో పాల్గొంటానని తెలియచేసారు. మల్లికార్జునరావు రామకృష్ణయ్య దగ్గరగా జరిగితే, లింగమూర్తిగారు మౌనం వహించి, మల్లికార్జునరావుకి దూరంగా జరిగారు.

*****

రామకృష్ణయ్య అసోసియేషను మీటింగ్‌లో పాల్గొంటారన్న విషయాన్ని కాలేజీలో బాగా ప్రచారం చేసాడు మల్లికార్జునరావు. రామకృష్ణయ్యకి కాలేజీ సమాచారాన్ని అందించాడు.

ఆ రోజు కాలేజీలో జరిగిన అసోసియేషను సభ్యుల మీటింగ్‌కి చాలామంది, టీచర్లు వచ్చారు. కానీ లింగమూర్తిగారు తనకి వంట్లో బాగోలేదు, మీ మీటింగ్ జయప్రదంగా జరగాలని శుభాకాంక్షలు చెప్పి, మధ్యాహ్నమే శలవు పెట్టి ఇంటికి వెళ్ళిపోయారు.

సాయంకాలం నాలుగుగంటలకి కాలేజీ మూసాక టీచర్ల సమావేశం మొదలైంది. వో సీనియర్ ప్రొఫెసర్ మీటింగ్‌కి అధ్యక్షత వహించారు.

ఆ మీటింగ్‌లో రామకృష్ణయ్యగారు మాట్లాడుతూ 'ఈ రోజుల్లో ఎడ్యుకేషన్ పెద్ద వ్యాపారంగా తయారైంది. అందులో ఈ ఇంజనీరింగ్ కాలేజీలు చేసే వ్యాపారం విషయం ఎంత చెప్పుకున్నా కొంత మిగిలిపోతుందని, చమత్కరిస్తూ కాలేజికని చెప్పి విదేశాల్నుండి, అసలు ఖరీదుకన్నా అరవై శాతం తక్కువకి దిగుమతి చేసుకున్న కంప్యూటర్ ఎయిడెడ్ న్యూమరికల్లీ కంట్రోల్డ్ లేత్ మిషన్లని విశాఖపట్నం

ఆటోనగర్‌లో ఈ కాలేజీ సెక్రటరీకున్న స్వంత ఇండస్ట్రీలో కమర్షియల్ పర్పస్‌కి వాడుకుంటోంది. ఎకడమిక్ పర్పస్ అన్న మిషతో అతి తక్కువ ధరకి కొన్న నాలుగొందల కంప్యూటర్లలో రెండొందలు మేనేజ్ మెంటు నడుపుతున్న కంప్యూటరు సెంటర్లో కమర్షియల్ పర్పస్‌కి వాడుకుంటూ అటు గవర్నమెంటు దృష్టిలోనూ, ఇటు స్టూడెంట్స్ దృష్టిలోనూ ధూళి జల్లుతున్నారు. ఉద్యోగాల విషయంలో కూడా అదే జరుగుతుంది.

గవర్నమెంటు దగ్గర మాకింతమంది స్టాఫ్ ఉన్నారు. మాకింత గొప్ప లేబరేటరీస్ ఉన్నాయి అంటూ చంకలు గుద్ది, గ్రాంట్స్ ఆర్థిక సహాయం తెచ్చుకుంటారు. తీరా ఇక్కడికొచ్చి చూస్తే టీచర్లంతా ఈసురోమంటున్న జీతాల్తో ప్రమోషన్లు రాక, ఉన్న పోస్టుల్లోనే జీవితం వెలిబుచ్చేస్తున్నారు. ఇంక సదుపాయాల విషయానికొస్తే పాతికమందికో బూరెట్టు, యాభైమందికో కంప్యూట, మ్యూజియంలో వాళ్ళకి చూపించినట్టుచూపిస్తారు,' అంటూ ఆంధ్రాలో ఉన్న వివిధ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల గురించి అనేక విషయాలు చెప్పారు.

ఆయన మాట్లాడినదంతా టేపు చేసి దాన్ని న్యూస్‌గా రాసి పత్రికలకిచ్చాడు, మల్లికార్జునరావు.

********

పత్రికల్లో వచ్చిన న్యూసు చదివి లింగమూర్తిగారు బాధపడ్డారు. మల్లికార్జునరావుని పిలిచి "మన విషయం మనం చూసుకోవాలి గాని, ఆంధ్రాలో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీలని ఉద్దరిద్దామన్న ఉద్దేశం, మన అసోసియేషనుకి ఉండకూడదు. మనం మన లిమిటేషన్స్ తెలుసుకు మసలుకోవాలి" అన్నారు.

ఇదే ఉద్దేశాన్ని మేనేజ్‌మెంటు సెక్రటరీ దగ్గరకూడా వ్యక్తం చేసారు. సెక్రటరీగారికి ఆయన చెపుతున్నది అర్థం కాకపోయినా చెప్పందేదో అర్థం అయింది.

సెక్రటరీ నవ్వి "లింగమూర్తిగారూ మీ డేటాఫ్ బర్త్ ఏదో ఎక్కువపడింది అన్నారటగా, దాన్ని మార్చి ఇవ్వండి. మేనేజ్‌మెంటు మీ అర్జీని సానుభూతితో పరిశీలించేట్టూ చూస్తాను. ఆ మారిన డేటాఫ్ బర్త్ పరిగణిస్తే మీకింకా రెండేళ్ళ పైగా సర్వీసు ఉంటుంది. అంతేకాక మీరే సీనియర్ ప్రిన్సిపల్‌గా మీరీ కాలేజీని అభివృద్ధి చెయ్యగలరనిపిస్తోంది." అన్నాడు.

లింగమూర్తి ఆనందం ఆకాశాన్నంటింది. ఆయన రెండోరోజే పాతకాగితాల్లోంచి తన జాతకాన్ని వెదికి తీసి తన డేటాఫ్ బర్త్, ఈ జాతకం ప్రకారం మార్చవలసిందిగా కోరుతూ అర్జీ పెట్టారు.

*****

ఈ విషయాలేవీ తెలియని మల్లికార్జునరావు అసోసియేషను గురించి మాట్లడదామని వెళితే "మన అసోసియేషను విషయంలో రామకృష్ణయ్య కలుగచేసుకోవడం నాకిష్టం లేదోయ్" అంటూ ఓ లెక్చరిచ్చారు లింగమూర్తి.

జరుగుతున్నదేమిటో అర్థంకాక మల్లికార్జునరావు "రామకృష్ణయ్య మన అసోసియేషను మీటింగ్‌కి వస్తున్నట్టు మీకు ముందే చెప్పాను, కదండీ" అన్నాడు.

దానికి లింగమూర్తి, టేక్ట్‌ఫుల్‌గా

"ఆయన వస్తున్నట్టు చెప్పావు సరే, ఆయన ఏం మాట్లాడుతారో, చెప్పావా? మేనేజ్ మెంటు ఎలా మేనేజ్ చేసుకుంటే ఆయన కెందుకు? మన సమస్య లేమీటి? అవి మేనేజ్ మెంటుతో చెప్పి ఎలా పరిష్కరించుకోవాలి, అదీ మన అసోసియేషను ముఖ్యోద్దేశం, అయిన తమాషా చాలు మీరెళ్ళండి" అన్నారు. అంతేగానీ తన సమస్య పరిష్కారం అయిపోయిందన్న విషయం మల్లికార్జునరావుకి చెప్పలేదు.

మల్లికార్జునరావుకి ఆయన చెప్పిన లాజిక్‌లో నిజం ఉంది, అనిపించింది మౌనంగా ఉండిపోయాడు.

******

ఆ విధంగా రామకృష్ణయ్య అడుగుపెట్టడంతో అసోసియేషను డిససోసియేట్ అయిపోయి, పడుకుంది. ఇది జరిగిన రెండు నెలలకి లింగమూర్తిగారిని ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ నోటిఫికేషన్ వచ్చింది.

అందరూ ఆశ్చర్యపోయారు. ఈయనకి ఇంకా ఏడాదే సర్వీసుంటే, రెండేళ్ళ పాటు ప్రిన్సిపాల్‌గా ఎలా నియమించారా? అని తర్జన భర్జన పడ్డారు.

కొన్నాళ్ళ తర్వాత ఒక్కో విషయం బయటపడ్డాయి. లింగమూర్తి జాతక కాగితాలు ఇన్నాళ్ళకి ఆయనకి పనికివచ్చాయి. ఆయన వయసు వాళ్ళ నాన్నగారు తప్పు వేయించారని నా డేటాఫ్ బర్త్‌ని ఆయనెవడు తప్పురాయడానికి? అంటూ లింగమూర్తిగారు తన జాతకం చూపించి తప్పు దిద్దుంచుకున్నారని, కాలేజీలో గుసగుసలుగా చెప్పుకున్నారు.ఆ గుసగుసలు అక్కడితో ఆగక ఇలాంటి ఉద్దేశాన్ని బుర్రలో పెట్టుకునే, ఆయన అసోసియేషనులో చేరాడని చెప్పుకున్నారు.

వీళ్ళు గుసగుసలతో కాలేజీ సలసల మరుగుతూంటే, అగ్నికి ఆజ్యం తోడన్నట్టు, లింగమూర్తి కొడుకు కాలేజీలో లెక్చరర్‌గా జాయిన్ అయ్యాడు.

********

మొదటికి మార్పుకే తట్టుకోలేక, సతమతమవుతున్న మల్లికార్జునరావుకి రెండో సంఘటన కోపాన్ని తెప్పించింది. ఆ కోపం లింగమూర్తి మీద కక్కేసాడు. లింగమూర్తీ ఊరుకోలేదు స్వరం పెంచి మల్లికార్జునరావుని దులిపేసారు.

ఇద్దరి లాజిక్కులూ ఒకదానితో ఒకటి "ఢీ" కొని నువ్వు వెధవ్వి అంటే నువ్వు వెధవ్వి అని అరుచుకున్నారు, మల్లికార్జునరావుకి ఇంక లాజిక్కులు అరుచుకోడాలూ అనవసరం అనిపించి చెప్పుతీసాడు అంతవరకూ వినోదం చూస్తున్నవాళ్ళు కలుగచేసుకుని మల్లికార్జునరావుని ప్రిన్సిపల్ రూమునుండి బయటికి లాక్కొచ్చేసారు.

మల్లికార్జునరావునైతే ప్రిన్సిపల్ రూమునుండి బైటకు లాక్కొచ్చారు గానీ, ఈ విషయాన్ని కబుర్లుగా చెప్పి నవ్వుకునే వాళ్ళని ప్రిన్సిపల్ ఆఫీసు స్టాపు ఆపలేకపోయారు.

ఈ కబురులో కాలేజీ స్టాఫ్ రెండుగా విడిపోయింది. చెప్పుచ్చుకు నాలుగు కొట్టాడని కొందరూ, కొట్టలేదు చెప్పు తీసాడు అంతే, అని కొందరూ రెండు భాగాలుగా విడి లింగమూర్తిమీద జాలిపడ్డారు.

కాని లింగమూర్తికి స్టాఫ్ తనమీద పడుతున్న జాలి నచ్చలేదు. మేనేజ్ మెంటుతో ఈ విషయం రిపోర్టు చేసి వాళ్ళ అనుమతితో మల్లికార్జున రావుని సస్పెండు చేసారు.

********

మల్లికార్జునరావుని అతని ఆదర్శాలూ, ఆచరణలూ, ముంచేసాయి. కలియుగంలో మనసావాచా కర్మేణ అన్న సూత్రం కొంప ముంచుతుంది, అని అర్థం అవుతోంది.

మల్లికార్జునరావు సస్పెండు అవడంతో అసోసియేషను సంగతి కొందరు సభ్యులు భయంతోనూ, కొందరు సభ్యులు మేనేజ్‌మెంటు వత్తిడితోనూ, మర్చిపోయారు.

అసోసియేషను వల్ల లాభపడింది అటు లింగమూర్తిగారు, ఇటు ట్రెజరర్ మధుసూధనరావూ, లాభపడ్డారు. పదవి సంపాదించి లింగమూర్తి లాభపడితే, అసోసియేషను పేరుమీద వసూలు చేసిన డబ్బు వాడుకుని మధుసూధనరావు లాభపడ్డారు.

*****

సస్పెండు అయిన దగ్గర్నుంచీ మల్లికార్జునరావు మీద సానుభూతి చూపించడం తప్ప ఏం చెయ్యలేకపోయేవాళ్ళం, ఈ రెండేళ్ళల్లోనూ మల్లికార్జునరావుతో ఏర్పడ్డ సన్నిహితం వల్ల, అప్పుడప్పుడు మల్లికార్జునరావు ఇంటికి వెళ్ళి పలకరించి కబుర్లు చెప్పి వస్తున్నాను.

రోజురోజుకీ మల్లికార్జునరావు గురించి, అతని విపరీత ప్రవర్తన గురించి తెలుస్తున్న వార్తల వల్ల మనసు పాడయేది. ఓ రోజు మల్లికార్జునరావు భార్యని తెగబాదేసాడని ఆవిడని ఆస్పత్రికి తీసుకెళ్ళవలసి వచ్చిందని ఓ వార్త, మళ్ళీ కొన్నాళ్ళ తర్వాత మల్లికార్జునరావు రోడ్డు మీద నడుచుకుంటూ విజయనగరం వెళ్ళిపోయాడని, అలసటకి అక్కడ రోడ్డు పక్కన పడిపోయాడని

మూడురోజులవరకూ అతని అతా పతా తెలియక ఇంట్లోవాళ్ళు బెంబేలెత్తిపోయారని, ఓ వార్త! ఈ వార్తలన్నింటి వెనక మల్లికార్జునరావులో పెనుమంటలా రాజుకుంటున్న కసే కారణం, ఈ కసి ఎవరి మీద అంటే చెప్పడం కష్టం, తనమీద తనకే కసి, తన మేధస్సు మీద కసి..

మల్లికార్జునరావు ఎకడమిక్ కెరీర్ చాలా అద్భుతమైంది. టెన్త్ క్లాసులో స్టేట్ రేంక్ వచ్చింది. ఇంటరులో స్టేట్ రాంక్ వచ్చిన పదిమందిలో ఒకడు.

ఇంజినీరింగులో గోల్డు మెడలు వచ్చింది. వెంటనే ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో ట్యూటరుగా చేరాడు. ఉద్యోగం చేస్తూనే మాస్టర్స్ డిగ్రీ చేసాడు. మల్లికార్జున రావు చేరిన రోజుల్లో ఇంజనీరింగ్ కాలేజీ కొత్తగా స్థాపించడం, ఎక్కువమంది టీచర్లు లేకపోవడం, చాలా సబ్జెక్ట్స్ మల్లికార్జున రావే చెప్పి మానేజ్ మెంటుకి తన సత్తా చూపించాడు. అందుకే అతను జాయిన్ అయిన అయిదేళ్ళకే రీడరయ్యాడు. రీడరు ఇంటర్వ్యూలో తనని ప్రశ్న అడిగిన ఎక్స్‌పర్ట్‌ని తప్పుపట్టాడని చెప్పుకుంటారు.

కాలేజీలో చేరిన రెండో ఏడాదే, స్టూడెంట్స్‌లో చాలా పాపులర్ అయాడు. మేథమెటికల్ కాన్సెప్ట్స్ చెప్పాలంటే మల్లికార్జునరావే చెప్పాలి అనిపించుకున్నాడు,

అతని సక్సెస్ అతని బుర్రకి ఎక్కింది, అదే అతన్ని పాడుచేసింది. అతనికున్న ఆదర్శాలూ, అతని వ్యక్తిత్వం ఇంకో కాలేజీలో రాణించేవేమో? కాని ఈ ఇంజనీరింగ్ కాలేజీలో రాణించలేదు సరిగదా హాలాహలంలా వెన్నాడి, అతని కెరీర్‌ని పాడుచేసాయి. రీడరైన తర్వాత అతను కేపిటేషను ఫీజు కట్టి కాలేజీకి వచ్చిన స్టూడెంట్స్‌ని చిన్నచూపు చూసేవాడు. వాళ్ళకి మార్కులు తక్కువ చేసేవాడు. ఇలాంటి వాళ్ళని కాలేజీలోకి తీసుకున్నందుకు మేనేజ్‌మెంటుని విమర్శించేవాడు. అక్కడతో అతనికి మేనేజ్‌మెంటుకి చెడింది.

అతను చాలాసార్లు మేనేజ్‌మెంటు సెక్రటరీ ముందే ఎందుకండీ డబ్బు కట్టగలిగిన ప్రతివాడ్నీ ఇంజనీరింగ్‌లోకి తీసుకుంటారు. వాళ్ళు మా ప్రాణాలు తోడేస్తున్నారు. అనేవాడు.

దానికి సెక్రటరీ చిరునవ్వు నవ్వి ఊరుకునేవాడు. అతని కామెంటరీ ప్రభావం అతనికి అర్థం కావడానికి కొన్నాళ్ళు పట్టింది. అతని వెనుక జాయినయిన వాళ్ళందరూ ప్రొఫెసర్లయి పోతోంటే అతను మాత్రం రీడరుగా మిగిలిపోయాడు. ఈ తేడా అతను అర్థం చేసుకునే సరికి సమయం మించిపోయింది. గత ఇరవై ఏళ్ళుగా రీడరు పోస్టులో, హేంగ్ అయిన కంప్యూటరు కర్సర్‌లా మినుకు మినుకుమంటున్నాడు.

అది అతనిలో కసిరేపి, కోపాన్ని తెప్పించింది. కాని ఏం చెయ్యలేక ఊరుకున్నాడు. అసోసియేషను పెట్టిందగ్గరనుండీ మళ్ళీ ఉత్సాహంగా కనిపించాడు. కాని లింగమూర్తిగారి రైటెబౌట్ టర్న్ లౌక్యం, లెఫ్ట్ సింపతీ గల మల్లికార్జున రావుకి కొరుకుడు పడలేదు. లింగమూర్తికి అన్ని బాధ్యతలూ తీరిపోయాయి. ఆయన నిర్మల మనసుతో, నిజాయితీగా ఈ కార్యానికి పూనుకున్నారు. ఆయన అండదండల్లో అసోసియేషను ఎంతో కొంత సాధిస్తుంది. అన్న అతని అభిప్రాయం తారుమారైంది.

ధనార్జనకి అధికారార్జనకీ హద్దుల్లేవని అతనికి తట్టలేదు. మనిషి అతఃకుహరంలో, ఏదీ చీకటి కోణమో? ఏది ప్రకాశ భరితమో? తెలుసుకోడం కష్టమని అతనికి తెలీలేదు.

●●●

## 20

**కొన్నాళ్ళకి మల్లికార్జునరావు మీద** సానుభూతి చూపుతూ, మేనేజ్‌మెంటు సస్పెన్షన్ కేన్సిల్ చేసింది. మల్లికార్జునరావు కాలేజీలో చేరాడు.

కానీ అప్పటికే మల్లికార్జునరావు ఫ్రస్టేషన్ దారిలో వెనక్కి తిరిగి రాలేనంత దూరం వెళ్ళిపోయాడు. కాలేజీకి వచ్చేవాడేకానీ క్లాసులకి వెళ్ళేవాడు కాదు. ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. ఎవరేనా పలకరిస్తే కరుస్తున్నట్లుగా, కోపంగా సమాధానం చెప్పేవాడు. అందుకే మిగతా స్టాఫంతా అతనికి దూరంగా మసిలేవారు.

ఓ రోజు కాలేజీ లేబరేటరీలో ఎవరో కుర్ర లెక్చరర్, స్టూడెంట్స్‌కి ఓమ్స్ లా చెప్పాడు. అక్కడే దూరంగా కూర్చున్న మల్లికార్జునరావు కుర్ర లెక్చరర్ని పిలిచి బలంగా లెంపకాయ కొట్టాడు.

కుర్ర లెక్చరర్ అవాక్కయిపోయాడు. వాడిని కోపంగా చూస్తూ "ఏమిట్రా చెపుతున్నావ్? ఓమ్స్ లా ఎవరికి చెపుతున్నావ్? వాళ్ళేం పదోక్లాసు కుర్రాళ్ళుకాదు, "వి బై ఐ ఈజ్ ఈక్వల్ టు రెసిస్టెన్స్" అని చెప్పడానికి వాళ్ళు రేపటి ఇంజనీర్లు. నీ వెర్రి వెధవ డెఫినెషను చెప్పి వాళ్ళ బుర్రలు తినకు అర్ధమై చెప్పగలిగితే "వోల్టేజ్ డ్రాప్స్ ఇన్ ఇ డైరెక్షన్ ఆఫ్ కరెంట్" అని చెప్పు. అదీ ఓమ్స్ లా. నీలాంటి చచ్చు వెధవలే ఈ కాలేజీలో తగలబడి చచ్చువెధవల్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు." అని స్టూడెంట్స్ వేపు తిరిగి "పోండ్రా వీడు మీకేం చెపుతాడు వీడే ఇంకా చాలా చదువుకోవాలి" అన్నాడు.

ఈ విషయం లింగమూర్తికి తెలిసినా ఏం చెయ్యాలో తెలీక ఊరుకున్నారు, కాని మల్లికార్జునరావు ఊరుకోలేదు. కాలేజీకి రావడం మానేశాడు.

నాలుగైదు రోజులు ఎదురుచూసి, ఎందుకు కాలేజీకి రావడం లేదో కనుక్కోమని నన్ను వాళ్ళింటికి పంపించారు., లింగమూర్తి...

లింగమూర్తికి తెలుసు నేను మల్లికార్జునరావూ సన్నిహితంగా ఉంటామని, నేనోసాయంత్రం మల్లికార్జునరావు ఇంటికి వెళ్ళాను... మల్లికార్జున రావు నిద్రపోతున్నాడు.

"ఇప్పుడు నిద్రపోవడం ఏమిటా?" అని ఆశ్చర్యంవేసింది.

దానికి సమాధానంగా, మల్లికార్జున రావు భార్య కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ అతని ఉన్మాదస్థితి గురించి చెప్పింది.

ఓ రోజు ఇంట్లో పిల్లల పుస్తకాలు చింపేసాడట, అడ్డొచ్చిన పెళ్ళాన్ని కొట్టాడట, పిల్లల్ని కొట్టి,

"ఈ చదువులనే నాటకాలు కట్టిపెట్టండి. డబ్బులు సంపాదించండి. రైల్వే స్టేషన్‌లో, బస్ స్టాపుల్లో బజారుల్లో కూలీ చెయ్యండి, దొంగతనం చెయ్యండి అడుక్కోండి,... వెధవల్లారా చెపితే అర్ధం కాదేం!

ఈ పుస్తకాల్లో కనిపించే అర్కిమెడిసూ, న్యూటనూ అయిన్‌స్టీన్ అందరు మోసగాళ్ళు డబ్బు సంపాదించడం చేతగాని దరిద్రులు! వాళ్ళు సుఖంగా బతకలేరు. మనల్ని సుఖంగా బతకనివ్వడంలేదు. ఆ న్యూటనుగాడికి ఏపిల్ కిందపడితేనేం, పైకెగిరితేనేం, వీడు సూత్రాలు

రాసి మన బుర్ర తిన్నాడు. ఆ ఏపిలుని కొరుక్కుతిన్నవాడు సుఖపడ్డాడు. వాడికి ఆపిలు చేతకాలేదు సరికదా, సూత్రాలు రాసి మన ప్రాణాలు తింటున్నాడు" అన్నాడట.

ఓ రోజు పిల్లలు టి.వి.లో ప్రోగ్రాం చూస్తుండగా కరెంటు పోయిందట. మల్లికార్జునరావు భార్య లాంతరు వెలిగించి తెచ్చేసరికి, మల్లికార్జున రావు ఫేంటూ, షర్టూ విప్పి కట్ డ్రాయరూ బనీనుతో నిలబడి ఆ పోగ్రాం పోయిందని బాధపడకండ్రా, నే చేస్తా డాన్సు అంటూ సోఫా మీంచి, సెంట్రల్ టేబుల్ మీదకి, అక్కడనుండి పక్కనే వున్న టేబులు మీదకి దానిమీంచి మళ్ళీ సోఫాలోకి దూకడం మొదలుపెట్టాడట, పిల్లలు ఆ తర్వాత అతనుండగా ప్రోగ్రాం చూడ్డం మానుకున్నారంట.

ఓ రోజు భోజనాల దగ్గర అన్నం పప్పుకూర మజ్జిగ నూనె ఉప్పూ, పచ్చడీ అన్నీ కలిపేసి "నేను కొత్తరకం ఫుడ్ కనుక్కున్నాను. 'ఆంధ్రా పిజ్జా' నోబులు బహుమతి వచ్చే అవకాశం ఉందా?" అని పెళ్ళాన్ని అడిగాడట.

ఏమనాలో తెలియక మల్లికార్జున రావు భార్య "ఊ" అందట.

"అయితే తినండి అందరూ" అని గదమాయించి, అందరిచేతా అది తినిపించాడట.. ఎక్కడ కొడతాడో అన్న భయంతో పిల్లా, ఆవిడా గప్ చిప్‌గా తినేసారట...

ఇవన్నీ చెప్పి మల్లికార్జున రావు భార్య కళ్ళనీళ్ళు పెట్టుకుంటూంటే, ఆవిడ్ని ఏమని ఓదార్చాలో తెలీక మౌనంగా ఉండిపోయాను.

●●●

నేను మళ్ళీ మర్నాడు వెళ్ళి మల్లికార్జున రావుని కలిసాను. "రావడం లేదేం" అనడిగాను.

నా ప్రశ్నకి సమాధానం చెప్పకుండా "సస్పెండు చెయ్యలేదా?" అడిగాడు.

"లేదే ఎందుకు?" అనడిగా.. ఆశ్చర్యంగా

"వోహో ప్రిన్సిపల్‌ని తప్ప కాలేజీలో అందర్నీ కొట్టచ్చన్నమాట" అన్నాడు. అలా ఎందుకన్నాడో నాకర్థం అయింది.

నేను మల్లికార్జునరావు ఇంటికి వెళ్ళాక, మల్లికార్జునరావు కాలేజీకి రావడం మొదలుపెట్టాడు కాని రెగ్యులర్‌గా రావడం లేదు. కొన్నాళ్ళ తర్వాత కాలేజీవాళ్ళు అతని రాకపోకల్ని పట్టించుకోడం మానేసారు. అతనూ కాలేజీకి రావడం మానేసాడు. అతని జీతం కూడా పూర్తిగా ఆపేసారు.

●●●

మల్లికార్జునరావు ఇంట్లో శాంతంగా ఉండలేకపోయాడు. అతని ఉన్మాదం పెరిగి ప్రమాదకరమైన పరిస్థితికి చేరుకుంది. ఇంట్లో వైర్లూ అవీ ఊడదీసి షార్టు చేసి, స్పార్కులు సృష్టించి, నానాగొడవ చేస్తున్నాడట. అతని భార్యా పిల్లలూ భయంతో బిక్కుబిక్కుమంటూ ఉంటే, అతని మావగారు వచ్చి అతన్ని మెంటల్ హాస్పటల్లో జాయిన్ చేసారని, కొన్నాళ్ళ తర్వాత మెంటల్ హాస్పటల్ నుండి డిస్‌చార్జ్ అయి ఇంటికి వచ్చాడని తెలిసి అతన్ని చూడ్డానికి అతని ఇంటికి వెళ్ళాను.

ఉన్మాదం తగ్గడం కోసం ట్రాంక్విలైజర్స్ వాడడం వల్ల అతను తన రూములో పడుకున్నాడు. అతని భార్య నన్ను అతని రూములోకి తీసుకెళ్ళింది.

●●●

ఆ రూములో అడుగుపెట్టిన నేను డంగైపోయాను. ఆ రూము గోడలనిండా రంగుసుద్దముక్కలతో ఏవేవో రాసివున్నాయి. అవన్నీ మేథమెటిక్స్‌కి సంబంధించినవే కాని మేదమెటిక్స్ కాదు, మరి..

మానవుడు.....మేధస్సు...డబ్బు
ప్రపంచం....చదువు....ఆదర్శం...డబ్బు
అధికారం....ఆశ.....డబ్బు
జీవితం.....నియమాలు... నైతికత
సమర్ధత... అసమర్ధత

అసూయ...ఆరాటం
ఆశ... కోపం... అసమర్ధత
విజ్ఞానం...సత్ప్రవర్తన
గౌరవం... ధైర్యం
సమర్ధత న్యాయం... విశ్వాసం
మిడిమిడిజ్ఞానం..... ప్రవర్తన
అసమర్ధత X డబ్బు.....సూడో గౌరవం...ధైర్యం
సూడో న్యాయం.. అపనమ్మకం

నా ఆదర్శం డబ్బు నా విజ్ఞానం డబ్బు, "ఐ లాస్ట్ మై ఐడెంటిటీ, కెన్ ఎనీ బడీ రిమూవ్ మనీ అండ్ ఐడెంటిఫై ది సెల్ఫ్"

ఇలాంటి రాతలతో విచిత్రమైన మ్యాట్రిక్స్‌తో గదంతా నిండిపోయివుంది.

మంచం మీద మల్లికార్జునరావు శాంతంగా నిద్రపోతున్నాడు. అతని ఉన్మాదం పెరగకుండా అతనికి పొద్దున్నా సాయంకాలం ట్రాంక్విలైజర్స్ వేస్తున్నారు.

అతన్ని ఆ స్థితిలో చూసి జాలివేసింది. "అతనికి ట్రాక్విలైజర్స్ వెయ్యకండి. అతని ఉన్మాదం ప్రపంచానికి ఎంతో మంచిది. " అని అతని భార్యకి చెపుదామనుకున్నాను. కానీ, నా నోరు పెగల్లేదు. నే చెప్పినా వాళ్ళు నా మాట పట్టించుకోరని తెలుసు.

అలా మంచం మీద కొన్నాళ్ళు గడిపిన మల్లికార్జునరావు ఎవర్నీ పట్టించుకోడం మానేసాడు. గుర్తించడం, మానేసాడు. అతని చూపులో చిన్న వెర్రితనం కనిపించింది.

ఇంక మల్లికార్జునరావు మామూలు మనిషి అవడని నమ్మకం కుదిరాక అతన్ని అతని కుటుంబాన్ని, తమ స్వగ్రామం తీసుకెళ్ళిపోయారు వాళ్ళ మావగారు.

●●●

మల్లికార్జునరావు ఊరు వదలి వెళ్ళిపోయినా, నేను అతన్ని మర్చిపోలేక పోయాను. కాలేజీ విషయాలు వెనకబడడంతో మళ్ళీ మంచం ఎక్కి కూర్చుని, ఇంగ్లీషు నవలలు చదువుకుంటూ, మధ్యలో నాలుగురోడ్ల కూడలిని గమనిస్తూ కాలం గడుపుతున్నాను.

కాని నాలుగురోడ్ల కూడలిలో మల్లికార్జునరావు కారెక్కి డాన్సు చేస్తున్నట్టూ, ట్రాఫిక్ పోలీసుని పట్టుకుంటున్నట్టూ, కళ్ళముందు కదిలే ఊహా చిత్రాల్ని ఆపలేకపోయాను.

మల్లికార్జునరావులా జీవితం గురించి మర్చిపోతే ఎంతబావుండును. అటు మల్లికార్జునరావులా తీవ్రప్రకృతిని అలవర్చుకోలేదు. ఇటు లింగమూర్తిగారిలా అవసరం తీర్చుకునే లౌక్యం అలవర్చుకోలేదు. నాలో ఆశ, వేదన, నన్ను సామాన్యుడిగానే నిలబెడుతున్నాయి. ఏదో తెలియని డిఫెన్స్ మెకానిజంతో జీవితాన్ని నెట్టుకొస్తున్నాను, ఈ మెకానిజం ఇరుసులో నలుగుతున్నానా? ఏదీ తేల్చుకోలేకపోతున్నా....

●●●

మల్లికార్జున రావు మరుగునపడి, నే చదువుతున్న నవల మీద ధ్యాస కుదరడానికి కొన్ని నెలలు పట్టింది. కానీ అదికూడా సాఫీగా సాగలేదు. ఝరి టెన్త్ క్లాసుకి వచ్చింది. దానికొచ్చే డౌట్లతో నన్ను మాటిమాటికి డిస్టర్బ్ చేస్తోంది.

ఝరి టెన్త్ పాసయింది. సెవంటీ పెర్సంట్ మార్కులు మాత్రమే వచ్చాయి. ఝరిని ఆదిత్య ట్యుటోరియల్ కాలేజీలో ఇంటర్ లో జాయిన్ చేసాను.

ఝరి కాన్వెంటు వాతావరణంలో పెరగడం వల్ల, ఆమెలో దర్పం డాబు కొట్టొచ్చినట్టు కనిపించేవి. ఝరిని 'ఏం చదువుతున్నావ్?' అని అడిగిన ప్రతివాళ్ళకీ 'ఈ రెండు సంవత్సరాలూ చాలా ముఖ్యం' అని, 'జీవితంలో ఏదో సాధించాలంటే ఈ రెండు సంవత్సరాలూ కష్టపడాలి. ' అంటూ తన ఆదర్శాలు వల్లెవేస్తుండేది. ఆ చిలకపలుకులన్నీ నావేనని నాకు తెలుసు, ఝరికి బోధించిన సూక్తులన్నీ తను ఇతరుల దగ్గర వల్లెవేస్తూ వస్తోంది.

ఝరి హిపోక్రసీ అర్థం అవుతోంది. సూక్తులు వర్ణించినంతగా చదువు సాగడం లేదని సందేహం కలిగింది. ఝరి పష్టియరు హాఫ్ ఇయర్లీ ఎక్జామినేషన్ మార్కులు, ఇచ్చినా నాకు చూపించలేదనే అనుమానంతో ఝరి పుస్తకాల బీరువా వెదికాను.

ఝరి పుస్తకాలు వెదుకుతున్న నాకు, ఝరి పుస్తకం మధ్యన ఓ ఉత్తరం కనబడింది. అది చదివి ఆశ్చర్యం వేసింది. ఎవరో ఝరికి రాసిన ప్రేమ ఉత్తరం, ఝరి ఇంకా చిన్నపిల్ల అనే అనుకుంటున్నాను. కాదని ఈ ఉత్తరం, నిరూపిస్తోంది. బృహతిని పిలిచి ఆ ఉత్తరం చూపించాను.

ఉత్తరం చూసి బృహతి బెంబేలెత్తిపోయింది. ఆ రోజు కాలేజీనుండి ఇంటికి వచ్చిన ఝరిని పట్టుకుని ఆ దవడా ఈ దవడా వాయించేసింది. 'చదువుకోమని పంపిస్తే ఇవేం బుద్దులే' అంటూ తిట్టింది.

"ఎవరో నా పుస్తకాల్లో పెట్టారు. వాళ్ళెవరో కూడా నాకు తెలీదు" అంటూ ఏడిచింది ఝరి.

ఝరి చెప్పింది నమ్మబుద్దివేసింది. ఆ ఉత్తరం చివర్న స్పష్టమైన పేరులేదు. మా ఇద్దరి మనస్సులూ కాస్త నెమ్మదించాయి. ఝరి చెప్పిందాంట్లో నిజం ఉండి ఉండచ్చు అనవసరంగా దాన్ని కొట్టాం అనుకున్నాం ఆ ఉత్తరాన్ని తీసి నేనుదాచాను.

●●●

రోజులు గడుస్తున్నాయి. ఝరి మీద నమ్మకం పోవడంతో ప్రతివారం బృహతి ఝరి పుస్తకాల్ని వెదుకుతోంది. పుస్తకాల్లో గానీ పుస్తకాల సంచీలోగాని ప్రేమలేఖలు దొరకలేదు. బృహతి ఏరోజు కబురు ఆ రోజు చెపుతోంది. మనసు కుదుటి పడింది.

బృహతికి ఝరి మీద సానుభూతి పెరిగింది. "కావాలని చేసింది కాదు ఏదో చిన్నతనం, దీనికి తెలియకుండా ఎవరో ఉత్తరం దీని పుస్తకంలో పెట్టివుంటారు. చదువుకుంది నచ్చింది పదిలంగా దాచుకుంది. అలాంటి ఉత్తరం వస్తే ఆ వయసులో ఎవరికి గర్వంగా ఉండదు. అందుకే పదిలంగా దాచుకుంది" అంటూ కూతురికి ప్రేమలేఖ వచ్చినందుకు తను మురిసిపోయింది.

నేను బృహతి చెప్పినవన్నీ వింటూ "ఊ" కొడుతున్నాను. నాకైతే పెద్ద గండం గడిచినట్టయింది. ఈ వయసులో తెలిసీ తెలియని తనంతో ఏదేనా చేసేస్తుందేమో? అన్న భయం తగ్గింది. ఝరి కూడా కాలేజీ కోచింగ్ క్లాసులు అంటూ నిముషం తీరిక లేకుండా హడావిడిగా ఉంటోంది.

●●●

## 21

**ఆ రోజు ఆదివారం నేను ఇంట్లోనే ఉన్నాను.** ఝరి ప్రాక్టికల్ క్లాసులు ఉన్నాయంటూ, తొమ్మిది గంటలకే ఇంటినుండి వెళ్ళిపోయింది. ఝరి వెళ్ళిన గంటకి ఝరి క్లాసుమేటు వచ్చింది ఝరికోసం,

'ప్రాక్టికల్స్ చెయ్యడానికి కాలేజీకి వెళ్ళింది' అని చెప్పింది బృహతి.

ఝరి క్లాసుమేటు ఆశ్చర్యపోయింది. 'ప్రాక్టికల్స్ క్రిందటి నెలే అయిపోయాయి. ఆంటీ' అంది.

'ఎక్స్ట్రాక్లాస్లేమైనా ఉన్నాయేమో?' అంది బృహతి.

'ఆదివారాల క్లాసులు ఆపేసారు ఆంటీ' అంది ఆ అమ్మాయి.

బృహతికి ముచ్చెమటలు పోసాయి. 'అయితే ఎవరో ఫ్రెండు ఇంటికి వెళ్ళివుంటుంది' అని చెప్పి ఆ అమ్మాయిని పంపేసింది.

ఆ అమ్మాయి వెళ్ళిపోయాక, ఆతృతగా నా దగ్గరకి వచ్చి 'ఝరి' అబద్ధం చెప్పి వెళ్ళిందని ఈ రోజు కాలేజీ లేదని చెప్పింది.

ఈ వార్త నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. నేను బద్ధకాన్ని పక్కన పెట్టి లేచి వెళ్ళి ఝరి పుస్తకాల రేక్ అంతా వెదికాను. ప్రతీ పుస్తకాన్నీ విప్పి చూసాను. బృహతి వెనకాల నుండి 'నేనవన్నీ వెదికాను. ఏమీలేవు' అంటోంది అయినా ఎందుకో నాకు బృహతి తెలివితేటల మీద నమ్మకం లేదు.

మొత్తం రేక్ అంతా వెదికినా ఏమీ కనబడలేదు నా ఉద్వేగాన్ని తగ్గించుకుని, మళ్ళీ రేక్లో పుస్తకాలన్నీ వెదకడం మొదలుపెట్టాను. ఈసారి పుస్తకాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించాను. ఒక పుస్తకానికి వేసిన అట్ట పైకి వచ్చినట్టుగా అనిపించి, ఆ పుస్తకం తీసి అట్టవిప్పి చూసాను. ఆ అట్టలో రెండు గ్రీటింగ్ కార్డులు, రెండు ఉత్తరాలూ ఉన్నాయి. అవి తీసి చదివాను. ఇంక సందేహానికి తావే లేదు అనిపించింది.

ఒక గ్రీటింగ్ కార్డు

వేలంటైన్డే నాడు ఇచ్చింది. రెండు లెటర్స్ తెలుగు సినిమా ప్రేమ డైలాగుల మయంగా ఉన్నాయి. ఝరి అమాయకురాలు కాదు అన్న విషయం తలుచుకుంటే శరీరంలో రక్తం అంతా నాడుల చివరికి పరుగెడుతోంది. బృహతి అసమర్థత మీద, గుడ్డినమ్మకం మీద కోపం వచ్చింది.

ఝరి నన్నూ, ముఖ్యంగా బృహతినీ వంచిస్తోంది. ఈ వంచన ఎంతవరకూ దారితీసింది? అనే ఆలోచన కంపరం ఎత్తిస్తోంది. ఇది చదువుకోవలసిన వయసు ఇంత చిన్న తనంలో దీనికి ప్రేమ అవసరం ఏం వచ్చింది? వీటన్నింటికీ కారణం టెలివిజన్లూ, స్టార్ డస్ట్లూ, చవకబారు తెలుగు పత్రికలూనా? అవి ఇచ్చిన ప్రేరణే ఝరిని భావావేసానికి గురిచేసాయా? ఝరి మనసులో ఏముంది? ఝరి బతుకు ఏమవుతుంది? అన్న ఆలోచనలతో మనసంతా కలతదేరిపోయింది.

ఝరి ప్రవర్తనకి నేను ఎంతవరకూ కారణం? అని చాలా సేపు ఆలోచించాను. నా నిర్లిప్తతని వదిలించుకుని కాలేజీకి వెళ్ళి ప్రిన్సిపల్తో ఈ విషయం మాట్లాడాలి అనుకున్నాను. కానీ అలా చేస్తే, అనవసరంగా నన్ను నేను గోల పెట్టుకున్నట్టవుతుందనిపించింది. ఎటూ తేలని సమస్య ఏం చెయ్యాలో? ఎలా పరిష్కరించాలో? అర్థం కాని అయోమయపరిస్థితి! ఝరి అబద్దాలు చెప్పి మమ్మల్ని వంచిస్తోందన్న నిజాన్ని జీర్ణించుకోలేకపోయాను. ప్రతిక్షణం భారంగా తయారైంది. ఝరి కోసం ఎదురు చూడ్డం తప్పించి ఏం చెయ్యగలను? ఇంత పెద్ద పట్నంలో ఎక్కడుందని వెదకను? ఈ ఆలోచనలన్నీ నా మనసుకి పాకుడులాపట్టి 'సిక్' చేసాయి.

బృహతి పరిస్థితి కూడా అలాగే తయారైంది. వంట అయిందే గానీ ఎవరికీ తినాలనిపించలేదు. మాటవరసకా అన్నట్టు 'భోజనం చేస్తారా?' అనడిగింది బృహతి.

'ఆకలిగా లేదు తర్వాత తింటా' అన్నాను 'నువ్వు తింటావేమిటే?'అని అరణిని అడిగింది బృహతి.

అరణి బుర్ర అడ్డంగా ఊపింది, మా మొహాలు చూసి ఏదో తేడా జరిగిందని అంచనా వేయగల సామర్థ్యం ఉంది దానికి.

●●●

ఎదురు చూసిన క్షణం వచ్చింది. మధ్యాహ్నం రెండుగంటలకి ఏదో పాటని హమ్మింగ్ చేసుకుంటూ వచ్చింది ఝురి. ఇంటికి రాగానే పుస్తకాలు అల్మరాలో పెట్టి 'అమ్మా అన్నం పెట్టవే' అంది. కాళ్ళు కడుక్కోడానికి బాత్రూములోకి వెళ్ళింది. బృహతికి కోపం వస్తున్నా ఆపుకుంది.

నేనే ఆపుకోమన్నాను. నేనే ఝురితో మాట్లాడతానన్నాను. అందుకే కోపాన్ని దిగమింగుకుని సహనంగా ఉంది.

ఝురి కాళ్ళు కడుక్కుని డైనింగ్ టేబులు దగ్గర కూర్చుంది. బృహతి మనసులో జ్వాలాముఖిలా రగులుతున్న టెన్షన్ని నిలదొక్కుకోలేకపోయింది. ఝురితో 'నాన్నగారు పిలుస్తున్నారు వెళ్ళు' అంది.

ఝురి కేజువల్గా 'ఎందుకూ?' అంటూ డైనింగ్ టేబుల్ దగ్గర్నించి లేచి నా గదిలోకి వచ్చింది.

మూడు గంటలనుండీ ఆలోచిస్తున్నా.. ఝురిని ఎలా ఎదుర్కోవాలి? అబద్ధం ఎందుకు చెప్పావు? అని అడిగితే నిజం చెబుతుందా? నిజం చెప్పేదైతే, అబద్ధం ఎందుకు చెబుతుంది.

ఈ ప్రేమ వ్యవహారంలో ఎంతవరకూ కూరుకుపోయింది? నేనేమైనా కోపగించుకుంటే, తను ఎదురు తిరుగుతుందేమో? ఎదురు తిరిగితే చెయ్యాలి? దాని మనసులో ఏముందో? చిన్నప్పుడు రెండు చేతులతోనూ, విసిరి పట్టుకుని ఆడించిన ఝురి కాదు. నిజమే కానీ పదిహేడేళ్ళకే ఎదిరించేటంత ఎదిగిపోతుందంటే నమ్మకం కుదరడం లేదు. ఝురి నన్ను ఎదిరించి మాటామాటా పెరిగితే అందరికీ తెలిసిపోతుంది. ఇంట్లో అద్దెలకి ఉన్న వాళ్ళకి తెలిసిపోతుంది. దానివల్ల నేను అపహాస్యం పాలవుతానేమో? అందరూ నా వెనకే నవ్వుతారు, కానీ సానుభూతి చూపుతారనుకోను. నా పెంపకంలో లోపం ఏమిటి? అందరి పిల్లలాగా ఝురి ఎందుకులేదు? లేక ఝురి పుంజుకుందీ అంటే? ఝురి గురించి నేనూహిస్తున్నవేవీ ఊహలు కావు. అవేవీ ఊహలు కాక నిజాలయితే, దీని చదువుని ఆపేసి ఇంట్లో కూర్చోబెట్టాలి! కట్టడి చెయ్యాలి దీని చదువు ఇక్కడితో ఆగిపోతుందా? చదువాగితే ఎందుకు ఆగిపోయిందని ప్రశ్న? లేనిపోని ఊహాగానాలు, ఎక్కువ గొడవ జరగకుండా నన్ను నేను నిగ్రహించుకుని ఝురి మనసులో మాట రాబట్టాలి, కానీ ఎలా? ఝురి మొండికేసి నిజం చెప్పకపోతే ఏం చెయ్యాలి? ఏదేదో ఆలోచించాను. మారుతున్న విలువలకి కాలానుగుణంగా, ఎంతో ఆదర్శవంతంగా ఝురిని పెంచాలనే నా సంస్కారపు మనస్తత్వాన్ని ఎవరో అవహేళన చేసినట్టూ అనిపించింది. నా ఉదారత్వాన్ని వదులుకుని కఠినంగా వ్యవహరించవలసి వస్తున్నందుకు బాధకలిగింది. ఝురిని కఠినంగా శిక్షించకూడదు. లాలించాలి. విషయం ఏమిటో తెలుసుకోవాలి? తను చేస్తున్నది తప్పు అని నచ్చచెప్పాలి.

ఝురి వింటుంది. నా మాట వినకపోడానికి కారణం, ఏదీ కనిపించడంలేదు, ఇదంతా ఏ స్నేహితురాళ్ళ ప్రోద్భలంతోనో జరిగివుంటుంది. స్నేహ ప్రభావం ఎంతేనా ఉంటుంది. ఝురిని స్వతంత్రంగా వదిలేసి దాని చదువు అది చదువుకుంటోందిలే అనుకోడం పొరపాటు. ఝురి చదువు గురించి ఇతర విషయాలగురించి తెలుసుకుంటూ ఝురితో స్నేహితుడిలా వ్యవహరించాలి.

ఝురి కావాలని తప్పు చేసిందంటే నమ్మబుద్ధి కాలేదు, ఝురిని మందలిస్తే చాలు అని అనుకున్నాను. ఇంకా ఎన్నో అనుకున్నాను.

కానీ ద్వారం దగ్గర ఝురిని చూడగానే, మూడు ఆదివారాలు ఇంట్లో అబద్ధం చెప్పి, నన్నూ, బృహతిని మోసం చేసిందన్న నిజం లావాలా మనసులో పొంగి ఆవేశంతో మంచం దిగి ఝురిని బలంగా లెంపకాయ కొట్టాను. "చదువు పేరుతో నువ్వు వేషాలు వేస్తే మాకెవరికీ తెలియదనుకుంటున్నావా?" అన్నాను. నా చెయ్యి పెళుసుగా ఉంటుంది అంటుంది బృహతి, ఆవేశంలో కొట్టానేమో? ఝురికి

దెబ్బ బలంగానే తగిలింది. పైపెదిమ చిట్లి రక్తం కారింది. అంతవరకూ నా మాటమీద కోపాన్ని నిగ్రహించుకున్న బృహతి 'ఈ పెడబుద్దులెక్కడ వచ్చాయే నీకు' అంటూ ఝరిని తలుపు దగ్గర నుండి గదిలోకి తోసి, పడకగది తలుపుల్ని దగ్గరగా వేసింది.

ఝరిని కొట్టడం వల్ల, ఝరి పెదవి నుండి కారుతున్న రక్తం చూసి ఆవేశం చాలావరకూ తగ్గింది. ఝరిని అనేక ప్రశ్నలు వేసా.. దేనికీ సధానం చెప్పలేదు ఏడుస్తూ నిలుచుంది. "ఇవాళ క్లాసుందా?" అంటే అవునని గానీ కాదని గానీ సమాధానం చెప్పలేదు.

అబద్దం ఎందుకు చెప్పావు అంటే సమాధానం లేదు. రెండు గంటలసేపు నేనూ బృహతి ఝరికి నీతులు బోధించాం. మేము చెప్పిన వాటన్నింటికీ ఝరి 'ఊ' కొట్టడమే గానీ తను ఒక్క వాక్యం మాట్లాడలేదు.

నాలుగు గంటలకి పనిమనిషి వచ్చింది కానీ ఇంట్లో ఎవరూ భోజనం చేసిన లక్షణాలు దానికి కనిపించలేదు. అది కిందకి వెళ్ళింది. ఇంట్లో దుర్గంధం కిందనున్న అద్దెవాళ్ళకి వ్యాపించింది.

మొదటగా మావయ్య మేడమీదకి వచ్చాడు.

"ఏం చిన్నా ఏం జరిగింది?" అంటూ ఏడుపు కళ్ళతో ఝరిని, ఆవేశాలతో ఎర్రబడిన మా మొహాలు చూసి, ఝరి ఏదో కాని పని చేసిందని అర్ధం చేసుకున్నాడు. మావయ్య రాక నచ్చలేదు. "ఏం లేదులే మావయ్యా" అన్నాను. వాతావరణంలో గంభీరతని అర్ధం చేసుకున్నాడు, మావయ్య తను ఈ విషయంలో కలుగచేసుకోవడం నాకిష్టం లేదని గ్రహించాడు. మేడ దిగి వెళ్ళిపోయాడు.

●●●

ఇది జరిగిన తర్వాత ఝరి ఆదివారాలు ఇంట్లోనే ఉంటోంది. మిగతా రోజుల్లో కాలేజీకి వెళుతోంది. కానీ ఈ సమస్య ఇంత తేలికగా పరిష్కారం అయి పోయిందంటే నాకు నమ్మకం కలగలేదు, ఝరి ఏదో దాస్తోంది. ఆదివారాలు మోసం చేస్తున్నావంటే, ఆదివారాలు మాత్రం మోసం చెయ్యడం మానేసి మిగతా రోజుల్లో మోసం చేస్తుందేమో? ఒకసారి నమ్మకం పోయాక, మళ్ళీ నమ్మకం కలగడం చాలా కష్టం. అందుకే ఓ రోజు అకస్మాత్తుగా కాలేజీకి వెళ్ళి ప్రిన్సిపల్‌ని 'ఝరి ప్రోగ్రెస్ ఎలా ఉందని' అడిగాను.

ప్రిన్సిపల్ ఝరి మార్కులు అవీ తీసి 'షి ఈజ్ నాట్ అప్ టు ది మార్క్, షి కెన్ డు బెటర్' అన్నాడు ఝరి నాకొక్కతే కూతురు, కానీ ఆ కాలేజీలో అలాంటి ఆడపిల్లలు ఎంతమంది ఉన్నారో? ఇంక ప్రిన్సిపల్ ఝరి గురించి ఏమీ చెప్పలేడని అనిపించి బైటకి వచ్చేసాను.

కాలేజీ ఎటెండెన్స్ రిజిష్టర్‌లో ఝరి క్లాసులు మానేసిన సూచనలేవీ కనబడలేదు. అయినా ఝరి మీద అనమ్మకం కలగలేదు. జీవితంలో ఏదో అనుకోని ప్రమాదం పొంచి ఉందన్న భయం నన్ను అనుక్షణం వెన్నాడుతోంది. అభద్రతా భావం, భయం, అనుమానం ఇన్నింటి మధ్యా, ఝరి ఇంటర్ పాసయింది. ఇంజనీరింగ్ సీటు రాలేదు బి.యస్.సిలో జాయిన్ అయింది. తోటివారితో కంపీట్ చెయ్యనందుకు ఇంజనీరింగ్ సీటు రానందుకు కొంచెం కూడా బాధపడలేదు. ఝరి అంతా కేజువల్ గా తీసుకుంది. దీనిలో మోటివేషన్ లేదు అనిపించి, సరిపెట్టుకున్నాను.

●●●

అరణి టెన్త్ పాసయింది. స్కూలు ఫస్టు వచ్చింది. ఏదేనా ప్రవేట్ కాలేజీలో కోచింగ్‌కి జాయిన్ చేద్దామనుకున్నాను. అరణి 'వద్దు' అంటూ గవర్నమెంటు కాలేజీలో జాయిన్ అయింది. వీళ్ళిద్దరి చదువులూ ఒక ఒడ్డుకి చేరుకుంటున్నాయనగా నా ఆరోగ్యం చెడింది. కడుపులో విపరీతమైన నొప్పి, ఎన్నో టెస్టులు, ఎంతో డబ్బు ఖర్చు అయాక అది గాస్టిక్ అల్సర్ అని తేల్చారు డాక్టర్లు, ఆపరేషన్ పడుతుంది. అన్నారు. హాస్పటల్లో జాయిన్ అవడం తప్పని సరయింది.

నేను హాస్పటలులో ఉండగా అరణి చేసిన సేవ మరుపురానిది. సాయంకాలం కాలేజీనుండి రాగానే, రాత్రి భోజనం పట్టుకు వచ్చేది. రాత్రి నా రూములో పడుకునేది. నే చెప్పిన కబుర్లు వినేది. రాత్రినే పడుకున్నాక చిన్న టేబుల్ లాంప్ వెలుగులో తన క్లాసు వర్కు చేసుకునేది. పొద్దున్నే లేచి హోటలు నుండి కాఫీ తెచ్చి, తను ఇంటికి వెళ్ళేది. మళ్ళీ రాత్రికి కేరియర్‌తో హాజరు.

అరణి సేవాభావం చూసి, దీన్ని అనవసరంగా తక్కువ అంచనా వేసి కామర్స్‌లో జాయిన్ చేసానా? అనిపించి ఓ రోజు 'తల్లీ మెడిసన్ చదవ్వే' అన్నాను.

కళ్ళెగరేసి చూసింది నన్ను ఆశ్చర్యంగా.

'సబ్జెక్టు మార్చుకో' అన్నాను.

'ఎలా? అంటూ సైగ చేసింది. అంటే దానికి బైపిసి గ్రూపు తీసుకు చదవాలనే కుతూహలం ఉందన్నమాట.

"రేపు క్లినికల్ లేబరటరీకి టెస్ట్‌లకి వెళతాం కదా, మధ్యలో మీ ప్రిన్సిపల్‌కి ఫోన్ చేసి చెపుతా.. అతను నాకు తెలుసులె' అన్నాను.

'ఊహూ'' అన్నట్టు కళ్ళు చికిలించింది. ఈ మధ్య చాలా చిలిపిగా తయారవుతోంది. ఎందుకంటే నాకున్న పలుకుబడి, గురించి బృహతి హాస్యం చెయ్యడం, ఝరి అరణి నవ్వడం నాకు బాగా జ్ఞాపకం.

●●●

మర్నాడు టెస్టులు చేయించుకోడానికి క్లినికల్ లేబటరీకి వెళ్ళాను. నన్ను హాల్లో కూర్చోబెట్టి డబ్బులు పే చేయడానికి వెళ్ళింది అరణి.

హాల్లో కూర్చుని చుట్టూవున్న జనాన్ని చూస్తున్నా.. ఎదురుగా కుర్చీలో ఓ ముదివగ్గు కూర్చున్నాడు. అతనికి సోడాబుడ్డి కళ్ళద్దాలున్నాయి. నల్లటి నలుపు మాసిన తెల్లటి గెడ్డం పొట్టిగా కత్తిరించిన జుట్టు. ముతక ఖద్దరు లాల్చీ, పంచె, చేతిలో కర్ర ఈయన్ని ఎక్కడో చూసాను అనిపించింది. ఎక్కడ చూసానో జ్ఞాపకం రావడంలేదు.

ఆయన పక్కనున్న అమ్మాయి, కౌంటరు ఖాళీ అవగానే, కౌంటరు దగ్గరకెళ్ళి డాక్టరు చీటీ చూపించింది. డాక్టరు రాసిన చీటీలో పేరు స్పష్టంగా లేదేమో, 'పేరేమిటీ' అని అడిగాడు, 'వెంకటరత్నం' అంది ఆ అమ్మాయి.

ఆ పేరు నా మస్తిష్కంలో మెరుపులా మెరిసి, నోటంట అప్రయత్నంగా 'మేష్టారు' అని వచ్చేసింది.

వెంకటరత్నం మేష్టారు అంటే నమ్మబుద్ధి కావడంలేదు. ఎప్పటి మాష్టారు! ఎప్పటి లెక్కలు!

ఎప్పటి జ్ఞాపకాలు మాష్టారికి ఎనభై ఏళ్ళు పైగా ఉండచ్చు వయసులో మార్పు వచ్చిందేమోగానీ, వేషభాషల్లో ఏమాత్రం మార్పు రాలేదు. నేను పలకరిస్తే సంతోషిస్తారు. అన్న ఆలోచన రాగానే, మాష్టారి దగ్గరికి వెళ్ళి 'నమస్కారం మాష్టారూ.' అన్నా..

వెంకటరత్నం మాష్టారు సోడాబుడ్డీ కళ్ళద్దాల్లోంచి నన్ను చూసి 'ఎవరూ కనబడదు, పరిచయం చేసుకోండి' అన్నారు.

నేను ఫలానావారి అబ్బాయిని అని చెప్పాను. మాష్టారు ఆశ్చర్యపోయారు'ఓరి నువ్వా నన్ను బాగానే గుర్తుపట్టావే' అన్నారు.

నాకు ఆనందం వేసింది. 'మీరు లెక్కల్లో చెప్పిన ట్రిక్కులు కూడా గుర్తున్నాయండి' అన్నాను.

'ఆహా' అన్నారు 'ఏమి చేస్తున్నావేమిటి? ' అడిగారు కుతూహలంగా

'ఇక్కడే ఇంజనీరింగ్ కాలేజీలో రీడరుగా ఉన్నానండి' అన్నాను.

'మంచిది నాయనా' అన్నారు అభిమానంగా.

"ఈ ఊళ్ళోనే ఉంటున్నారా మాష్టారూ?" అని అడిగాను.

"ఈ ఊళ్ళోనే ఉంటున్నాను నాయనా, రిటైరైన తర్వాత కొన్నాళ్ళవరకూ ప్రైవేట్లు చెప్పుకునేవాడిని. ఆ తర్వాత కళ్ళకి వచ్చింది. ఓపికా తగ్గింది. ఇప్పుడీ కళ్ళు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. అబ్బాయిని ఒక కన్నేనా ఆపరేషను చేయించారా అంటే, వాడేం మాట్లాడడు ఈ పోయేవయసులో కంటికి ఆపరేషను చేయించి డబ్బు తగలేయడం వాడికి ఇష్టంలేదు. అయినా వాడినని ఏం లాభం, వాడిదీ అంతంత మాత్రం సంసారమే! సంసారం అంతంత మాత్రమే గానీ అవసరాలు ఎన్నెన్నో?, ఇన్నాళ్ళూ కూడూ గుడ్డా ఇల్లూ అవసర వస్తువలనుకునేవాళ్ళం కాని ఇప్పుడు టీ.వీ ఫ్రిజ్, మోటారు సైకిలు అవసరం లిస్టులోకి ఎక్కాయి, ముసలివాళ్ళు కోళ్ళు విరిగిన కుర్చీలాగో, దండెం విరిగిన మంచంలాగో ఓ మూల పాత సామానులతో సమానంగా పడుండవలసిందే

ఆ పెన్షనొచ్చిన రోజు మాత్రం మనవలు అయిదు పది దక్కుతాయని పక్కకి చేరతారు. మిగతా రోజుల్లో పిలిచినా పలకరు. టీ.వీ ముందునుండి కదలరు వాళ్ళకి కథలు అవీ, చెప్పి కాలక్షేపం చేద్దామనే ఆలోచన భ్రమగానే మిగిలిపోయింది. నా పెన్షనే నా ఊపిరి. ఈ మధ్య పెన్షను పెంచి ఎరియర్స్ ఇచ్చారు. అది పట్టుకుని ఒక కంటికేనా ఆపరేషను చేయించుకుందామని నిర్ణయించుకున్నాను. అవెంత వరకూ సరిపోతాయో తెలీదు. రిటైర్ మెంటు వయసులాగే చావుకి కూడా ఓ వయసు పెడితే బావుండును. ఇలా చివికి చివికి చావడం, నాకూ కష్టంగానే ఉంది. మా వాడికీ కష్టంగానే ఉంది. అవసరానికి మించి బతకడం వల్లే తల్లితండ్రులు గౌరవాన్ని కోల్పోతున్నారోయ్! నా సంగతికేంలే నీ విషయం చెప్పు" అన్నారు.

మాష్టారికి నన్ను చూడగానే ఎవరో ఆత్మీయుడిని చూసాననిపించి ఉంటుంది. అందుకే ఆయన బాధంతా ఏకరువు పెట్టారు. ఆయన చెప్పింది వినడం తప్పించి, నేనేం చెయ్యగలను. నేను నా విషయం చెప్పాను.

'చాలా సంతోషం నాయనా, చిన్నప్పుడు మొట్టికాయలు, వేసేవాడిని అవి జ్ఞాపకం ఉన్నాయా?' అన్నారు బోసినోరుతో నవ్వుతూ.

'ఆ జ్ఞాపకం ఉండబట్టే పలకరించానండి' అన్నాను చిరునవ్వు నవ్వుతూ.

'అయినా పలకరించావే, మంచివాడివే'

'అవి జ్ఞాపకం ఉండబట్టే పలకరించానండి' అన్నాను నవ్వుతూ. సోడాబుడ్డి కళ్ళద్దాల్లోంచి, కళ్ళు పెద్దవి చేసి నన్ను చూడ్డానికి ప్రయత్నిస్తూ, గాలిలో తడుముతూ, నన్నుపట్టుకుందామని ప్రయత్నిస్తున్నారు. నేను నా చెయ్యి అందించాను. దాన్ని పట్టుకుని నొక్కి 'నీలాటి వాళ్ళ గురించి విన్నా, చూసినా ఆనందం కలుగుతుందోయ్, జీవితం ధన్యమైనట్టు అనిపిస్తుంది. కానీ జనసముద్రంలో నా శిష్యుల్ని ఎక్కడని వెతకను?' అంటూ ఎందుకూ పనికిరాకపోయిన, కళ్ళల్లో నీరు పెట్టుకున్నారు.

అప్పుడే అక్కడకి వచ్చిన అరణిని దగ్గరగా రమ్మని సైగ చేసాను. అరణి దగ్గరకి వచ్చాక చూపుడు వేలుకింద బొటన వేలుంచి ఎంత డబ్బు ఉంది అనడిగాను. అరణి హేండ్ బేగ్‌లో చెయ్యిపెట్టి డబ్బు బైటకి తీసి లెక్కపెట్టింది. వెయ్యిదాకా ఉన్నాయి. అందులోంచి అయిదొందలు తీసుకుని, నా చేతిలో ఉన్న మాష్టారి చేతిలో అయిదొందలూ పెట్టి 'ఇదుంచండి మాష్టారూ' అన్నాను.

మాష్టారు గుప్పిడి మూసారు.

'మా మనవరాలు ఎక్కడుందోయ్?' అని అడిగారు.

'కౌంటరు దగ్గర ఉంది మాష్టారూ' అన్నాను.

'ఊహూ' అని రొంటి నుండి ఓ డబ్బా తీసి, అందులో నేనిచ్చిన డబ్బు పెట్టి, మళ్ళీ రొంటిన పెట్టుకున్నారు. మాష్టారు డబ్బు పెట్టుకున్న డబ్బా పొడుం డబ్బా! మాష్టారు పొడుం పీల్చేవారు ఇప్పుడు పీల్చడం మానేసినట్టున్నారు.

'మాష్టారూ పొడుం పీల్చడం మానేసారా?' అని అడిగాను.

'ఊపిరి నిలబెట్టుకోవడమే కష్టంగా ఉంది. నాయనా, ఇంక పొడుంకి చోటెక్కడుంది' అన్నారు.

పొడుం కూడా మాష్టారికి లక్జరీ అయిపోయింది, అనుకున్నాను.

నా ఆలోచనలో నేనుండగానే.... మాష్టారు మెల్లగా, 'ఇంతకీ నువ్విచ్చిన లెక్క ఎంతుంటుందేమిటి? ' అని అడిగారు. 'అయిదొందలు మాష్టారూ' అన్నాను. నేను అలా ఎందుకు అడిగారా? అన్న ఆశ్చర్యంతో..

'ఊహూ' అని దీర్ఘం తీసి 'మనకళ్ళే మనని మోసం చేసినప్పుడు ఊరోళ్ళని నిందించి ప్రయోజనం ఏమిటి చెప్పు' అన్నారు.

నేను ఆశ్చర్యంగా మాష్టార్ని చూస్తూ నిలబడ్డాను. నా ఆశ్చర్యాన్ని కనిపెట్టినట్టు. 'చూడు నాయనా ఈ రోజుల్లో చదువుకోడం అన్నదిలేదు. అంతా చదువు 'కొనే' వాళ్ళే, అందులో లెక్కలు ఎవరికి కావాలి! రొక్కం 'కావాలి' అన్నారు.

మాష్టారి వ్యంగ్యానికి నేను ఆనందిస్తుండగానే, వాళ్ళ మనవరాలు ఆయన్ని తీసుకెళ్ళడానికొచ్చింది. మాష్టారు 'వస్తాను నాయనా మంచిది' అంటూ ఆమె వెంట వెళ్ళిపోయారు.

●●●

ఆరోగ్యం అనుకున్న టైముకన్నా ముందుగానే బాగుపడింది. హాస్పటలు నుండి ఇంటికి వచ్చాను. కొన్నాళ్ళ రెష్టు తర్వాత కాలేజీకి వెళ్ళడం మొదలుపెట్టాను.

'ఆపరేషను అదీ సవ్యంగా జరిగి మీ ఆరోగ్యం కుదుటబడితే తిరుపతి వస్తామని మొక్కుకున్నా. ' అంది బృహతి.

తిరుపతి అనేసరికి ఝరి, అరణి కూడా ఉత్సాహం చూపించారు.

నాకు కూడా హాస్పటల్ వాతావరణం, ఆ మనుషులు తిరుగుడు శరీరానికి పట్టిన జాడ్యం వదిలినా, మనసు 'సిక్' అయినట్టనిపించింది. దాన్ని వదలకొట్టుకోవాలి అంటే కాస్త తిరిగి రావడం మంచిది. బృహతి మొక్కు, ఝరి అరణిల సరదా తీరి నా మనసుకి ఆహ్లాదం కలిగించే చోటు తిరుపతి అని అనిపించగానే తిరుపతి ప్రయాణానికి ఏర్పాట్లన్నీ పూర్తిచేసి, తిరుపతి బయలుదేరాం.

●●●

తిరుపతి వెళ్ళి, ఒక లాడ్జి తీసుకుని ఆ రోజు ప్రయాణ బడలిక తీర్చుకున్నాం. మర్నాడు తిరుపతిలో అలివేలు మంగాపురం, గోవిందరాజుల టెంపుల్, కల్యాణ వేంకటేశ్వరుడ్ని, దర్శించి రెండోరోజు పొద్దున్నే బస్సులో తిరుమల చేరుకున్నాం. తిరుమల చాలా హడావిడిగా ఉంది. 'గోవిందా గోవిందా' అంటూ ఎలుగెత్తి వేంకటేశ్వరుడ్ని పిలిచే భక్తుల పిలుపుతో మార్మోగి పోతోంది. తిరుమలలో ఓ కాటేజి తీసుకున్నాం. 'తిరుమలలో మనం నాలుగు రోజులు ఉందాం' అన్నా. అందరూ సంతోషంగా తలలూపారు.

కాటేజీలో సామాన్లు పెటి, ఓ అరగంట సేదతీరి, బయలుదేరి తిరుమల షాపింగ్ కాంప్లెక్స్‌కి వచ్చి ఓ హోటల్లో కాఫీ టిఫిను తినేసరికి అందరికీ ప్రాణాలు లేచివచ్చాయి. నేను బేంకుకి వెళ్ళి సుప్రభాత సేవకి అర్చకులతో పాటు దర్శనం చెయ్యడానికి నాలుగు టిక్కట్లు తెచ్చాను.

మర్నాడు దర్శనం కాబట్టి, ఈ రోజంతా ఖాళీయే, నాలుగురోడ్ల కూడలి దగ్గర ఓ జీపు అద్దెకు తీసుకుని, పాపనాశనానికి వెళ్ళాం. పాపనాశని దగ్గర మోడ్రన్ అవుట్ లుక్‌తో కట్టిన సిమెంటు కట్టడం, స్నానాలకి ఏర్పాటు చేసిన కాంక్రీటు చప్టాను చూసిన తర్వాత, ఏదో లోపించింది అనిపించింది. ఆ లోపించింది ఏమిటి? పవిత్రతా? కాదు పాపనాశనిలో పవిత్రత అంతర్లీనంగా ఉండవచ్చు, మరి లోపించిందేమిటి? సహజత్వం! కొండ అంచులో విస్తరించుకున్న చెట్ల మధ్య కొండ చరియల్లోంచి ధారాపాతంగా పడే పాపనాశని మిస్సయింది.

మరి మిగిలింది. మొజాయిక్ సిమెంట్ చప్టాలు, పెద్ద గోడ దానిపైనుండి, పడు అని ఆర్డరేస్తే విధిలేక పడుతున్న ధారలాగ పాపనాశని. దాని సహజమైన అందాన్ని కోల్పోయింది. నా మనసులో భావాన్ని బృహతి పసిగట్టింది.

'హమ్మయ్య సుఖపడ్డాం. పెళ్ళవకముందెప్పుడో ఒకసారి వచ్చాను. కొండ రాళ్ళమధ్య, ఆ పాకుడు మీద కూర్చుని స్నానం చెయ్యడం చాలా చిరాకనిపించింది. ఇప్పుడు చక్కగా కట్టారు. అందంగా కూడా ఉంది' అంది.

'అందం అన్నది చూసేవాళ్ళ కళ్ళల్లో ఉంటుందా? అర్థం చేసుకునేవాళ్ళ మనసులో ఉంటుందా?' అన్న ప్రశ్న కలిగింది. సహజత్వం అందంగా ఉండదా? ప్రకృతిలో ఉండే సహజమైన పెర్ఫెక్షన్ నాకు నచ్చుతుంది. మనిషి తయారు చేసిన ఈ కాంక్రీటు చప్టా. బృహతికి అందంగా కనబడింది. ఇదంతా మామా సంస్కారాల మీద పెర్సెప్షన్ మీద ఆధారపడివుందేమో?

నా ఆలోచనల్లో నేనుండగానే బృహతి, ఝురి, అరణి కిందకి దిగి దాని ధారకింద కాళ్ళు కడుక్కుని, దోసిటలో కాసిని పట్టి నెత్తిమీద జల్లుకున్నారు. బృహతి దోసిటతో నీళ్ళు తీసుకొచ్చి నా బుర్రమీద చల్లింది. 'నా పాపాలన్నీ పోయినట్టేనా?' అనడిగా నవ్వుతూ. బృహతి చురుగ్గా నన్ను చూసింది. 'నా ఉద్దేశంలో పోయినట్టే' అంది.

'ధన్యుడ్ని' అనుకున్నాను. పాపనాశని దగ్గర నుండి బాలాజీ మందిరంకి వెళ్ళాం. అక్కడినుంచి తిరిగి కాటేజీకి వచ్చేసాం. ఆ రాత్రి తిరుమల అంతా తిరిగాం. ఆ ప్రజల మధ్యలో, పూజల హడావిడిలో, భక్తుల ఆనందంలో తిరుమల చాలా ఆహ్లాదకరంగా ఉంది. దీపాల కాంతిలో మిలమిలా మెరుస్తున్న తిరుమల కలియుగ వైకుంఠంలాగే ఉంది

●●●

మూడోరోజు అందరం తెల్లవారుఝామున లేచి స్నానాలు చేసి గుడికి వెళ్ళేసరికి, సుప్రభాతం మొదలు పెట్టేసారు. సుప్రభాతం పార్టీలో మేముకాక మరో నూటయాభైదాకా ఉంటారు. అందరూ పట్టుబట్టలతో, పట్టుచీరలతో గుడి దీపాల్లో కళకళలాడిపోతున్నారు. నేను సుప్రభాతం పార్టీతో కదులుతూ అందరినీ గమనిస్తున్నాను. భక్తులందరూ తమకేదో ప్రత్యేకమైన అనుభవం జరగబోతోందన్న భావనని మనసునిండా నింపుకుని కదులుతున్నారు.

బృహతికి భక్తి కూడా ఆడంబరమే? సుప్రభాతం పార్టీతో దర్శన చేసాం అని చెప్పుకుంటే గొప్పగా ఉంటుంది అన్న భావనతో కళ్ళు మూసుకుంటూ, అప్పుడప్పుడూ తెరుస్తూ పట్టుచీర సవరించుకుంటూ గర్వం నిండిన కళ్ళతో ముందుకి నడుస్తోంది. ఝురికి ఏకాగ్రత లేదు అందర్నీ చూస్తోంది, గమనిస్తోంది. రెండు చేతులతోనూ చున్నీ సర్దుకుంటోంది, చిన్నగా విసుగు మొహంలో కనిపిస్తోంది. అది ఆకలి వల్ల కావచ్చు, పొద్దున్నే నిద్రలేచినందుకు కావచ్చు. అరణి రెండు చేతులూ జోడించి కళ్ళు మూసుకుని ఏకాగ్రతతో నడుస్తోంది. ఎదుటివాళ్ళు కదిలినప్పుడు, బృహతి అరణిని తట్టి హెచ్చరించవలసి వస్తోంది.

పొద్దున్నే స్వామి ఎంత పుణ్యం చేసుకుంటే, ఇంతమంచి భక్తులు దొరుకుతారు. అనుకున్నా మనసులో, ఎదురుగా వైకుంఠద్వారాలు తెరుచుకున్నాయి. స్వామి దర్శనం అయింది. భక్తి పారవశ్యం ఎంతమందికి కలిగిందో తెలియదు గానీ అందరూ "గోవిందా గోవిందా" అన్నారు. అనడానికి నాకు నోరు పెగల్లేదు సిగ్గేసింది. అరణి అనడానికి నోరేలేదు.!

నిలువెత్తు వేంకటేశ్వరుడి విగ్రహాన్ని దర్శించి, రెండు చేతులూ ఎత్తి నమస్కారం చేసాను.

స్వామి దర్శనం నుండి బయటకి వచ్చి హోటల్లో దూరి టిఫిను చేసాం. మార్కెట్టంతా మూడుసార్లు తిరిగి లాకెట్టులు, పూజకి పనికివచ్చే ఇత్తడి సామాన్లు, వాల్ హేంగింగ్స్ ఏవేవో కొన్నాం. మధ్యాహ్నం భోజనం చేసి కాటేజికి వచ్చి పడుకున్నాం

సాయంకాలం గుడిముందు కూర్చుని గుడికి చేసిన డెకరేషను ధర్మదర్శనం కోసం క్యూలో ఉన్న జనాల్ని చూస్తూ చాలాసేపు గడిపి, మర్నాడు కాళహస్తి వెళ్ళి సాయంకాలం వెనక్కి వచ్చి, ఓ రోజు తిరుమలలో గడిపి అయిదోరోజు బయలుదేరి, వెనక్కి వెళ్ళి పోదాం అని ప్లాను చేసుకున్నాం.

●●●

## 22

**ప్లాను చేసుకున్న ప్రకారం మూడోరోజు** ఉదయం పదిగంటలకి తిరుమల బస్ షాపుకి వచ్చాం, కాళహస్తి బస్సు రావడానికి ఇంకా అరగంట టైముఉంది.

బస్‌షాపులో కూర్చుని ప్రయాణికుల్ని పరిశీలిస్తున్న నేను షాక్ తిన్నాను. దూరంగా బస్ షాపులో ఒక బెంచీమీద కూర్చున్న వ్యక్తి నా చిరపరిచితుడిలా అనిపించాడు. నలుపు తెలుపుగా నెరిసీ నెరియని గెడ్డం, తెల్లని జుత్తూ మాసిన బట్టలు భూతద్దాల్లాంటి కళ్ళద్దాలూ, ఆ వ్యక్తిలో ఎక్కడికీ వెళదామన్న తొందరలేదు. కళ్ళద్దాల్లోంచి బస్ షాపులో ఉన్న జనాన్ని పరిశీలిస్తున్నాడు అతనెవరు?

అతన్నెంతో పరిశీలించిన మీదట వాడు రాజగోపాల్ అన్న అనుమానం వచ్చింది. చాలా ఆశ్చర్యం వేసింది. రాజగోపాల్‌తో కాంటాక్ట్స్ పోయి చాలా యేళ్ళయింది. వాడి సంగతులేవీ తెలియడంలేదు. చాలా రోజుల క్రితం వాడు పి.హెచ్.డి. పూర్తిచేసి కర్ణాటక ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో రీడరుగా జాయిన్ అయాడని తెలిసింది. తర్వాత వాడి గురించి ఏ విషయమూ తెలియలేదు.

చాలాసేపు పరిశీలించిన తర్వాత వాడు రాజగోపాలే, అని నిర్ధారించుకున్నాను. వాడు రాజగోపాల్ అని నిర్ధారించుకోగానే నేను బృహతి వేపు తిరిగి "నాకు కడుపునొప్పిగా ఉంది. విరోచనాలు అయేట్టున్నాయి. నేను రాలేను మీరు కాళహస్తి వెళ్ళిరండి" అన్నా..

"అదేమిటి మీ వంట్లో బాగోలేదా?.. అయితే మేము కూడా వెళ్ళం" అంది బృహతి.

"అలాకాదు మీరు వెళ్ళిరండి. ఇంతదూరం వచ్చి వెళ్ళకపోతే అయ్యో ఇంతదూరం వచ్చి చూడలేకపోయామే అనిపిస్తుంది. నే మందులు కొనుక్కుని, రూముకెళ్ళి మందులు వేసుకుని రెస్ట్ తీసుకుంటాను. నా గురించి ఆలోచించకు" అన్నాను.

బృహతి మర్యాదకి అన్నట్టుగా "మీరు లేకపోతే మేమెందుకూ ఇప్పుడు కాకపోతే మరోసారి వెళతాం" అంది.

ఝురికి మాత్రం తిరగాలని ఉంది, కాళహస్తి వెళ్ళాలని ఉంది. వాళ్ళమ్మకి సైగ చేస్తోంది వెళదాం అంటూ అది గమనించి బృహతితో "నేను కాటేజీకి వెళ్ళి మందు వేసుకుని పడుకుంటాను. మీకు బోరుకొడుతుంది. నా కోసం మీ సరదా ఎందుకు పాడుచేసుకోడం, ఇవాళ ముందేసుకు పడుకుంటే, రేపటికి వంట్లో తేలికగా ఉంటుంది మళ్ళీ తిరగచ్చు. నా గురించి అట్టే ఆలోచించక, మీరు వెళ్ళిరండి" అన్నాను.

బృహతిని ఒప్పించి ముగ్గుర్నీ కాళహస్తి బస్సు ఎక్కించి, బస్సు రోడ్డు మలుపు తిరిగేవరకూ చూసి, బస్సు మలుపు తిరిగాక నేను రాజగోపాల్ వేపు తిరిగాను. వాడక్కడే కూర్చున్నాడు. నేను వాడి దగ్గరకి వెళ్ళి వాడి పక్క బెంచీమీద కూర్చున్నా..

వాడు నన్ను గుర్తుపట్టలేడని తెలుసు. పాతికేళ్ళ క్రితం ఎప్పుడో నన్ను చూసాడు. ఈ మధ్యలో నేను లావయ్యాను.. మొహం కూడా మారింది.

రాజగోపాల్ నన్ను కేజువల్‌గా చూసి. మొహం తిప్పేసుకున్నాడు. రెండు నిముషాలు వాడిని తదేకంగా చూసాను. వాడు రాజగోపాలే నేను పొరబడలేదు. అనుకున్నాను. వాడి వాలకం ఇలా ఎందుకుంది.? వాడు వంటరిగా, పిచ్చివాడిలా ఇక్కడ ఎందుకున్నాడు? ఎన్నో సందేహాలు, ఎన్నో ప్రశ్నలు, అన్నింటికీ వాడొక్కడే సమాధానం చెప్పగలడు? వాడు నన్ను గుర్తుపట్టలేదు. తెలుస్తూనే ఉంది. నేనేవాడిని పలకరిద్దామని నిర్ణయించుకున్నాను.

"మీరు రాజగోపాల్ కదా?" అన్నాను గెడ్డం మనిషితో.

ఆ మాటకి అతను నావేపు తిరిగి, నన్ను రెండు నిమిషాలు పరికించి చూసి, "వోహ్ చిన్నా" అన్నాడు.

అలా అన్న రాజగోపాల్ మొహంలో ఉత్సాహం గాని ఆశ్చర్యం గానీ కనిపించలేదు. నేను వాడి ప్రవర్తనకి ఆశ్చర్యపోయా... ఇన్నేళ్ళ తర్వాత కలిసాం. ఒక అనుకోని సంఘటన జరిగింది. చిన్ననాటి స్నేహితుడిని కలిసానన్న ఆనందం వాడి మొహంలో దివిటీ పెట్టి వెతికినా కనబడలేదు.

"ఏరా ఇన్నాళ్ళకి కలిసాం, ఆనందంగాలేదా?" అన్నాను.

"లేదు" అన్నాడు వాడు ముక్తసరిగా

వాడి ముభావానికి, జడత్వానికి, నా మనసు బాధపడింది. కానీ ఇన్నేళ్ళుగా, నిర్లిప్తంగా ఏదో సంసారిక జీవితం నెట్టుకొస్తున్న నాకు వాడి కలియిక అద్భుతంగానూ, ఎడారిలో నీటిచెలమలాగా కనిపించి, మనసు మురిసింది. సరిలేవాడికెలా ఉంటే నాకేమీ రోజంతా వాడితో గడిపి, వాడి గురించి వివరాలు తెలుసుకుందామనుకున్నాను.

"నాకు మాత్రం చాలా ఆనందంగా ఉందిరా" అన్నాను.

తన భూతద్దంలాంటి కళ్ళజోడులోంచి నన్ను దీర్ఘంగా చూసాడు. దూరంగా ఉన్న వేరుశెనక్కాయలవాడిని పిలిచాడు.

"ఓ పదిరూపాయల వేరుశెనగకాయలు ఇవ్వు" అన్నాను.

తన భూతద్దంలాంటి కళ్ళజోడులోంచి దీర్ఘంగా చూసాడు. దూరంగా ఉన్న వేరు శెనగకాయలు కొలిచి, పొట్లంలా మడిచి వాడికి ఇచ్చాడు.

నేను రాజగోపాల్‌ని చూస్తూ కూర్చున్నాను. పొట్లం పుచ్చుకుని నన్ను చూసి "ఆనందంగా ఉంది అన్నావు కదా వాడికి పదిరూపాయలిచ్చుకో" అన్నాడు.

నేను నవ్వుతూ జేబులోంచి పర్సు తీసి, అందులోంచి పదిరూపాయలు తీసి వేరుశెనగకాయలవాడికి ఇచ్చాను.

రాజగోపాల్ పొట్లాం విప్పి, ఇద్దరికీ మధ్యగా బెంచీమీద పెట్టి, 'ఇప్పుడు శనక్కాయలు తిను'. అని, తను శనక్కాయలు ఒలుచుకుని తినడం మొదలుపెట్టాడు.

నే శనక్కాయలు వొలుస్తూనే "ఎక్కడికి వెళుతున్నావురా?" అని అడిగా...

"వచ్చిందగ్గరకి" అన్నాడు నవ్వుతూ.

"ఉత్తరాలు రాయడం మానేసావేం" నా ప్రశ్న.

"ఉత్తినే రాయడం ఎందుకని మానేసాను" వాడి ప్రాస జవాబు.

"స్నేహలత ఎలా ఉంది?"

"స్నేహలతనే అడుగు."

"ప్రస్తుతం ఎక్కడ ఉద్యోగం?"

"అది అప్రస్తుతం"

"ఏం?" నా ఆశ్చర్యం.

"ఉద్యోగం వదిలేసి మూడేళ్ళయింది"

"ఉద్యోగం వదిలేసి ఏం చేస్తున్నావు?"

"శనక్కాయలు తింటున్నాను. రుచిగా ఉన్నాయి."

"పెళ్ళి, పిల్లలు కబుర్లు చెప్పరా, నీ గురించి వినాలని ఉంది" అన్నాను.

వాడు మళ్ళీ వాడి భూతద్దాల్లాంటి కళ్ళజోడులోంచి నన్ను చూసాడు.

"ముసలిదైై నీ జీవితం పడుచు గుండెతో భయపెడుతోందేమిటిరా?" అనడిగాను. నా అస్త్రం పనిచేసింది. వాడి మొహంలో వెలుగు కనిపించింది.

"నీకింకా నా కవిత్వం జ్ఞాపకం ఉందన్నమాట" అన్నాడు నవ్వుతూ.

అదే సమయం అనుకుని "చెప్పరా ఎందుకిలా ఉన్నావు. ఆ గెడ్డం మీసాలేమిటి? ఇక్కడికెప్పుడొచ్చావ్ ? ఎవరితో వచ్చావ్? విషయాలు చెప్పరా?" అనడిగాను. వాడ్ని బుజ్జగిస్తున్నట్టుగా..

"చెపుతాలే మధ్యాహ్నం భోజనం మొదలైవుంటుంది. వెళదాం పద" అన్నాడు

"ఎక్కడికి?" అన్నా..ఆశ్చర్యంగా.

"స్వామివారి భోజనశాలకి ఫ్రీగా భోజనం పెడతారు పద" అన్నాడు. బెంచీ మీంచి లేస్తూ.

"దర్శనం చేసుకున్నవారికి ఫ్రీ టిక్కెట్టు" అన్నా..

"ఫర్వాలేదు చాలా మంది తినరు. మనం అడిగితే ఇచ్చేస్తారు పద" అన్నాడు.

నాకాశ్చర్యం వేసింది. వీడు భోజనానికి కూడా కక్కుర్తిపడేలా ఉన్నాడంటే, నమ్మబుద్ధివేయలేదు. అసలేం జరిగింది? వీడెందుకిలా తయారయాడు. పన్నెండువేల రూపాయలొచ్చే ఉద్యోగం ఎందుకు వదిలేసాడు? నాకు వాడి విషయం తెలుసుకుందామని చాలా ఆతృతగా ఉంది. కానీ వాడు ఏ విషయం అంత తేలికగా చెప్పేట్టులేడు ఏం చెయ్యాలి? అన్న ఆలోచన బుర్ర తొలిచేసింది. ముందు వాడి భోజన సమస్య తీరిస్తే వాడు స్థిమితపడతాడు అనిపించి...

"ఆ భోజనం సంగతి ఒదిలేయ్, హోటల్లో భోజనం చేద్దాం" అన్నాను.

"సరే పద" అన్నాడు బెంచీమీంచి లేస్తూ.

నేను కూడా వాడితో పాటు లేచాను. వేరు శనక్కాయల కాగితాన్ని తొక్కలతో సహా డస్ట్ బిన్‌లో పడేసి, వాడి వెనకాలే హోటలుకి వెళ్ళాను. ఇద్దరం భోజనం చేశాం. భోజనం చేస్తున్నంత సేపూ నా గొడవంతా చెప్పాను వాడికి, అంతగా చెప్పవలసిన అవసరం లేదు వాడే నేను, నేనే వాడు. అప్పటికి మధ్యాహ్నం పన్నెండయింది.

"పద కాటేజికి వెడదాం" అన్నాను.

"పద" అని బుర్రూపుతూ, నాతో కాటేజీకి వచ్చాడు.

"లుంగీ కట్టుకుంటావా?" అన్నా..

"అబ్బే ఇలాగే బావుంది" అన్నాడు.

నే లుంగీ కట్టుకున్నాక, బెడ్ రూములోకి వెళ్ళాము, నేనో మంచం మీద పడుకుని, వాడికి ఇంకో మంచం చూపించాను. "కాసేపు పడుకో సాయంకాలం, మాట్లాడుకుందాం." అన్నాను.

వాడు వాడి సోడాబుడ్డి కళ్ళద్దాలలోంచి నన్నే చూస్తున్నాడు, సమాధానం చెప్పలేదు.

"ఇంకో దిండు కావాలా?" అనడిగాడు.

"వద్దు" అంటూ మంచం మీద పడుకుని కళ్ళకున్న కళ్ళజోడు తీసి దిండు పక్కన పెట్టి, దిండుకి తల ఆనించి కళ్ళుమూసుకున్నాడు.

మూడురోజులుగా అటూ ఇటూ తిరుగుతున్నానేమో! ఈ రోజు దొరికిన అవకాశానికి మనసు కుదుట పడింది. దిండు మీద తల ఆన్చగానే నిద్రవచ్చేసింది.

●●●

ఎవరో తట్టిలేపినట్టుగా తెలివొచ్చింది. కళ్ళు తెరవగానే భగ్గున మండాయి. బద్ధకం తీరడానికా అన్నట్టు మళ్ళీ దిండుకి ఆనుకుని పడుకున్నాను. అప్పుడు జ్ఞాపకం వచ్చాడు, రాజగోపాల్.

నిద్రమత్తు పూర్తిగా వదలిపోయింది. మంచం మీంచి లేచి రాజగోపాల్ పడుకున్న మంచం చూసాను. రాజగోపాల్ మంచం మీద లేడు. వాచీ చూసుకున్నా.. నాలుగు గంటలు కావస్తోంది. అంటే మూడున్నర గంటలు ఆదమరచి నిద్రపోయానన్నమాట. రాజగోపాల్ నా కన్నా ముందు లేచి, వరండాలో కూర్చుని ఉంటాడు అనుకుని టేబులు మీదున్న కూజాలోంచి గ్లాసులోకి నీళ్ళు వంపుకుని, తాగి బైటకి వచ్చాను. కాటేజీ తలుపులు దగ్గరగా వేసివున్నాయి. వెళ్ళి తలుపులుతీసి చూసాను. బైట వరండాలో ఎవరూ లేరు, లోపలికొచ్చి బాత్రూములో వెదికాను. రాజగోపాల్ అక్కడాలేడు. కాటేజంతా ఖాళీగా ఉంది. రాజగోపాల్ చెప్పాచెయ్యకుండా వెళ్ళిపోయాడా? లేక ఏదేనా పనుండి వెళ్ళాడా? మళ్ళీ వస్తాడా? రాడా?

ఎన్నో ఆలోచనలు! తలదిమ్ముగా ఉండడంతో టేబులు మీదున్న పర్సు, జేబులో వేసుకుని కాటేజీకి తాళం వేసి, కాటేజీలకి పక్కగా రోడ్డుమీదవున్న టీ దుకాణంకి వెళ్ళి, టీష్టాలులో టీ తాగి, సిగరెట్టు వెలిగించాక, మనసు కుదుట పడింది. రాజగోపాల్ ఏ విషయమూ చెప్పకుండా ఎందుకెళ్ళిపోయాడు.. చెప్పడానికి ఏం లేదనుకున్నాడా? లేక చెప్పుకోడానికి నామోషీ ఫీలయ్యాడా? అని ఆలోచిస్తూ టీష్టాలు వాడికి డబ్బులివ్వడానికి పర్సు తెరిచాను. అందులో చిల్లరనోట్లు మాత్రమే ఉన్నాయి.

పొద్దున్న కాళహస్తి వెళుతున్నప్పుడు పెట్టిలోంచి రెండువేలరూపాయలు తీసి పర్సులో పెట్టాను. నేను కాళహస్తి వెళ్ళను అని అనుకోగానే, వెయ్యిరూపాయలు తీసి బృహతికి ఇచ్చాను. మిగతా వెయ్యి పర్సులో ఉండాలి. అందులో మధ్యాహ్నం భోజనానికి డెబ్బై అయిదు రూపాయలదాకా అయాయి, వందరూపాయల నోటు హోటలు వాడికి ఇచ్చాను. వాడిచ్చిన చిల్లర నోట్లు, తొమ్మిది వందరూపాయనోట్లు ఉండాలి. తొమ్మిది వందరూపాయల నోట్లు లేవు. కాటేజీలో ఎక్కడేనా పడిపోయాయేమో అని, టీష్టాలు వాడికి డబ్బులు చెల్లించి గబగబా నడుచుకుంటూ కాటేజీకి వచ్చి, కాటేజీలో నేలమీద, పక్కలమీద, అంతా వెదికాను. ఎక్కడా డబ్బు కనబడలేదు.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది. పర్సు టేబులు మీద ఉండగా తీసానని. పేంటు జేబులో పెట్టుకున్న పర్సు టేబులు మీదకెలా వచ్చింది? టేబులు మీద చూసాను. టేబులు మీద నా డైరీ ఉంది. నా పెట్టిమీద ఉండే డైరీ టేబులు మీదకి ఎలా వచ్చింది? డైరీలో నా పెన్ను సగం పైకి వచ్చి వత్తు పెట్టినట్టుగా ఉంది.

డైరీ తీసి మధ్యగా పెట్టిన పెన్నుని తీస్తూ ఆ పేజీలోకి చూసాను. ఆ పేజీలో ముత్యాల్లాంటి రాజగోపాల్ అక్షరాలు కనిపించాయి. నా కళ్ళు అప్రయత్నంగానే వాటివెంట పరిగెత్తాయి.

**ఒరేయ్ చిన్నా**

నీ పర్సులో తొమ్మిది వందలరూపాయలు నేనే తీసాను. వెళ్ళిపోతున్నాను. ఈ డబ్బు నువ్వు నాకు వట్టినే ఇవ్వలేదు. చాలా ఏళ్ళక్రితం నేను నీకు విశాఖపట్నం మెయిన్ రోడ్డుమీద జీవితంలో ఏదేనా ఎలా సాధించాలో దానికి అడ్డువచ్చేవారిని నిష్కర్షంగా ఎలా తప్పించాలో జీవితంలో సెల్ఫ్ లేదా అహం: ఎంత ముఖ్యమో! బోధించాను. నీలో అహం మేల్కొంది దానితో నువ్వూ కొంత సాధించావు.

కానీ తర్వాత అలసిపోయావు. చతికిలపడ్డావు. నువ్వు చేసే ప్రతీ పనీ కలిసి రావాలనుకునే నీ అహం దెబ్బతింది. అన్ని సమయాల్లోనూ కలిసిరాక, తపించిపోయావు. కలిసిరానప్పుడు, చతికిలబడి ఇదంతా ఇతరుల స్వార్థప్రకృతని అదిపోతేకానీ లోకం బాగుపడదని వాపోయావు. చతికిలపడ్డవాడికి ఈ లోకంలో శాంతి కరువైపోతుంది.! అనే నువ్వూ రుజువు చేసావు.

నా గురించి తెలుసుకుందామని నీ ప్రయత్నం. ఎందుకో తెలుసా పోల్చి చూసుకోడానికి తప్పదు నీ ప్రకృతి నీకు తెలీదు. నీలిమిటేషన్స్‌ని నువ్వు అర్థం చేసుకోలేదు. నువ్వేకాదు నేను కూడా... మనచుట్టూ ముసురుకున్న జనంకూడా అర్థం చేసుకోలేదు. ***మనం ఆశించినంత మనం పొందడం లేదనే దిగులు, మనలో ప్రవేశించినప్పుడు, అశాంతి మొదలవుతుంది. అది మనల్ని బతకనివ్వదు.***

ప్రతీ నిముషం పక్కవాడు మనకన్నా బాగా బతికేస్తున్నాడేమో? అన్న డౌటు, మనల్ని నిలవనివ్వదు. నీ జీతం నా జీతం నీ రాబడి నా రాబడి నీ భార్యా నా భార్యా నీ పిల్లలూ నా పిల్లలూ నీ ఆస్తులూ నా ఆస్థులూ ఇలా ఒకటేమిటి అన్నీ చెప్పగలిగితే నా జీవితంలో ప్రతిక్షణం తెలుసుకుని, నీ జీవితంతో పోల్చి చూసుకుందామనే నీ ఆరాటాన్ని చూస్తోంటే! నాకు ఆశ్చర్యం వేస్తోంది. దేనికి ఈ పోలికలు? నీ జీవితం బావుంటే ఆనందిస్తావేమో? బాగులేకపోతే విచారిస్తావా? లేదు! ఎందుకో తెలుసా విచారించి చెయ్యగలిగింది ఏంలేదు కాబట్టి!

నా భార్య నీ భార్యకన్నా అందకత్తె అవుతే నువ్వు నీ భార్యని వదిలెయ్యలేవు. నీ పిల్లలు నా పిల్లలకన్నా చదువుతక్కువవాళ్ళూ, బుద్దిహీనులూ అని తెలిస్తే మరుక్షణం వాళ్ళని రోడ్డుమీద వదిలెయ్యవు. నీ జీతం కన్నా నా జీతం ఎక్కువైతే, నీ ఉద్యోగం వదిలెయ్యవు. అయినా నీకు నా ఇన్‌ఫర్మేషను కావాలి నా వివరాలు కావాలి. పోల్చిచూసుకుని నీ ఫెయిల్యూర్స్‌ని సమర్థించుకోడానికి, వాటన్నింటికీ కారణం. నీ చుట్టుపక్కల మనుషులని, పరిస్థితులని, నీకు నువ్వు నచ్చచెప్పుకు తప్పించుకుపోయే నీ అహాన్ని జోకొట్టడానికి, నేను సముద్రపు ఒడ్డున బాలమురళీకృష్ణ పాటపాడేవాడిని.. గుర్తుందా? "ఏటిలోని కెరటాలు ఏరువిడిచిపోవు, ఎదలోపలి మమకారం ఎక్కడికీ పోదూ" అంటూ, ఎదలోపలి మమకారం అంటే మనకి ఎదుటివాళ్ళ మీద ఉండే మమకారం, అని కవి ఉద్దేశం కాబోలు కాని కాదు, మనికి మనమీద ఉండే మమకారం మనకి తెలియకుండా మన నీడనే మనం విపరీతంగా అభిమానించడం ఆరాధించడం చేస్తాం. ఇది బుద్దిజీవుల్లో మరీ గాఢంగా ఉంటుందని నా అభిప్రాయం. అయితే ఎందుకిదంతా? దేనికోసం ఈ పాకులాట! పోల్చి చూసుకు బావుంటే ఆనందం బాగులేకపోతే ఏడుపు దేనికి?

ఎవరి జీవితమేనా మన జీవితానికి ప్రేరణ ఇస్తుందని మాత్రం వారి విషయాలు తెలుసుకోము. అలా తెలుసుకుని ప్రేరణ పొందే రోజులు గడిచి పోయాయి. ఇంక ఎవరిదారి, వాళ్ళు వెతుక్కోవలసిందే, మన భావాలకి మన ప్రవర్తనకి సమన్వయం కుదరటం లేదు కదూ! దాన్నే హిపోక్రసీ అంటామా? దాన్నొదిలేసి జీవించడం కష్టంకాదు. సులభం ఎంతమాత్రమూ కాదు.

నీలో అంతో, ఇంతో అంతర్లీనంగా ఉన్న భావజగత్తుకి, ఈ స్థూలజగత్తుకి, అంటే మెటీరియలిస్టిక్ ప్రపంచానికి చాలా తేడా ఉంది. నువ్వు ఇటుఒడ్డుకి, అటు ఒడ్డుకి సమానదూరంలో ప్రవాహం మధ్యలో ఉన్నావు. నీలో ఒకవిధమైన నిజాయితీ మేల్కొంటేగానీ, నీకేవొడ్డూ కనబడదు. కనబడని దాన్ని చేరుకోలేవుకూడా. నా ఉద్దేశంలో నువ్వు ఏ వొడ్డుకి చేరుకున్నా పర్వాలేదు ప్రవాహం మధ్యలో, కన్‌ఫ్యూషను ఊబిలో కూరుకుపోకు.

మీ అమ్మగారు చనిపోయినప్పుడు జరిగిన విషయాలు చెప్పావు అక్కడనీ విల్ పవర్‌ని అంతర్లీనంగా ఉన్న స్వార్థం వశపర్చుకుంది. మీ అత్త నీకు లొంగకపోయేసరికి, మరి ఆవిడ మొహం చూడలేదు. నీ "విల్ పవర్" ఉపయోగపడింది. రవళి విషయంలో ఎవరో మహానుభావుడు చెప్పినట్టే జరిగింది. "యవ్వనం పెద్దపొరపాటు, నడివయస్సు ఒక భయంకర సంఘర్షణ, వార్ధక్యం ఒక పెద్ద చింత" భలే! వార్ధక్యంలోకి పోయి చింతపడకుండా చూసుకో!

అలాగని నిన్ను నువ్వు తృణీకరించుకుని, ఏదో కొత్త అర్థాలు వెతక్కు, అలా చేసిననాడు నువ్వు ఏదో "పోజు" కొడుతున్నావని అందరూ అపోహపడే అవకాశం ఉంది, అదే జరిగింది కూడా నీ సూపరెంటెండెంట్ ఇంజనీరుకి నీ హాఫ్‌హార్టెడ్ నైతికత చికాకేసి ఉంటుంది అందుకే నీ ఉద్యోగం ఊడేంత హంగామా జరిగింది, ఊడిందికూడా..

నువ్వు చెప్పినవన్నీ బేరీజు వేసిం తర్వాత, నీ జ్ఞానం నిన్ను ముందుకి నడిపించాలనే పిచ్చి వ్యామోహంలో ఉన్నావనిపిస్తోంది. అంతకన్నా నీ తత్వం నీకు మార్గదర్శకమవాలని కోరు. నీలో జ్ఞానం అనే చీకటి కోణంలోకి తొక్కేసిన నీ తత్వాన్ని గుర్తించు, దాన్ని గుర్తించిననాడు, నిన్ను పట్టుకు పీడిస్తున్న అనేక జాఢ్యాలు వదిలేస్తాయి.

సరిలే, నా జీవితం గురించి అడిగావుకదూ, చెప్పే ఓపిక లేదు, అందుకే రాస్తున్నాను.

స్నేహలత జర్మనీ వెళ్ళిపోయేవరకూ జరిగినదంతా నీకు తెలుసు. స్నేహలత జర్మనీ వెళ్ళిపోయాక నన్ను నేను నిలదొక్కుకోలేకపోయాను. ఓ ఏడాదిపాటు ఇంటికి బెంగుళూరుకి తెగతిరిగాను. ఏ పనీ చెయ్యలేకపోయాను.

ఇంటి దగ్గర అమ్మ నాలో వ్యాకులతని, అశాంతిని గమనించింది. పెళ్ళిచేసుకోరా అంటూ ప్రపోజ్ చేసింది. "ఈ పి.హెచ్.డి." అవనీ అంటూ తప్పించుకున్నాను. ఏడాది తర్వాత మనసు కుదుటపడింది. స్నేహలత మరుగున పడింది.

ఓ ఏడాదిపాటు బెంగుళూరు నుండి కదలకుండా, పి.హెచ్.డి. పూర్తి అయింది అనిపించా... బెంగుళూరులోనే ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో రీడరుగా ఉద్యోగం వచ్చింది.

జీవితం గాడిలో పడింది అనుకున్నా.. అలా పడ్డం పైవాడికిష్టంలేదనుకుంటా! మూర్తి పెళ్ళికార్డు వచ్చింది. మూర్తి మాకు దూరపు బంధువవుతాడు. మూర్తి పెళ్ళికార్డుతోపాటు నాన్నగారి ఉత్తరంకూడా వచ్చింది. తనకి అమ్మకి ఒంట్లో నలతగా ఉంటోందని, పెళ్ళికి ఎవరూ వెళ్ళకపోతే బావుండదని పెళ్ళికి వెళ్ళి రిటర్న్‌లో గుంటూరు రమ్మని రాసారు. నాకు పెళ్ళికి వెళ్ళడం ఇష్టంలేదు కాని నాన్నగారు ఎప్పుడూ ఇలా రాయలేదు. అందుకే కష్టమైనా సరే అనుకుని, పదిరోజులు కాలేజీకి శలవు పెట్టి, పెళ్ళికి బయలుదేరాను.

పెళ్ళికి వెళ్ళాలంటే రాజమండ్రిలో దిగి, బస్సు ఎక్కి సీతానగరం వెళ్ళాలి. రాజమండ్రిలో ట్రైయిను దిగి, ఆర్.టి.సి కాంప్లెక్స్‌కి వెళ్ళి అక్కడ బస్ ఎక్కి సీతానగరం వెళ్ళాను. నేను సీతానగరం చేరుకునేసరికి చీకటి పడింది. అడ్రసు పట్టుకుని ఆడపెళ్ళివారింటికి వెళ్ళాను. అక్కడ విడిది వివరాలు తెలుసుకుని, విడిదికి వెళ్ళాను. విడిదిలో నన్ను గుర్తించగలవాళ్ళు చాలా తక్కువమంది ఉన్నారు. నేను తిన్నగా మూర్తి దగ్గరకు వెళ్ళా..

మూర్తి నన్ను చూసి లేచి వచ్చాడు. ఆప్యాయంగా చెయ్యిపట్టుకుని "రావేమోననుకున్నాను, వచ్చావన్నమాట? ఎన్నాళ్ళయిందో నిన్ను చూసి, గుంటూరునుండి వచ్చావా? బెంగుళూరినుండి వచ్చావా?" అనడిగాడు. నేను నవ్వుతూ బెంగుళూరినుండి డైరెక్టుగా వస్తున్నాను అని జవాబు చెప్పాను.

అప్పుడు మూర్తి అక్కడ కూర్చున్న ఒక పాపని పిలిచి "భావనని పిలుచుకురా" అంటూ పంపాడు భావన వచ్చేలోగా తన గురించి తన ఉద్యోగం గురించి వివరాలన్నీ చెప్పాడు.

నా వివరాలన్నీ అడిగాడు మేమిలా మాట్లాడుకుంటుండగా భావనని పిలవడానికి వెళ్ళిన పాప భావనని వెంటబెట్టుకు వచ్చింది.

అదే మొదటిసారి చూడ్డం భావనని. మూర్తి భావనని పరిచయం చేసాడు. నేను నమస్కారం చేసాను, మూర్తి నన్ను భావనకి పరిచయం చేస్తూ, వీడు రాజగోపాల్, నాకు కజిన్ అవుతాడు" అన్నాడు భావన "హాయ్" అంటూ నాజూగ్గా పలకరించింది.

భావన పేరుకి తగ్గట్టు భావనాత్మకంగా ఉంది. మంచి మెరుపున్న శరీరచ్ఛాయ, సోగకళ్ళు, ముత్యాలు అమర్చినట్టు పలువరుస ఎర్రచిగురుటాకుల్లా పెదాలు శిల్పిచెక్కిన కళాకృతిలా శరీరాకృతి చూసేవాళ్ళకి సిగ్గుజ్ఞాపకం రాదు. సిగ్గుజ్ఞాపకం వచ్చి తలతిప్పిన వాళ్ళకి ఇంకా సరిపోదు మళ్ళీ మరోసారి చూడాలనిపిస్తుంది.

నేను భావనని పరిశీలిస్తుంటే, మూర్తి "భావనా..! రాజగోపాల్‌ని స్నేహితులకోసం ఉంచిన గదిలోకి తీసుకెళ్ళు, స్నానం చేసాక పెళ్ళివారింటికి తీసుకెళ్ళి భోజనం ఏర్పాట్లు చూడు. మా వాడికి ఆతిథ్యం సరిగా జరిగేటట్టు చూడడం నీ బాధ్యత" అన్నాడు.

భావన నవ్వుతూ తలఊపింది. నన్ను విడిదిలో వేరేగా ఉన్న గదిలోకి తీసుకెళ్ళింది. గదికి ఆనుకుని వెనకగా ఉన్న పెరడులో స్నానాలగది ఉందని చూపించింది.

"మీరు స్నానం చేసి తయారవండి నేను అరగంటలో వస్తాను. ఆడపెళ్ళివారికి మీ గురించి చెప్పి వస్తాను" అంటూ మెరుపులా మాయమైంది. నేను బుద్ధిమంతుడిలా తలూపి, స్నానానికి తయారయాను.

●●●

## 23

**నే స్నానం చేసి డ్రస్ మార్చుకునేసరికి,** భావన ఆడపెళ్ళివారింటి నుండి వచ్చింది. "ప్రస్తుతానికి ఉప్మా తింటారా? తొమ్మిది గంటలకి భోజనం చేద్దురుగాని" అంది.

"అలాగే" అన్నాను నన్ను ఆడపెళ్ళివారింటికి తీసుకువెళ్ళింది. అక్కడ మూర్తి నాన్నగారు కనిపించారు. "ఏమోయ్ ఎప్పుడు వచ్చావంటూ" ఆప్యాయంగా పలకరించారు.

నేను మొహమాటపడుతూ ఏదో నసిగాను. భావన నన్ను తీసుకెళ్ళి పెళ్ళివారింట్లో పందిరికింద టేబుల్స్ దగ్గర కూర్చోబెట్టింది. లోపలి నుండి ఎవరో వంత బ్రాహ్మడు ప్లేటుతో ఉప్మాతీసుకొచ్చి నా ముందు పెట్టాడు. భావన లోపలినుండి స్టీలుగ్లాసుతో కాఫీ తీసుకొచ్చింది. నేను టిఫిన్ తిని కాఫీ తాగాక

"మీరు ఇక్కడ కూర్చుంటారా? విడిదిలోకి వెళతారా?" అనడిగింది.

"విడిలోకి వెళతాను, థాంక్యూ" అన్నాను.

"దేనికి?" అంది ఆశ్చర్యంగా.

"చక్కని ఆతిథ్యానికి" అన్నాను.

"యు ఆర్ వెల్ కమ్" అంది, నవ్వుకుంటూ పెళ్ళివారింటిలోకి వెళ్ళిపోయింది.

భావన 'యు.ఆర్ వెల్ కమ్" అన్న స్టైలు చూసి, 'కాన్వెంట్ బర్డ్‌లా' ఉందే అనుకున్నా

●●●

ఆ రాత్రి మగపెళ్ళివారి అందరితో కలిసి భోజనం చేసాను. మూర్తి స్నేహితులెవ్వరూ రాలేదేమో, రూము ఖాళీ, మంచి నిద్రపట్టింది.

మర్నాడు విడిదంతా హడావిడిపడుతుండగా, కప్పులెగిరిపోయేటట్టు వాయిస్తున్న బేండుమేళానికి తెలివి వచ్చింది. విడిదిలో స్నాతకం జరుగుతోంది. రాత్రికి పెళ్ళి జరుగుతోంది. రాత్రికి పెళ్ళి! మూర్తి అక్క వచ్చి "లేచారా? తొందరగా తయారవండి ఎదురు సన్నాహం ఉంది" అని చెప్పి మాయమైంది.

తయారై బయటికి వచ్చి విడిది పందిట్లో కూర్చున్నాను. ఎవరో కాఫీ టిఫిను అందించారు. నా కళ్ళు భావనని వెదుకుతున్నాయి. మెరుపు తీగ యే కలరు ధరించిందా? అని ఆలోచిస్తున్నాను.

ఎదురు సన్నాహం పూర్తయి, ఆడపెళ్ళివారింటికి చేరేక, శుభలేఖలు చదవడం పూర్తయింది అనిపించాక, "ఇదిగో పానకం" అంటూ పానకం గ్లాసు అందించింది భావన, అప్రయత్నంగా పానకం గ్లాసు అందుకున్నాను. కళ్ళముందు మెరుపుమెరిసినట్లయింది. స్నఫ్ కలర్ సారీలో విచిత్రంగా హుందాగా ఉన్న భావన్ని చూస్తూ, ఆమె కదలికలో వేగాన్ని గమనిస్తూ, ఆమె నవ్వులోంచి కురుస్తున్న వెన్నముద్దల చల్లదనానికి, మైమరుస్తూ చాలా సేపు ఆ పందిరి కిందే గడిపాను.

చాలా సేపటి తరువాత అందరూ లేచి వెళ్ళిపోయారు. ఇంక భావన కనబడదని అనిపించాక, లేచి విడిదికి వచ్చా.

నేను విడిదికి వచ్చేసరికి మూర్తి స్నేహితులందరూ వచ్చినట్టున్నారు. నేనంటున్న గదిని ఆక్రమించేసారు. గదినిండా సిగరెట్టు పొగ విస్తరించుకుని, నన్ను ఇబ్బంది పెట్టింది.

కొంతమంది పేకాట వేసారు. వాళ్ళ నవ్వులు జోకులు భరించలేక విడిదిలోంచి బైటకి వచ్చి, విడిది ముందు వేసిన పందిరికింద కూర్చున్నా వేసవి నిప్పులు చెరుగుతోంది. నిప్పుల్ని లెక్కచెయ్యకుండా ఆడమగ పెళ్ళివారు రంగు రంగుల పట్టు చీరలు కట్టుకుని హడావిడిగా అటూ ఇటూ తిరిగేస్తున్నారు.

ఆ హడావిడిలోంచి విడి భావన నా దగ్గరకి వచ్చి పలకరించింది. నా ఒంటరితనానికి చింతించింది. సాయంకాలం మామిడితోటలోకి తీసుకెళతానని మాటిచ్చింది.

భావన సాయంకాలం తోటలోకి తీసుకెళతానని చెప్పిందగ్గర్నుండి కాలం స్థంబించిందా అన్నట్టు, వాచీలో ముల్లులు మెల్లగా తిరుగుతున్నాయి. రోజులో ఒకే సాయంకాలం పెట్టినందుకు, పైనున్న వాడిమీద కోపం వచ్చింది.

నే సాయంకాలం కోసం కలలు కంటుంటే, సందేశం ఏదేనా ఉందా అంటూ మేఘాలు కమ్మేసాయి. గాలి మారిపోయింది. వాతావరణం చల్లబడింది. చిన్న జల్లులతో మొదలై ఫెళఫెళా రావాలతో వో దుక్కి వర్షం కురిసింది.

ఉదయం నుండి కాసిన ఎండకి తపిస్తున్న శరీరం చల్లగాలికి తుంపర జల్లులుకి సేదతీరింది. చిన్నపిల్లలందరూ, చప్పట్లుకొడుతూ, వానలో తడుస్తూ, గెంతడం మొదలుపెట్టారు. వాళ్ళని కసుర్తూ లోపలికి తీసుకొద్దామని వానలోకి వెళ్ళిన పెద్దవాళ్ళు వెళ్ళిన పని మర్చిపోయి, చల్లదనానికి మురిసిపోయి, వానలో తడిసిపోయారు.

రెండు గంటలసేపు ఎక్కి తొక్కి కురిసిన వర్షం, పక్క ఊరికి తప్పుకుంది. వెళ్ళేముందు పలకరించడానికా అన్నట్టు సూర్యుడు కొండల చాటునుండి తొంగి చూసాడు.

సాయంకాలం అయినా భావన కనబడపోయేసరికి, ఆమెను వెదుకుతూ ఆడపెళ్ళివారింటికి వెళ్ళాను, అక్కడ అందరి మధ్యా కూర్చుని కబుర్లు వింటోంది భావన.

భావనని పిలిచి పొద్దున్న వేసుకున్న మామిడితోట ప్రోగ్రాం గుర్తు చేసాను. భావన ఆశ్చర్యపోయింది. ఇప్పుడా ఈ బురదలోనా? అంది. బురదైనా పర్వాలేదని, భావనకి నచ్చచెప్పి ఒప్పించాను. పొద్దున్న మాతో మామిడి తోటకి వస్తానన్న వాళ్ళు ఇప్పుడు "రాము" అన్నారు.

భావన నేను మరిద్దరు చిన్న పిల్లలు మామిడి తోటకి బయలుదేరాం వర్షం కురియడం వల్ల భూమాత చల్లబడి మెత్తబడింది. జాగ్రత్తగా చూసుకు నడవవలసి వస్తోంది.

పిల్లలు మాత్రం ఎక్కడి నీటి చలమ కనబడితే అక్కడ ఆగి, నీటి చలమలో దిగి, కాళ్ళతో నీళ్ళు తుళ్ళిస్తున్నారు. వాళ్ళని అదలిస్తూ బురదలో కాలుజారకుండా మెల్లగా అడుగులో అడుగువేస్తూ నడుస్తోంది భావన. నీరెండలో పాలనురుగులాంటి తెల్లటి చీరలో, భావన చినుకు ముత్యంలా మిలమిలా మెరిసిపోతోంది.

భావన కదలికలో పున్నాగు వేగం, తనువులో గులాబీరేక నాజూకు, నాలో విచిత్రమైన అనుభూతుల్ని కలిగించింది. ఒకరికి తెలియని ఒకరం నాలో ముప్పిరిగొనే ఊహల పోరుతో, మనసుని ఊగిస్తున్న భావనా సౌందర్యాన్ని దర్శిస్తూ, తలపుల్లో మునకలు వేస్తూ, ఆ సాయంత్రాన్ని హృదయంలో బంధించాను.

●●●

పెళ్ళయిపోయాక భావన పరిచయం తలపుల్లో వెంటరాగా గుంటూరు చేరా..

ఇంటికి చేరిన రెండోరోజే మూర్తి నాన్నగారి నుండి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం చదివి నాన్నగారు "ఏరా భావన ఎలా వుంది?" అనడిగారు.

భావన గురించి నాన్నగారికి ఎలా తెలిసిందా? అని ఆశ్చర్యపోయాను.

అప్పుడు అమ్మ చెప్పింది మూర్తి తండ్రే సంబంధం చూసాడని ప్రత్యేకంగా పెళ్ళిచూపులంటే నేను రానేమో అని, మూర్తి పెళ్ళిలో నేనూ భావనా కలుసుకునేటట్టు చేసారని నాకు భావన నచ్చింది అని చెప్పడం భావన తండ్రి, మూర్తి తండ్రి ఇద్దరూ మా ఇంటికి రావడం, నాన్నగారితో మాట్లాడి మా పెళ్ళి నిశ్చయం చెయ్యడం జరిగింది. నిశ్చయం జరిగిన నెలరోజులకే, మా పెళ్ళి ఆర్భాటంగా జరిగిపోయింది.

●●●

భావన చాలా కలిమిగల కుటుంబం నుండి వచ్చింది. ఆ విషయం ఆడంబరంగా జరిగిన పెళ్ళి చాటి చెప్పింది.

భావన తండ్రికి విజయవాడకి దూరంగా కానూరు, సమీపంలో పెద్ద ఫార్మ్ హౌస్ ఉంది. అక్కడే జరిగింది మా పెళ్ళి నాన్నగారు అంచనా వేసినట్టుగా అయితే, మా పెళ్ళికి వేసిన షామియానా, చేసిన డెకరేషనుకి అయిన ఖర్చుతో, వో చిన్న యమ్. ఐ. జి ఫ్లాట్ కొనచ్చు, ఇంక పెళ్ళికి వచ్చిన అతిధుల సంఖ్య వారి అంతస్థుతో పోల్చి చూస్తే, మా బంధువులు మేము సూర్యుడి ముందు కొవ్వొత్తి దీపాల్లా వెలవెలబోయి ఎడ్రసులు లేకుండా పోయాం.

పెళ్ళి జరిగిన మూడోరోజు భావన తండ్రి ఇరవై వేలరూపాయలు నా చేతిలో పెట్టి హనీమూన్‌కి వెళ్ళి రమ్మన్నాడు. అండమాన్స్‌లో మేము పదిరోజులు గడపడానికి కావలసిన ఏర్పాట్లు చేసాడు.

హనీమూన్‌కి అండమాన్స్ వెళ్ళాం, ట్రెడిషనల్‌గా ఏవేవో చేద్దామని, అమ్మ వేసుకున్న ప్లాను కుదరలేదు.

●●●

దీవి సౌందర్యం భావన సౌందర్యానికి తీసికట్టు.

భావనలో రోజుకో కళ చూస్తున్నాను. ఆమె సరాగాల సాగరంలో వో మునక వేసినప్పుడల్లా ఉక్కిరి బిక్కిరి అవుతున్నాను. శరీరం మరుపున పడేంత ఆనందాన్ని పొంది మనసు తృప్తిగా మూగబోతోంది.

ఇది ఒకసారా కాదు. రెండు సార్లా కాదు భావన ఊపిరి నిట్టూర్పుగా మారి, చల్లటి చెయ్యి. నా మెడ చుట్టూ చేరి నన్ను తనలోకి ఆహ్వానించినప్పుడల్లా కొత్త అనుభూతి ఆ అనుభూతిలో విచిత్రమైన జిజ్ఞాస! ఏవేవో రహస్యాలు తెలిసికోవాలనే పిపాస! నా ఈ పిపాసని గమనించిన భావన కనురెప్పలలో చూపే నిషా సౌందర్యహేల! పెదవులపై అల్లాడే తమకం! శరీరపు అణువణువుల మధ్య చైతన్యం! అణువణువుల మధ్య బిగి! ఆ బిగిలో లీలలో అద్భుతసౌందర్యం! మెల్లమెల్లగా నా ఉనికిని కరిగిస్తోన్న చైతన్యపు సెగలు!

అసాధారణ సౌందర్యపురాసి భావన చేస్తున్న సీత్కారాలు! లతావేష్టితమై గాఢంగా పెనవేసిన భావన కుహరాంతర్భాగంలో విరిసిన ఆమని! సర్వాన్ని కోల్పోతున్న ఆనందంలో నా మస్తిష్కం మరుగున పడీ ఆద్యంతాలని నిర్వచిస్తున్న సౌందర్య కాంతి పుంజాలతో కాలం నిలిచిపోయిన అనుభవం!

శరీర సౌందర్యంతో మొదలైన జిజ్ఞాస ఆత్మసౌందర్యాన్ని దర్శింపచేస్తుందని అనుకోలేకపోయాను. ఆత్మసౌందర్యం దర్శించిన తనివి తీరకుండానే మరపున పడిపోతోంది. ఎప్పుడూ నేనే దగా పడుతున్నానా? అనిపిస్తోంది. సౌందర్యాన్ని శాశ్వతంగా నాలో నిలుపుకోలేకపోతున్నాననే దిగులు, భావన మళ్ళీ మళ్ళీ కావాలనిపిస్తోంది. విచిత్రం ఏనాడు భావన నా జిజ్ఞాసని తక్కువగా అంచనా వెయ్యలేదు. చైతన్య రాసి అయిన భావన నాలో ఆద్యంతాలు లేని హాయిని నింపింది.

భావనతో నేను పొందే అనుభవాన్ని చెప్పినప్పుడల్లా పకపకా నవ్వేది! అదే ఆమె సమాధానం.

●●●

బెంగుళూరులో నాలుగేళ్ళు భావన సాన్నిధ్యంలో కలయో?మాయయో? అన్నట్టుగా గడిచిపోయింది.

నాలుగేళ్ళల్లో భావన నాన్నగారు, నన్ను బెంగుళూరు వదిలి హైదరాబాదు వచ్చి ఇండస్ట్రీ మొదలు పెట్టమని ప్రోత్సహించారు. కానీ నాకే ఇష్టం లేకపోయింది.

నాలుగేళ్ళూ సమ్మర్ సెలవలకి సమ్మర్ రిసార్ట్స్‌కి వెళ్ళేవాళ్ళం. జీవితాన్ని అన్ పేరలల్‌గా అనుభవించాలనే నా భావనలకి భావన 'సై' అనేది.

ఆ సమయంలో గుంటూరులో నాన్నగారు సడన్‌గా హార్ట్ ఎటాక్ వచ్చి పోయారని టెలిగ్రాం వచ్చింది.

భావనకి ఈ విషయం చెప్పి "బయలుదేరు" అన్నాను. భావన 'నువ్వెళ్ళిరా' అంది.

"ఏం నువ్వు రావా?" అనడిగా.. ఆశ్చర్యంగా.

"నాకు చావంటే భయం నేను రాను అక్కడకి" అంది.

నా ఆశ్చర్యం ఇనుమడించింది. నువ్వు రాకపోతే బావుండదని అక్కడ ఎవరేనా ఏమైనా అనుకుంటారని, నువ్వు రావడం ముఖ్యమని ఎన్నో విధాల నచ్చచెప్పడానికి నేను చేసిన ప్రయత్నాలన్నీ వృధా అయిపోయాయి.

భావన మొండికేసింది ససేమిరా రానంది.

ఆనాడే భావనలో దాగివున్న కొత్తరూపు చూసాను.

●●●

రెండు టిక్కెట్లు తీసి భావనని వాళ్ళింటికి పంపించి నేను గుంటూరు వెళ్ళాను.

నే గుంటూరులో దిగి ఇంటికి వెళుతూంటే ఏదో తెలియని వెలితి కనిపించింది. గుంటూరు వరకూ వచ్చిన భావన మనస్సు మార్చుకుని నాతోపాటూ దిగుతుంది అనుకున్నాను కానీ భావన మనసు కరగలేదు. నాతోపాటు దిగనూ లేదు.

అప్పటికే రెండోరోజు అవడం వలన నేను వెళ్ళగానే దహనానికి ఏర్పాట్లనీ చేసేసారు.

నాన్నగారిని దహనం చేసి తిరిగి ఇంటికి వచ్చాక, తిన్నగా వెళ్ళి దీపం చూడమన్నారు. ఒంటిగా గాలికి అల్లల్లాడుతున్న దీపం, పక్కగా ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి, పెద్దత్త తొడమీద తలపెట్టుకుపడుకున్న అమ్మని చూస్తే కడుపు తరుక్కుపోయింది. వెక్కిళ్ళు ఆగలేదు. గుండె కరిగి మరుగుల్లా వెచ్చటి కన్నీళ్ళు ధారాపాతంగా, భోరున ఏడుస్తూ అమ్మ కాళ్ళదగ్గర చతికిలబడ్డాను.

●●●

నాన్నగారిని పితృవనానికి సాగనంపాక, ఆ ఇంటిలో నేనూ అమ్మా, మావయ్యలూ వారి కుటుంబం మిగిలాం. నాన్నగారు పోయిన పదోరోజుకి భావన తండ్రి వచ్చాడు. భావన రాలేదేం అడిగిన దానికి అది చిన్నపిల్ల చావంటే దానికి భయం అన్నాడు. ఎంత సరిపెట్టుకుందామన్నా, భావన ప్రవర్తన్ని సరిపెట్టుకోలేకపోయాను.

కర్మ చెయ్యడం పూర్తయిన తర్వాత ఇంటిలో సామాన్లు అమ్మేసి, మిగిలిన కొన్ని సామాన్లు తీసుకు అమ్మతో బెంగుళూరు చేరాను.

బెంగుళూరులో అమ్మ వండి పెడుతోంది. నేను కాలేజీకి వెళ్ళివస్తున్నాను. అమ్మకి అవకాశం దొరికినప్పుడల్లా అంటోంది.

"ఒరేయ్ వెళ్ళి భావనని తీసుకురా?" అని

"అదే వస్తుందిలే" అని సమాధానం చెప్పి ఊరుకున్నాను.

మేము బెంగుళూరు వచ్చిన మూడు నెలలకి మామగారి దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. వచ్చి భావనని తీసుకెళ్ళమని. నేనా ఉత్తరానికి జవాబు రాయలేదు. మావగారింటికి వెళ్ళనూ లేదు.

మరో నెల తర్వాత వాళ్ళింటిలో పని చేస్తున్న నౌకరు భావనని బెంగుళూరు తీసుకొచ్చి దిగబెట్టాడు.

●●●

భావన తనంతట తానే వచ్చినందుకు ఆనందం వేసింది. భావన మీద ఉన్న కోపం పోయింది. ఆ రోజు రాత్రి కరుణశ్రీ చెప్పినట్లు "ఏదీ మరొక్కమారు హృదయేశ్వర గుండెలు పులకరింపగా ఊదగదోయి! ఊదగదోయి! సుధామయయుష్మదీయ వేణూదయరాగడోలికల నూగుచు విశ్రుతిలో విలీనమైపోదును. నాదుక్రొవ్వలపు ముగ్ధపరీమళమ్ముతో" అని అహంకారాలన్నింటికీ చిచ్చుపెట్టి, ఆ వెచ్చదనంలో కాలాన్ని మరిచి దూరానికి పరదాదించి ఒకటైపోయాం.

భావనలో స్పందన నన్ను చకితుడ్ని చేస్తుంది. ఆ క్షణాల్లో ఆమెకి నిన్న విషయం తలపుకి రాదు. రేపటి ఆలోచన లేదు. ఆమె లొంగిపోతున్న బానిసకాదు. తనని తను సమర్పించుకుంటున్న గొప్పదాత.

భావనకి ఆనందాన్ని ఇచ్చిపుచ్చుకునే గొప్పకళ తెలుసు. ఆ కళలో నా అస్థిత్వం కరిగి, ప్రవాహంలో కొట్టుకుపోతున్నాననిపిస్తుంది.

●●●

నాకూ భావనకి రోజులు గడుస్తున్నాయి. కానీ అమ్మకి కష్టంగా ఉంటోంది. భావనకి అమ్మ ఉనికి నచ్చలేదు, ఇబ్బందిగా ఉంటోంది.

అమ్మకి ప్రత్యేకంగా ఏమీ చెయ్యక్కర్లేకపోయినా, భావన అమ్మతో అంటీ అంటనట్టుగా నిరాదరంగా ఉండడం అమ్మకి కష్టం కలిగించింది. అదే రానురాను మాటలు విసురుకునే స్థాయికి పెరిగింది.

ఓ రోజు కాలేజీనుండి తొందరగా ఇంటికి వచ్చాను. అప్పటికి మధ్యాహ్నం రెండయింది.

నాకు అమ్మే తలుపు తీసింది. వెంటనే వెనక్కి తిరిగి తన గదిలోకి వెళ్ళిపోయింది. కానీ అప్పటికే అమ్మకళ్ళు ఎర్రగా ఉండడం పసిగట్టాను. ఏం జరిగిందా? అన్న ఆలోచనతో, నా గదిలోకి వెళ్ళాను. భావన నా గదిలో నిద్రపోతోంది. నేను అమ్మదగ్గరకి వెళ్ళి కూర్చున్నాను. అమ్మ ఏడ్చిందేమో అన్న అనుమానం వచ్చిద్మి "ఏం అలా ఉన్నావు?" అని అడిగాను.

అమ్మ గద్గదంగా "ఏం లేదు" అంది.

పాత విషయాలు జ్ఞాపకం వచ్చి, బాధపడుతోంది అనుకున్నా.

భావన ఒళ్ళు విరుచుకుంటూ "అప్పుడే వచ్చేసావేం?" అంది.

"కాలేజీలో ఎవరో పోయారు శలవిచ్చారు" అన్నాను.

"అలాగా" అంటూ కిచెన్‌లోకి వెళ్ళింది. నేను డ్రస్ మార్చుకుని డైనింగ్ హాల్లోకి వెళ్ళాను. అక్కడ భావన అమ్మకి కంచం పెట్టి అన్నం వడ్డిస్తోంది, నేనాశ్చర్యపోయాను. "అదేమిటమ్మా భోజనం చెయ్యలేదా?"

"లేదు" అంది భావన ముభావంగా.

"ఏం?" అన్నా

"ఏమో నాకేం తెలుసు" అంది విసురుగా.

"ఇంతవరకూ భోజనం చెయ్యలేదేం?" అని అడిగాను అమ్మని.

"ఎంత లేటయిందని? భావన పడుకుంది. లేచి పెడుతుందిలే అని ఊరుకున్నాను" అంది అమ్మ

అమ్మ కంటి తడిపెట్టుకోడానికి కారణం అర్ధం అయింది. అమ్మ ఆకలికి కంటతడి పెట్టలేదు.

భావన నిరాదరణకి బాధపడింది. భావనే లేచి అన్నం పెట్టాలనే పట్టుదల అమ్మకి లేదు. వచ్చిన కొత్తలా అలా చేసేది కూడా, కానీ భావనకి అది నచ్చేది కాదు. ప్రతిపనిలో తప్పులెంచేది. విసుక్కునేది భావనకి సాయపడుతూ అమ్మ ఏదైనా పని చేస్తే, విసుక్కుంటూ తిరిగి అదే పనిని చేసుకునేది. దానివల్ల అమ్మ మనసు బాధపడేది. అది చూసి నేనే అన్నాను.

"అమ్మా దానిపని దాన్ని చేసుకోనీ హాయిగా నీ గదిలో కూర్చుని భాగవతం అవీ చదువుకో" అని

ఆ రోజు నుండి అమ్మ ఇంటిపనిలో కలుగచేసుకోడంలేదు. అదీ అమ్మ పాలిటి శాపంగా మారింది.

నేనేం మాట్లాడకుండా, నా గదిలోకి వెళ్ళిపోయాను. ఎంత ఆలోచించినా భావనలో గడ్డకట్టుకుపోయిన అహాన్ని ఎలా కరిగించాలో అర్ధంకాలేదు, ఘర్షణ పడాలా? అదెంతవరకూ సమంజసం!? అమ్మ వయసుకి గౌరవం, బంధుత్వానికి అభిమానం పంచిపెట్టు అంటూ కమాండ్‌మెంట్స్ నిర్ధారించాలా? అలా చెయ్యడం వల్ల ఇంటిని నరకంగా మార్చేస్తుంది భావన. మరేం చెయ్యాలి? అన్న ఆలోచనలతో మనసంతా చికాకుగా తయారైంది.

భావన రెండు కాఫీ కప్పులతో గదిలోకి వచ్చింది. ఒకటి నాకిచ్చి, తను టేబులు పక్కనున్న కుర్చీలో కూర్చుని కాఫీ సిప్ చేస్తోంది.

"అమ్మ భోజనం అయిందా?" అనడిగాను.

"వెళ్ళి చూసిరండి" అంది.

"వెళ్ళి చూడక్కరలేదు నువ్వు చెప్పు చాలు అయిందా? లేదా?" అన్నా కసురుతూ

భావన మౌనంగా ఊరుకుంది. కానీ సమాధానం చెప్పలేదు. ఆ మౌనం నాలో సహనాన్ని చంపింది

"అమ్మకి అన్నం పెట్టి తిన్నాక నువ్వు పడుకోవలసింది" అన్నాను.

"అడ్డమైన వాళ్ళకోసం కాసుకు కూర్చోడం నా చేతకాని పని" అంది విసుగ్గా

"ఆవిడ అడ్డమైనది కాదు, నాకు అమ్మ అవుతుంది, కొంచెం ఒళ్ళు దగ్గరపెట్టుకు మాట్లాడు" అన్నాను.

"అలా అయితే రేపట్నించీ ఆవిడకి వండిపెట్టి తిన్నాక, కాలేజీకి వెళ్ళండి" అంది.

"నేనే అన్నీ చేసుకుంటే నువ్వెందుకిక్కడ" అన్నాను.

"మీ అందరికీ ఒండిపెట్టడానికి రాలేదు" అంది స్వరాన్ని పెంచుతూ.

"సింగారించుకు కూర్చోడానికి వచ్చావా?" అన్నా

మాటామాటా పెరుగుతున్నాయి. స్వరం పెరుగుతోంది. ఈసడింపులు పెరుగుతున్నాయి. దూరం ఏర్పడుతోంది. ఏర్పడ్డ దూరం తగ్గడానికి ఘనీభవించిన అహం కరగడానికి రోజులు వారాలు ఎదురు చూడవలసి వస్తోంది. ఒక్క అమ్మ విషయంలోనే కాదు పిల్లల విషయంలో కూడా భావనకి నా అభిప్రాయంపై ఏ విధమైన గౌరవంలేదు.

అమ్మకి కూడా ఇంట్లో చిన్న పిల్లలు తిరుగుతూ ఉంటే బావుండనిపించింది. పెళ్ళైన ఎనిమిదేళ్ళయినా పిల్లలెందుకు లేరో నాకు తెలుసు. భావనకి పిల్లలమీద ఇంట్రస్టు లేదు. ఇదే విషయాన్ని భావనతో ప్రస్తావించినట్టుంది అమ్మ ఆ రోజు కాలేజీ నుండి రాగానే మీ అమ్మగారిని నేను భరించలేకపోతున్నాను. నా స్వంత విషయాల్లో ఆవిడ కలుగచేసుకోడం నాకిష్టం లేదు అంది

భావన ఏ విషయంలో ఇలా అందో నాకు ముందే తెలుసు అమ్మ నాతో చెప్పింది. అంతా చెప్పి భావన తనని ఎలా కసిరిందో కూడా చెప్పింది. అమ్మ అలా చెపుతుంటే నా మనసంతా పాడైపోయింది. అదే విషయాన్ని ఎత్తుకుని భావన చెప్పేసరికి, నాకు కోపం వచ్చింది. కానీ నన్ను నేను నిగ్రహించుకుంటూ, "అమ్మని సరిగ్గా అర్థం చేసుకో భావనా?" అన్నాను.

ఆ మాటకి భావన "మీ అమ్మగారిని సరిగ్గా అర్థం చేసుకోడం లేదని, సరిగ్గా చూడడం లేదనీ మీ కనుమానంగా ఉంటే, ఓల్డ్ ఏజ్ హోమ్‌లో జాయిన్ చెయ్యండి" అంది.

ఆ మాటకి నేను కోపం పట్టలేకపోయాను. ఒక్క లెంపకాయకొట్టాను. నా పురుషాహంకారానికి భావన తట్టుకోలేకపోయింది. హిస్టీరియా వచ్చిన దానిలా అరిచింది. ఇంట్లోంచి వెళ్ళిపోతానంది. ఆమె ఎన్ని బెదిరించినా భావనని పట్టించుకోవాలనిపించలేదు.

అమ్మని ఓల్డేజ్ హోమ్‌లో చేర్పించడమా? ఎంత మాటంది. భావనకి తెలిసే అందా? లేక ఆవేశంలో అందా? నేనుండగా అమ్మని ఓల్డేజ్ హోమ్‌లో చేర్చడమా? ఇంపాసిబుల్! నా నీడ నన్నేనాడేనా విడిచి వెళ్ళిపోయిందేమోగాని, అమ్మ మాత్రం ఆ పని ఎప్పుడూ చెయ్యదు, పాతికేళ్ళవరకూ నాకూ అమ్మకీ ఉన్న అనుబంధం గురించి భావనకి ఏ భాషలో చెపితే అర్థం అవుతుంది? ఇలాంటి అమ్మని చూసే తెలుగువాడు "అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ, చాలపెద్దమ్మ" నిజమే ముగ్గురమ్మలకీ మూలపుటమ్మ, నాకు డబ్బులు కావాలన్నా, కథలు చెప్పాలన్నా, నా తప్పుల్ని కాయాలన్నా, అమ్మే సరి. అమ్మ కొంగునుండి డబ్బులు కొట్టేసేనని తెలిసీ చిరునవ్వు నవ్వి పోన్లే తీసుకో అనగలిగిన అమ్మ ఉండగా తెలుగు పిల్లాడికి లక్ష్మీదేవి ప్రత్యక్షం అయినా అవసరం లేదు. లక్ష్మీదేవిలో చంచల స్వభావం వెదికి చూసినా అమ్మలోలేదు. ఆ విధంగా అమ్మే గొప్ప! ఏ చదువుల తల్లికి సుమతీశతకం వచ్చు, ఏ తల్లి శారద రామాయణం పాడగలదు, మా అమ్మ తప్ప.

కొడుకుని తండ్రి కోపం నుండి కాపాడలేక ఏనుగు బుర్రతో సరిపెట్టుకున్న తల్లి సంగతి నాకు తెలియదు కానీ, నాన్నగారి కోపం నుండి కాచి, తన గుండెల్లో దాచుకున్న అమ్మ, నిజంగా నాకు మహత్వ, కవిత్వ పటుత్వ సంపదలు ఇవ్వలేదా? అలాంటి అమ్మని భావన ఓల్డేజ్ హోమ్‌లో చేర్చమంటుందా? నా జీవనశక్తిని వోల్డ్ యేజ్ హోమ్‌లో చేర్చనా? నేనెటు పోతున్నాను? లేదా మనమంతా ఎటుపోతున్నాం?

చిన్నప్పుడు రెండు జేబులునిండా జంతికలు పోసి, ఆడుకోడానికి పంపిన అమ్మ, ఇంట్లో చెప్పకుండా సినీమాకి పోతే నాన్నకి తెలియకుండా అబద్దాలు చెప్పి ఉత్తుత్తి కోపాన్ని చూపించిన అమ్మ, ఆటల్లో మోకాళ్ళూ, మోచేతులూ డోక్కుపోతే దెబ్బలకి నూనె రాస్తూ, తను బాధపడుతూ నన్ను మందలించే, అమ్మ.

బెంగుళూరు వెళ్ళేరోజున సున్నుండలు, ఆవకాయ సీసాల్లో పేక్ చేసి దూరంగా ఉండి తను తింటున్నానో లేదో అని వాపోయిన అమ్మ, కోడలు వస్తోంది అంటే ఎంత ఆనందపడింది. తనకి ఇంట్లో తోడు ఉంటుందని అనుకుంది. అందరూ తన కొడుకులాగే, తన భర్తలాగే తనంటే అభిమానంతో మెలుగుతారని అమ్మ ఊహ! కానీ అలా జరగలేదు.

తన మంచితనం, ఇంత దారుణంగా పరీక్షకు గురవుతుందని అనుకోలేదు. తన అభిమానాన్నే లెక్కచెయ్యని కోడలు వస్తుందని అనుకోలేదు. ఇప్పుడు ఎన్ననుకున్నా, ఏమనుకున్నా వృథా!

మర్నాడు కాలేజీ నుండి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో భావనలేదు. అమ్మనడిగితే ఏ విషయం చెప్పలేకపోయింది. గదిలోకి వెళ్ళి చూస్తే భావన పెట్టిలేదు. భావన వెళ్ళిపోయిందని తట్టగానే, పోష్టాఫీసుకి వెళ్ళి "భావన ఇక్కడ నుండి బయలుదేరిందని అక్కడికి చేరుకోగానే తెలియచెయ్య".మని, టెలిగ్రాం ఇచ్చాను. ఈ రోజు వస్తుంది రేపు వస్తుంది అనుకున్న సమాధానం రెండు నెలలైనా రాలేదు.

నాలుగు రోజులకిగాను కాలేజీకి శలవు పెట్టి, భావన దగ్గరకి బయలుదేరాను. మర్నాడు సాయంత్రం ఆరుగంటలకి భావన ఇంటికి చేరుకున్నాను. ఇంట్లో ఎవరూ ఆప్యాయంగా పలకరించలేదు. నేను హాల్లో కూర్చున్న కాసేపటికి మావగారు హాల్లోకి వచ్చారు. ఆయన్ని చూసి గౌరవంతో లేచి నిలబడ్డాను. ఆయన ఎదురుగా సోఫాలో కూర్చున్నారు. నన్ను కూర్చోమనలేదు. ఆయన కూర్చోమంటారని కాసేపు ఎదురు చూసి, ఆ ఆశ సన్నగిల్లిపోగా నేనే నిలబడలేక కూర్చున్నాను.

"భావన క్షేమంగా ఉందా?" అనడిగాను.

"ఆ ఉంది" అన్నారయన ముభావంగా.

"భావనని తీసుకెళ్ళడానికి వచ్చాను" అన్నాను.

"ఎందుకు మళ్ళీ కొట్టిపంపేయడానికా?" అన్నారాయన.

నాకేం మాట్లాడాలో తెలీక మౌనంగా ఊరుకున్నాను. నా డాక్టరేటు నా పొజిషను గొప్పగా చెప్పుకోడానికి వాళ్ళకి కావాలి లేకపోతే నా ఏడాది ఆదాయం వాళ్ళ ఆవర్జా చిట్టాలో వో మూల రెండు రూళ్ళకి కూడా సరిపోదు. నేను వాళ్ళు నిర్దేశించిన, ఆశించిన తోవలోకి రానని మొదటి ఏడాదిలోనే గ్రహించారు. చేసేదేం లేదు కనుక నాకు దూరంగా ఉన్నారు.

నా మౌనాన్ని ఆయన ఏం అర్థం చేసుకున్నారో నాకు తెలీదు కానీ అనునయంగా "రాజగోపాల్ ఆలోచించు అంత తప్పా భావనదేనా? మీ అమ్మగారిది లేదూ? అన్ని సౌకర్యాలు ఆవిడకే ఉండాలా? ఆవిడ నీ సానుభూతి సంపాదించి భావనకి నీకూ మద్య బేధం కలిగించడానికి ప్రయత్నిస్తోందేమో? కన్సర్వేటివ్ ఆలోచనలతో మెలగే మీ అమ్మగారిని నువ్వు కాస్త అర్థం చేసుకోవలసింది. నువ్వాలోచనలేకుండా భావన మీద చెయ్యిచేసుకోడం ఏమన్నా బావుందా? భావన పుట్టిన దగ్గరనుండీ ఇప్పటివరకూ గట్టిగా గసరినట్టుకూడా జ్ఞాపకం లేదు." అన్నారు.

నేను దేనికీ సమాధానం చెప్పలేదు. చెప్పలేను కూడా ఆయన బోధించిన నీతులు, వివరించిన వివరణలు వింటూ మౌనంగా కూర్చున్నాను.

ఆయన చెప్పడం పూర్తిచేసాక లోపలనుండి ఎవరో పనివాడిని పిలిచారు. "అల్లుడు గారిని నవ్య గదిలోకి తీసుకెళ్ళు" అన్నారు.

భావన అసలు పేరు నవ్యభావన. పనికుర్రాడు నా సూట్ కేస్ తీసుకెళ్ళి భావన గదిలో పెట్టాడు. భావన లేనప్పుడు ఆ గదిని ఎవరూ వాడరు. నేను పెళ్ళైన కొత్తలో ఆ గదిలో నాలుగైదురోజులున్నాను. గదికి బ్రైట్ క్రీమ్ కలర్, రేసుగుర్రాలు, కండలు తిరిగిన పురుషుడు ఉన్న వాల్ హేంగింగ్స్, అంతా భావన టేష్టే. గదికి ఆనుకుని ఆధునిక సౌకర్యాలతో బాత్రూముంది. బాత్రూములోకి వెళ్ళి స్నానం చేసి, వచ్చి మంచం మీద వాలాను. భావన ఏదీ? ఎక్కడా కనబడటం లేదే? అనుకున్నాను, పనికుర్రాడు కాఫీ తీసుకొచ్చి ఇచ్చాడు. కాఫీ తాగాక కాఫీ కప్పు తీసుకెళ్ళిపోయాడు.

రాత్రి తొమ్మిది గంటలకి భావన వచ్చింది. పలకరించాలి అన్నట్టుగా పొడిగా "ఎప్పుడొచ్చావు?" అంది.

"ఏడుగంటలకి" అన్నాను.

తను డ్రస్ మార్చుకుంది. పద భోజనం చేద్దాం అంది. ఇద్దరం కిందకి దిగాం. డైనింగ్ టేబులు దగ్గర ఎవరూ లేరు. పనివాడు వడ్డించాడు. నేను భోజనం ముగించి భావన గదిలోకి వచ్చేసాను. భావన వాళ్ళ అమ్మగారి దగ్గరకి వెళ్ళింది. అత్తగారు నేను వచ్చానని తెలిసినా పలకరించడానికి రాలేదు. ఆవిడ ఈ విధంగా ప్రవర్తించడం మొదటిసారికాదు. అందుకే సరిపెట్టుకున్నాను.

ఆలోచనలతో మంచం మీదకి చేరాను. ప్రయాణపు బడలికలో ఉన్నానేమో, వెంటనే నిద్రపట్టేసింది.

●●●

అర్ధరాత్రి తెలివొచ్చింది. పక్కన భావన పడుకునుంది. ఆమెని దగ్గరగా తీసుకున్నాను. భావన నాలో ఒదిగి పోయింది. ఆమెని దగ్గరగా తీసుకోడం అంటే మన్మధ సామ్రాజ్యానికి పట్టాభిషేకం కట్టడమే.

మిగతా రాత్రి నిద్రపోలేదు. ఏవో కబుర్లు, ఇద్దరిలోనూ ఒక సంఘీభావం, ఒకళ్ళ తప్పులు ఒకళ్ళు సహించే సహనాన్ని ప్రదర్శించుకుని రాజీ కొచ్చేసాం.

రెండు రోజుల తర్వాత అక్కడ నుండి నేనూ, భావనా బెంగుళూరు వచ్చేసాం. బెంగుళూరులో పరిస్థితి భావనకి అనుకూలంగా ఉంది. అమ్మ పూర్తిగా మారిపోయింది. అన్నీ సరిపెట్టుకోడం మొదలు పెట్టింది. అమ్మలో ఈ మార్పు ఆనందాన్ని ఇచ్చింది. అమ్మకి నేనంటే ఎంత అభిమానమో? కానీ ఇలా ఎన్నాళ్ళు జరుగుతుంది? భావన మనసు పెళుసు. చిన్నమాటలో బేధం వచ్చినా సహించి సరిపెట్టుకునే మనస్తత్వం కాదు నేను అమ్మ గురించి ఆలోచిస్తూ కాలాన్ని నెట్టుకొస్తూంటే ఆపద ఇంకో రూపంలో వచ్చింది.

●●●

## 24

**ఓ రోజు సాయంకాలం ఇంటిముందు టేక్సీ ఆగింది.** అందులోంచి స్నేహలత దిగి, లోపలికి వచ్చి

'డాక్టర్ రాజ్‌గోపాల్ ఇల్లు ఇదేనా' అని అడిగింది.

'యస్' అంది భావన.

'ఐ యామ్ స్నేహలత కమింగ్ ఫ్రమ్ జర్మనీ" అంటూ తనని తాను పరిచయం చేసుకుంది.

'ప్లీజ్ కమిన్' అంటూ స్నేహలతని లోపలికి ఆహ్వానించింది భావన.

స్నేహలత ఇంటిలోకి వచ్చి, అమ్మని పలకరించింది. అప్పటికి ఎవరు వచ్చారా? అని చూద్దామని హాల్లోకి వచ్చిన, నాకు ఎదురుగుండా స్నేహలత సర్‌ప్రైజ్‌లా కనిపించింది.

హలో రాజా అంటు పలకరించింది. నేను నవ్వుతూ స్నేహలతని పలకరించాను.

"జర్మనీ నుండి ఎప్పుడు వచ్చావు" అనడిగా...

"జస్ట్ కమింగ్! ఇనిస్టిట్యూట్‌లో పనుంది. అందుకే వచ్చాను జర్మనీలో ఉండగా ఎంక్వైరీ చేసాను. నువ్వు బెంగుళూరులో ఉన్నావని మా గైడ్ చెప్పారు. ఈ హోటలు రూమ్స్, డ్రైలైఫ్, ప్చ్ ఐ యామ్ ఫెడప్ విత్ దట్ టై ఆఫ్ లైఫ్, అందుకే కాస్త కాలక్షేపంగా ఉంటుందని ఇక్కడ దిగా' అంది.

అంటే కొన్ని రోజులు స్నేహలత ఇక్కడ ఉండడానికి వచ్చింది. స్నేహలత చాలా బోల్డ్ టైపు అనవసరంగా లేనిపోని కామెంట్స్ ఏమైనా చేస్తుందేమో? అన్న భయం వెన్నాడింది.

రెండోరోజుకల్లా స్నేహలత ఉనికి భావనకి చిరాకు కలిగించింది. ముఖ్యంగా మేమిద్దరం మైమరచి ఇనిస్టిట్యూట్‌లో గడిపిన రోజులు గుర్తుచేస్తుకుంటూ కబుర్లు చెప్పుకోడం భావనకి నచ్చలేదు.

మూడోరోజు వచ్చేసరికి, స్నేహలత ప్రతీదానికీ ఎదురు చూడాల్సి వచ్చేది. భావనలో మార్పుని స్నేహలత పసిగట్టింది. కానీ బైటకి తేలలేదు.

నేను భావనకి ఎన్నో విధాల నచ్చచెప్పి చూసాను. ఇంటికి అతిథిగా వచ్చిన వాళ్ళతో అలా ప్రవర్తించకూడదని రెండు మూడురోజుల్లో తను వెళ్ళిపోతుందని, అంతదాకా సహనం వహించమని, కానీ భావన విసుగ్గా నేనేం మీకూ మీ స్నేహితురాలికి దాసీ దాన్ననుకున్నారా? అంది. అది స్నేహలత వింది.

స్నేహలత మరి రెండురోజులు ఇంటిలో మార్పొస్తుందేమో? భావన మారుతుందేమో అని ఎదురుచూసింది కానీ రోజు రోజుకీ ఇంట్లో పెరుగుతున్న టెన్షన్ని పూర్తిగా అంచనా వేయలేకపోయింది.

ఆ రోజు భావన పెట్టిన అల్లరి ఇటు నన్నూ అటు స్నేహలతని చాలా ఇబ్బంది పెట్టింది.

ఇంత జరిగాక ఇంకా ఈ ఇంట్లో ఉండడం భావ్యం కాదని స్నేహలత లాడ్జికి మారిపోయింది. ఇంట్లోంచి స్నేహలత వెళ్ళిపోతోంటే నాకు చాలా బాధ కలిగించింది. 'వెరీ సారీ లతా' అన్నాను నా కళ్ళల్లో నీరు తిరిగింది.

●●●

స్నేహలత వెళ్ళిపోయినా భావన మాములు మనిషి అవలేదు. నాతో మాటలు మానేసింది. నేనూ అన్యమనస్కంగా ఉండి, కలుగ చేసుకుని మాట్లాడలేదు. ఇంట్లో పరిస్థితి కుదుటపడకుండానే స్నేహలత వెళ్ళిపోయే రోజు వచ్చింది. మనసంతా చికాకుతో స్నేహలతతో పాటు బొంబాయి వెళ్ళాను.

బొంబాయిలో స్నేహలతని ఫ్లైటు ఎక్కించి, వెనక్కి బెంగుళూరు వచ్చాను. నేను వచ్చేసరికి ఇంట్లో పరిస్థితి మరీ వేడెక్కిపోయింది. తనతో చెప్పకుండా నేను బొంబాయి వెళ్ళానని నానాఅల్లరీ చేసి, ఓ రోజున చెపుతున్నా వినిపించుకోకుండా పుట్టింటికి వెళ్ళిపోయింది భావన.

నేను కాలేజీనుండి ఇంటికి వచ్చేసరికి అమ్మ ఈ విషయం చెప్పి 'అలాగైతే ఎలాగరా, ఎవరో ఒకరు సరిపెట్టుకోవాలి' గాని అంటూ బాధపడింది.

ఇంతకు ముందు భావన వెళ్ళిపోయినప్పుడు ఎక్కడికి వెళ్ళిందా? అని గాబరాపడ్డా.. ఇపుడు అదేం లేదు. పుట్టింటికి వెళుతుందని స్పష్టంగా తెలుస్తోంది. భావనని పట్టించుకోలేదు. అమ్మకి సమాధానం చెప్పలేదు.

రోజులు గడుస్తున్నాయి. భావన వెళ్ళిపోయి ఏడాది అవుతోంది. అటు భావన దగ్గర్నించిగాని, ఇటు మావగారి దగ్గర్నించి గానీ ఎటువంటి వార్తాలేదు.

ఇవన్నీ మనసులో పెట్టుకుని అమ్మ జబ్బున పడింది. హాస్పటలులో జాయిన్ చెయ్యవలసి వచ్చింది. హాస్పిటలుకి వెళ్ళిన అమ్మ మళ్ళీ ఆరోగ్యంతో తిరిగి రాలేదు. మనసులో బాధపడ్డా, రుణం తీరింది అన్న రిలీఫ్ ఫీలయ్యాను. అమ్మ పోయిన విషయాన్ని ఎవరికీ తెలియచెయ్యలేదు. ఆ అవసరం లేదు అనిపించింది.

రోజులు గడుస్తున్నాయి. ఒంటరిగా జీవితం బావుంది, అనిపించి.. గడుపుతున్నాను.

●●●

మరుపు మానవనైజం. అనేక విషయాలు సంఘటనలు కాలగర్భంలో కలిసి వాటి అస్థిత్వాన్ని కోల్పోయాయి. ఒంటరిగా రోజులు గడవడం కష్టం అనిపించినప్పుడల్లా, మనసు భావన వేపు లాగుతోంది.

కానీ ఎందుకో వెళ్ళబుద్దివెయ్యలేదు.

ఆఖరికి వేసంగి శలవుల్లో ఒంటరిగా రోజులు నెట్టుకురావడం కష్టం అనిపించి, భావన దగ్గరకి వెళదామనే ఆలోచన, ఆవేశం బుద్ధిమీద గెలిచాయి. భావన దగ్గరకి బయలుదేరా..

భావన్ని సమీపిస్తున్నకొద్దీ.. మళ్ళీ మనసులో వ్యతిరేకమైన ఆలోచనలు చోటుచేసుకున్నాయి. నా స్వార్థం కొద్దీ భావన దగ్గరకి వెళుతున్నానా? అనిపించింది. ఆమె నాకు కలుగచేసిన అనుభవం అపూర్వమైనది. ఆమెతో నేను సామాన్యంగా వ్యవహరించాను. అవమానించాను. పురుషాహంకారంతో వ్యవహరించాను. ఏమిటీ అహంకారం? రైట్యువస్‌నెస్ నాదే అన్న అహంకారం నాలో ఉందేమో?

భావాన్ని తిరస్కరించి రుజువు చేసుకున్నానా? ఎక్కడో ఏదో సబబుగా లేదు. అనిపించి భావన దగ్గరకి ఏ మొహం పెట్టుకెళ్ళడం? భావన నా కందనంత దూరంగా జరిగిపోయింది. అనిపించింది.

బెజవాడలో ట్రైను దిగి, భావన ఇంటికి వెళ్ళలేదు. కృష్ణ వొడ్డున, కనక దుర్గ గుడిలోనూ పిచ్చివాడిలా తిరిగాను. అయినా మనసు శాంతించలేదు. బెజవాడ నుండి బయలుదేరి పూరి, కోణార్క, గయ కాశీ చాలా చోట్లతిరిగాను. మనసుకు శాంతి ఏర్పడలా, ఇంకా బంధాలు బలంగా ఉండడం వల్ల బెంగుళూరు వెళ్ళాను. ఆరునెలలు ఉద్యోగం చేసాను అందులో మనసు నిలవలేదు. ఇంట్లో సామాను అమ్మేసాను.

నాకున్న వస్తువులన్నీ పంచి పెట్టేసాను. ఉద్యోగానికి రిజైన్ చేసాను. చిన్న పెట్టెతో దేశంపై బడ్డాను.

కానీ పై వాడికి నాకు ఈ బంధం ఇష్టం లేదేమో? ప్రయాణంలో పెట్టె కొట్టేసారు. ఆ రోజు నాతోటి ప్రయాణీకులు నన్ను తెలివితక్కువ వెధవ్వి అన్నట్టు చూసారు. వాళ్ళందర్నీ చూసి ఆ రోజు నేను నవ్విన నవ్వు నా జీవితంలో ఎప్పుడూ నవ్వలేదు.

మొదట్లో నాలో ఇంకా సంస్కారమనే అహంకారం మిగిలివుండడం వల్ల ఉన్ననాడు తిని, లేనినాడు పడుకోవలసి వచ్చేది. కానీ ఈ రోజుల్లో నాలాంటి వాడికి తిండి దొరకడం కష్టం కాదు. సంస్కారాలన్నీ వదిలించుకున్నాను. మూడేళ్ళుగా తిరుగుతున్నాను. ఎక్కడికి? ఎందుకు? అంటే నాకే తెలీదు.

జీవితంలో ఏ విషయంలోనూ పరిపూర్ణత ఉండకూడదు. జ్ఞానంలోగానీ, సౌందర్యోపాసనలోగానీ, దేనిలోనూ పరిపూర్ణత మనిషికి మేలు చెయ్యదు. నాకు ఏదో తక్కువైపోయింది. అంటేనే జీవితాన్ని నెట్టుకురాగలం, జీవితాన్ని ఒక ఒడ్డునుండి ఇంకో ఒడ్డుకి చేర్చగలిగినవాడే పరిపూర్ణుడు ఇంకో ఒడ్డుకి చేర్చడం మాత్రమే జీవిత ధ్యేయం కావాలి. ఇంక ఏ రోజేనా ఎక్కడేనా ఈ దేహంతో రుణం తీరిపోతే, నన్ను రొడ్డుమీంచి పక్కకి ఈడ్చి అగ్నిసంస్కారం చేసే మహానుభావుడికి నా నమస్కారం...

**రాజగోపాల్**

రాజగోపాల్ డైరీలో రాసింది చదవడం పూర్తయేసరికి, కళ్ళు మసకలు కమ్మాయి.

జీవితంలో అన్నీ కావాలనే ఆబ పనికిరాదేమో? పరమ పదసోపాన పటంలో రాజగోపాల్‌ని నిచ్చెనలు వరించాయి. చాలా తొందరగా ఎక్కేసాడు. కాని పెద్దపాము జీవితాన్ని మింగేసింది. వీడు మాత్రం పరమ పదం వేపు సాగిపోయాడు. వీడు జీవితంలో ఏ గ్రహం వక్రించింది? ఏ గ్రహం రుజుమార్గంలో సాగింది? గ్రహాల్ని వదిలేసి వీడే వక్రించాడా? అందుకే గ్రహాల అవసరం లేకుండా పోయింది. వాడి జ్ఞానం, వాడి కళ ఎవరికీ అక్కరలేకుండా పోయింది. ఆఖరికి వాడికీ పనికిరాకుండా పోయాయి.

నా ఆలోచనల్లో నేనుండగానే బృహతి, ఝురి, అరణి వచ్చారు. బృహతి లోపలికి వచ్చి 'అదేమిటి చీకట్లో కూర్చున్నారు.' అంటూ లైటు వేసింది.

బృహతి, ఝురి అరణి కాటేజీకి వచ్చాక, అందరం కలిసి భోజనానికి హోటలుకి వెళ్ళాం. తిరుమలంతా రంగు దీపాలతో భక్తుల గోవిందలతో చాలా ఆర్భటంగా ఉంది. భోజనం చేసి తిరిగి వస్తూంటే, ఆర్క్ లైట్ల కాంతిలో మెరిసిపోతూ శ్రీవారి గోపురం కనపడింది.

దాన్ని చూడగానే నాలో విచిత్రమైన కోరిక కలిగింది. మర్నాడు సాయంకాలం ప్రయాణం రేపటి రోజంతా ఏ పనీ లేక కాటేజీలో గడపాలంటే విసుగనిపిస్తుంది., మళ్ళీ ధర్మ దర్శనం చేస్తేనో అనిపించింది. అదే బృహతితో చెప్పాను.

'రేపు ధర్మ దర్శనానికి వళదామా?' అనడిగా.

'అమ్మో అయిన దర్శనాలు చాలు పదేసి గంటలు ఆ క్యూలో నేను నిల్చోలేను' అంది బృహతి ఝురి కూడా రానని చెప్పేసింది. అరణి నాదగ్గరకి వచ్చి నా చెయ్యిపట్టుకుని 'నేను వస్తాను' అంటూ సైగ చేసింది.

మర్నాడు నాలుగు గంటలకి దర్శనానికి వెళదామని నిర్ణయించుకున్నాం.

●●●

మర్నాడు నాలుగు గంటలకి అరణి లేచి, కాటేజీ బైట అమ్మ వచ్చిన, వేడినీళ్ళు కొంది. ఇద్దరం స్నానం చేసి దర్మదర్శనానికి బయలుదేరాం. బృహతి ఝురి మంచి నిద్రలో ఉన్నారు. కాటేజీ తలుపు వేసుకోమని బృహతిని లేపాను. బృహతి విసుగ్గా లేచి, మా వెనకాలే వచ్చి, కాటేజీ తలుపు వేసింది.

బయట చలిగా ఉంది రెండు చేతులూ చంకల కింద పెట్టి, ముడుచుకుపోయి నడుస్తూ గుడికి చేరుకున్నాం.

ఇద్దరం క్యూలో నిలబడ్డాం. నాలుగు గంటలకే పెద్దక్యూ ఉంది. ఈ క్యూనుండి ఎప్పుడు బయటపడతాం? బృహతి చెప్పినట్లు డబ్బులు ఇచ్చి చూసినా అదే దేవుడు ధర్మంగా చూసినా అదే దేవుడా?

అనవసరంగా ధర్మదర్శనం చేద్దామనే కోర్కె కలిగిందా? రాత్రి కటకటాల్లో, బెంచీలమీద, కుర్చీలోనూ, నిద్రపోయిన వారున్నారు. రాత్రంతా ధర్మదర్శనానికి క్యూలో నిలబడ్డ వాళ్ళున్నారు. ప్రతి అరగంటకి మమ్మల్ని ముందున్న కటకటాల్లోకి వదులుతున్నారు, వాలంటీర్లు. అలాంటివి వో పదేనా కటకటాలున్నాయి వాటన్నింటినీ దాటాక క్యూలోకి వెళతాం. వాలంటీర్లు తలుపు తీసినప్పుడల్లా ముందునున్న కటకటాల్లోకి వెళ్ళి కుర్చీల్లో కూర్చుంటున్నాం.

కటకటాల్లో క్లోజ్డ్ సర్క్యూట్ టీ.విలున్నాయి. అందులో క్రితం నెలజరిగిన బ్రహ్మోత్సవాలు చూపిస్తున్నారు, నా పక్కన అరణి దేవుడ్ని తలచుకుంటూ భక్తితో రెండు చేతులూ జోడించి కూర్చుంది. దానికెంత భక్తో, నేను దానిలా ఎందుకుండలేకపోతున్నాను.

అరణి భక్తిలో ఏకాగ్రత చూస్తే ముచ్చటేసింది. ఒక్క భక్తిలో ఏమిటి? చదువులో సేవ చెయ్యడంలో విలక్షణమైన ఏకాగ్రత అరణికి స్వభావ సిద్దంగా అలవడిన గుణం. ఏ పని మొదలుపెట్టినా దానియందు శ్రద్ధా ఆశక్తి ఏర్పరచుకుంటుంది అరణి. ఇది మనకి అవసరమా? కాదా? అన్న తడబాటు ఉండదు. నాకదిలేదా? మనసు ఉలిక్కిపడింది. విచిత్రమైన ప్రశ్న, నాకు నిజాయితీ లేదా? నన్ను నేను ప్రశ్నించుకుంటున్నాను. ఈ రాజగోపాల్ కనబడి నా మనసును కలయగొట్టి వదిలిపెట్టాడు. ఇంతవరకూ, నా చుట్టూ ఉన్న పరిస్థితుల్ని, మనుషుల్ని ఖండించుకుంటూ నన్ను నేను మోసం చేసుకున్నాను. ఇప్పుడు కూడా అదేచేస్తున్నానా?

నాకు నిజాయితీ ఉందా? లేదా? ఎంత వదిలించుకుందామన్నా, గోడమీద బల్లిలా, ఈ ప్రశ్న నా మస్తిష్కాన్ని వదిలిపెట్టలేదు. ఎక్కడో మనోకుహరాల్లోంచి నిజాయితీ లేదనే సమాధానం నిష్కర్షగా రాలేదు గాని, దొంగలా అడుగులు వేస్తూ, నిజాయితీ తక్కువ అనే సమాధానం వచ్చింది. ఏ పనిచేయాలన్నా, బుద్దిజీవిని కదా, నాలో నేను తర్కించుకుంటాను. దానితో నేను చేసేపని లాభసాటిదా? కాదా? అన్న అనుమానం పీడిస్తుంది. నిష్కామకర్మ అన్నది నాన్సెన్స్ అనిపిస్తుంది. దాంతో చేసేపనిలో నిజాయితీ లోపిస్తుంది.

మరి అరణి కూడా బుద్దిజీవే! జీనియస్ కూడా! చేసేపనికి ఫలితం ఆశించదా? ఆశిస్తుందో లేదోకానీ, ఆశించినట్లు కనబడదు. ధర్మ దర్శనానికి వచ్చి ఇటు అరణిలా ఏకాగ్రతగా, ఉండలేకపోతున్నాను. అటు బృహతిలా నిద్రాపోలేకపోయాను. ఇటు అరణే కరక్టే, అటు బృహతీ కరక్టే అనిపించారు. మధ్య నేనే అటూ ఇటూ ఊగిసలాడుతున్నాను. ఈ ఊగిసలాట జీవితంలో ఉంది! నా జీవితం ప్రతి మలుపులో ఉంది!

ఆఖరి కటకటాల్ని వదిలి క్యూలో నిలబడ్డాం, మా వెనుకే ఇంకో కటకటాల్లోంచి వచ్చిన జనం నిలబడ్డారు. కాళీ లేకుండా అందరూ ఒకళ్ళని ఆనుకుని ఒకళ్ళు నిలబడ్డారు. ఆ నిలబడ్డంలో నన్నెవరో ముందుకి తోసినట్టయి వెనక్కి తిరిగి చూసాను. ఎవరో ఇద్దరు పల్లెటూరివాళ్ళు మోటు మొహాలూ, మోటుగా ధరించిన బట్టలు, ఆ బట్టలనుండి ముతక కంపు ఆ పల్లెటూరుది గుండుచేయించుకుంది. గుండుకి అక్కడక్కడా చందనం రాసింది. ఆమెని గమనించాక వీడు దీనికి పిల్లల్ని ఎలాకన్నాడా? అన్న డౌటు వచ్చింది. వాడికి జీవితంలో ఏ ప్రత్యేకతా అక్కరలేదా? వాడి కళ్ళకి అదే అందంగా కనబడిందేమో? వాడు, ఆమె రెండు నిముషాలకోసారి 'గోవిందా, గోవిందా!' అని అరుస్తున్నారు. అదే భక్తా! అదేవాళ్ళ ఏకాగ్రతా? ఇవేవీ కాదు అనిపించింది. ఇవన్నీ కాకపోతే మరేమిటి? నమ్మకం? తనకు జరిగే అంంచికీ చెడుకీ అన్నింటికీ గోవిందుడి సంకల్పమే మూలకారణం అనే వెర్రి నమ్మకం, వాళ్ళిద్దరికీ ఉన్న నమ్మకం తనకిలేదా? లేదనే అనిపిస్తోంది! అందరూ వెళుతున్నారని నేనూ తిరుపతి వచ్చానా?

వచ్చావులే అన్నట్టు నా వెనకనుండి ఓ సఫారీ సూటాయన నన్ను తప్పించుకుని ముందుకి వెళ్ళడం నాకు నచ్చలేదు. 'మీరలా తప్పించుకు వెళ్ళడం బాగులేదు. మేమూ క్యూలోనే ఉన్నాం కదా' అన్నాను అతనితో సౌమ్యంగా. అతను నన్నోసారి చూసి ఊరుకున్నాడు. కానీ వెనక్కి రాలేదు. అతను నా ప్రశ్నకి సమాధానం చెప్పకపోవడం, నా సహనాన్ని చంపేసింది 'మీకే చెపుతున్నాను' అన్నాను గొంతుక పెంచి.

అతను నా అసహనాన్ని గుర్తించలేదు. నాకు సమాధానం చెప్పలేదు. కళ్ళుమూసుకు దండం పెట్టుకున్నాడు. అది కొంగ జపం అది నాకు తెలుసు. ఎదుటి వాళ్ళ అభ్యంతరాన్ని గుర్తించకుండా అదో నటన ఆసరా చేసుకుని ముందుకి సాగిపోతున్నాడు. నిజంగా భక్తుడైతే తనెక్కడ ఉన్నాడన్న ధ్యాస ఉండదు. న్యాయంగా క్యూలో వచ్చేవాడు. వీడికి భక్తిలేదు. నమ్మకమూ లేదు. లైనులో ఉన్నాడంటే అయిదొందలు మిగుల్చుకుందామన్న పిసినిగొట్టూ ఆలోచన వచ్చిఉండాలి. అయిదొందలూ మిగలాలి. అందరికన్నా ముందుగా దేవుడ్ని చూసెయ్యాలి చాలా విచిత్రమైన మనిషి!. వాడ్నెలాగైనా వెనక్కి పంపాలన్న పట్టుదల నాలో పెరిగింది. వాడి భుజం తట్టి, వెనక్కి వెళ్ళమని చెపుదామనుకున్నాను. నేను గొంతు పెంచి మాట్లాడినప్పుడే కళ్ళు తెరిచి, నన్ను గమనిస్తున్నట్టుంది అరణి అతని వీపు మీద తట్టుదామని ఎత్తిన చెయ్యిని పట్టుకుంది. 'వద్దు వదిలెయ్' అన్నట్టుగా బుర్రవూపింది. నేను అరణి మొహంలోకి చూసి, నా చెయ్యిని వెనక్కి తీసేసుకున్నాను.

ఇదంతా వెనకనుండి ఒకావిడ గమనించింది. నా ఉద్ధుతం చూసింది. అరణి సౌమ్యం గమనించింది. అరణిని మెచ్చికోలుగా చూసి, సఫారీ సూటువాడిని ఉద్దేశించి 'కొందరంతేనమ్మా మంచీ మర్యాదా ఉండవు, అలాగని వాళ్ళతో సమానంగా మనం కూడా జబర్దస్తీ చెయ్యలేం' అంటూ ఏవేవో మాట్లాడుతోంది అరణితో. అరణికి మళ్ళీ కళ్ళుమూసుకునే అవకాశం ఇవ్వలేదు. అలా మాట్లాడి మాట్లాడి కాసేపటికి ఆవిడ గొంతు ఆరిపోయినట్టుంది. వెంట తెచ్చుకున్న మరచెంబులో నీళ్ళు ఒంపుకు తాగింది. అరణిని కావాలా అనడిగింది. అరణి 'వద్దు' అని బుర్ర అడ్డంగా ఊపింది.

ఆవిడ మంచినీళ్ళు తాగుతుండగా, అరణి నా పక్కగా జరిగి కళ్ళు మూసుకుంది. క్యూ మెల్లిగా కదులుతుంది. వెనకాలావిడ నన్నూ, అరణిని కాసేపు తేరపార చూసింది. పక్కనున్న వాళ్ళాయనతో "ఇంత గొప్ప భక్తులకి దైవదర్శనం దండుగ ఇంట్లో కూర్చుంటే కనపడడా దేవుడు" అంది నాకా మాటలు వినిపించాయి.

అందులో వెక్కరింపుకూడా అర్ధం అయింది. అయినా ఊరుకున్నాను అరణి కళ్ళే తెరవలేదు. ఆవిడ మాటల్లో అరణి పట్ల చిన్న వ్యంగోక్తులు హాస్యోక్తులూ నా చెవిని పడుతున్నాయి. కానీ నేనవేం పట్టించుకోలేదు. ఆవిడలో హాస్యం వ్యంగ్యం సరుకు అయిపోయాక అసలు కసి బయటపెట్టింది. నేనింత గొంతు పోయేట్టు వాగినా ఒక్క మాటేనా మాట్లాడలేదా అమ్మాయి!. ఎంతయినా ఈ కాలం పిల్లలకి గర్వం ఎక్కువ అంది వాళ్ళాయనతో ఆ మాటతో చిర్రెత్తుకొచ్చింది. క్యూలో ముందుకి నడుస్తూనే, వెనక్కి తిరిగి ఆవిడ

మొహంలోకి చూసాను. నా రియాక్షన్ ఆవిడకి ఆనందం కలిగించింది. వాళ్ళాయన్ని మోచేత్తో పొడిచి, ఆనందాన్నిచాటుకుంది. ఆవిడవేపు రెండు సెకండ్లపాటు చూసి 'అది మీతో ఎలా మాట్లాడుతుందండీ, మూగది మాటాడలేదు' అన్నాను.

వెనుక నిలుచున్న మొగుడూ పెళ్ళాలిద్దరూ డంగైపోయారు. ఆవిడ తేరుకునేసరికి చాలాసేపు పట్టింది. నేనామాట అనేసి ముందుకి తిరిగిపోయాను. కానీ వెనకాల వస్తున్న అరణి విడినట్లు అనిపించి వెనక్కి తిరిగాను. ఆవిడ అరణిని పొదివి పట్టుకుని నడుస్తోంది. ఆవిడ కళ్ళల్లో నీరు, అరణిని పట్టుకోవడంలో అభిమానం కొట్టొచ్చినట్టు కనిపించాయి. ఆవిడ నన్ను చూసి భారమైన గొంతుకతో 'వెరీసారీ' అంది. ఆవిడ చేతుల్లోంచి అరణి నన్ను చూసి చిన్నగా నవ్వింది. అరణి నవ్వు ఇంద్రజాలకుడి మంత్రదండంలా అనిపించింది.

క్యూ మెల్లగా నడుస్తోంది. కానీ క్యూలో ముందున్న, ఎవరిదో మెళ్ళో గొలుసు పోయింది. ఆవిడ గాబరాగా తెగి జాకెట్టులో కానీ, బొడ్డుకట్టులోకానీ, పడిందేమో అని దులుపుకుంటోంది. దానివల్ల క్యూ ముందుకి వెళ్ళకుండా ఆగింది. ఆవిడకన్నా ముందున్న క్యూ కదలడం వల్ల, దానికీ మాకూ మధ్య ఖాళీ ఏర్పడింది. మా వెనకనున్న వాళ్ళు ముందుకి తోసుకు వచ్చి "అయ్యో గొలుసుపోయిందా? దేవుడి గుడిలో ఎవరు తీస్తారు. తెగి ఎక్కడో పడిపోయివుంటుంది. వెతకండి." అని చెప్పి ఆవిడ్ని తప్పించుకు ముందుకు వెళ్ళిపోతున్నారు. గొలుసుకింద పడిపోయిందేమో అని అందర్నీ దూరంగా జరగమని వెదకడం మొదలుపెట్టారు. కొంచెం సేపు వెదికిన తర్వాత, ఇంక గొలుసు దొరకదు. అని ఆవిడకీ అర్ధం అయింది. క్యూలో ఉన్న వాళ్ళకీ అర్ధం అయింది. నిరాశతో ఆవిడ క్యూతోపాటు ముందుకి కదిలింది. మామూలుగా అయితే గొలుసుపోయినందుకు ఎవరేనా తీసారేమో? అన్న అనుమానంతో నానా తిట్లు తిట్టివుండేది.

కానీ ఇది దేవుడి గుడి, దేవుడి దర్శనానికి వచ్చానని, ఆ కసంతా తొక్కిపెట్టి పరధ్యానంగా క్యూతో పాటు నడుస్తోంది. తిట్టడానికి సిగ్గుపడింది కానీ లోపల దేవుడ్ని ఎప్పుడో మర్చిపోయివుంటుంది. నగ దొంగిలించినవాడిని తిట్టుకుంటుందేమో? లేదా? దేవుడ్ని ఛాలెంజ్ చేస్తుందేమో? నగ ఇప్పించమని. లేదా సినిమాల్లో చూపించినట్టు, దేవుడ్ని ప్రత్యక్షమై తన నగ తనకి ఇచ్చేస్తాడనే మిరకిల్ కోసం ఎదురు చూస్తూ కల కంటోందేమో? అలాంటి మిరకిల్స్ ఏవీ జరగవు! మరి దేవుడి ఉనికి ఎంతవరకూ మనకి పనికివస్తుంది? మనకి కష్టసమయంలో ధైర్యం చేకూర్చడానికా? కానీ కర్మాను బంధిని మానుష్యలోకే! అని చెప్పి గోవిందుడు చేతులు దులిపేసుకున్నాడు. ఇక్కడితో వదిలిపెట్టాడా మనిషిని 'కాకా' పడుతూ 'సముదుఃఖసుఖం ధీరం' అని సాంఖ్యలో సుఖంలో, దుఃఖంలో సమత్వల్యం సాధించినవాడిని ధీర పురుషుడ్ని చేసేసాడు. గోవిందుడు చెప్పిన ధీరపురుషుడ్ని అంతో ఇంతో ఆవిడ మొగుడిలో చూసాను. ఆయన ఇక నగ దొరకదు అనే నిర్ణయానికి వచ్చి 'అది దేవుడి సొమ్మే దేవుడే తీసుకున్నాడు' అన్నాడు. ఆయన నగపోయాక ధీరపురుషుడు అయ్యాడు కానీ, నేను ధీరపురుషుడిని కాలేకపోయాను. అరణిని ముందుకి నెట్టి వెనుక నుండి అరణి మెళ్ళో గొలుసు ఉందో, లేదో, అని గమనించడం మొదలుపెట్టాను.

క్యూ జరుగుతోంది. కానీ అరణి గొలుసు మాత్రం పోలేదు, కానీ మేం నడుస్తున్న క్యూలో కొంచెం ముందుగా కలకలం బయలుదేరింది. ఎవరిదో పాప తప్పిపోయింది. చిన్న పాప ఇంతవరకూ చెయ్యిపట్టుకుని నడుస్తూనే ఉంది. కానీ ఇప్పుడు లేదు. తల్లి కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది. ఆవిడ్ని పట్టుకుని ఆవిడ మొగుడు క్యూకి పక్కగా నిలబడ్డాడు. వాలంటీర్స్‌తో మాట్లాడుతున్నాడు. వాలంటీర్స్ అతని ఆమెకి ధైర్యం చెబుతున్నారు. పాప ఎక్కడికీ పోదని, దొరికితీరుతుందని, కానీ వాళ్ళ తాత్కాలిత ఆందోళన్ని, దుఃఖాన్ని తగ్గించలేకపోయారు. ఆవిడ మొగుడు దాన్ని చంకనుండి ఎందుకు దించావు అని పెళ్ళాన్ని కోప్పడుతున్నాడు. ఆవిడ వెక్కుతూనే చెయ్యి నొప్పెట్టింది మిమ్మల్ని ఎత్తుకోమంటే విసుక్కుంటారు. ఓ రెండు నిముషాల తర్వాత ఎత్తుకోవచ్చని దించాను. ఇప్పటివరకూ నా చెయ్యి పట్టుకునే ఉంది అంటూ వాపోయిందావిడ. జనం అందరూ ఆవిడ్ని మొగుడ్ని చాలా సానుభూతితో చూస్తున్నారు. ఎవరి దుఃఖం వారిదే, ఎవరి సుఖం వారిదే, ఎవరి భక్తి వారిదే,అని అందరికీ తెలుసు! అందుకే ఆ దంపతుల్ని దాటుకు ముందుకి వెళ్ళిపోతున్నారు. జనంతో

పాటూ పాప ముందుకు వెళ్ళిపోయిందేమో? అన్న దంపతుల ఆదుర్దాని ఎవరూ పట్టించుకోలేదు. వాళ్ళిద్దర్నీ చూస్తే బలిజేపల్లి లక్ష్మీకాంతం గారి హరిశ్చంద్రుడు జ్ఞాపకం వచ్చాడు!

కొరివి చేత్తో పట్టుకుని 'మాయామేయ జగంబె నిత్యమని సంభావించి, మోహంబునన్ నా ఇల్లాలిని నా కుమారుడని, ప్రాణంబుండు నందాక ఎంతో అల్లల్లాడిన ఈ శరీరము ఇపుడు ఇందున్, కట్టెలన్, కాలుచో ఆ ఇల్లాలును రాదు ఆ పుత్రుడును తోడైరాడు తపింపగన్!' హరిశ్చంద్రుడు చదివిన పద్యం చదివి దంపతులిద్దరికీ వినిపించాలనిపించింది. కానీ సమయం సందర్భం కాదు, క్యూతో పాటు ముందుకి జరిగాను.

గర్భగుడిలోకి అడుగుపెడుతుండగా, మా ముందు క్యూలోనే చతికిలబడి వాంతి చేసుకున్నాడు. రాత్రంతా దైవదర్శనం ఎప్పుడవుతుందా అని తపిస్తూ సరియైన నిద్రలేక పోవడం వల్ల పైత్య ఎక్కువై, వాంతి అయింది అన్నారు క్యూలో కొందరు.

వాలంటీర్లు వచ్చి వాంతిని శుభ్రం చేసి వాంతి చేసుకున్నతన్ని పక్కగా కూర్చోపెట్టి, ఉపచారాలు చేసారు. వాళ్ళాపని చేస్తుండగానే మేమూ వాంతిని దాటుకుని గర్భగుడిలోకి ప్రవేసించాం. వాడు వాడి కడుపులో కుళ్ళంతా కక్కి శుద్ధి అయ్యాడు! కానీ వాడి కుళ్ళు అందరిమధ్యా కక్కి అందర్నీ, ఆ ప్రదేశాన్ని కుళ్ళు చేసాడు. రోజువారీ జీవితంలో మనం కుళ్ళుని కక్కుతూ పోతాం ఒకళ్ళు కక్కిన కుళ్ళుని విధిలేక దాటుకుంటూ పోతాం!

ఎవరో చెప్పినట్లు 'మేన్ ఈజ్ ఓన్లీ ది హ్యూమన్, హు రెఫ్యూజెస్ వాట్ హి ఈజ్' అంటే మన ప్రకృతికి ముసుగు వేసి, రోజా జీవితంలో నాటకం ఆడతాము అన్నమయ్య చెప్పినట్టు 'నానాటి బ్రతుకూ నాటకం. కానక కన్నది కైవల్యమూ! ' అని మనలో ప్రకృతికి అహంకారం అనే బట్ట తొడిగి 'నా' అనే విచిత్రమైన ఊబిలో కూరుకుపోయి, మనుగడ కోల్పోతున్నామా?

ఎదుటివారికి అర్థం కాదు అది నేనాడిన నాటకాలన్నీ, నన్ను దోషిగా నిలబెట్టాయి. నా తత్వాన్ని మరిచి తల్లడిల్లిన సంఘటనలు తలుచుకుంటే, అలా ప్రవర్తించింది నేనేనా? అన్న అనుమానం పీడిస్తుంది రాజగోపాల్ చెప్పినట్టు 'అత్త లొంగిపోతుంది అన్న అహంకారానికి పోయాను. నా విఫల మనోరదాలన్నింటికీ! ఏవేవో కారణాలు వెతుకుతూ కాలం అనే ఊబిలో కూరుకుపోయాను. రవళి విషయంలో ఏదో తెలియని అహంభావం ఆమెని నా నుండి దూరంగా నెట్టింది. నైతికంగా నన్ను నేను నిరూపిద్దామని తీసుకున్న నిర్ణయం, చేసిన సర్కసు ఫీటు బెడిసికొట్టి ఉద్యోగం ఊడేటట్టు చేసింది.

ఆ తర్వాత కూడా జీవితంలోనే తొడుక్కున నిర్లిప్తత అనే ముసుగు, నా మొహానికి చిన్నదైపోయింది. అనేక సందర్భాలలో ముసుగు చాలక, అహం స్పష్టంగా కాకపోయినా, అంతో ఇంతో బయటపడుతూ వచ్చింది. అలా బయట పడ్డపుడు విచిత్రమైన ఉలికిపాటు. దాన్నే గీతాకారుడు 'ప్రకృతిమ్ స్వాధిష్ఠాయ సంభవామాత్మమాయయా?' అన్నాడు.

మనిషిని పరిపూర్ణుడిని చేసేది వాడి ప్రకృతే! కానీ అది మాయతో కప్పబడినప్పుడు జ్ఞానం నశిస్తుంది! మాయ అంటే ఏది? తన ప్రకృతిని మాయకప్పేయకుండా ఏం చెయ్యాలి? అలాకాక మాయకు లొంగి, చతికిలబడి, అంతా దైవాధీనం పరిస్థితులకు లొంగక తప్పదు. నాలో నేను సమాధానపడాలి! అనే వెర్రి సమాధానం చెప్పుకుంటున్నామా? అలాంటి వెర్రి సమాధానానికి లొంగకుండా జాగ్రత్తపడాలా? ఈ డిఫెన్స్ మెకానిజంకి లొంగకూడదు! ఈ డిఫెన్స్ మెకానిజం ప్రాకృతికంగా జంతువులకి సంక్రమించింది. వాటి మేధస్సు డిఫెన్స్ మెకానిజం ఉపయోగించడానికి మాత్రమే ఉపయోగపడుతుంది.

ఈ డిఫెన్స్ మెకానిజాన్ని ఉపయోగించి, ఊసరవెల్లిలా రంగులు మార్చి ఇంతకన్నా నేనే చెయ్యగలను? అనే చచ్చు సమాధానం చెప్పుకోనక్కరలేదు. ఈ డిఫెన్స్ మెకానిజాన్ని తనదిగా చేసుకుని మనిషి తనని తాను కించపర్చుకుంటున్నాడు. శోషణకి గురైనా రోషపడకూడదని! ఎందుకు? అని ప్రశ్నించే తత్వాన్ని మార్చుకుని, సమాధానపడుతూ జీవించి, తనకి మేధాపరంగా సంక్రమించిన జిజ్ఞాస, పిపాస, రోషాలకి, సంకెళ్ళు వేసి స్వార్థాన్ని పళ్ళ మధ్య బిగ కరిచి, అతికీ అతకని చిరునవ్వుతో జీవితాన్ని నెట్టుకొస్తున్నాడు.

ఈ పళ్ళ మధ్య చిక్కుకున్న స్వార్ధం, మేధస్సును మభ్యపెడుతున్న ఆశ, కించడాశతో జగాన్ని పెంచకుండా దురాశతో వంచించెను జగమంతా, స్వార్ధాన్ని దిగవిడవాలంటే నా ఆలోచనలకి బ్రేక్ చేస్తూ క్యూలో జనం 'గోవిందా గోవిందా' అని అరిచారు.

అవును గోవిందుడే చెప్పాడు. కర్మ చేస్తూ యోగిగా ఉండమన్నాడు బుద్దిజీవులు మాత్రమే అలాచెయ్యగలరన్నాడు. అమే మానవజాతిని, మృగసముదాయాన్నీ విడదీసే ఈ మేధస్సును నిష్కామకర్మతత్వానికి సమర్పించమన్నాడు. నేను చేస్తున్న పని నాకు లాభిస్తుందా? లేదా? అన్నది కాదు ప్రశ్న? మరి నేను కర్మ చేస్తునానా? లేదా? అన్నదే జవాబు. అదీ ఎవరికి చెప్పాడు శోషణకి గురై రోషంతో యుద్ధానికి సిద్దపడ్డ అర్జునుడికి చెప్పాడు.

ప్రతి మనిషి జీవితంలో ఆ పరిస్థితి వస్తుంది. 'టు వేజ్ ఎ వార్ ఆర్ నాట్ టు వేజ్ ఎ వార్' ఆ ప్రశ్న ఉదయిస్తుంది. జ్ఞాన, భక్తి, కర్మ సన్యాస ధ్యానయోగాలన్నింటికీ పునజ్జీవం పోరాటం ప్రకృతి తత్వం!

జంతువుల్లో డిఫెన్స్ మెకానిజం ఉన్నట్టే బుద్దిజీవుల్లో, మనుష్యుల్లో అఫెన్స్ మెకానిజం ఉండాలి. పోరాట పటిమ ఉండాలి! దాన్ని కాదని జంతువుల్లా డిఫెన్స్ మెకానిజాన్ని తనదిగా చేసుకు ఆచరించడం మనిషి తనని తాను కించపరుచుకున్నట్టే!

ఈ అఫెన్స్ మెకానిజాన్ని పాటించడం తేలిక! మనని మన తత్వాన్ని దాచి తెరలు పొరలు మనల్ని మనం మోసగించుకోకుండా, మన పరిధులు మనం తెలుసుకుని, ఆ పరిధుల్లో అఫెన్స్ మెకానిజం ఉపయోగించవచ్చు!

ఈ రోజుల్లో నిజం పలకడం ఒక అఫెన్స్! నిజాన్ని ఒప్పుకోడం ఒక అఫెన్స్! హిపోక్రసీని పక్కకి పెట్టి తనలో లోపాన్ని ఒప్పుకోడం ఒక కోవకి చెందిన అఫెన్స్ అయితే ఎదుటి వాళ్ళ తప్పుల్ని క్షమించడం, మరోకోవకి చెందిన అఫెన్స్ అవుతుంది. ఎవరో చెప్పినట్టు 'ఈ రోజుల్లో వెయ్యి ఉక్కు గుండెలు, లక్ష ఇనుపనాలికలూ కావాలి ఒక్క నిజం పలకడానికి' అన్ననానుడికి సుడి చుట్టగలగాలి.

ఏదో ఆలోచనాలోకాల్లో విహరిస్తూ క్యూలో నడుస్తున్న నన్ను అరణి చేత్తో తాకింది. ఏమిటి? అన్నట్టు అరణిని చూసాను, కనుసైగలతో అటు చూడు అంటూ చూపింది. ఏమిటి చూపిస్తోందా? అని అటువేపు చూసాను.

కళ్ళు జిగేల్ మన్నాయి. ఒళ్ళు జలదరించింది. ఎప్పుడూ నామాల వెనుక శాంతంగా కళ్ళు మూసుకుని ప్రతిపటంలోనూ, దర్శనం ఇచ్చే గోవిందుడు కాడు ఎదురుగా ఉన్నది.

విచ్చుకున్న నేత్రాలతో ప్రపంచాన్ని సమ్మోహితం చేస్తూ భక్తుల్ని దర్శిస్తున్నాడు గోవిందుడు. ఆ చూపునుండి నా చూపు తిప్పుకోలేకపోయాను. వెనుకగా వస్తున్న భక్తులు 'ఈ రోజు లక్ష్మివారం. నేత్రదర్శనం' అని అనుకుంటున్నారు.

ఆదివ్యచక్షువులు నాకేదో సత్యాన్ని చెబుతున్నాయి. అనిపించింది. అది నేను అర్ధం చేసుకోలేకపోతున్నాను. ఏమిటది? సత్యాన్ని అర్ధం చేసుకుంటే కుదరదు అది చాలా సంకుచితంగా ఉంటుంది. సత్యాన్ని అనుభవించాలి. లేదా ఫీల్ అవాలి!

రాందాసుకి ఏ మేధస్సు, ఏ తార్కిక జ్ఞానం ఉంది కానీ అతని ప్రవర్తనలో ఓ నిజాయితీ ఉంది. అది అతనికి ఇంస్టింక్ట్‌గా అబ్బిన గుణం! మన మేధస్సు, తర్కం నాకేం లాభిస్తుంది అన్న ప్రశ్నతో నిరంతరం ప్రతిధ్వనిస్తూ మన మనసులకి పాకుడులా పట్టి పీడిస్తోంది. ఈ పాకుడు వదిలేదెప్పుడు?

అంతా ఊగులాటే? ఇదెప్పుడు వదులుతోందో? నా ఆలోచనల్లో నేనుండగానే గర్భగుడి దగ్గరకి వచ్చేసాను. అక్కడ నిలబడ్డ వాలంటీరు, నా భుజం పట్టుకుని ముందుకి నెట్టాడు. ముందుకి వెళ్ళడానికి టర్న్ తిరిగిన నాకు గోవిందుడి నేత్రదర్శనం జ్ఞాపకం వచ్చింది. ఆలోచనల్లో పడి సరిగా గోవిందుడి నేత్రదర్శనం చెయ్యలేదు. అనిపించి వెనక్కి తిరిగి చూసాను. చెవి దగ్గర ఎవరో నవ్వి నట్టయింది. ఆ నవ్వులు గోవిందుడి నేత్రాలనుండి తెరలు తెరలుగా విరజిమ్ముతున్నాయా? అనిపించింది.

అప్పటి వరకూ నాలో ఉన్న చాలా అనుమానాలు తొలిగిపోయాయి. ద్రష్ట ద్రష్టగానే మిగలకూడదు అతని ధ్యేయం ఉండాలి, దాన్ని ఆచరించాలి! ఆచరణలో పెట్టాలి! అది జరిగిననాడు, అది నిర్ణయించుకున్న నాడు! నీకు నా అవసరంలేదు అంటున్నాడు గోవిందుడు!

***చివరి(వక్క)పలుకు***

ఝరీగమనంలో శైశవగీతి. ఆ గీతిలో అపశృతి, అది. గ్రహించే స్థితి శైశవానికి లేదు. శైశవం పసితనం కన్నా ఉద్వేగభరితం కావడం. పసితనపు అస్థిత్వాన్ని ఎవరో బలంగా పిడికిటో బిగించి, దానికి ఏదో డైరక్షన్ ఇద్దామనే తపన పట్టుదల ఇంటి పెద్దవాళ్ళందరిలో కనిపించింది.

అదవసరమా? వాటికి సమాధానం దొరకడం కష్టం, పసితనం పిల్లలిది కాకుండా, పెద్దవాళ్ళ దురాక్రమణ పాలవడం దౌర్భాగ్యమే!

కల కనడం నేర్చిన దగ్గర్నించి మనిషికి ఏ రీతిగా గడిచినా క్షణాల ఇంద్రజాలమే. అందుకే భ్రమలు కలలై కల్లలై వ్యక్తిత్వం మీద బలమైన ముద్రవేసాయి. ఇక్కడ బలమైన సంకల్పం లేదని అనుమానం లేదా యుక్తాయుక్త విచక్షణ లేని సంకల్పాలే బలంగా నడిపించాయి.

ఆ భ్రమలు కలల ప్రపంచం నుండి బయట పడ్డానికి నే చేసిన పోరాటంలో, అలసిపోయానేమో? అందుకే పరమసోపాన పటంలో, ఏ సోపానం ఎక్కలేక మీడియోకర్‌గా మిగిలానా?

జీవితం పట్ల రాజీ ప్రతిపాదనకి అక్కడే పునాదిపడింది. అందుకే నీతి అవినీతుల్లో కొట్టుకుపోయి, ప్రతి సమస్యకీ బాహ్యజగత్తులో సమాధానం వెదికా! అది తప్పే!రాజీ ప్రతిపాలనలో ఇంతకుమించి ఇంకో మార్గం లేదు, అన్న ఆలోచనే తప్పు. అని అడుగడుగునా తారసపడ్డ స్నేహితులు ప్రియులు, ఆ ప్రియులు కూడా తేల్చేసారు.

అయితే జీవితంలో తారసపడ్డ అనేక మందిని తరచి చూసినప్పుడూ అంటే రాజగోపాల్, మల్లికార్జున రావ్, భావన, అరణి, పెంటిగా పేరుపడ్డ పార్వతి విషయంలో భ్రమ అంతా దేవుడిదేమో? అన్న ప్రశ్న, దేవుడు చేసిన న్యాయానికి (తేరా ఇన్సాఫ్ గ్రభారహా హమ్ రహే బే ఖబర్) భయం వేసింది. ఎందుకంటే దేవుడెప్పుడూ న్యాయమే చేస్తాడని నమ్ముతాం కాబట్టి!

ఆఖరికి తీసుకున్న నిర్ణయం, ఏ కొద్దిమందికో నచ్చుంటుంది. మిగతా లోకం విడికి లౌక్యం తెలీదు అనే తావీదు కట్టేసి, తన దారిన తాను పగలు రేయి మడతల్లోకి జారుకుని ద్వందాల్లో ఋజువక్రమార్గాల్లో నిస్సహాయంగా ఉండిపోయింది.

అయితే లోకాన్ని నన్నూకలిపుంచింది ఒకే ఒక సూత్రం ఆశ! ఆశని వదలలేదు జీవితం. బాగవుదామనే ఆశ లోకాన్ని, బాగవుతుందనే ఆశ నాకు. ఇదొక్కటే ఋజుమార్గం.

●●●

(సమాప్తం)